ఆంధ్రసచిత్రవార

# పత్రిక

వృద్ధాప్యంలో కోరికలు




2-3-62




"అక్కా నాకూ పెత్తవూ"


ఫొటో: డి. రాధాకృష్ణమూర్తి (మద్రాసు)



ఫిలిప్స్ ఫిలిటినా B2CA99U
ఏసి/డిసి. ధర రు. 187/-



ఫిలిప్స్ ఫిలిటా B3CA07U
3 బ్యాండులు, 5 వాల్వు
ధర రు. 308/-




ఫిలిప్స్ మయినరు B4CA07A
4 బ్యాండులు–6 వాల్వు
ధర రు. 405/-


9 ట్రాన్సిస్టరు రేడియో B4CA07T
రు. 510/-

# అందానికి, ఆనందానికి
# అగ్రస్థానం
# 1962
# ఫిలిప్స్
# నోవోసోనిక్
# రేడియోలు


నాదములో ఒక
నూతన ప్రపంచము




ఫిలిప్స్ మాష్టరో B6CA86A
8 వాల్వు – డబుల్ స్పీకర్సు
ధర రు. 957/-



ఫిలిప్స్ ఇంటర్నేషనల్
B4CA97A–6 వాల్వులు–4 బ్యాండ్లు
ధర రు. 551/-



ఫిలిప్స్ మేజరు డబుల్ స్పీకర్సు
B5CA86A – 7 వాల్వు
ధర రు. 645/-



ఫిలిప్స్ ట్రాన్సిస్టరు రేడియో
ఫిలిప్స్ B5CA06T
ధర రు 690/-

వస్తులు అరవము

గుంటూరు జిల్లాకు ఆథరైజుడు ఫిలిప్స్ రేడియో డీలరు:

టెలిగ్రాం: విజోన్

## విజయ & కంపెని,

ఫోన్: 356

మెయిన్ రోడ్డు - గుంటూరు.

# ఉత్తరాలు

## కార్టూనులు

బాపుగారు గుమ్మడిగారిని గూర్చి ఒక్కొమ్మ టీవి క్షేమంగా చిత్రీకరించారు వారికి నా అభి వందనాలు తెలియజెయ్యండి

ఎం రంగారావు పట్నాయక్ (వేణమ్మపేట)

*  *  *

బాపుగారి కార్ట్యూన్ (లో) గుమ్మడా! హాతోస్మి ఇంతకుముందు దేవికగారు వేసిన ముఖ చిత్రం (గుమ్మడిది) ఈవారం "బాపు"గారి కార్ట్యూను చూచిన తరువాత బహుశా శ్రీ గుమ్మడియొక్క ముఖాకృతి చిత్రించుటకు తగి నది కాదేమోననే సందేహం కలుగుతున్నది క్రిందటి సారి దేవికగారి గుమ్మడిముఖచిత్రం చూడగానే శ్రీ ఆర్ నాగేంద్రరావుగారి చిత్రం గుర్తుకు వచ్చింది ఈసారి "బాపు" గారి చిత్రం చూస్తే ఎవ్వరూ గుర్తుకురాకపోగా కార్ట్యూను చదివి చిత్రము ఎవరిదో తెలుసుకోవాలనే ఉత్కంఠ మాత్రం పెరిగింది బహుశా యిలాటి చిత్రాలు పాఠకుల ఉత్కంఠను పెంచటానికి ఉపయో గిస్తాయేమో!

జి పి ఆర్ వి కామారావు (విజయనగరం)

*  *  *

బాపుగారు ఈ సారి వేసిన గుమ్మడి కార్ట్యూనుకన్న వ్రాసిన వాక్యాలు బాగున్నాయ్. ముఖ్యంగా నాల్గవవాక్యము నన్నెంతో ఆకర్షిం చింది కృతజ్ఞతలు! సంగీతదర్శకులపై, దర్శ కులపై, కెమరామన్‌లపై యిట్లే వ్రాయాలని కోరుచున్నాను

శ్రీ తోట పద్మారావు, (సికింద్రాబాదు)

## సందేహం

ఏమండీ! నా 'ఫేన్ మెయిల్'లో వ్రాసిన విధ ముగా మీ వంటవాడు మా ఉత్తరాలు అన్నియు అంటించుచున్నాడా ఏమిటి? నా ఒక్క ఉత్తరం ప్రచురించుటలేదు

శ్రీమతి కె కమలా కృష్ణవేణి (మీనవిల్లూరు)

**మీ సందేహము తీర్చలేము!**

## మన రాష్ట్రం

9—2—'62 తేదీ పత్రికలో నదీజలాలపై శ్రీ కౌండిన్య వ్రాసిన వ్యాసం చదివి చాలా విచార పడ్డాను ఆంధ్రకు కృష్ణా, గోదావరి నదీ జలాలపై ఉన్న హక్కును నిరూపించటానికి వారికి దొరికిన వాదనలు ఇవేనా? "బీహార్‌లోని బొగ్గు, ఇనుము గనులలో ఒరిస్సా, మహారాష్ట్రాలు పరిశ్రమల సంపదలో గుజరాత్ భాగం కోరవచ్చు అదేవిధంగా వెనుకబడిఉన్న రాష్ట్రాలు పొరుగున ఉన్న సంపన్న రాష్ట్రాల సంపద కోరడానికి 'పరిపాలనా సౌలభ్యం'కోసం ఏర్పాటైన సరిహద్దులు అడ్డు రాకూడదుగదా? ఇందుకు మద్రాసు ప్రభుత్వం ఒప్పుకుంటుందా?" ఇలాంటి అమాయకపు ప్రశ్నలు శ్రీ కౌండిన్య అనేకం అడిగారు భారత దేశం ఒకదేశంకాదనీ, అనేక స్వతంత్రదేశాల కూటమి అనీ వారి అభిప్రాయమా? ఒరిస్సాలో ఉన్న ఉక్కుపరిశ్రమ, బీహార్ బొగ్గును వాడుతోంది. బీహార్‌లోని ఎరువు పరిశ్రమ రాజస్థాన్ రాయిని వాడుతోంది, రేపు ఆంధ్రలో స్థాపించబోయే విద్యుచ్ఛక్తి యంత్రాల పరిశ్రమ అనేక రాష్ట్రాల సంప దను వినియోగిస్తుంది శ్రీ కౌండిన్య ఇదంతా తప్పంటారా? అదీకాక అయిదేళ్ళ కొకసారి ప్రభుత్వం నియమించే ఆర్థిక సంఘం (Finance Commission) కేంద్రం వసూలు చేసే పన్నులను రాష్ట్రాలకు వారి వారి అవసరాలను బట్టి పంచిపెడుతుంది పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన రాష్ట్రాలు ఎక్కువ పన్నులు ఇస్తాయి అంతమాత్రంచేత వాటికి ఎక్కువ వాటా ఇవ్వాలని శ్రీ కౌండిన్య అంటారా? అంటే వెనకబడిన ప్రాంతాలు ముందుకు వెళ్లటం ఎలా? నాగార్జున సాగర్‌లాటి బ్రహ్మాండమయిన ప్రాజెక్టులను ఆంధ్ర తన పన్నులలోంచి కట్టగలదా? ఇలాంటి విషయాలను గూర్చి వారు ఆలోచించాలని నా మనవి వారి వాద నను కొనవరకూ లాగితే భారతదేశం కాంగోలా తయా రవుతుంది! ఎవరి తాత్కాలిక అభివృద్ధిని వారు చూసుకుంటే భవిష్యత్తు గురించి మనం కంటున్న కలలు కరిగిపోతాయి

ఐతే తనకు మాలిన ధర్మంగా మనం ప్రవర్తించా లని నా ఉద్దేశంకాదు మన హక్కులను హాస్యాస్పద మైన వాదనల ద్వారా సమర్థించవద్దని మాత్రమే నా మనవి ఇలాంటి వివాదాలలో అడగవలసిన ప్రశ్న ఈ నది ఏరాష్ట్రంలో ప్రవహిస్తుందనికాదు ఈ నదీజలాలను ఎల్లా వినియోగిస్తే దేశం అధి కంగా సస్యశ్యామలం అవుతుందని మదరాసుకు నీళ్ళు కావాలంటే వేరే ఇంకేమీ దోవలేదా? దాని కయ్యే ఖర్చు ఎంత? అదేఖర్చుతో ఇంకొకచోట ఇంకొక ప్రాజెక్టు కట్టితే దేశానికి ఎంత లాభం వస్తుంది? ఈ పథకాలే ఆర్థికంగా మిక్కిలి ఉప యోగకరాలని మదరాసు (లేక మైసూరు ఎవరైనా సరే) ఇంజనీర్లు నిరూపించగలరా? ఇలాంటి ప్రశ్న లకు ఆంధ్రులు ముఖ్యంగా మన ఇంజనీర్లు సమా ధానం మనకు అనుకూలంగా చెప్పగలిగితే బ్రహ్మ దేవుడైనా మన హక్కులకు భంగం కలిగించలేడు విదేశాలనుంచి తిండి గింజల దిగుమతికి కోట్లకొలది విదేశీ మారకం ఖర్చు అవుతున్న ఈ రోజుల్లో మన వాదనకు బలం చేకూర్చేది పై ప్రశ్నలకు సరి యైన సమాధానాలుకానీ, సంకుచితభావాలుకాదు మన ఈ బీద పరిస్థితిలో ఇలాంటి భావాలకు మనం తావు ఇవ్వకూడదు

పై ప్రశ్నలకు సరియైన సమాధానం మన దేశపు ఇంజనీర్లకు వదిలితే ఆంధ్రకు న్యాయం లభి స్తుందని నా మనవి

మహాదేవశర్మ (పూనా)

*  *  *

9—2—62 సంచికలో "నదీజలాల వివా దంలో మద్రాసు పితలాటకం" గూర్చి కౌండిన్యగారు చాలా బాగుగా వ్రాసినారు కౌండిన్యగార్కి నా ప్రత్యేక ధన్యవాదములు అటువంటి వ్యాసములు అవసరమైనప్పుడల్లా పత్రికలో ప్రకటించుతారని కోరుచున్నాను

**మద్రాసుకు కావేరి నీళ్ళు తరలించి నీటి ఎద్దడి** నివారించవచ్చుకాని, రాయలసీమను కృష్ణనీటితో తప్ప సాగులోనికి తీసుకొనిరాలేం పైగా ఒక్క మద్రాసుకేకాదు మంచినీరు కావలసినది ఆంధ్రలో విజయవాడ, గుంటూరువంటి పెద్ద పట్టణాలకు, ఇంకా మాచర్ల, నర్సరావుపేట, వినుకొండ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు మొదలగు అనేక పట్టణాలకు ఇంకా ఇంకా అనేక చిన్న పల్లెటూర్లకు కూడా నీటి సరఫరా అవసరమే

ఎట్టి పరిస్థితులలోనైనాసరే, నాగార్జునసాగర్ పూర్తి పథకం, శ్రీశైలం, పోచంపాడు పథకాలు ఆచరణలో రూపొందితీరవలసినదే

కంకణాలపల్లి విజయలక్ష్మి (మంచికల్లు)

## ఢిల్లీ లేఖ

శ్రీకృష్ణగారి లేఖ శీర్షిక ప్రకారం "పవర్" ప్రభుత్వకార్యాలయాలలోనే కాక ఇకపై వాటి "బాత్" రూములలో కూడా ఉంటుందని తెలు స్తోంది!

ఆ లక్ష్మీనారాయణ (నాగపూరు)

**ముద్రణాలోపమని మనవి.**

*  *  *

ఆంధ్రపత్రిక వారపత్రికలో నాకు అన్నిటి కంటె నచ్చినది న్యూఢిల్లీ లేఖయే మన ప్రభు త్వమువారి ఆర్థిక, వైదేశిక విధానములనుగూర్చి, ఇంకా అనేక రాజకీయసమస్యలనుగూర్చి శ్రీ కృష్ణగారు అద్భుతముగా న్యూఢిల్లీ లేఖలో ప్రతి వారము చక్కగా వివరించుచున్నారు మామూలు వార్తాపత్రికలలో కనుపించని అనేక వార్తావిశేష ములను శ్రీకృష్ణగారు వెల్లడించారు

పి దక్షిణామూర్తి (గుంటూరు)

*  *  *

## కథలు

"ఎండమావులు" నాకెంతో నచ్చింది చిత్రిం చిన బొమ్మను చూచి ఏదో మామూలు ప్రేమ కథ లెమ్మని ముందు చదవలేదు చివరన చది వాను కాని మరపురాని కథ అని తెలుసుకున్నాను.

రాజనాల (విజయనగరం)

*  *  *

"ఎండమావులు" కథ చాలా బాగుంది ముఖ్యంగా జీవితంలో జరిగే పరిణామాలను కథానస్తువుగా చిత్రించిన శ్రీ ఆదివిష్ణుగారికి నా ధన్యవాదాలు. చలపతి పాత్ర అతి సహజంగా పోషింపబడ్డది. కథ చాలా హాయిగా జరిగింది ముమ్ముందు కూడ ఉత్తమ కథలకు ప్రోత్సాహమిస్తారని ఆశి స్తాను.


సిద్దగిరి సంజిరెడ్డి (నూళ్ళూరుపేట)


*  *  *

సహాయము చేసినా చేయకపోయినా సనాతన స్నేహాన్ని స్మరించుచు సాభిప్రాయముగా సంభా షణ సల్పుట సజ్జనుల విధి, ధర్మము

అంతేకాని 'ఎండమావులు' కథలోవలె అధి కారాయన్నాయని ఆనందపడుతూ, స్నేహధనాన్ని, బంధువర్గాన్ని పరలుగా భావించుట వారి పురోభి వృద్ధికే నిరోధమగుట తథ్యము

వి సాంబశివ అంబరీష, కైలాస, గంధర్వ, వర్ష, **గంగాశార్యతి (తాతలి),** ★


బెణికిందా?
రవ్వంత అమృతాంజనము రాయండి
నిమిషంలో నొప్పి తగ్గుతుంది
జలుబు, జ్వరాలు, ఒళ్లు నొప్పులు — వీటన్నిటికీ అమృతాంజనం ఉపయోగించండి. మీ కుటుంబానికది శ్రీరామరక్ష. నొప్పి కలిగినప్పుడు ఒక్క-సారి రాస్తే చాలు. ఇంట్లో ఒక్క సీసా ఉంటే నెలల తరబడి
AMRUTANJAN
The Pain Balm
అమృతాంజన్ లిమిటెడ్
మద్రాసు-4, బొంబాయి-1,
కలకత్తా-1, న్యూఢిల్లీ-1
JWT AM-1428


ఉబ్బస రోగమా?
ఎఫోమాగ్
ఎలిక్సర్
(Ephomag Elixir)
సేవించి శీఘ్ర నివారణ పొందండి.
నమ్మకంగా లోపలికి పుచ్చుకోదగిన
ఉబ్బస నివారణౌషధము.
అన్ని కెమిస్టు షాపులలోను దొరుకుతుంది
DATA TEMPORE
MPL
PROSUNT
M.A.C. Margarets Pharma-Labs.
40, SAN THOME HIGH ROAD, MADRAS-28.
Telegrams: MAGMARS. Telephone: 71886.

# ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

## విషయానుక్రమణిక

శుక్రవారం : *2-3-62*

ప్లవసం॥మాఘమాసం ఐ॥ దశమి

సంపుటము : 54 సంచిక : 26

స్థాపితము:
1908

*

ముఖ్య సంపాదకుడు:
శివలెంక శంభుప్రసాద్

*

సంపాదకుడు.
శివలెంక రాధాకృష్ణ

*

విడి ప్రతి : 25 న. పై
సంవత్సర చందా : 13-0-0 రు.

*

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టివీధి, మద్రాసు-1

★



ముఖచిత్రం


కథలు

| | | |
|---|---|---|
| గాలివాన | — | 8 |
| గూడుకోసం గువ్వలు | — | 26 |
| ఆకర్షణ | — | 32 |

వ్యాసం

| | | |
|---|---|---|
| వృద్ధాప్యంలో కోరికలు | — | 17 |

| | | |
|---|---|---|
| హరివంశం | — | 12 |
| కవిసార్వభౌముడు | — | 16 |
| డాక్టర్ రాజా | — | 19 |
| ఏడుకొండలు | — | 23 |

| | | |
|---|---|---|
| భూగర్భంలోనికి సాహసయాత్ర | — | 24 |

| | | |
|---|---|---|
| ఎన్నికైన సమూహాలు (ప్రత్యేక కార్టూన్) | — | 20 |

ఈ తారాలు-3; సోమెన కార్టూన్-6; కథకాని కథ 7, సినీవిహారం-10, మనమూ-మనరాష్ట్రం-13; మనమూ-మనదేహస్థితీ-15; ఎప్పుడూ-ఇంతే-17; వనితావాణి - 18; నగువుల్రావు - 25; వారఫలాలు-28; హామేసాతమాషా-31; గళ్ళనుడికట్టు-61; యువప్రపంచం-63; పొట్టికథలు-64.



## లోకంపోకడ





"ఎన్నికలలో గెలిచినందుకు మీకు నా అభినందనలు"

"గెలుపు ఏమోగాని డబ్బంతా ఖర్చయిపోయి చిప్ప చేతికివచ్చింది."



కుడి
ఎడమ
ఉత్తర బొంబాయిలో
ఎన్నికల కుస్తీ
భారత్‌కూ మనదేశానికి ఉన్న తేడా చూశావా?
భారతదేశంలో సార్వత్రిక ఎన్నికలు
పాకిస్థాన్ పౌరులు
నెహ్రూం ~ లోహియాం బాక్సింగ్ పోటీ
ఈ రెండవ పడవ నన్ను మరొకరు నడిపితే బాగుండును!
ఆంధ్ర రాజకీయాలు
కాంగ్రెస్ అధ్యక్షపదవి

# కథ కాని కథ

## మాటకుమాట

### (మొదటి బహుమతి)

మా స్నేహితుడు నేను, నెల్లూరునుండి మా వూరు పోతున్నాము. మా వాడు బ్రతక లేక బడిపంతులు చేస్తున్నాడులెండి! వాడు రోజుకు కనీసం కట్ట బీడీలు త్రాగుతాడు. ఒక బీడీనే రెండుసార్లు కాలుస్తాడు. సగం త్రాగి ఆర్పి చెవిలో పెట్టుకొని కొద్దిసేపాగి మళ్లా ముట్టిస్తాడు.

అలవాటు ప్రకారం మా వాడు చెవిలోని బీడీనితీసి, పక్కనే బీడి త్రాగుతున్న పెద్ద మనిషిని నిప్పిమ్మని అడిగాడు. అతను తమాషాకో నిజంగానో తెలియదుగాని "ముక్కలకు నిప్పియ్యను" అన్నాడు. మావాడు చేసేదిలేక ముక్కను బయట పారవైచి, సరిక్రొత్త బీడీనితీసి నిప్పిమ్మని అడిగాడు. ఆ పెద్దమనిషి తాను తాగుతున్న బీడీ నిచ్చాడు. దానితో మావాడు తన బీడీని ముట్టించుకొని అతని బీడీని ఆర్పివేసి అతని కిచ్చాడు. మొదట సంగతి మరచి ఆ పెద్ద మనిషి "నిప్పియ్యవయ్యా" అని మావాడి నడిగాడు. మా వాడు వెంటనే ముక్కలకు నిప్పియ్యను" అన్నాడు. బస్సులో జన మంతా గొల్లుమన్నారు. ఆ పెద్దమనిషి ముఖం చిన్నబోయింది.

పి. కొండయ్య (గుంటూరు)

* * *

## నా వైఫ్‌ని చూడండి

### (రెండవ బహుమతి)

మా క్లాసుమందే ఆడపిల్లల అట్టసలము ఉందిలెండి. వాళ్లు ఎప్పుడూ ఏదో ఒక ఆట ఆడుతూనే ఉంటారు. రోజూ మేము వాళ్ల వైపుచూస్తూ పాఠములు సరిగా వినము. మా స్కూలుకు క్రొత్తగా ఒక సైన్సుమాష్టారు వచ్చారు. ఆయన మొదటనే మా క్లాసుకు వచ్చాడు. ఆయన వచ్చినా మేము ఆడ పిల్లలవంక చూడటంమానలేదు. ఆయనకు బాగా కోపము వచ్చింది. ఆ కోపములో ఆయన "నావైపు చూడండి" అనుటకు బదులుగా "నావైఫ్‌ని చూడండి!" అనే సరికి క్లాసంతా ఒక్కసారి గొల్లుమంది.

ఉండవల్లి మల్లికార్జునరావు (అద్దంకి)

* * *

## వేలంపాట

### (రెండవ బహుమతి)

ఓ సాయంత్రం నేనూ మా రామం షికారు కెళ్ళాం. బజారువేపు పోతుండగా అక్కడో చోట పాతకుర్చీలు, బల్లలు అవీ వేలం వేస్తున్నారు. అవి కొన్నవారికిఅదనంగా ఓ మంచి బహుమతి ముట్టచెప్తామని వేలంవేసే అతను అరుస్తుండగా నేను మా రామాన్ని, "ఆ బహుమతి ఎట్లా వుంటుందంటావురా రామం?" అని అడిగాను.

వాడు చటుక్కున "ఆ ఏముంటుంది నల్లుల మందుతప్ప! అదేవాటికి తగ్గ బహుమతి అని అనేశాడు. వాడి జవాబుకు నాతోబాటు ఆ గుంపులోనున్న కొద్దిమంది కూడా నవ్వారు.

మైనూరి నీలకంఠం (మద్రాసు)

* * *

## ఇనుము లేదు

### (రెండవ బహుమతి)

నేను మా స్నేహితులు ద్వారకా, వాసు ఆనాడు మార్కెట్‌లో కలిసికొన్నాం. ముగ్గురం కలిసి ఆకుకూరలువుండే వైపు వెళ్లి కూరలు తీసికోసాగం. ఇంతలో ఒక ముసలాయన మా ప్రక్కగా ప్రతిఆకుకూర తరచి తరచి చూస్తున్నాడు పాపం! ఆమెకు విసుగెత్తిందేమో మరి 'ఏంది సామీ! అలా చూస్తున్నారు' ఆఖరికి అనేసింది. ఆయన 'ఆ! ఏమీ లేదూ... వీటిలో దేనిలో ఇనుముందా' అని అన్నాడు. 'వీటిలో యినుము లేదు గినుము లేదు' అని గబుక్కున ఆకు కూర కట్టలు తీసికొని బుట్టలో వేసుకున్నదామె. మేము ఆయన అంతరార్థము గ్రహించి హాజాగా నవ్వుకున్నాము!

వెంకట్ (తిరుపతి)

* * *


## అమ్మ భయం!

### (రెండవ బహుమతి)

ఒకసారి నా మిషన్‌దగ్గరకు ఒకామె తన పదేండ్ల కుమార్తెతో వచ్చింది. ఒకగుడ్డ యిచ్చి అమ్మాయికి అర్జంటుగా గౌను కుట్టి యివ్వమని, ఆ అమ్మాయిని నా మిషన్ దగ్గర వదలి బయట కొట్టుదగ్గరకు వెళ్ళింది. నేను కొలతలుచూచి, మిగిలిన గుడ్డను చించి కత్తిరింపులు మొదలుపెట్టాను. ఆ అమ్మాయి ఒక్కసారి ఏడుపు మొదలుపెట్టింది. నాకేమీ అర్థముకాక ఏడుస్తావెందుకన్నాను. "నా గుడ్డ చించావెందుకు? మా అమ్మవచ్చి నన్ను కొడ్తుంది" అని మళ్ళీ ఏడుపు లంకించుకుంది. నాకు నవ్వాగలేదు. ఆ అమ్మాయికి ఏడుపు ఆగలేదు. ఇంతలో వాళ్ళ అమ్మ వచ్చి, జరిగినది విని ఆమెకూడా నవ్వటం మొదలుపెట్టింది.

నిడుమోలు రంగారావు (దుగ్గిరాల)

"10 దండలు వేయిస్తానని డబ్బు తీసుకుని, రెండుదండలే వేస్తున్నావేం?"
—31వ పేజీ కార్టూన్ చూడండి


వీరాజీ

గడియారాలన్నీ యించుమించుగా ఒంటిగంటన్నర చూపెడుతూ వుండేసరికి ధరణీపతికి కడుపులో దొలిచినట్లయ్యింది. మెదడు కొంచెం బరువుగా వుంది. ఫైలు మూసి కలం స్టాండుమీద ఎడేశాడు. వెంటనే తతిమ్మా గుమస్తా పక్షులతో కలిసిపోయాడు. అందరూ "అవు రావుర"ని—ఆఫీసు యినపముళ్ల కంచెల కెడంగావున్న "మొబైల్ కపే" మీదపడ్డారు. చలపతి, చంద్రం యిద్దరూ టీ మాత్రం తాగుతారు. కాని వాళ్లిద్దరికి ఉత్త 'టీ' 'ఉడుకుగా' గొంతులో నించి దిగదు. అందుకనే కబుర్లతో నంచుకుంటారు. ఆ కబుర్లు కూడా చాలా గమ్మత్తైనవి. విశేషం గలవీను. ఒక్కోసారి హయగ్రీవరావులాంటి "యిడ్లీదాసు" కూడా మింగుదామనుకున్న యిడ్లీ ముక్కను కూడా మింగడు. ఆశ్చర్యంగా నోరు విప్పలేక చెవులు రిక్కిస్తాడు.

నిన్న చలపతి 'హెడ్క్లర్కు'గారి కోడలు అలిగి వెళ్ళిపోయిందన్న తాజా వార్త వినిపించాడు మొన్న చంద్రం కాషియరు పెళ్లాన్ని ఆరోకాన్పుకి పుట్టింటికి బలవంతంగా పంపించేడని బయటపెట్టాడు. అంచేత ఆవేళ చలపతిదే వంతు.

"ఐనా గాకపోయినా మన సెక్రటరీ పెళ్లైన మూన్నెల్లకే అలా ఐపోయాడేమిటీ?" అన్నాడు చలపతి.

"ఎలా ఐపోయాడు? ఇంచక్కా హోటలు కూడు తప్పిందిగా......" తన ఏకవచన ప్రయోగానికి మొదట కొంచెం మురిసిపోయి ఆనక కొంచెం ముందుకువంగి టీ తాగడం నటించాడు చంద్రం.

"అసలూ, వూరికి అంతదూరంలో కొంప కట్టుకున్నాడుకదా. ఆఫీసులోవున్నంతసేపూ యింటిమీదకే ధ్యాసపోదుట్రా?......" హయగ్రీవరావు అడిగాడు బొత్తిగా యిలాంటి విషయాలు తనకు తెలియవన్నట్లు మొహం పెట్టి.

"ఇల్లు ఒకటి దగ్గరగా చూడమన్నాడ్రా" చెప్పేడు చలపతి.

"ఏంరోయ్! ఏం కథ......? వాళ్ల శ్రీమతిగారు ఒంటరితనం భరించలేనందా?" అడిగేడు చంద్రం.

"కాదు......కాదు......" నవ్వాడు విజయగర్వం సూచించేటట్లు చలపతి. ఓరి వాజమ్మా! వేసేవు పప్పులో కాల"న్నాడు చంద్రాన్ని ఎత్తునించి మెడ పెట్టి చూసి

"అయితే చెబుదూ...వెధవది ప్రతీది నానబెట్టక" చంద్రం తన వోటమిని నొప్పుకోడం యిష్టంలేక అలా అన్నాడు. కాని "గాస్సిప్" చేయడంగన్నా పెద్ద కళ యింకోటి లేదని ఆ యిద్దరి నొదుద్దేశమూను.

చలపతి వెంటనే అనేశాడు. "ఇంతేనా నీ తెలివితేటలు?......"

అని తిరిగి చంద్రం మాట్లాడేలోపునే అన్నాడు. ఆయనగారి శ్రీమతి మధ్యాహ్నంపూట యిడ్లెన్నూ పెసరట్లూ చేసి పంపుతే తిందామని యిల్లు మార్చేస్తావంటున్నాడు అనుకుంటున్నావ్ కదూ......? అదేం కాదు......" కొంచెం యిసింటా జరిగి, అందరు వింటున్నారో లేదో గమనించి, "ఈయనగారు యిక్కడ వున్నప్పుడు అక్కడ శ్రీమతిగారు మరొకడికి తన వలపు వంచిపెట్టకండాను...." అందరూ అంతే అలాగే వుండిపోయారు. ఈ విశేషం......

ఈ అద్భుతం ఈ చలపతి విసిరిన బాంబు...... ముక్కుమీద తగిలినట్లు......

ధరణీపతి మాత్రం అన్నాడు "నాన్‌సెన్సు" అని.

"ఏమిటీ? నాన్‌సెన్సు .. .నీ మొహం......నేను అబద్ధం ఆడుకునేటంత కర్మం ఏం చేశానూ?" అని సొగదీసి అడిగి చలపతి వెంటనే నువ్వు నన్ను కాదనేపాటివాడివా అన్నట్లు చూసి, "అయితే నువ్వు యింకా దొడ్డిదారంటే వున్నావన్నమాట?...... పాపం!......మీ యిల్లూ అరు మైళ్ళ దూరం కాబోలు? అందుకే సెక్రటరీమీద నీ కింత సానుభూతి అన్నాడు. దాంతోనే "టీ" మహా రుచిగా సిప్ చేసేడు.

దరణీపతి మొహం కందిపోయింది. టీ కప్పు లోనించా? అతని కళ్లల్లోనించా? అన్నట్లు ఆవిర్లు వస్తున్నాయి.

చంద్రం పరిస్థితుల నందుకున్నాడు. "చూడు ధరణీపతి! పొగవస్తే నిప్పు వుందనేగా......అదీగాక... నీకేం తెల్సు? ఆడాళ్లసంగతి. మొగుడు ముందా వాడు ఓ కన్ను పారేస్తే తప్ప తిన్నగా వుండరు సుమా...." అన్నాడు. అందరూ నవ్వేశారు. అక్కడికి ధరణీపతి ఒక్కడే మొగుడూ, తామెవ్వరూ కానట్లు. తమకెవరికి పెళ్ళాలే లేనట్లు.

ధరణీపతికోసం ఉక్రోషంగా మారి......అది కాస్త దుఃఖంగామారి......బయటికి రావడానికి అవకాశం లేక మొహంమాడిపోయింది.

"ఛా! ఉత్త వెధవలు మీరు......" అంటూ వెళిపోబోయాడు. అంతలో చలపతి భుజంమీద చెయ్యివేసి, "అరె! ఆగవోయ్ బ్రదర్! పుచ్చకాయల దొంగా అంటే భుజాలు తడుముకున్నట్లు మధ్య నీకెందుకూ? వులుకూ?" అన్నాడు.

* * *

ఔను మధ్యను నా కెందుకూ వులుకు? అనుకున్నాడు ధరణీపతి అర్జంటు అన్న కాగితంమీది ఎర్రని అక్షరాలలోని "ఎరుపుకేసి నిప్పునుచూపినట్లు చూస్తూ: "నిప్పువుంటేకాని పొగ రాద"న్నాడు చలపతి.

"నేను భుజాలు తడుముకున్నానా?" అనుకున్నాడు ధరణీపతి భుజాలు దులుపుకుని.

"నిజమే కాబోలు—ఈమధ్య సెక్రటరీగారు అసలు ఉత్సాహంగా అగుపించడంలేదు అనిపించింది. "సిరా" దులిపి కలం కాగితంమీద పెట్టి పెట్టగానే ధరణీపతికి, "పెళ్లికాకముందు చాలా హుషారుగా సెక్రటరీ అగుపించిన సందర్భాలు వద్దనుకున్నా ఒకటి రెండు జ్ఞాపకం వచ్చేయి. "ఆడ జాతి సంగతీ తనకూ తెలియుదేమో?......ఏమో......! అమాట కొస్తే నీరజ గురించి తనకెంత తెలుసు?...... నీరజ అంటే ధరణీపతి భార్య. ధరణీపతికి పెళ్లై అంతా ఆర్నెళ్ళు కాలేదు. నీరజ చాలా అందగత్తె. అందులో ధరణీపతికి గర్వం కూడా వుంది ఐతేనేం... చదువుకున్నది. నగరంలో పెరిగింది అవన్నీ యివాళ సెక్రటరీగారు అతని భార్య......కొత్తగా యిల్లు..... దగ్గరగా చూడమనడం ...... చలపతి "వాగుడు" చంద్రం "ఊరడింపు" యివన్నీ జరిగితేనేగాని ధరణీపతికి ఏమీ అలజడి కలిగించనేలేదు.

ధరణీపతి కలాన్ని సిరాలోముంచినప్పుడల్లా ఎవరో తన ఎదనే పొడుస్తున్నట్లనిపించింది. "నీరజ ఎన్నిసార్లు చెప్పింది శేఖరం గురించి?"

"చాలా సార్లు చెప్పింది"

"శేఖరం ఎంత మేనబావ అయితేమటుకు తన ముందు అన్నిసార్లు అతగాణ్ణి మెచ్చుకోడం ఏమంత భావ్యం?" అడిగింది అతనిలోని అహంకారం.

"ఔను. పరాయి మొగాణ్ణి అంత యిదిగా భర్తముందు పొగడడం......తప్పకండా తప్పు" అని తీర్మానించేసింది అతనిలోని అనుమానం.

"ఇది"గా అంటే? ఏమని మెచ్చుకుంది? అందులోని అంతరార్థం ఏమిటీ?.... అసలు అంత అవసరం ఏమొచ్చింది? అతని మస్తిష్కం పాత "ఫైలు" తిరగేస్తున్నది

"నీరూ! వెధవది టెన్నిస్ అంటే నాకు అంత కిట్టదా? మా సెక్రటరీగారు అదంటే పడిచస్తాడు." అన్నాడు ఒకసారి. అది కూడా అనకపోయేవాడేగాని.... నీరజ ఆరోజు పేపర్లో వెనక పేజీలో వేసిన టెన్నిస్ ఆట బొమ్మనే చూస్తూవుంటే అలా అన్నాడు. వెంటనే "ఔను" అనొచ్చును. "కాదు" అనొచ్చును. నీరజ. కాని ఆ పిల్ల రెండూ అనలేదు. "మా బావ శేఖరం ఎంత మంచి ప్లేయరనుకున్నారు?" అంది. అవి వూరుకుందా? వాళ్ల బావకి ఎన్ని కప్పులు వచ్చాయో సవివరంగా చెప్పింది చెప్పుకుని మురిసిపోయింది.

అది ఆవేళ అంతగా బాధించనేలేదు.గాని "స్త్రీలం"టే ఎంత అపనమ్మకం వుంచాల్సిన వస్తువులో చలపతి చంద్రాలు పాఠం చెప్పిన ఈవేళ మాత్రం గుండెల్లో ములుకులైయ్యేయి.

"ఔను సుమా! నాకు చాలాసార్లు నీరజ ఫలాని నవల మంచిది......చదవండి. ఫలాని సబ్బు చాలా మంచిది. మా శేఖరంబావ అంటూండేవాడు లెండి..... ఫలానీ వెంకటప్పయ్య మాంచి చదరంగం ఆడుతాడు. మా బావ అతగాడితో వోడిపోయాడు." యిలా చెపుతూ వుంటుంది.

ఇంతకీ ఆ బావ ఎవరు?

ఎదురుగుండావున్న ప్యూనుకేసి ఆ ప్రశ్న వేయడానికా? అన్నట్లు తలఎత్తి ప్రశ్నార్థకంగా చూసేడు ధరణీపతి.

"ఏం......సార్.....గుండుసూదులు కావాలా?" అన్నాడు వాడు.

"అలాగేవుంది నా బ్రతుకు......వెధవని...... వాణ్ణే కట్టుకోలేకపోయిందీ?" అని లెటర్ డ్రాప్టులో మునిగిపోయాడు...... అంటే మునిగిపోదామని ప్రయత్నం చేశాడు. కాని ఉత్తరాల జ్ఞాపకాలు బుర్రలో గిర్రున తిరిగేయి. కర్మ! తన కింత మంది స్నేహితులున్నారు...ఎన్నడూఒక్కడూకావోతే ఒక్కడు ఉత్తరంముక్క రాసిన పాపానపోలేదు. కాని నీరజకి మాత్రం బోలెడు ఉత్తరాలు వస్తూంటాయి

"ఏం ఉత్తరాల. చెపుమా! ఛా! వెంటనేపోయి చూదునా? అనిపించింది. కాని పాడుకొంప ఆరు మైళ్లు. అరగంట బస్సుకోసరం క్యూలోపాట్లు అనక మరి అరగంట ప్రయాణం......

"ఛీ సెక్రటరీగార్ని అనుకున్నాను అనవసరంగా.

—56వ పేజీ చూడండి

# ఈవారం సినీవిహారం

మధుమూర్తి

## మంచి మనసులు

ఆ అబ్బాయిది చాలా మంచిమనసు. తనను పెంచి పెద్దజేసి తండ్రి లేని లోటును తీరుస్తూ తనపై వాత్సల్యం వర్షించిన పెద్ద అన్నగారి ఆనందం కోసం, ఆయన అంతిమకోరికను



"సిరిసంపదలు"లో సావిత్రి.

శిరసావహిస్తూ ఒక అమ్మాయిని, అంధురాల్ని' పెళ్లిచేసుకున్నాడు; ఆమె కురూపికాదు. ఆమెను ఆనందపరచడం, ఆమెనుంచి ఆనందాన్ని అందుకోవడం అతని కర్తవ్యం. ఆమెది కూడా మంచి మన సు.

ఆమెను హంపీనగరానికి తీసుకు వెళ్ళాడు.

అలనాటి ఆంధ్రభోజుడు శ్రీకృష్ణ దేవరాయల వైభవానికి సాక్షిగా నిలిచిపోయిన శిథిలాలను చూసి, అతను పొందిన ఆవేశాన్ని ఆమెకు అందించటానికి వెలుగునీడలు ఎరుగని ఆమెకు మనోరూపాన్ని ఏర్పరచడానికి అత డొక పాట పాడాడు.

ఆహా! ఆంధ్ర భోజా! శ్రీకృష్ణదేవరాయా!  
విజయనగర సామ్రాజ్య  
నిర్మాణతేజో విరాజా!  
ఈ శిథిలాలలో చిరంజీవి వైనావయా!  
శిలలపై శిల్పాలు చెక్కినారు




'ఖైదీ కన్నయ్య' లో రేలంగి.

సృపి కే అందాలు తెచ్చినారు.


కనుచూపు కరువైన వారికైనా  
కనిపించి కనువిందు కలిగించు రీతిగా ॥శి॥

ఒకవైపు ఉగ్రరూపాలూగు కవనాలు  
ఒకప్రక్క ఉరికించు యుద్ధ భేరీలు

—53వ పేజీ చూడండి



"దేశద్రోహులు"లో ప్రేమ్‌నజీర్



“ప్రతిజ్ఞాపాలన”లో ఎస్. ఎ. రామారావు

# హరి వంశము

## హారీత శివశర్మ

# సాందీపనిపర్వం - 50

సాందీపని మహారాజా పిలిపించమనినాడని సుదక్షిణ పౌండ్రకునకు తెలియజేయలేదు. కంచుకిని పిలిచి, రథమును సిద్ధము చేయించవలసినదిగా ఆజ్ఞాపించినది. రథము వచ్చి వాకిటిలో నిలబడిన తరువాత గాని, పౌండ్రకునకు ఏది ఏమో బోధపడలేదు బోధపడగా అతడు సుదక్షిణ మందిరమునకు బయలుదేరిపోయినాడు సుదక్షిణ ఆశ్రమ ప్రవేశోచితములగు ఉడుపులను ధరించి, ప్రయాణమునకు సిద్ధముగా నున్నది అట్టి ఆమెను పౌండ్రకుడు వీక్షించినాడు మందహాసము చేయుచు నామెను పలకరించినాడు

"సుదక్షిణ! ఎక్కడికో ప్రయాణమగుచున్నట్టు లున్నావు"

సుదక్షిణ అతనిని చురుక్కున చూచినది. "స్వామి! తమకు ఎప్పుడు ఏమి మాటాడవలెనో తెలియదు అంతగా నా ప్రయాణమును గూర్చి తెలియవలయునన్నచో ఎంత దూరము పోవుచున్నావని అడిగిన చెప్పెడిదానను గదా!" అన్నది పౌండ్రకుడు తెలివి తెచ్చుకొనినాడు. ఆమె యున్న ఆమాట అతనికి అర్థమైనది. "సుదక్షిణా! తప్పు అయినది" అనినాడు. "ఇప్పుడు సత్యముగా నడిగెదను. ఎంత దూరము పోవుచున్నావు. నేను రథమును తోలుదునా!" అనినాడు.

పౌండ్రకుని తొలి మాటలు సుదక్షిణ మనసును ఆఘాతపరచినవి. ఆమెకా మాట అవహేళనము వలె తోచినది. తన జీవితమే ఒక అవహేళనము వలె నామెకు భాసించినది ఆమె పౌండ్రకునకు సమాధానము చెప్పలేదు వెలుతో మాటలాడు మౌనమున తన భావమును ప్రకటించినది అది పౌండ్రకుని వద్దన్నట్టును లేదు అవు నన్నట్టును లేదు. "మహారాజా లేల కష్టపడవలయును. అందునను నా రథమునకు సారథ్యమా! వృద్ధసూతుడు నా రథమును తోలును ప్రభువులు ఇప్పుడు తమ పనులను చూచుకొనవచ్చునని చెప్పుడు" అన్నది

పౌండ్రకుడు మరల మందహాసము చేసినాడు. అతనికి ఆమెను తనయందు సుముఖురాలను చేసుకొనవలయునన్న దీక్ష ఎక్కువైనది. శ్రీకృష్ణవాసుదేవుని భిక్షావృత్తాంతము నాటినుండియు ఆమె తనయందు, తనయందువలె వ్యవహరించుట లేదు తన లీలలను చూచుటలేదు చూచి పూర్వము వలె సుందరముగ నవ్వుటలేదు ఇప్పు డామె ఏవో కొన్ని యుగముల యనుభవము తనలో గూడుకట్టుకొనినట్లు, గంభీరయు, మితభాషయునై యున్నది మరి తనయందు మర్యాద చేయుట లేదా! అచ్చట ఏ లోపమును లేదు కాని ఆమె తనకు ఎంత చేరువలో నున్నదియో, అంత దూరముగ గూడ నున్నట్లు పౌండ్రకున కనిపించుచున్నది అట్టి ప్రవర్తనమును చూచియే, అతడు ఆమె శ్రీకృష్ణదేవునియందు ప్రేమచేయుచున్నదన్న అభిప్రాయములో పడినాడు మరి ఆమె ఇంటిలో నిప్పుడు ఆ యాదవుని నామమునుగూడ ఉచ్చరించుటలేదు పూర్వము మహానందముతో వచ్చినప్పుడెల్ల, ఆయనను ఎన్నియో విషయముల నడుగుచుండెడిది ఇప్పు డదియు చేయుటలేదు ఆయన రాగా, తన్ను పలకరించగా, "తండ్రీ! సేమమా! నామాక్షి కుశలమా! దానికి ఎప్పుడు పెండ్లి చేయుదురు" అని మాత్ర మడుగును ఆయన యేమో పెద్ద హాస్యగాడు. "నేను పెండ్లి చేసుకొని సుఖపడుచుంటిని కదా! దానికి మాత్ర మిట్టి సుఖ మెందులకు" అనును "ఆచార్య! తమరు పురుషులు నామాక్షి కాదు మీ సుఖమును, ఆమె సుఖమును ఒక్కటీరు సుఖములా!" అని సుదక్షిణ అనును "అవును! తల్లీ! అవును నీవు బాగుగా నన్నావు నేను మతిలేనివాడను సాందీపని అన్నట్లు జడుడను" అనును ఇద్దరును నవ్వుకొందురు ఆ నవ్వినప్పుడు గూడ సుదక్షిణ పూర్వమువలె యుండుటలేదు ఆ పూర్వము నవ్వినప్పుడు ఆమె ముఖము ప్రభాత ఉషస్సుకు వలె వికసించెడిది ఇప్పుడును ఆ ఉషస్సునకు కొరవలేదు. కాని ఆ కాంతిలో క్రొత్త కాంతులు విచిత్రములై మిలమిలలాడుచున్నవి. లేతసూర్యుని కిరణములతోడి సంపర్కముతో ఉషస్సు ఎరుపువిరిగి కరుకుతేరినట్లు ఆమె ముఖపద్మమునందు విచిత్రరాగములు పొరాడుచున్నవి ఇదియంతయు పౌండ్రకునకు విచిత్రముగ నున్నది శ్రీకృష్ణయాదవుని దర్శనానంతర మామె ఇట్లైనదని పౌండ్రకున కాతనిపై మరియు నామర్ష మధికము కాజొచ్చినది ఇప్పు డామె యెచ్చటికు పోవుచున్నది అదియే ఇంకను అతనికి తెలియలేదు

"సుదక్షిణ! నీవు చెప్పరాదా!" అనినాడు

సుదక్షిణ అతనిని చూచిన చూపులలో గౌరవమున్నదా! తిరస్కారమున్నదా! ఆమె అడిగిన మాటలలో నవి యేమో పొక్కలేదు

"స్వామి! నేను సాందీపని ఆశ్రమమునకు పోవుచున్నాను"

పౌండ్రకుడు హఠాత్తాడితుడైన ట్లయినాడు అతని ముఖములో తీక్ష్ణత తోచినది మాట గూడ తీక్ష్ణమైనది "నీవేల పోవలయును పనియేమి! మరియొకరిని పంపరాదా! నీవు చెప్పినచో నేను పోయిరానా!" అని ఆవేశముతో ననినాడు

సుదక్షిణ గల్లున నవ్వినది

"స్వామి! నేనేల పోరాదు. తమరేల పోవలయును. మా తండ్రిగారు సాందీపనిని పిలిచికొనిరమ్మనినారు. నేను పోవుచున్నాను కాదు నేను పోయెదను అని మీ రందురు నేను మిమ్ముల నచ్చటికెట్లు పంపుదును అచ్చట శ్రీకృష్ణవాసుదేవు డుండును మీకును, ఆయనకును పడదు. మీ రాయన నేమో అందురు ఆయన మిమ్ముల నేమైన చేసినచో నే నేమాడుదును మీరు పోవలదు నేనే పోయెదను" అన్నది

"నేనును వచ్చెదను" అనినాడు పౌండ్రకుడు.

"నాతో వలదు" అన్నది సుదక్షిణ

"నీవు న న్నవమానించుచున్నావు" అనినాడు పౌండ్రకుడు

"కాదు! నన్ను నేను రక్షించుకొనుచున్నాను" అన్నది సుదక్షిణ అని వెంటనే అచ్చటనుండి కదలినది వృద్ధసూతుడు మొగలితోనుండి గుఱ్ఱములను అదలించుచు, ఆమెను చూచి, సాదర మందహాసము చేసినాడు ఆమె రథము నధిరోహించినది సారథి రథమును ముందునకు పోనిచ్చెను పౌండ్రకు డచ్చట నిలబడి ఆ రథము పోయినంత మేర చూచుచు నిలుచుండెను తరువాత తానును వేర రథము నధిరోహించి బయలుదేరెను సుదక్షిణ ఒక్క దారిని పోగా, తాను మరియొక్క దారిని పోయెను రెండు రథములును సాందీపని ఆశ్రమమునకు ఒక్కసారిగ చేరినవి. పౌండ్రకుడు తన రథమునుండి అవతరణము చేసి సుదక్షిణ రథమువద్దకు పోయి నిలబడెను. ఆమె మాటాడలేదు అతని వంకగూడ చూడలేదు

"సుదక్షిణ! నేనును వచ్చినాను" అనినాడు పౌండ్రకుడు

ఆచార్యాణి దూరమునుండి సుదక్షిణను చూచి, తానై స్వయముగా వాకిటిలోనికి వచ్చినది

"తల్లీ! మా ఆశ్రమమునకు విజయముచేసినారు పదుడు! లోపలకు పోదము" అనినది. ఆమెను వెంటబెట్టుకుని లోపలికి పోయినది పౌండ్రకుడు వాకిటిలోనవే నిలబడియున్నాడు

సాందీపని విద్యామందిరములో నున్నాడు. ఆచార్యాణి ఆయనకు రాజకుమార్తె వచ్చినదని కబురుపెట్టినది ఆయన విద్యామందిరమునుండి తన నివేశనమునకు వచ్చినాడు సుదక్షిణ ఆయన పాదములమీద పడినది

"ఆచార్య! తండ్రిగారు! మిమ్ములను ఒక్కసారి రమ్మనినారు తీసికొనిపోవుటకు స్వయముగా వచ్చితిని" అన్నది

సాందీపని ఆలోచనాధీనుడై, అంతలో "తల్లీ! నీవు రావలయునా! ఎవ్వరిని పంపినను వచ్చెడివాడనే!" అని, ఆచార్యాణి దిక్కై "అమ్మా! నీవును బయలుదేరవలయునే" అని ఆజ్ఞాపించినాడు

వా రుభయులు బయలుదేరి వాకిటిలోనికి వచ్చునరికి శ్రీకృష్ణదేవు డచ్చట కన్పించినాడు అతడును, పౌండ్రకుడును ఒకరి నొకరు విచిత్రముగా చూచుకొనుచు నచ్చట నిలబడినారు శ్రీకృష్ణదేవునకును, అతనికిని, అంతకు ముందుగా నేదియో సంభాషణము జరిగినట్టు లున్నది పౌండ్రకుని మోము వెల్లనై యున్నది శ్రీకృష్ణుని మోమున విచారముతోడి మందహాసము అందగించుచున్నది.

51—వ పేజీ చూడండి

# పార్టీలక్ష్యాలకంటె కులమతాభిమానాలకు ప్రాధాన్యం: విద్యారంగంలో తెగని ఆలోచనలు; తీరని సమస్యలు

**కౌండిన్య**

దేశంలో తతిమ్మా రాష్ట్రాలన్నింటితోపాటు, ఆంధ్రప్రదేశ్‌లో కూడా సార్వత్రిక ఎన్నికలు సమాప్తమయ్యాయి. పోలింగ్‌కుముందు, అక్కడక్కడా చెదురుమాటుగా జరిగిన కాంగ్రెస్ కమ్యూనిస్టు కొట్లాటలుతప్ప, మొత్తంమీద, క్రితం రెండు ఎన్నికలలో మాదిరి, ఇవి కూడా ప్రశాంతంగానే జరిగిపోయాయని చెప్పవచ్చు. ఎన్నికలలో పాల్గొన్న వివిధ పక్షాలు ఎన్నెన్ని స్థానాలు గెల్చుకున్నదీ, అతిరథ మహారథులలో ఎందరు నెగ్గినదీ ఎందరు నేల కొలిగినదీ పై వారంగాని తెలియదు. ఫలితాలు చాలా ఆశ్చర్యకరంగా ఉండేమాట నిజం.

రాష్ట్రంలో పోలింగ్ ధోరణి అనుకున్నదానికి కొంత భిన్నంగాఉంది. అతి ముఖ్యులైనవారు పోటీలో నిలచిన కీలకనియోజక వర్గాలలో సహా చాలాచోట్ల పోలింగ్ ఒక మాదిరి ఎక్కువగానే ఉంది. క్రిందటిసారి అనగా1955లో ఆంధ్రప్రాంతంలో మొత్తంఓట్లలో 80%పోలైనాయి. 57 తెలంగాణా ఎన్నికలప్పుడు కూడా విశేషంగానే ఓట్లు పడ్డాయి. ఈసారి సగటున ఎంతశాతం పోలైనదీ ఓట్లు లెక్కింపు పూర్తి అయితేగాని బయటపడదు. ఈసారి ఎక్కువ ఓట్లు పోలైనాయంటే, అది ఓటర్ల రాజకీయాది చైతన్యాభివృద్ధికన్నా, రాజకీయ పార్టీల వోట్ల సమీకరణ సామర్థ్యంవల్లనే సాధ్యమైందని చెబితే బాగుంటుంది. ప్రచార సమయంలో అన్ని పార్టీలవారు ఇంటింటికీ వెళ్ళి వోట్లు అర్థించి అంతటితో తమ పని పూర్తి అయినట్లు భావించక, ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు చేర్చడంలో కూడా ఎక్కువ శ్రద్ధ వహించాయి. కనుకనే కీలక నియోజక వర్గాలలోనూ పార్టీ కక్షలు మరీ బలంగా ఉన్న కొన్ని చోట్ల నూటికి 90 వంతులు కూడా పోలయ్యాయి.

ఓటింగ్ తీరు తెన్నులు గమనిస్తే, పార్టీల ఆశయాలకు, వాటి కార్యక్రమాలకు ప్రాధాన్యమిచ్చి అభ్యర్థుల నెన్నుకొన్నట్లు అంతగా కన్పించదు. కులాభిమానం, వర్గాభిమానం, స్థానికంగా ఆ యా వ్యక్తుల పలుకుబడి—ఈ మొదలైనవాటిదే పై చేయి అయింది. వయోజన ఓటింగ్ హక్కు లభించినా, పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఆ ఓటు హక్కును విచక్షణతో, ఆ యా పార్టీల మంచిచెడుగులను గమనించి వినియోగించగల పరిజ్ఞానం ఓటర్లలో బహుళ సంఖ్యాకులకు అలవడలేదంటే అతిశయోక్తి కాదు. దేశంలో నిరక్షరాస్యులెక్కువగా ఉండటం, అక్షరాస్యులలో కూడా కుల మతాభిమాన వాసనలు పోకపోవడం ఇందుకు కొంత కారణం. దానికితోడు రాజకీయ పార్టీలు కూడా అభ్యర్థులను నిర్ణయించడంలోనేమి, ప్రచారాన్ని నిర్వహించడంలోనే బాహాటంగా కన్పించకపోయినా, కులాభిమానానికి తావిచ్చాయి. కమ్మ,రెడ్డి, బ్రాహ్మణ అబ్రాహ్మణ, హరిజన, హరిజనేతర, ఈరకమైన వర్గ, కుల దృక్పథంతో ఎన్నికలలో పాల్గొనడం ప్రజాస్వామ్యాన్ని సురక్షితంచేసే లక్షణం కాదు. కమ్యూనిస్టు పార్టీవారు ఒక చోట స్వతంత్ర పార్టీని, మరొకచోట కాంగ్రెస్‌ను, స్వతంత్రపార్టీ వారు ఒకచోట కమ్యూనిస్టులను మరోచోట



అమెరికన్ దౌత్యప్రతినిధులు శ్రీయుతులు జార్జి మెక్ గవర్న్, ఆర్థర్ ష్లెసింగర్ ప్రభృతులు ఇటీవల హైదరాబాదుకు వచ్చారు.

మరో పార్టీని బలపరచడం అవకాశవాదం తప్ప మరేమీకాదు. ఇది పార్టీ పద్ధతి ప్రజాస్వామ్యాభివృద్ధికి దోహదం కాజాలదు.

ఈ ఎన్నికలు గురించి రాజకీయ పార్టీలవారు నేర్చుకోవలసిన గుణపాఠాలు కొన్ని ఉన్నవి. వోటర్లలో వివిధపార్టీల గుణదోషాలు, వాటి ఆశయాలు కార్యక్రమాలు గురించిన విచక్షణాశక్తి ఎక్కువ కన్పించలేదన్నా, పార్టీలకన్నా ఏ అభిమానం వల్లనైతేనేం అభ్యర్థులకే ప్రాధాన్య మిచ్చారన్నా—అందుకు ఆ యా పార్టీలే ప్రధానంగా బాధ్యత వహించాల్సి ఉంటుంది. గత రెండు ఎన్నికలలో కన్నా, ఈసారి వివిధపార్టీలవారు పరస్పరనిందా ప్రచారం ఎక్కువగ సాగించిన సంగతి తెలిసినదే. రాజాజీ నెహ్రూలాంటి అగ్ర నాయకులు మొదలు సామాన్యనాయకుల వరకూ ఎదుటివారిని నిందించడం మినహా తమ పార్టీ గొప్పతనాన్ని తగినంతగా వివరించలేదంటే సత్యదూరంకాదు. చేసిన విమర్శలే చేస్తూ, తిట్టిన తిట్లే తిడుతూ సాగించే ప్రసంగాలవల్ల విసుగెత్తి ఈసారి సభలకు అట్టే జనం రాలేదు. అందుకే ప్రతి పార్టీవారికీ, ఇంటింటికీవెళ్లి 'మీ వోటు మాకే' అని ఒక్కొక్కరిని ప్రాధేయపడాల్సిన వచ్చింది. లక్షల సంఖ్యలో ఉండే ఓటర్లను ఒక్కొక్కరిని ఇలా అర్థించాలంటే ఎంత ఖర్చో ఊహించవచ్చు. ప్రపంచంలో ప్రముఖ ప్రజాస్వామ్య దేశాలైన బ్రిటన్, అమెరికాలలో కూడా ఎన్నిక సభలకు ఎంతో ప్రాముఖ్యం ఉంటుంది. వేలాది జనానికి వివిధ సమస్యలను, పార్టీ విధానాలను తేలికగా విడమర్చి చెప్పడం సభలలో సులువు. కాగా సభలపై జనానికి మోజు తగ్గడం కూడా ప్రజాస్వామ్యానికి చెరుపే. ఈ సంగతి వివిధ పార్టీలు ఆలోచించాలి. సమస్యలను తీసుకొని చక్కగా విమర్శించగల, వివరించగల వక్తలుంటే, సభల రక్తి కడతాయనడం సందేహంలేదు. అంతేగాని మా పార్టీకే మీ వోటు అనడం ఒక్కొక్క సమయంలో పార్టీ ఏదైతేనేం 'కంకికొడవలి' లేదా 'కాడెద్ల గుర్తు'కే

—62వ పేజీ చూడండి

# మనము - మన దేహస్థితి

డా॥ గాలి బాలసుందరరావు

## లివరు: శర్కరలు

గత వ్యాసంలో రక్తంలోవుండే గ్లూకోజు పరిమాణమును గురించీ, దానిని లివరు మార్చే విధమును గురించీ తెలుసుకున్నాము

శరీరంలో వినియోగమయ్యే గ్లూకోజు పిండి పదార్థములనుండీ, పాలూ, పళ్ళూ వీటినుండి మాత్రమే తయారుకాదు ఇతర ఆహారపదార్థముల రసాయనిక స్వరూపమును గూర్చి, వాటిని గ్లూకోజుగా మార్చగల శక్తి, లివరులోవున్న జీవకణములకు ఉన్నది ప్రోటీనులు జీర్ణంకాగా ఏర్పడిన ఎమైనో ఏసిడ్లనూ, కొవ్వు పదార్థములు జీర్ణం కాగా ఏర్పడిన గ్లిసరాల్, కీటో ఏసిడ్లు అనే పదార్థములనూ మార్చి లివరు అత్యవసరమైనప్పుడు గ్లూకోజుగా మార్చగలదు మాంసకృత్తులు మాత్రమే బలమని కేవలం మాంసమూ, చేపలూ, గ్రుడ్లూ పెల్చుకు తినేవారి శరీరంలో హృదయానికీ, మెదడుకూ కావలసిన గ్లూకోజు కొంతవరకు ఈ విధంగానే తయారవుతుంది

మనుష్యులూ, జంతువులూ తీసుకునే ఆహారంలో పిండిపదార్థములు తక్కువైనప్పుడుగానీ, కేవలం లోపించినప్పుడుగానీ, శరీరంలోవున్న ప్రోటీనులలో చాలా భాగమును లివరు గ్లూకోజుగా మార్చివేస్తుంది అయితే అన్ని రకములయిన ప్రోటీనులనుండి తయారయ్యే ఏమైనో ఏసిడ్లూ ఒక రసాయనిక నిర్మితి కలిగివుండవు కొన్ని మాత్రమే, రసాయనిక వికృతి పొందినప్పుడు గ్లూకోజుగా మారడానికి వీలయిన రసాయనికనిర్మితి కలిగివుంటవి గ్లూకోజులో కార్బను, హైడ్రోజను, ఆక్సిజను 6 12 6 నిష్పత్తిలో వుంటవిగదా ఈ నిష్పత్తిలోనే ఆ మూల వస్తువులున్న ఎమైనో ఏసిడ్లు మాత్రమే గ్లూకోజుగా మారడానికి వీలుపడుతుంది శరీరంలో తయారయ్యే ఎమైనో ఏసిడ్లలో నూటికి 50 నుండి 65 భాగములవరకు ఇటువంటి రసాయనికనిర్మితి కలవే మనిషి నిరాహారుడైవున్నప్పుడు శరీరంలో కండరములు శుష్కించి, అందులోవున్న ప్రోటీను గ్లూకోజుగా మారిపోయి, శరీరంలో దహించబడినప్పుడు కావలసిన శక్తిని ఉత్పత్తి చేస్తవి

ప్రోటీనులలాగానే కొన్ని కొవ్వు పదార్థములు కూడా గ్లూకోజుగా మారడానికి వీలున్నది ఒకప్పుడు కొవ్వు పదార్థములు అతి స్వల్ప పరిమాణంలో మాత్రమే గ్లూకోజు కావడానికి వీలుంటుందని శరీరశాస్త్రజ్ఞులు భావించారు కాని ఆధునిక పరిశోధనలవల్ల కొవ్వుపదార్థములలో కూడా చాలాభాగం గ్లూకోజుగా మారడానికి వీలున్నదని తేలింది

కొవ్వుపదార్థములు ( Hydrocarbon ) రెండు రకములు వెన్న, నెయ్యి, నూనె, గుడ్లు, పాలు, చేపలు వంటి పదార్థములలో వుండే కొవ్వు పదార్థములు శరీరంలో జీర్ణమయ్యేవి కొవ్వువత్తులు పేరఫిన్, మైనం యిటువంటిపదార్థములలో వుండేవీ రసాయనికంగా కొవ్వులే! కాని అవి జీర్ణం కావు గ్లిసరాల్‌గానూ ఫేటీ ఏసిడ్లుగానూ అవి మారవు శరీరంలోవున్న ప్రోటీనులు గ్లూకోజు అయినంతగా కాకపోయినా, శరీరంలోవున్న కొవ్వులు కూడా ఉపవాసంలోనూ, ఆహారంలో గ్లూకోజు లోపించినప్పుడూ, లివరు ప్రభావంవల్ల మార్పు చెంది గ్లూకోజుగా మారిపోతవి

శరీరపరిశ్రమ చేస్తున్నప్పుడు కండరములలో 'లేక్టిక్ ఏసిడ్' ( Lactic Acid ) అనే వస్తువు తయారవుతుంది రక్తంలో దీని పరిమాణం అధికమైనప్పుడే అలసట ఏర్పడుతుంది లివరు ఈ లేక్టిక్ ఏసిడ్‌నుకూడా గ్లూకోజుగానూ, గ్లైకోజన్‌గానూ మార్చివేస్తుంది

పై వస్తువులనేకాక, నారింజ, బత్తాయి, నిమ్మవంటి పుల్లని పళ్ల రసములలో సిట్రేటు (Citrates) లనూ ఆల్కహాలునూ (మద్య విశేషము) మరికొన్ని యితర వస్తువులనూ అవసరమైనప్పుడు లివరు గ్లూకోజుగా మార్చగలదు

పైన వివరించబడిన అసాధారణ గ్లూకోజు నిర్మాణానికి 'ఎడ్రినల్' గ్రంథి తయారుచేసే ఎడ్రినలిన్ అనే వస్తువు చాలా అవసరం ఎడ్రినలిన్ గ్రంథి వ్యాధిగ్రస్తమైనప్పుడు ఎడ్రినలిన్ సరిగా ఉత్పత్తికాదు అప్పుడు శరీరంలోవుండే చక్కెరలుకాని వస్తువులనుండి చక్కెరలను తయారుచేసే శక్తి లివరుకు ఉండదు

రసాయన శాస్త్రవిజ్ఞానం అభివృద్ధి అయిన తరువాత, శరీరంలో ఉత్పత్తిఅయ్యే రసముల రసాయనిక స్వరూపమును నిర్ణయించి, శాస్త్రజ్ఞులు వాటిని కృత్రిమంగా తయారుచేసే విధానాలను కనిపెట్టారు అల్లా తయారుచేయడానికి వీలయిన వస్తువులలో ఎడ్రినలిన్ ఒకటి ఎడ్రినల్‌గ్రంథి నుండి కూడా దీనిని తయారుచేయవచ్చును ఏవిధంగా తయారు చేసినదైనా 'ఎడ్రినలిన్'ను శరీరంలోకి ఇంజక్షన్ ద్వారా పంపవచ్చును అప్పుడు శరీరంలోవున్న ఇతర వస్తువులనుండి గ్లూకోజునూ, గ్లైకోజనునూలివరుఅధికంగా తయారుచేస్తుంది

వివరీతంగా ఉద్రేకములకు లోనయినప్పుడూ, మితిమీరిన శరీర పరిశ్రమ చేయవలసివచ్చినప్పుడూ, దేహంలో ఎడ్రినలిన్ అధికంగా ఉత్పత్తి అవుతుంది అల్లాగే, అతి శీతలత్వానికి దేహం గురిఅయినప్పుడు,అనేక దైహిక మానసిక బాధలు ఏర్పడినప్పుడు కలిగే మానసిక అశాంతికూడా ఎడ్రినల్‌గ్రంథి హార్మోనులను అధికంగా తయారుచేయడానికి కారణమౌతుంది ఇటువంటి పరిస్థితులలో, శరీరంలో జీవకణములు తమ 'మెటబాలిజమును' (నిర్మాణ నిర్మూలనముల ఫలితము) నిర్వహించడానికి యితర సమయములలోకంటె ఎక్కువగా గ్లూకోజు అవసరమౌతుంది,

మానసికోద్రేకములకు గురిఅయినవారికీ, మంచు కొండలపైకి ఎక్కేవారికీ అంతరిక్షంలోకి పోయే వారికీ ఆరోగ్యస్థితిలోవున్న లివరూ, ఎడ్రినల్ గ్రంథీ అత్యవసరములు

ఎడ్రినలిన్‌లాగే, ఇతర వస్తువులనుండి గ్లూకోజు గ్లైకోజనూ తయారు చేయడానికి అవసరమయిన మరొక హార్మోను, కంఠం ముందువైపున శ్వాసనాళంమీదవున్న థైరాయిడ్ గ్రంథినుండి తయారయ్యే స్యందనము ఈ స్యందనమును 'థైరోటాక్సిన్' అంటారు 'టాక్సిన్' అంటే విష వస్తువు అని అర్థము ఒక పరిమాణందాటి థైరాయిడ్ గ్రంథి ఈ వస్తువులను ఉత్పత్తిచేసినప్పుడు శరీరంలో కొవ్వూ కండరములూ శీఘ్రకాలంలోనే కరిగి, శరీరం శుష్కించిపోతుంది అందువల్ల మొదట్లో ఈ వస్తువును విష వస్తువులాగా భావించి ఆ పేరు పెట్టేరు అదే మిగిలిపోయింది అనాళికా గ్రంథులనుండి తయారయ్యే స్యందనములను హార్మోనులు అంటారు అయిదారు గాత్రములో సంగీతపరికరములో శ్రుతికలిపి మేళవించడమును హార్మనీ అంటారు శరీరంలోజరిగే అసంఖ్యాక కార్యక్రమములను నిర్వహించే ఉపాంగములను మేళవించేవి గనక ఈ స్యందనములకు హార్మోనులు అని పేరువచ్చింది వీటినిగురించి సమగ్రంగా ప్రస్తావన వచ్చినప్పుడు వివరిస్తాను

శిరః పేటికలో మెదడుకు క్రిందగా పిట్యూయిటరీ అనే అనాళికాగ్రంథి వున్నది దానిలో పూర్వభాగము (ముందున్నది) పృష్ఠభాగము (వెనుక వున్నది) అని రెండుభాగము లున్నవి ఇందులో పూర్వభాగంలో తయారయ్యే హార్మోనులు అధికం అయినప్పుడు—లివరు శరీరంలో ఇతర వస్తువుల నుండి గ్లూకోజును గ్లైకోజనునూ తయారు చేస్తుంది పిట్యూయిటరీ గ్రంథిలో వ్యాధి యేర్పడ్డప్పుడు లివరులో గ్లైకోజన్ పరిమాణం తగ్గిపోతుంది

రక్తంలో గ్లూకోజు ఒక పరిమాణంలో వున్నప్పుడే శరీరకార్యక్రమం చక్కగా సాగుతుంది. రక్తంలో గ్లూకోజు అత్యధికమైనప్పుడు మధుమేహం ఏర్పడడమేకాక, రక్తనాళముల లోపలిపొరనునుపుచెడి, దానిలో ఎగుడుదిగుడు లేర్పడి, నెత్తురుపోటు వస్తుంది హృదయంలో రక్తనాళములు గడ్డకట్టి హృద్రోగం ఏర్పడుతుంది నరములమీద పొరలు వాచి చర్మంలో మంటలు ఏర్పడతవి సామాన్యంగా భోజనంలో ఏ పదార్థాన్నయినా ఎవరూ తూచి తినరు అయినా అనేక అనర్థములకు హేతువైన "రక్త శర్కరాధిక్యత (Hyperglycaemia) ఏర్పడకుండా లివరు కాపాడుతూ వుంటుంది

శరీరంలో జరిగే నిత్యకార్యక్రమానికి కావలసిన 'శక్తి'లో ముప్పాతికభాగం శర్కరలనుంచే వస్తుంది. ఈ వస్తువులు చాలా చౌక; అన్నిచోట్లా దొరుకుతవి. కాని ఇంత ముఖ్యమయిన ఈ వస్తువులను

51-వ పేజీ చూడండి

# కవి సార్వభౌముడు

## నోరి నరసింహ శాస్త్రి



### జరిగిన కథ

పెదకోమటి వేమారెడ్డి శ్రీనాథ భట్టును శ్రీ విద్యానగరమునకు విద్యా విజయప్రస్థానము చేయవలసిందని అర్థిస్తాడు. శ్రీనాథుడు విద్యానగరం చేరాడు. తనను జయించేందుకే శ్రీనాథుడు వచ్చాడన్న వార్త డిండిములకు తెలుస్తుంది. శ్రీనాథుడు మానసోల్లాస కావ్యాన్ని అభిప్రాయార్థం అరుణగిరినాథులకు పంపుతాడు. డిండిముడా కావ్యాన్ని అవహేళన చేస్తాడు. శ్రీనాథుడు డిండిములకు మానసోల్లాస కావ్యావహేళనంపై అధిక్షేపణపత్రం పంపుతూ కావ్య దోషాలు పండిత పరిషత్తులో నిరూపించమని డిండిముని సవాలు చేస్తాడు. శ్రీదేవరాయ ప్రభువుల సమక్షంలో పండిత పరిషత్తు మానసోల్లాస కావ్యం దోషరహితమని నిర్ణయించగా, ప్రతిన ప్రకారం శ్రీనాథుడు అరుణగిరినాథుల డిండిమమును నాశనం చేయిస్తాడు. దేవరాయలు శ్రీనాథుని పాండితీ గరిమను గుర్తించి, విద్యానగరాస్థానంలో తెలుగు భాషకు గణనీయస్థానం ఇస్తున్నట్లు ప్రకటిస్తాడు. శ్రీనాథునకు కనకాభిషేకం, పర్వతమల్లునకు "ప్రతిమల్లశేఖర" బిరుద ప్రదానం జరుగుతాయి.

శ్రీనాథ కవిసార్వభౌముడు కొండవీటికి తిరుగు ప్రయాణమునకు తొందరపడుచుండెను విద్యానగరములో నాతని నందరు సపరివారముగా విందులకు పిలుచువారే, వస్త్రాదులతో సమ్మానించువారే అందరు కాదనుటకు వీలులేనంత ప్రముఖులే కటకపాలుడును, వల్లభరాయుడును ఒకనాడు వచ్చి, తమతో ముందు చెప్పనిది, ఆతని తిరుగుప్రయాణము చేయవద్దనిరి

అవచిదేవయ్యత్రిపురారి రాయలవారికి కాంభోజాశ్వములు తెప్పించిపెట్టు బేహారము సందర్భమున వచ్చెను అది ముగించుకొని వెళ్లుచు, నాతడు శ్రీనాథుని జూడవచ్చి, పుష్కలముగా చోటంగికస్తూరి, పంజారకర్పూరము, గోవా సంకుమదము, కాశ్మీరకుంకుమరజము ఇత్యాది సుగంధద్రవ్యములు బహూకరించి, ఇంతవాడైనందుకు ప్రేమపూర్వకముగు తన యానందము తెలిపి, కొండవీడు చేరినతర్వాత వీలైనంత శీఘ్రముగా తప్పక కాంచీనగరము వచ్చి తన యొద్ద కొంతకాల ముండవలెనని యాహ్వానించి మాట తీసుకొని వెళ్లెను

వంట మైలారురెడ్డి కందుకూరుకు వెళ్లుచు, శ్రీనాథుని తన యాస్థానమునకు వచ్చి తప్పక ధన్యుని గావింపవలెనని ప్రార్థించెను ముమ్మకవియింటిలో గోష్ఠికి చేరు బహుభాషా కవుల ప్రసంగములతో విసిగి నారణప్ప తరుచుగా కొండవీటవిడిదికి వచ్చి దుగ్గన పోతనలతో జట్టు కట్టుచుండెను వారికి ఒండొరులయందు ప్రేమ యతిశయించుచుండెను త్వరలో ఎడబాటు రానున్నదని వారెరిగినందున ఎక్కువ కలిసి మనసార మాటాడుకొనుచుండిరి వారిలో వయస్సులో మూడు నాలుగేళ్ల నారణప్ప పెద్దవాడు తన బావ యొద్ద వ్యాకరణాలంకారశాస్త్రములు అధ్యయనము చేయుచున్నందున దుగ్గన ఎక్కువ పాండితికలవాడు పోతన ఊహలు హృదయములో నాటునట్లవగుటచే, అతని మాటలకు శక్తి ఎక్కువ వారి ప్రసంగము లెప్పుడును కవిత్వమునకు సంబంధించినవే ఒకనాటి అపరాహ్ణవేళ వారు ముగ్గురు విడిదిముందున్న ఆవరణలో గల చల్లని మామిడిగున్న నీడలో కూర్చుండి ఉత్సాహముతో ప్రసంగించుకొనుచుండిరి పోతన తాను చెప్పిన ఈ పద్యము చదివెను

"కొందరికి తెనుగు గుణమగు
కొందరికిని సంస్కృతంబు గుణమగు, రెండున్
కొందరికి గుణము లగు నే
నందర మెప్పింతు కృతుల నయ్యై యెడలన్'

—48 వ పేజీ చూడండి

కుమారిబోయిన శ్యామసుందరి

ప్రతిఇంటిలోను మనకు బామ్మో, లేక అమ్మమ్మో, తాతయ్యో, యిలాంటి ముసలి వారు కనుపిస్తారు అరవై ఏండ్లు దాటాక అందరూ పసిపాపలే అంటారు నిజంగా ఇది నిజమే ననిపిస్తుంది నేను ఒకసారి ఒక రింటికి వెళ్లాను వాళ్లింట్లో కూడా ఒక ముసలావిడ ఉంది ఆమె ఆ యింటి యజమానురాలి పెద్ద అత్తగారు వారింట్లో ఒక భార్యాబిడ్డలు ఇద్దరు మగపిల్లలు, ముగ్గురు ఆడపిల్లలు, ఆవిడాను నేను గుమ్మంలో అడుగు పెట్టగానే "వస్తున్నానండీ కాఫీ తయారవుతుంది, అంత తొందరపడతారే, కొంచెంసేపు ఆగలేరు ?" అని ఆ యింటి యజమానురాలు (అంటే వరసకు పిన్ని అవుతుంది నాకు)

"అదికాదే అమ్మా ! ఏదో ముసలి ప్రాణం అల్లాడిపోతుంది ఆ భగవంతుడు నన్ను తీసుకు పోవడంలేదు నా ఖర్మ మీతో మాటలు పడాల్సి వస్తుంది ఏం చెయ్యను తల్లి " అంటూ ఒక ముసలి గొంతుక

"అంతలోనే అంతంతమాట లంటా రెందుకండీ యివిగో కాఫీ" అంటోంది మా పిన్ని నేను అంతలోకే లోపల అడుగు పెట్టాను

నన్ను చూచి "రా సుందరీ రా !" అంటూ పిలచింది మా పిన్ని నేను వెళ్లాను నన్ను చూసి ఆ ముసలావిడ కంటికి చెయ్యి అడ్డుగా పెట్టుకుని "రాఘవరావుగారి పెభద్ద కోడలు సుందరేనా ? ఏమే, నీ మొగుడు ఏం ఉద్యోగం చేస్తున్నాడు మీ మామయ్య కులాసాగా తిరుగుతున్నాడా ?" అంటూ ప్రశ్నలవర్షం కురిపించింది

నేనేమి చెబుతాను చెప్పండి నేను ఏమీ మాట్లాడలేకపోయాను అంతలోనే మా పిన్ని అందుకొని, ఆ సుందరి కాదు ఈ యమ్మాయి ఫలానావాళ్ల సుందరి అని వివరించి చెప్పింది "అలాగటే ఆవి డనుకున్న, చూపు ఆనదు ఏమి చదువుతున్నావే, ఏమి చదువులో ఏమోలే ఉ అమ్మయ్ యింకా కాసిని కాపివుంటే పొయ్యవే"అంది

"ఇక లేవండి పిల్లలు త్రాగేశారు" అంది మాపిన్ని.

"అయ్యో అయ్యో అప్పుడే త్రాగేశారటే? అవునులే అమ్మా నాకెక్కడవుంటాయి. నన్ను ఎప్పుడు తీసుకుని వెడతాడో ఆబగవంతుడు నాకు రోజురాకుండా వచ్చింది నా పాపం ఇంకా పండలేదుకామోసు" అనిదీర్ఘాలు తీసింది

"పోనిలెండి అంతతమాట లెందుకనుకుంటారు ఆయనకు వుంచినవివున్నాయి పోస్తానుండండి"అంది మాపిన్ని


"ఎందుకులే తల్లీ!" అంటూనే పిన్నితెచ్చిన కాఫీ త్రాగడం మొదలుపెట్టిందావిడ.

నేను మాపిన్ని వెనక వంటిట్లోకి నడిచాను. మాపిన్ని ఏమిటి ఈ ధోరణి అనిఅడిగాను మా పిన్ని ఇలా చెప్పింది "ఏంచెయ్యను సుందరీ ఈవిడతో వేగలేక చూస్తున్నామనుకో పోనితే ముసలావిడ, మనం చుడక పోతే యింకెవరు చూస్తారని మావారు ఇంట్లో పెట్టారు ఇక నాబాధలు యింతా అంతాకాదు ఏ మాటన్నా

—47వ పేజీ చూడండి

ఎప్పుడూ ఇంతే—118

శంకర్





# వనితా వాణి

## మన కుటుంబవ్యవస్థ

కుటుంబంలోని వ్యక్తులు స్నేహభావంతో ప్రవర్తిస్తూ, సర్దుకుపోతే 'ఉమ్మడి కుటుంబం' అంత శ్రేయస్కరమైనది, అంత చక్కనిది, వేరే ఉండదని వ్రాశారు అందుకు మేము ఏకీభవిస్తున్నాము ఈవిధముగాఉన్న కుటుంబాలు చాలా అరుదుగా ఉన్నాయి

టి గిరిజ, శైలజ (రాజమండ్రి)

* * *

మన కుటుంబ వ్యవస్థ అనే వ్యాసం నాకు చాలా బాగుంది

పులవర్తి బంగారమ్మ (అనకాపల్లి)

* * *

నిజానికి కలిసిఉండే కన్నా దూరంగా ఉంటేనే మమతలూ, ప్రేమలూ అధికంగా ఉంటుంది. దూరంగ ఉంటే కోడలు మీద అత్తకు, అత్తమీద కోడలుకు ప్రీతి, ప్రేమ ఎక్కువగా ఉంటుంది. ఆమాట ముమ్మాటికి నిజం

ఎస్ శ్యామల (బళ్లారి)

* * *

అత్తలు కనుక తమ ప్రవర్తనలో పూర్తిగా గాకపోయినా కొంతయినా మార్పు తెచ్చుకుంటే ఈ కాలంలో గూడా ఉమ్మడి కుటుంబాలు సుఖ శాంతులతో వర్ధిల్లుతాయి కోడళ్లు చిన్నతనంవల్ల ఏమైనా తెలిసి తెలియని అజ్ఞానంలో ఉండి చేసి నప్పటికీ అత్తలు సహనం కలిగి కోడలు తమ కూతురుతో సమానమని అనుకుంటే ఎంత గడుసరి కోడలైనా మార్పుచెంది అత్తను తప్పక తన తల్లిలాగ భావించుతుంది

కె హేమలతాదేవి (బెల్లంపల్లి)

* * *

తల్లిదండ్రుల మీద ఆధారపడకుండా జీవించగల శక్తి పురుషునకుంటే, వేరు కాపురం పెట్టటం, సాధ్యమైనంత దూరంగా ఉండుటవల్ల, ఆ రెండు కుటుంబాల మధ్య బంధుత్వము, ప్రేమ నిలకడగా ఉంటాయి

పి. ఎస్. రాజ్యం (తాడంకి)

* * *

ఒకప్పుడు అత్తగార్లు కూడా కోడరికం చేసినట్టు మర్చిపోవద్దని "వనితావాణి" ద్వారా వారికి తెలియజేస్తున్నాను

మేకల లలితావెంకటేశ్వర్ (యనమదుర్రు)

* * *

ఇప్పుడు జరుగుతున్న పరిస్థితులను చక్కగా వివరించారు కోడళ్లను బాధపెట్టే అత్తగార్లకు చక్కని గుణపాఠం

కుమారి కరిబండి విజయలక్ష్మి (రాజమండ్రి)

## సాధింపులు

అత్తగార్లు "తాము ఒకప్పుడు ఒకింటి కోడలే" నని ఆలోచించరు కోడలు ఎలా నడుచుకున్నా వారికి లోపాలు కనిపిస్తుంటాయి నే నందరిని అనటంలేదు మా ఆడపడుచులే 'అలా వదులుగా జడేసుకుంటావ్ ! ఆ జార్జట్ చీర కట్టుకోవడమేమిటి ?' అని సాధిస్తారు దానికి తోడు మావారు నన్నేమీ అనరని, మా ఆడపడుచులకి కోపం ఏది ఎలా ఉన్నా, ఈ వ్యాసం అత్తగార్లకు, ఆడపడుచులకి కనువిప్పు కలిగిస్తుంది.

సోదరి (అనంతపురం)

* * *

వ్యాసము అంత సమంజసముగా లేదనవచ్చును కోడళ్లను బాధపెట్టే అత్తగార్లని గూర్చి వ్రాసినారు గాని, అత్తలను బాధపెట్టే కోడళ్లను గూర్చి వ్రాయలే దెందుకో ! ఈనాటి ఉమ్మడి సంసారము విచ్ఛిన్న మగుటకు కోడళ్లే ఎందుకు కారణము కాకూడదు ? పూర్వం అత్తగారు కోడలిని బాధిస్తే ఇప్పుడు కోడలే అత్తని బాధించుతుంది అంతెందుకు మాకు తెలిసిన ఒక కటుంబములోని అత్తగారికి ఇద్దరు కోడళ్లు పాపం అత్తగారు చాలా మంచిది ఆ ఇద్దరు కోడళ్లు పని సరిగా చేసేవాళ్లు కాదు వారు అత్తగారికి కొంచెం కూడ సహాయం చెయ్యకపోగా వాళ్లే కయ్యానికి కాలు దువ్వేవారు పాపం వారి భర్తలు కూడ పల్లెత్తుమాటనేవారు కాదు అత్తమీద లేనిపోని చాడీలు చెప్పేవారు అలాంటి ఆ అత్తగారి సంగతి కొంచెం మీరే ఆలోచించండి ఎప్పుడైతే అత్తా కోడళ్లు కలిసి మెలిసి, ఈర్ష్యాద్వేషాలు లేకుండ పని చేసుకొంటారో ఆ సంసారము చూడడానికి చాల బాగుంటుంది కాబట్టి ఉమ్మడి కుటుంబాలు విచ్చిన్న మగుటకు అత్తలే కారణము కాదు. అందులో సగభాగము కోడళ్లది కూడా ఉన్నది

నన్నపనేని స్వర్ణకుమారి (గుంటూరు)

* * *

ఈ రోజులలో ఉమ్మడి కుటుంబాలలో సుఖ శాంతులు లభిస్తవి అనుకోడం పొరపాటు ఉమ్మడిగా ఉంటూ కలతలతో, మనస్పర్థలతో బాంధవ్యాన్ని తెంచుకునే కంటే మంచిగా, దూరంగా ఉంటూ బంధువుల ప్రేమానురాగాలు పొందవచ్చు చూపవచ్చు క్రొత్తగా వివాహమయిన యువతి క్రొత్త ప్రదేశములో మసలుతూ అందరి మనసులకు తగ్గట్లు నడచుకోవడం కష్టమే అవుతుంది అలాంటప్పుడే మనస్పర్థలతో వేరింటి కాపురాలకు ఎక్కువ దోహద మవుతుంది అత్తగారు అయ్యాకనో, ఆడబిడ్డ అయ్యాకనో తమ హోదాను బట్టి అధికారం చూపిస్తుంటారు కొందరు ఈ రోజులలో ఉద్యోగరీత్యా ఎక్కువగా వేరువేరు వూర్లలోనే ఉండవలసి వస్తుంది. ఇలాంటివారికి ఉమ్మడి కుటుంబాలలోని బాధ అసలే ఉండదు అందరు కలసినప్పుడు ఆ కొద్ది కాలం కులాసాగనే గడుపుతారు

నాగరికత, విద్య పెరిగిన మన దేశంలోని యువతులు కలతలు లేకుండ శాంతిగా జీవించాలనే అనుకుంటూ వుంటారు ఇలా ఉండాలంటే వేరు కాపురాలు తప్పవు రచయిత్రి అన్నట్లు, దూరంగా ఉండగానే అత్తగారివైపు బంధువులను అగౌరవంగా చూడదు ఉమ్మడి కుటుంబాలకంటె వేరు కాపురాలే ఎంతో మంచివని తోస్తుంది

ఎస్ వసంతా నారాయణ (వేటపాలెం)

* * *

పాతకాలపు రోజులకు మల్లే ఈ రోజులలో కూడ 'కలహాకంఠి' వంటి అత్తగార్లు లేకపోలేదు పాపం మా పిన్ని కూతురు పడే అవస్థ ఆ సర్వేశ్వరుడికే తెలియాలి కట్టుకుందుకు శుభ్రమైన గుడ్డకు నోచుకోలేదు తినేందుకు అర్హత లేదు కట్టుకున్నమొగుడు బుద్ధిమంతుడు! మాతృభక్తి పరాయణుడు తండ్రి కాంతాలోలుడు ఇంకేం అత్తగారి హయాంలో కొడుకు, తండ్రీ నలుగుతూంటే వేరే కోడలుపిల్ల సంగతి చెప్పాలా! ఈ వ్యాసం చదివేను ఉమ్మడి కుటుంబంలో కోడళ్లను నల్లిని నలుపుతున్నట్లు నలిపే అత్తల్ని తామూ ఒకప్పుడు ఒక ఇంటి కోడలే అను సత్యమును మరువరాదు. ఈ అత్తలే తమ కూతుళ్ళు మాత్రం కోడరికం లేకుండా సుఖపడాలని ఆశిస్తారు.


మంధా లక్ష్మీశర్మ (భిలాయి)

★



డాక్టర్ రాజు
బొమ్మల కథ
దేవిక
14
నేనే డాక్టరు రాజునైతే సందేహించే వాడినే కాదు!
మీకు అభ్యంతరం లేకపోతే. మనిద్దరం వివాహం చేసుకోవచ్చు
క్షమించండి అది సాధ్యం కాదు
మూడు వారాల తర్వాత ఒక రోజు.....
రేపు మీ డాక్టరు రాజుగారు ఈ ఆస్పత్రికి వస్తున్నాట్ట.
నిజంగానా!
ఒక వైద్య బృందం ఇక్కడకు వస్తున్నట్లు తెలుస్తుంది
మళ్లీ డాక్టరు రాజు.
కొత్తరకం ఆపరేషన్ ప్రదర్శిస్తారట.



ఎన్నికైన తమాషాలు
ఏం సుబ్బన్నా- ఓతకన్నేశావ్ మరిచిపోయావ్- ఆఁ-
నాపేరు సుబ్బన్న 'కాదు
నాకే మీ ఓటు
ఏవిటోలాయ్- పండుక్కి కనబళ్లేదూ- ఆఁ- బక్షీస్ అడగడం మానేశావ్- ఆఁ- మొహమాటపడ్తున్నావ్
మీ ఓటు నాకే
కనాకకేకమీ కఓకటు
వీడు 'క' భాషలో మాటాడేస్తున్నాడండోయ్ -
ఈ హద్దు మీరి ప్రచారం చేయరాదు
పోలింగ్ బూత్
సచ్చేవయ్యా బాబూ- ఇస్తాన్నాగా- ఇస్తా నీకే ఇస్తా ఓటు-


ఎన్నికైన తమాషాలు
రాజుగా వుండి నియంతృత్వం చెలాయించడం శ్రీవారికి ఇష్టంలేదు - అందువల్ల మీరంతా తనను అధ్యక్షునిగా ఎన్నుకోవాలని శాసిస్తున్నారు
కవి గారూ - యతీ ప్రాసా బాగానే వున్నాయి గాని.... అలాటివి ఓటుకి చెప్పుకో- వచ్చా మరి..
కోటయ్యకే మీ ఓటు!
వెంగయ్యకే మా ఓటు
ఆ పిల్లడు ఓటరుగారి పిల్లడు కాదట -. కిందపారెయ్
నాకే మీ ఓటు

ప్రణాళిక ద్వారా మీకు కలిగే ప్రయోజనాలు

# ఇతోధికమైన ఆరోగ్య సదుపాయాలు


పల్లెలకీ, పట్టణాలకీ వ్యాప్తమైన మంచినీటి సదుపాయం.
14,600 ఆస్పత్రులు, వైద్యశాలలు, 2,40,100 పడకలు,
81,000 డాక్టర్లు 10,000 మాతాశిశు ఆరోగ్య కేంద్రాలు
మలేరియా, క్షయ, మశూచి మొదలైన వ్యాధులను
అరికట్టే పద్ధతులను ప్రవేశపెట్టడం ద్వారా
మూడవ ప్రణాళిక ఆఖరయేసరికి ప్రజల ఆరోగ్యాభివృద్ధి



ప్రణాళిక విజయానికి తోడ్పడండి తద్వారా

మూడవ పంచవర్ష ప్రణాళిక | ప్రతి ఒక్కరికీ ఆనందదాయకమైన జీవితం

DA 61/759




*జరిగిన కథ*

రామవరం ఆంధ్ర - ఒరిస్సా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో ఒక గ్రామం శ్యామబాబు అక్కడ దిగి, ఆ ఊరి లోనే వైద్యవృత్తి చేసుకుంటున్న రాధానాథమిశ్రా గారిని కలుసుకుని ఆయన సహాయంతో ఉద్యోగం సంపాదించుకుంటాడు. రామవరంలోని మిల్లు యజమాని సత్యనారాయణరావుగారు తన పిల్లలకు శ్యామబాబు ట్యూషన్ చెప్పే ఏర్పాటు చేయిస్తాడు నారాయణి మిశ్రాగారి పనిమనిషి. మిశ్రాగారు త్రాగుబోతు అయినా చాలా మంచివాడు. ఒకరోజున పోలీసులు ఆయనను పట్టుకుంటే శ్యామబాబు జరిమానా చెల్లించి విడిపిస్తాడు మిశ్రా కొదురవ్యసనం పోగొట్టేందుకు శాయశక్తుల ప్రయత్నిస్తాడు. మిశ్రాను విడిపించుటకు హామీ నిచ్చిన సూర్యప్రకాశరావు పేకాటలో ధనం పోగొట్టుకొని ఆత్మహత్యకు పూనుకొనగా శ్యామబాబు రక్షిస్తాడు. మిల్లు గుమాస్తా ధర్మసూరి కుమార్తె లలితను చూసి శ్యామబాబుకు పూర్వస్మృతులు వస్తాయి. లలితను వివాహం చేసుకోవాలని, ధర్మసూరి మేనల్లుడు శంకర్ ధర్మసూరిగారింటికి వస్తాడు. ధర్మసూరిగారు తన కుమార్తెను శంకర్ కు చేసుకోవలసిందిగా శంకర్ తలిదండ్రులను అడిగి విఫలుడౌతాడు. శ్యామబాబు ధర్మసూరిగారిని ఓదారుస్తాడు. శ్యామబాబుకు రామవరం జమీందారు కాంతారావుతోను, దినకరరావు అనే వ్యవసాయశాఖోద్యోగితోను పరిచయం ఏర్పడుతుంది

తెల్లవారగానే దినకర్ పొరుగూరికి పోయి డాక్టర్ని పిల్చుకువచ్చాడు ఆయన ముసలివాడు నెమ్మదస్తుడే కాని, ఆయన కొక దురభ్యాస ముంది సాయంకాల మయ్యేసరికి, బ్రాందీ తాగేసి పడుకుంటాడు రాత్రి మరి ఎలాటి కేసు లొచ్చినా లేవడు కాని అతని 'హస్తవాసి' మంచి దని పేరుంది మరి పల్లెటూళ్లల్లో ఇటువంటి డాక్టర్లు తప్ప ఇంకెవరు దొరుకుతారు? పెద్ద పెద్ద చదువులు చదువుకున్నవాళ్లు పల్లెటూళ్లకు రారాయె ఏదో కొన్నాళ్లు లోకల్ బోర్డు డిస్పెన్సరీల్లో పనిచేసి, రిటైరైన డాక్టర్లు, ఆ పల్లెటూళ్లు వదలలేక పట్టుకు పాకులాడుతూంటారు వాళ్లెలాటివాళ్లయినా, ప్రజలకు వాళ్లే గతి.

డాక్టరుగారు రవిని చాలాసేపు పరీక్షించారు ఆయన ఉండగానే రవికి ఒకసారి ఫిట్సు వచ్చింది ఆయన చాలాసేపు మాట్లాడలేదు నాడి బాగా పరీక్షగా చూసారు తరువాత దినకర్నీ, శారదనీ, గాబరాపడవద్దనీ, ఆ చుట్టుపట్ల మశూచి ప్రబలంగా ఉందనీ, బహుశా ఇది దాని లక్షణమే అయివుంటుందని చెప్పి, మందేమీ ఇవ్వకూడదనీ, ఇస్తే దానివల్ల అది మరింత ప్రకోపిస్తుందనీ చెప్పారు జ్వరం హెచ్చుగా ఉండడంవల్ల ఫిట్సు వస్తున్నాయని చెప్పారు రెండురోజులు చూసి, తను మందు ప్రారంభిస్తాననీ అంతవరకూ నుదురు మీద తడిగుడ్డవేస్తూ, జ్వరతీవ్రత హెచ్చకుండా చూడడంకన్నా వేరే చేసేదేమీ లేదనీ చెప్పి డాక్టరుగారు వెళ్లిపోబోయారు. శారద, పిల్లవాడు భయం అంటున్నాడని చెప్తే, ఎక్కడో జడుసుకొని ఉంటాడు, కొబ్బరికాయ దిగదుడిచి పారెయ్యమని చెప్పారు మర్నాడు మళ్లీ వస్తానని డాక్టరు వెళ్లిపోయాడు

ఆరోజు దినకర్ ఆఫీసుకు వెళ్లలేదు. పది గంటల సమయంలో శారద వంట ముగించి దినకర్ని భోజనం చెయ్యమంది. రవి నీరసంగా "అమ్మా! అన్నం పెత్తావా?" అని అడిగాడు. శారద, "నీ వంట్లో జ్వరం తగ్గిపోగానే పెట్తా, నాయనా" అంది రవి సరేనన్నాడు

దినకర్ భోజనందగ్గర కూర్చున్నా డన్నమాటే గాని, అన్నమేమీ సయించలా శశికి కొంచెం అన్నం కలిపి పెట్టాడు పైకి చెప్పలేని దిగులేదో దినకర్ మనస్సు నావరించింది శారద అసలు భోంచెయ్య లేదు పిల్లవాడి ఫిట్సూ, జ్వరం చూస్తూంటే ఆమె మనస్సు ఒక్క నిముషం వాణ్ణి వదిలిపెట్ట బుద్ధివెయ్యలేదు.

సాయంకాలందాకా రవికి ఫిట్సు వస్తూనే ఉన్నాయి అయిదూ, ఆరు గంటల మధ్య కొంచెం తెరపిగా ఉన్నట్లుంది తల్లినీ, తండ్రినీ పలకరించాడు జ్వరం కూడా తగ్గినట్లయింది చీకటి పడ్డాక మళ్లీ ఫిట్సు వచ్చింది పైగా చాలాసేపు పిల్లవాడు బాధపడ్డాడు మళ్లీ, దేన్నో చూసి జడుసుకొన్నట్లుగానూ, ఎవరో బెదిరిస్తున్నట్లుగానూ, భయంకరమైన వింత ఆకారం చూసి "కెవ్వు"మని! అరుస్తున్నట్లుగానూ, మొహం వికృతంగా పెట్టసాగాడు దినకర్ కూడా ఆ దృశ్యానికి తట్టుకోలేకపోయాడు అతనికి ఎవరైనా ధైర్యం చెప్పేవాళ్లుంటే బాగుండు ననిపించింది శారద నిశ్చలంగా పిల్లవాడివైపు చూస్తోంది అర్థంకాక

శ్యామ్‌బాబు ఆసమయంలో దినకర్ ఇంటికి వచ్చాడు. అతన్ని చూడగానే శారదకూ, దినకర్‌కు ప్రాణాలు లేచి వచ్చాయి తమ ఆ నిస్సహాయ స్థితిలో దేవదూతలా శ్యామ్‌బాబు వచ్చాడనుకున్నారు అతనికి జరిగినదంతా చెప్పారు డాక్టర్ వచ్చికూడా ఏమీ మందివ్వలేదని శ్యామ్‌బాబు విచారించాడు పిల్లడిని పరీక్షించి, తను డాక్టరు మిశ్రను పిల్చుకువస్తానని వెళ్లి, పావుగంటలో మిశ్రను తీసుకువచ్చాడు మిశ్ర టెంపరేచరు చూశాడు. నూట అయిదు డిగ్రీలుంది

—44 వ పేజీ చూడండి.




## జరిగినకథ

హాంబుర్గ్ నగర నివాసి ప్రొఫెసర్ లిడెన్‌బ్రోక్ ఒక పాత గ్రంథం సంపాదిస్తాడు. దానిలో ఒకలిఖితపత్రం దొరుకుతుంది

'ఆర్నె సాక్నుస్సెమ్' అనే ప్రాచీన శాస్త్రజ్ఞుడు, ఐస్‌లాండ్‌లో ఆరిపోయిన ఒక అగ్నిపర్వతం ముఖద్వారంలోనుంచి భూగర్భంలోనికివెళ్లినట్లు అందులో వ్రాసి ఉంటుంది తమ్ముడు కొడుకు ఆక్సెల్‌తో కలిసి ప్రొ|| లిడెన్‌బ్రోక్ అక్కడికి ప్రయాణం కడ్తాడు. స్నాఫెల్స పర్వతంవరకు దారి చూపేందుకు వారు హాన్స అనే గైడ్‌ను కుదుర్చుకుంటారు. స్కార్టారిస్ శిఖరం దిగువన వారికి మూడు రంధ్రాలు కనిపిస్తాయి. మధ్య రంధ్రంమీద స్కార్టారిస్ నీడ పడేవరకు కనిపెట్టుకొనిఉండి, నీడపడిన రోజున ఆరంధ్రంగుండా లోనికి దిగుతారు. కొంత దూరం వెళ్లేసరికి వారికి రెండుదార్లు కనిపిస్తాయి. తూర్పువైపు సొరంగం లోంచి పోగాపోగా ఆదారి ఒకచోట ఆగిపోతుంది. పొరపాటు తెలుసుకుని వారు మళ్లీ రెండుదార్లు చీలినచోటకు తిరిగివెళ్లి, రెండవ సొరంగంలో ప్రయాణం కొనసాగిస్తారు. అలసిపోయిన ఆక్సెల్ దప్పికతో మూర్ఛపోతాడు. హాన్స భూగర్భజల ప్రవాహాన్ని కనుగొని అతని దప్పిక తీరుస్తాడు. అంతా మళ్లీ ముందుకు నడుస్తారు పోగా పోగా ఒక పెద్దగొయ్యి ఎదురవుతుంది. దానిలో దిగి ఎనిమిది రోజులపాటు ప్రయాణం చేసిన తరువాత వారుఒక విశాలమైన ప్రదేశానికి వస్తారు. అక్కడ విశ్రాంతి తీసుకుని మళ్లీ బయలుదేరుతారు. ముందు నడుస్తున్న ఆక్సెల్ దారితప్పి ఒంటరివాడవుతాడు

## 28

తెలివి వచ్చేసరికి నా ముఖం తడిగా ఉన్నది—కాని కన్నీటితో తడిసిఉన్నది ఎంతసేపు స్పృహతప్పి ఉన్నానో తెలియదు ఎంతకాలము గడిచినదో గమనించే సాధనము నా దగ్గర లేదు ఒంటరితనముతో సమానమయినది అంతవరకూ లేదు ఇంత దిక్కు లేకుండా పోయినవారు ఉండి ఉండరు!

పడిన తర్వాత చాలా రక్తం కోల్పోయాను. అందులోనే నానుతున్నట్లు అనిపించినది! ఎందుకు బ్రతికిఉన్నానా అనుకున్నాను! ఎందుచేతనంటే మరణం ఇంకా ఎదుర్కొనవలసి ఉన్నది ఆలోచించటానికి ఇష్టంలేకపోయినది ఉపయోగమేమీ లేకపోయినా, కష్టపడిలేచి నుంచుందామని ప్రయత్నించాను కాని, దొర్లటంకన్నా చేయ గలిగినది ఏమీ లేకపోయినది

మళ్ళీ బలహీనం నన్ను వోడించపోతున్నదనగా, ప్రాణం జారిపోతున్నదనగా, నా కొక శబ్దం గట్టిగా వినిపించినది దీర్ఘంగా గర్జించే ఉరుము పోలి

—42వ పేజీ చూడండి

# చదువుల్రావు





గూడు
కోసం
గువ్వలు
పులికంటి
కృష్ణారెడ్డి

ఒకటి...రెండూ...మూడు"

ఒకదాని వెంబడి ఒకటి అన్నీ మిలమిలా మెరిసే తెల్లని పది నయాపైసల కాసులు ఘల్లుఘల్లున ఎడమచేతి లోనికి జారి పడుతూంటే, ప్రాగ్దిశాభాగాన సూర్యభగవానుడు పైకెక్కొద్ది విచ్చి ఎకసంచె అంపందములా వెలిగిపోతూంది బోయిన గురప్పతాత ముఖారవిందము!

"నాలుగూ...ఐదూ...ఆరూ...ముప్పై!"

లెక్కపెట్టడం ఆగిపోయింది. పిడికిలి మూతబడింది. పిడికెడునిండా ముప్పై పదినయాపైసాలకాసులు మున్నూరు నయాపైసాలు!...మూడురూపాయలు!! "మూడు రూపాయలు!" అని మరొక్కసారి సంతృప్తిగా తనలోతాను అస్పష్టంగా గొణుక్కున్నాడు గురప్పతాత. ఎక్కడెక్కడో, ఎవరెవరి జేబుల్లోనో భద్రపరచబడిన కాసులు తన చేతిలో రాలడానికి కారణం...తన రామచిలుక! ఇంకిపోయిన బ్రతుకుబాటలో ఇగిరించిన మొలక!

తాత దృష్టి పంజరంవైపు మళ్లింది. మానవ సంస్కారానికి చిహ్నం—కృతజ్ఞతాభావం తాత మొగాన తొణికిసలాడుతూంటే పంజరం తలుపు తెరిచాడు పంజరములో ఒక ధ్యానం చేస్తున్న శుకం ఎగిరివచ్చి తాత ముంజేతిమీద వాలింది. ప్రతిఫలంగా బోసినోటి ముద్దును మోసుకొని లోనికేగింది. అంటే ఆ నాటి వ్యాపారం ముగిసిందన్నమాట!

—సర్కసు డేరా చుట్టూ వేసిన చారలచారల పరదాగుడ్డ మాదిరి ప్రహారీగోడ! ఆ గోడలోపల పెద్దమేడ! ఆ మేడలోపల గర్భగుడి! ఆ గుళ్లో గోవిందరాజస్వామి! ఆయన ఏడాది కొక్కసారి లేస్తారు. ఆయన లేవడానికి వారంరోజులు ముందుగానే గుడిముందర ఉన్న తేరు సింగారిస్తారు. వానకు తడిసి, ఎండకు ఎండి, "పులి గుండు" లా ఉన్న తేరు పేరంటానికి బయలుదేరే ముత్తయిదువులా పసుపుపూసి, కుంకుమబెట్టి, కమ్మలు, మాటీలు తగిలించుకొని వన్నెలు చిన్నెలు వారుకొంటుంది.

ఆ ఒక్కరోజు తప్ప మిగత దినాల్లో ఆరథము దీనజనాశ్రితకల్పవల్లి! అ నీడలో ప్రక్కన బీడులో, గూడు లేని గువ్వలు, తోడులేని అవ్వలు చేరుతుంటారు. తాడులేని బొంగారాలు గోలీలు ఆడుతుంటారు, ఆ ప్రక్కనే చిన్నచిన్న అంగళ్లు ఉంటాయి. అక్కడే గురప్పతాత అంగడి కూడ!

బలపరాతి విగ్రహంలాంటి రూపు, ఎప్పుడూ ఏదో వెదుకులాడే చూపూ, అనుభవంతో పండిన శిరోభాగాన్ని నుదిటిని వేరుచేస్తూ దట్టంగా మూడు విభూతి పట్టెలు, ఆ పట్టెల మధ్య పెద్ద కుంకుమబొట్టూ, మెడలో రుద్రాక్ష మాలలు, బూడిద గుమ్మడికాయంత తలగుడ్డ, చెంపలనిండుకు చేరదీసి కన్నులు గాదు-కారదీసి మీసాలు...గురప్పతాతను చూస్తే ఏదో గురుతరమైనభావం కలిగి మంత్రముగ్ధులై ఎదుట నిలబడి పోవలసిందే!......

ముందు నాలుగుమూరల తుండుగుడ్డ పరచుకొంటాడు. ఆ గుడ్డపైన ఓ యాభై కవర్లు వరుసగా పేరుస్తాడు. మనం అనుకుంటూవుంటాం బ్రహ్మ మన అదృష్టాలను పుట్టించినపుడే నొసట వ్రాస్తాడని! కానీ గురప్ప తాత జీవితానుభవాన్ని క్రోడీకరించి కరక్కాయసిరాతో కార్డుముక్కలమీద మానవుల జాతకాలు వ్రాసి ఆ కవర్లలో వుంచాడు. ఒక్కొక్క జాతకం విలువ పది నయాపైసలు! ప్రక్కన్నే పంజరం వుంటుంది. ఆ గుడ్డమీదనే ఒకమూల, చెదపురుగులతో స్నేహంచేసి, శీతాతప బాధలను సహిస్తూ అట్టమీద వెంకటేశ్వరుడు వాడిన పూలవెనుక వెలిగిపోతూ సాక్షీభూతంగా ఉన్నాడు. ఆయన ముందు ఓ బుడిగ చెంబడీ వుంది.

38—వ పేజీ చూడుడు




దైవజ్ఞపాతూరి శ్రీరామమూర్తి

**2-3-1962 శుక్రవారము మొదలు**
**8-3-1962 గురువారము వరకు**

## మేషం :

**(అశ్వని, భరణి, కృత్తిక 1 పా )**

మీ మనస్సుకు పని అధికం లవుతుంది క్రమ క్రమంగా మీ కార్యక్రమాలలో మంచి అనుభవం కలుగుతుంది మీరు ఎదురుచూడని మార్గాలలో కలహప్రసంగాలు రాగలవు గ్రహబలంవల్ల మీ కృషి ఫలించి మీ మాట నెగ్గుతుంది సంచారము, విశ్రాంతి లేని పనులవల్ల స్నేహితుల సహాయం పొందవలసి వస్తుంది కుటుంబంలోని కార్యభారం చాలా భాగం తగ్గిపోతుంది బంధువుల రాకపోకలు ఉత్సాహకరంగా జరుగుతవి ఈ సమయంలో కొనే వస్తువులలో మోసం జరిగే అవకాశా లున్నవి మాటలలో తొందర పడవద్దు కొన్ని సమయాలలో డబ్బు ధారాళంగా వచ్చినట్లు కనిపించినా మధ్య మధ్య ప్రతిబంధకాలు కనిపించగల సూచన లున్నవి యంత్రాలు, నూనెగింజలు వ్యాపారస్తులకు లాభదాయకంగా ఉంటుంది 5, 6 తేదులలో సుఖభంగం, మిత్రులతో కలహాలు.

* * *

## వృషభం :

**(కృత్తిక 2, 3, 4 పా, రోహిణి, మృగశిర 1, 2 పా )**

సాధారణంగా ఈ సమయంలో ఏ వ్యవహారంలో ప్రవేశించినా త్వరగా ఫలిస్తుంది ఇంతకుముందు కోపంచూపించిన వ్యక్తులు ఒక విధంగా పరిష్కార మార్గానికి వస్తారు వృత్తి వ్యాపారాలలో మీ మాట నేర్పు బాగా చూపగలుగుతారు శ్రమ పడవలసి వస్తుం దనుకున్న పనులు చాల సులభంగా తెమిలిపోవటంవల్ల తగినంత విశ్రాంతి, సుఖము పొందగలుగుతారు విద్యా వ్యాసంగాదులలో చికాకు తోచగల అవకాశా లున్నవి వారం రెండవ భాగంలో డబ్బును చాలా జాగ్రత్తగా వాడుకొనవలసి వస్తుంది కంట్రాక్టు వ్యాపారాలలో శ్రమఅధికం కావచ్చు ముందు ముందు ఫలితం బాగుంటుంది పిల్లల ఆరోగ్యం గురించి జాగ్రతగా ఉండవలసిన సమయం శ్రిప్పట అధిక మవుతుంది 7, 8 లలో ధనలాభం, దూర ప్రయాణాలు.

> **గ్రహస్థితి**
>
> కర్కాటకంలో రాహువు, మకరంలో బుధ, శని, కేతులు, మకర కుంభాలలో అంగారకుడు, కుంభంలో సూర్య, గురువులు కుంభమీనాలలో శుక్రుడు, ధనుర్మకర, కుంభ, మీనాలలో చంద్రుడు

* * *

## మిథునం :

**(మృగశిర 3, 4 పా, ఆరుద్ర, పునర్వసు 1, 2, 3 పా.)**

మీ అదృష్టం ఫలించే సమయం అయితే "కలిసివస్తే నా శక్తి, చెడిపోతే నీ తప్పు" అనే రకం మనుష్యులతో చేరటంవల్ల ఈ సమయంలో ఆందోళన కనిపిస్తుంది ముందుగా యోచించుకొనటానికి అవకాశం లేకపోయినా సమయంలో చిక్కు నుంచి బయటపడ గలుగుతారు ఇతరుల వ్యవహారాలలో సలహా చెప్పటము, పెత్తనం నిర్వహించటము అవసర మవుతవి వాహనాలు ఎక్కిన సమయాలలో జాగ్రత్తగా ఉండండి మీ ఆరోగ్యం ఇంతకుముందు కన్నా సంతృప్తికరంగా ఉంటుంది ధనాదాయవిషయంలో ముందు ఎంత కష్టం తోస్తుందో చివరకు అంత తృప్తికరంగా ఉంటుంది అయినవారితో కలహాలు వస్తవనే భావం తోస్తుంది కాని, వాతావరణం చల్లబడి పోతుంది హోదాతో కూడిన ఖర్చులు పెరుగుతవి. 3, 4 తేదులలో వృత్తిలో చిక్కులు శ్రమ

* * *

## కర్కాటకం :

**(పునర్వసు 4 పా, పుష్యమి, ఆశ్లేష)**

ప్రస్తుతం ఒక మాట మాట్లాడితే తక్కువ, రెండు మాటలు మాట్లాడితే ఎక్కువ అధికారులతో లావాదేవీలు పెరుగుతవి వృత్తిలో అనేక రకాల అవకాశాలు కనిపిస్తూ ఉంటవి, శక్తికి మించి పైన వేసుకొనతగిన సమయం కాదు ముఖ్యంగా సాటివారి కుట్ర యుక్తుల వల్ల మీ అభివృద్ధికి ఆటంకాలు ఏర్పడుతూ ఉంటవి ప్రయాణాలు చేస్తారు కుటుంబంలో మనశ్శాంతి లభిస్తుంది ఖర్చులు అధికంగా కనుపించినా సుఖం పొందగలుగుతారు చల్లని మాటలతో మీ పనులను సాగించవలసిన సమయం నౌకరులు మొదలైనవారితో పేచీలు రాకుండా చూచుకొనండి వారాంతంలో అకస్మాత్తుగా దేహబాధలు కనుపించి వెంటనే స్వస్థత లభిస్తుంది మీవద్ద నేర్చుకుని మీకు ఎదురు తిరగటానికి ప్రయత్నించేవా రుంటారు 7, 8 తేదులలో శుభ, సంతోష కార్యక్రమాలు, సంఘంలో గౌరవం.

* • •

## సింహం :

**(మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**

మీ జాగ్రత్తవల్ల ఈ సమయంలో వచ్చే తగాదాలవల్ల నష్టకష్టాలు రాకుండా చేసుకొంటారు. అయితే యథార్థాన్ని విడిచి యుక్తి మార్గాన్ని అనుసరించవలసి వస్తుంది బాహ్య విషయాలలో మీ స్థానం బలపడుతుంది. అపవాదులు వచ్చేటట్లు తోస్తుంది కాని, దైవానుగ్రహంవల్ల

తప్పించుకుంటారు మీరు ఏపని చేస్తున్నా, ఏవరితో మాట్లాడుతున్నా చల్లగా గ్రహించటానికి ప్రయత్నించేవా రుంటారు ఆదాయం మామూలుగా ఉంటుంది తరచు అధికారులను కలుసుకొనవలసి వస్తూ ఉంటుంది పిల్లల మూలంగా ఆనందం లభిస్తుంది మీరు ఎదురు చూస్తున్న ధనం కొంచెం ఆలస్యం కావచ్చు వారాంతంలో దొంగతనం జరిగే అవకాశా లున్నవి అధికారం బాగుంటుంది క్రొత్త వ్యాపారాలలో చేయి పెట్టవద్దు ప్రశాంతంగా జరిగే పనులవల్ల ధనం సంపాదించుకొనతగిన సమయం.

* * *

## కన్య:

**(ఉత్తర 2,3,4 పా, హస్త, చిత్త 1, 2 పా.)**

దూరంగా ఉన్నంతవరకు అంతా మనవాళ్ళే ఏది ఎలా ఉన్నా రుణభారం నుంచి బయటపడగల మార్గాలు కనుపిస్తవి ఓర్పుతో పని చేయగలుగుతారు కుటుంబంలో కొన్ని విధాల సంతృప్తికరంగా ఉంటుంది సంఘంలో గౌరవం పొందగలుగుతారు మిమ్మలను నమ్ముకుని కార్యరంగంలో దిగినవారికి చక్కగా సాయం చేయగలుగుతారు మీ ధనాదాయపరిస్థితులలో పెద్ద మార్పులు రావు అయితే ఆయా సమయాలలో అవసరానికి తగినంత లభిస్తూ ఉంటుంది స్నేహితులవద్ద నుంచి సంతోషవార్తలు తెలుస్తవి కుటుంబంలోని వారికి ఎవరికో ఒకరికి అనారోగ్యం చేస్తూ ఉంటుంది వారాంతంలో అకస్మాత్తుగా ప్రయాణం చేయవలసి రావచ్చు విరోధారమైన వార్తలు ఆందోళనను కలిగిస్తవి 7, 8 తేదులలో క్రొత్తవారితో స్నేహ సంబంధాలు, ఇష్టవస్తు లాభం

* * *

## తుల:

**(చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు)**

సుఖ సంతోషాలు పొందదగిన సమయం మీ మాట కటువుగా కనిపించటంవల్ల మీ మిత్రులు కొంతమంది ముందు వ్యతిరేకిస్తారు అయితే న్యాయసమ్మతంగా ఉండటంవల్ల చివరకు మీ దారికి రాగలుగుతారు ధనం విశేషంగా ఖర్చు అవుతుంది. వృత్తిలో మీరు—ఆలోచించిన ప్రకారము పనులు అనుకూలించి సకాలంలో ఫలితం పొందగలుగుతారు మీ మాటను గౌరవించి మీకు సహాయం చేయగలవారు తటస్థపడతారు ఆదాయం తాత్కాలికంగా తగ్గేటట్లు తోస్తుంది పుణ్యక్షేత్రాలకు ప్రయాణం చేయవలసి రావచ్చు దక్షిణ దిక్కునుంచి సంతోషవార్తలు తెలుస్తవి వారాంతంలో మీ శక్తి సామర్థ్యాలనుగురించి చులకన చేసే మాటలలో మిమ్మలను నొప్పించేవా రుంటారు. విలువగల వస్తువులు కొంటారు 2, 3 తేదులలో వృత్తిలో క్రొత్తవారి సంబంధము, వినోదకార్యక్రమాలయందు ఆసక్తి.

* * *

## వృశ్చికం:

**(విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ.)**

తోటివారు ఎలా మాట్లాడినా మీరు ముందు అనుకొన్న ప్రకారం ప్రయత్నాలు సాగిపోతూ ఉంటవి ఎదటివారి హృదయం తెలుసుకొని ప్రవర్తించగలుగుతారు సంఘంలో మీ మాటకు గౌరవం లభిస్తుంది ధన విషయంలో ప్రోత్సాహకరమైన మార్పులు వస్తవి కుటుంబంలోని వారి అనారోగ్యకారణాలవల్ల చికాకు కలుగుతుంది లోగడ మీరు చేసిన వాగ్దానాలు సకాలంలో నెరవేర్చుకుంటారు ఈ సమయంలో మీమీద తప్పు లేకపోయినా నిష్ఠురాలు మాట్లాడేవారు ఉంటారు సాధ్యమైనంతవరకు తటస్థ భావంతో ఉండటం మంచిది సాధారణంగా అసౌఖ్యం కనుపించగల అవకాశా లున్నవి వ్యవహారరంగంలో ప్రధాన సమస్యలు తీరిపోయి సక్రమమైన మార్గంలో పోగలుగుతారు 7, 8 తేదులలో గౌరవ ప్రాప్తి, శుభకార్యసిద్ధి

* * *

## ధనుస్సు:

**(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా)**

మీ ధైర్యమే మిమ్మలను కాపాడుతుంది ఖర్చు విశేషంగా కనుపించినా సకాలంలో మీమాటను చెల్లించుకుంటారు వ్యవహార రంగంలో రాగల చిక్కులను ముందుగా తెలుసుకో గలుగుతారు స్నేహితుల ఆదరాభిమానాలు లభిస్తవి సమయానుకూలంగా మీ బాధ్యతలను తగ్గించుకొనటానికి ప్రయత్నించటం మంచిది అధికారులవల్ల జరుగవలసిన పనులు చురుకుగా సాగవు ఆదాయాన్ని మించిన ఖర్చులు, బాహ్య విషయాలలో ఆడంబరాన్ని కాపాడుకొలనవలసిన అవసరం కలుగుతుంది క్రొత్త వ్యాపారాలలో డబ్బును వినియోగించవద్దు ఈ సమయంలో స్వబుద్ధితో ఆలోచించుకొని ఒక నిర్ణయంతో ఉండటం అవసరం పుణ్యకార్యాలు నెరవేరుతవి స్థిరాస్తులవల్ల, ఫలితం పొందగలుగుతారు 2, 3, 4 తేదులలో కష్టవార్తలు, ధనవ్యయం

* * *

## మకరం:

**(ఉత్తరాషాఢ 2, 3, 4 పా, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా)**

మీ పరిస్థితి తమాషాగా ఉంటుంది చక్కగా ఫలిస్తుందనుకున్న ఏ ప్రయత్నము ఒక స్థితికి రాదు కాని, అకస్మాత్తుగా జరిగే కార్యక్రమాలు మాత్రం చురుకుగా కలిసివస్తవి ఏ విషయంలోనూ ముందుగా మాట చెప్పడానికి అవకాశం లభించదు మీరు ఎవరికోసం శ్రమపడి కార్యం సాధిస్తారో వారు దానిని నిర్లక్ష్యంగా చూస్తారు మీ ఆరోగ్యం ఇంతకుముందు కన్నా సంతృప్తికరంగా ఉంటుంది ఎప్పుడో ఆశ వదులుకున్న వ్యవహారాలు ఈ సమయంలో రంగానికి రాగల అవకాశా లున్నవి వారం రెండవ భాగంలో వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు ఉత్తర దిక్కు నుంచి ధనలాభం ఉంటుంది వృత్తిలో శ్రమ అధికంగా ఉంటుంది అందుకు తగినట్లు ఆదాయం కూడా పెరుగుతుంది 5, 6 తేదులలో కుటుంబంలోఅనారోగ్యాలు, ధనవిషయంలోకలహాలు.

### ఈ వారము ధరలు

బంగారు ధర ఈవారం ఆరంభంలో మందీ వచ్చి 5 తేదీ నుంచి తేజీ అవుతుంది వెండి ధర కొద్దిగా పెరిగి నిలకడగా ఉంటుంది పసుపు ధర మందీ అవుతుంది ప్రత్తికి గిరాకీ వస్తుంది శనగలు ధర క్రమంగా మందీ అవుతుంది ధాన్యంధర వారారంభంలో నూనె పెరిగినా తిరిగి తగ్గే అవకాశా లున్నవి నూనె గింజలకు గతవారంలో వచ్చిన ధర క్రమంగా తగ్గి నిలుస్తుంది చింతపండు, బెల్లము ధరలు పెరుగుదలలో యుంటవి

## కుంభం

**(ధనిష్ఠ 3, 4 పా., శతభిషం, పూ. భాద్ర 1, 2, 3 పా.)**


ఇంతకుముందు జరిగిన సంఘటనలు ఇప్పటికి కూడా మిమ్మలను నిరుత్సాహపరుస్తూ ఉంటవి. అన్ని అవకాశాలు కంటిముందు కనిపిస్తున్నా వినియోగించుకొనటానికి ధైర్యం చేయలేకపోతారు అనుభవంలో అనేక సూక్ష్మ విషయాలను తెలుసుకొంటారు ఇతరుల మాటలమీద ఆధారపడవలసిన అవసరం క్రమంగా తగ్గిపోతుంది ఇతరుల వద్దనుంచి రావలసిన ధనం సమయానికి వస్తుంది విద్యార్థులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది వృత్తి వ్యాపారాలలో శ్రద్ధ వహించి పనిచేయగలుగుతారు "అందితే జుట్టు, అందక పోతే కాళ్లు" అనే రకం మనుష్యులతో వ్యవహరించవలసి వస్తుంది డబ్బు విశేషంగా పెట్టుబడి పెట్టవలసి వచ్చినా వెనుకకు తగ్గవలసిన అవసరం ఉండదు బంధువులవద్దనుంచి వచ్చే వార్తలు ఉత్సాహాన్ని తగ్గించవచ్చు

* * *

## మీనం:

**(పూ. భాద్ర 4 పా, ఉ భాద్ర, రేవతి)**

ఏ విషయంలోనైనా ఒక అడుగు వెనుకకు తగ్గిఉండటం మంచిది గౌరవిస్తూ కార్యం నెరవేర్చుకుని చల్లగా జారుకొనేవా రుంటారు ధన సంబంధమైన లావాదేవీలలో ఖచ్చితంగా మాట్లాడవలసిన అవసరం ఏర్పడుతుంది ఆడంబరము, గొప్పదనము మాట ఎలా ఉన్నా వృత్తి ఉద్యోగాలలో సాఫీగా పనులు జరగటానికి ప్రయత్నించండి ప్రయాణ సూచన లున్నవి చేయవలసిన పనులు మరచిపోతుండటంవల్ల ఒక సమయంలో పశ్చాత్తాపపడవలసి వస్తుంది కుటుంబంలో ఖర్చులు అధికం ఉష్ణ, శైత్య ప్రకోపాలవల్ల అనారోగ్యం చేస్తుంది వారాంతంలో ప్రశాంత స్థితి ఏర్పడుతుంది వ్యవహారరంగంలో అనుకూలత కలుగుతుంది గౌరవస్థులతో స్నేహం చేయగలుగుతారు 2, 3 తేదులలో ఆదాయ భంగము దైవకార్యాలు. ★



## హోటేళ్ల చరిత్ర

(ఆఖరి బస్సులో ఓపట్నం చెరుకున్న ఓ శ్రీశ్రీ [లేక మాచిరాజు?] భక్తుడు విసుగుతో పాడుకున్న సగం సగం పాట).

ఏ హోటలు చరిత్ర చూచినా
ఏమున్నది గర్వకారణం?
హోటేళ్ల చరిత్ర సమస్తం
ధన సంపాదన పరాయణత్వం
హోటేళ్ల చరిత్ర సమస్తం
బ్రహ్మచార్లని కాల్చుకు తినడం
హోటేళ్ల చరిత్ర సమస్తం
పొట్టేళ్లవలె పోటీపడ్డం

*　　*　　*

చల్లారిన ఫలహారాలూ
కరుణించని భోజనయోగం
బల్లలపై పుర్చీలన్నీ
హోటేళ్లలో, మూలుగుతున్నవి

*　　*　　*

ఏ సర్వర్ సారన్నాడో
ఎక్లీనరు కిమ్మనలేదో
మేజాలూ వాటిపై ఈగలు
ఇవికావోయ్ హోటేలుకర్థం!

భోజనాల తయారీకి
చెమటోడ్చిన భీములెవ్వరు?
వడ్డించిన పచ్చడికాదోయి
అది చేసిన చచ్చుడి ఎవ్వరు?

*　　*　　*

అయ్యరు హోటలూ ఆంధ్రుడి శాలా
ఉడపో గిడపో ఏవైతేనేం
కట్టి కుడిపేస్తాయి తప్పక
హోటేలు కెళ్లిన పాపాన్ని

*　　*　　*

ఈ గీతం ఈ కాలంలో
సాధించినదీ పరమార్థం
శ్రీ శ్రీ మాచిరాజుల కనుకరణం
మామక హోటే లనుభవం
కొంచెం కొంచెం వ్యక్తీకరణం

—రునరా

## శ్రీ ఎడిటర్ దయ

శ్రీ ఎడిటర్ దయచేతను
వారాధిగ సకలజాలలు; కథలన్ పంపన్
ధాంళమైన పద్యము
లిలనే, ప్రథమంబుగాను పంపితి సుమతీ!

శ్రీ తోట పద్మారావు, (సికింద్రాబాదు).

*　　*　　*

## పాప సందేహం

ఒక చిన్నపిల్ల తల్లితో ఇలా అంది అమ్మా! ప్రక్క ఇంటి వాళ్లు నిజంగా చాల పేదవాళ్లు కదూ!

అదేమిటే! ఎందుకలా అంటు న్నావ్? అందా తల్లి ఆశ్చర్య పోతూ!

వాళ్ళ పాపాయి నయాపైసా మ్రింగినప్పుడు వాళ్ళు చేసిన గడబిడ ఇంతా అంతా కాదమ్మా! అని సమాధాన మిచ్చిందా పిల్ల.

బి పద్మావతి (నెల్లూరు)

## 'పాక' సౌరభం

మహిత కైవల్య శ్రీసుధా మధురి మమ్మ
సకల, సురలోక, సుమకోటి సౌరభమ్మ
కల్పతరు, కామధేనుల గౌరవమ్మ,
కలవు, కలవమ్మ నీ "పచ్చిపులుసు" నందు

పంచబక్ష్యమ్మ, పరమాన్న పరియుతంబు
షడ్రసోపేత దివ్య భోజనముగూడ
పెక్కుచవులూరి లవణంబు దక్కకూర
గాదె! ఓయమ్మ! నీ 'ఊరగాయ' లేక.

ధ్యానమాత్ర, దర్శనమాత్ర, ఘ్రాణమాత్ర
శ్రవణమాత్ర, లాలాజల స్రవకరంబు,
అద్వితీయంబు, రుచికరం బద్భుతంబు
వసుధ, నోయమ్మ! 'గోంగూరపచ్చ' డొకటె


పి ఎస్ రంగారావు (జడ్చర్ల)


*　　*　　*

## దేవతల బాధ

శూలధారి మేనతోలునుధరియించె
భైరవుండు అసలు బట్టలేడె;
పట్టుబట్టలాది విష్ణువు దాల్చుట
చాకలాడబాధ తాళలేక!

గిరిశ్రీ (మద్దికెర అగ్రహారం





"నా ముడి బాగా నచ్చిందా?" అంటూ వాసంతి పేపరు చదువుతున్న భర్త

"ఊ" అన్నాడు గోపాలం పేపరునుండి తలపైకెత్తకుండానే

"ముడి సరిగ్గా వచ్చిందా? నాకేమో కొద్దిగా ప్రక్కకు వచ్చిందేమో వని

"లేదు సరిగ్గానే ఉంది"

"పూలు వంకరగా లేవుగదా?"

"లేదు"

వాసంతి పూలు సరిచేసుకునే నెపంతో మరికాస్సేపు భర్తముందే నిలబ

అత డా న్యూస్‌పేపరునుండి తలపైకెత్తనేలేదు తన ముడివైపు అతడు అనిఉంటాడనేది వాసంతికి తెలుసు

వాసంతి కనుబొమలు ముడివడ్డాయి తనఅందాన్ని, అలంకారాన్ని భర్త

స్నేహితురాళ్ళు భర్తస్నేహితులు అందరిదృష్టినీ ఆకర్షిస్తున్న ఆమె సౌం

లేత గులాబిరంగు నైలాన్‌చీర కట్టుకుని, నల్లటిజరీఅంచు పట్టుజాకెట్టు వే

వాసంతి భర్తముందు ఒక్క నిమిషం మాట్లాడకుండా నిల్చుని తన అలంకా

"ఓహో! వారు ఇప్పుడు నావైపు ఒక్కసారిచూస్తే!"

గోపాలంమాత్రం పేపరునుండి తలెత్తనేలేదు అతడు జనరల్ ఎన్నికలగురించి

"ఏమండీ అలా వెళ్ళొద్దామా?" వాసంతి ఊరుకోలేక అడిగింది.

"ఎక్కడికి?" అంటూ పేజీ త్రిప్పాడుగోపాలం.

"ఎక్కడికైనాసరే"

"అంటే?"

"అబ్బ! నాకు చాలా విసుగ్గా ఉందండి ఇల్లుకదలి ఎన్నిరోజులో అయింది

గోపాలం వాసంతిమాటలకు అవుననలేదు, కాదనలేదు పేపరు మ


దగ్గరకు వెళ్ళి "ఇక వెడదాం" అన్నాడు

'తాళం తెస్తాను' అంటూ వాకిలికివేసే పెద్దతాళంకప్ప తేవటానికి ల

తను ఎంతసేపటికీ రాకపోవటం చూసి భర్తలోపలికి వస్తాడని ఆశించిందా

కాని గోపాలం శాంతమూర్తిలా గేటును చేతితోపట్టుకుని వీధిలోకి చూస్తూ

కిటికీతెరలోనుండి ఆమెకు కనిపిస్తూనేఉంది.



ందు నిల్చుంది.

స్తోంది. అవునా?"

ంది.
ాసికూడా ఉండదు తన ప్రశ్నకు ఏదో ఒక జవాబు చెప్పాలి గనుక 'సరిగ్గా ఉంది'

లెత్తి చూసి మెచ్చుకోవాలని ఆమెహృదయం ఆరాటపడుతూవుంది.
ర్యాన్ని మెచ్చుకోనిది ఒక్క గోపాలమే
కుని అందంగా అమరిన ముడిని నవ్వుతున్న గులాబుల వ్యూలతో అలంకరించింది.
మీదికి దృష్టి పోనిచ్చింది

తి శ్రద్ధతోచదువుతూనే ఉన్నాడు.

రోజు ఎక్కడికయినాసరే వెళ్ళాల్సిందే సరే అలా షికారెళ్ళొద్దాంరండి. "
శేవి షర్టు వేసుకున్నాడు చెప్పులు తొడుక్కుని ఆమెకన్నాముందే తలుపు

కి వెళ్ళింది వాసంతి తాళంకప్ప తీసుకుని గదిలో అలాగే నిల్చుంధివాసంతి

నిలబడ్డాడు ఇంటివైపుకైనా తిరగలే దా మహానుభావుడు. అతడలానిల్చున్నది

భార్య ఎందుకింత ఆలస్యం చేస్తోందో అన్న కుతూహలం కూడా అతడికున్నట్లు కనిపించలేదు.

ఇక విధిలేక బయటికొచ్చింది వాసంతి. కావాలనే చెప్పులు పెద్దగా చప్పుడుచేసుకుంటూ మెట్లు దిగివచ్చింది.

కాని గోపాలందృష్టి ఇటులేదు. అతడి చూపుల ననుసరించి తనూ చూసింది. గోపాలం స్నేహితుడు రామం రావటం కనిపించింది.

అసలే తగ్గిపోతున్న వాసంతి ఉత్సాహం రామాన్ని చూసి పూర్తిగా దిగజారిపోయింది.

ఎక్కడికో వెళ్ళటానికి సిద్ధంగావున్న దంపతులను చూసి నవ్వుతూ, "నేను వచ్చినవేళ బాగున్నట్టు లేదే," అన్నాడు.

"ఫరవాలేదులే. లోపలికిరా" అన్నాడు గోపాలం సంతోషంతో.

"ఎక్కడికో బయలుదేరినట్టుంది" అన్నాడు రామం వాసంతివైపు ప్రశ్నార్థకంగా చూస్తూ.

వాసంతి సంకోచంతో, "ఎక్కడికీలేదు. ఊరికే అలా తిరిగివద్దామనీ. అంతే. ఇంకోరోజు వెళ్ళవచ్చు రండి" అంది.

"సినిమాకా?"

"కాదురా బాబూ లోపలికిరా—" అన్నాడు గోపాలం. రామం ఆదరంతో వాసంతివైపు చూస్తూ, "నేనూ వస్తాను రండి. అలా తిరిగివద్దాం" అన్నాడు.

"వద్దులే రామం" అన్నాడు గోపాలం.

"రండి వదినా. ఒక సంచి తీసుకోండి. అలా మార్కెట్టుదాకావెళ్ళి కూరగాయలు తెద్దాం" అన్నాడు రామం.

"ఒద్దు. మీరే వెళ్ళి తీసుకురండి" అంది వాసంతి.

"అలాగే చేద్దాం. మనమే తెద్దాం" అన్నాడు గోపాలం వెంటనే.

"వదినకు నిరాశ కలిగించలేను" అంటూ రామం తానే ముందుకువెళ్ళి, "సంచి ఏది వదినా" అన్నాడు.

ఇక విధిలేక వాసంతి లోపలికివెళ్ళి సంచి పట్టుకొనివచ్చింది. ఇంటికి తాళంవేసి ముగ్గురూ బయలుదేరారు.

తన భర్త అంత చలాకీగా మాట్లాడగలడని వాసంతికి తెలిసివచ్చింది అప్పుడే. గోపాలం నవ్వుతూ సరదాగా కబుర్లు చెప్పుతూ నడుస్తున్నాడు. వాసంతి నిదానంగా అడుగులు వేస్తోంది.

"చాల్లేరా బాబూ. నీ దగ్గర బోర్ కొట్టించుకోవటం ఉండనే ఉంది" అంటూ వాసంతివైపు తిరిగాడు రామం.

"మీకు ఏం కూరగాయలు కావాలి?"

"ఏదయినా సరే"

"మీకేది ఇష్టమో చెప్పండి"

"ఆయనకు బీన్స్ ఇష్టం"

"వాడిసంగతి నేను అడగలేదమ్మా. గడ్డికూర వండిపెట్టినా మాట్లాడకుండా తినేస్తాడు. మీకేం కావాలని అడుగుతున్నాను."

వాసంతి చిరునవ్వు నవ్వి తలెత్తి రామంవైపు చూసి అడిగింది.

"మీకు?"

"నాకా?" ఏం నా కిష్టమైన కూరలు వండి భోజనానికి పిలుస్తారా?"

"ఆఁ"

# ఆకర్షణ

"అబ్బ, ఒక్కపూటన్నా హోటల్ భోజనం తప్పింది. సరే. రేపెలాగూ ఆదివారం. ఆఫీసుకు సెలవు. పదకొండు గంటలకంతా భోజనానికి హాజరవుతాను."

"అలాగే రండి" అంది వాసంతి నిండుమనసుతో.

ఇక అప్పటినుండి రామం కబుర్లకు అంతు లేకుండా పోయింది. "నాకు బీన్స్, బంగాళాదుంపలు, బఠాణీ అన్నీ వేసి కూటుచేస్తే చాలా ఇష్టం. మరి వడియాలు......

రామం గోపాలాన్ని పూర్తిగా మరిచిపోయినట్టే కనిపించింది. గోపాలం రామాన్ని తనవైపు త్రిప్పుకోవడానికి, "ఈమారు ఎన్నికల్లో చాలా గొడవే అయ్యేటట్టు వుందిరా" అన్నాడు.

"ఎన్నికల్ని గంగలో కలవమను. కూటుమధ్యలో

---

సర్వరు 'ఖాతాదారు' ముందు ఇడ్లీ ప్లేటు పెట్టి, "మరో ప్లేటు చచ్చినా తీసుకురాను!" అన్నాడు.

"అదేమిటి పిండి అయిపోయిందా?" అని అడిగాడు ఖాతాదారు వెళ్లిపోతూ.

"కాదు, వంటగదికి నిప్పంటుకుంది."

---

ఎన్నికల గొడవెందుకోయ్? నిమ్మకాయ ఊరగాయ ఉంది కదొదినా?"

"ఉంది"

"దానితోపాటే టమాటో పెరుగుపచ్చడి"

పెళ్ళికాని బ్రహ్మచారి రామం; హోటలు భోజనంతో అవస్థపడుతున్నాడు. అందుకే గృహిణి చేతి వంట తినాలని ఆత్రుత పడుతున్నాడు.

"అన్నట్టు బట్టలకొట్టుకుకూడా వెళ్ళొద్దాం. దీపావళికి చీర తెమ్మని వ్రాసింది చెల్లాయి......"

"వచ్చే సంవత్సరం మీ ఆవిడనుండి ఉత్తరం రావాలి" అంటూ నవ్వింది వాసంతి.

రామం మాట మారుస్తూ, "ఇప్పుడు మీరు కట్టుకున్న చీర చాలా బావుంది. చెల్లాయికీ ఇలాంటి చీరె కొని తీసుకువెడతాను. తనూ మీలాగే సన్నగా, పొడుగ్గా, అందంగా వుంటుంది."

ఇలాంటి పొగడ్త వాసంతికి చాలా కొత్త. ఆ పొగడ్త విని ఆమె మనసులోనే చాలా సంతోషించింది. కొద్దిగా కంగారు పడిందికూడా. భర్త ఏమనుకుంటాడోనని.

కొంచెం గాబరాగానే భర్తవైపు చూసింది. గోపాలం కూడా అప్పుడే ఆమెవైపు చూశాడు — ఆమె ఎలాంటి చీర కట్టిందో చూద్దామని.

రామం గోపాలంతో మాట్లాడటమేలేదు. వాసంతితోనే ఎక్కువగా మాట్లాడుతూ నడుస్తున్నాడు. మార్కెట్‌లోకూడా తనే కూరగాయలు బేరంచేసి సంచి నింపాడు.

"ఏ మడవిమనిషివిరా భాయ్. కాలేజిలో చదువుతున్నప్పుడు ఆ సత్యభామ కారు తలుపుతీసి నిల్చునే వాడివి. ఆమె పుస్తకాలు మోసుకుని ఇంటికి తీసుకువెళ్ళేవాడివి. ఆ నీ 'షివ్రి' పెళ్ళానికి చూపెట్టక్కర్లేదూ?" అంటూ వాసంతి చేతిలోని కూరల సంచి తీసుకున్నాడు.

"సత్యభామ ఎవరు?"

"మాకు జూనియర్ వదినా. గోపాలం ఎలా ఆమె వెంటబడ్డాడనీ! మీ పాదాలకున్న అందంలో సగంకూడా ఉండేదికాదు. 'జూ' నుండి పారిపోయి వచ్చినట్టుండేవి కదటరా?" అన్నాడు రామం గోపాలంవైపు చూసి.

గోపాలం వాసంతి పాదాలవైపు చూస్తున్నాడు నిజమే. ఆమె పాదాలు కోమలంగా ఉన్నాయి. నల్లటి ఎత్తుమడమల జోళ్ళు ఆమెపాదాలకు ఆభరణాల్లా శోభ నిస్తున్నాయి.

రామం పిలుపు విని గోపాలం ఈ లోకంలో దిగి, "ఆఁ......ఏమిటి" అన్నాడు.

"ఏమిట్రా ? సత్యభామను గురించేనా కలలు కంటున్నావ్?"

"ఛ, అవేం మాటలురా" అన్నాడు గోపాలం.

"ఏం భయమా?"

"అబద్దాలెందుకురా?"

"ఏమి టేమిటి నేను చెబుతున్నవి అబద్ధాలా ? నాన్సెన్స్. సత్యభామలాంటి కపివదనను వర్ణిస్తూ, కవిత్వం రాయలేదూ? అదీ అబద్ధమేనా? పాపం, అపుడు నీకు నిజమైన సౌందర్యమంటే ఏమో తెలీదేమో. ఇప్పుడు తెలిసిందనుకుంటాను — పెళ్ళయ్యాక"

గోపాలం అపుడే వాసంతివైపు చూశాడు. దీపాల వెలుగులో మనమోహకంగా కనిపించింది వాసంతి అతడి కళ్ళకు.

పరధ్యానంగా "ఆ? ....... అవును" అనేశాడు చప్పున.

వాసంతి మృదువుగా నవ్వింది.

"అలా రా దారికి. వీడు ఎక్కువ ఆటలు ఆడకుండా చూసుకున్నవాడిని నేనేనమ్మా. ఆ కోతి పెళ్ళికాగానే ఆ గొడవ వదిలిపోయింది."

"బ్రతికాం......" అంటూ నిట్టూర్చింది వాసంతి.

"అంతటితో ఏమయిందమ్మా. తరువాత రుక్మిణివెంటబడ్డాడు. ఆ మహాతల్లి రూపంలో సత్యభామ అక్కయ్యే!"

"చాల్లేరా. పాత పురాణాలన్నీ లాగుతావెందుకు?" అన్నాడు గోపాలం చిరుకోపంతో.

"ఈయన పద్యాలుకూడా రాసేవారా? నాకు తెలియదే" అంటూ ఆశ్చర్యం ప్రకటించింది వాసంతి.

"ఆ! బ్రహ్మాండంగా రాసేవాడు. ఊఁ......రేపు పదకొండుకల్లా నేను భోజనానికి హాజరవుతాను...."

వస్తాను. నా రూము ఇక్కడికి దగ్గరలోనే ఉంది.... వంచి తీసుకో.....మళ్ళా వదినచేతి కిచ్చేందుకు..... నేను అలా కనుమరుగవగానే.....దారిలో పోయే ఆడవారికి చూపే శ్రద్ధని ఇంట్లోని భార్యకు చూపడం తప్పేమీకాదు....." అంటూ సంచు తీరిగాడు రామం.

గోపాలం సంచి తీసుకుని బయల్దేరాడు. రామం వెళ్ళగానే వా రిద్దరిమధ్యా మౌనం వ్యాపించింది. రామం ఇంటివరకువచ్చివుంటే బాగుండే దనిపించింది వాసంతికి.

ఆదివారం పదకొండుగంటలకు సరిగ్గా వచ్చాడు రామం.

"ఆకలి ...... ఆకలి" అంటూనే వంటగదిలోకి వచ్చాడు.

"వదినా, వంటయిందా?"

"ఆఁ, అయింది."

"అయితే వడ్డించండి" అంటూ తనే వెళ్ళి గోపాలాన్ని లాక్కుని వచ్చాడు.

వాసంతి ఇద్దరికీ అరిటాకులువేసి వడ్డించింది. రామం వంటను మనసారా పొగడుతూ భోంచేస్తున్నాడు.

చేసినవంట నెవరైనా పొగడటంకూడా వాసంతికి క్రొత్త విషయమే. వంచిన తల పైకెత్తకుండా చేతిలో ఓ పుస్తకం పట్టుకుని, ఏం వడ్డించా రన్నదికూడా గమనించకుండా భోంచేయటమే గోపాలం పద్ధతి.

రామం కూడు రెండు మార్లు కలుపుకొని తృప్తిగా భోంచేశాడు. "ఈరోజు చేసిన భోజనం రుచి జ్ఞాపకంతో ఇంక వో నెలరోజులు హోటల్ భోజనం చేయగలను" అన్నాడు పెరుగూ అన్నం కలుపుకుంటూ.

"ఊరికే పొగడకండి" అంది వాసంతి సిగ్గుతో.

"పొగడ్తకాదమ్మా ఇది. నువ్వైనా చెప్పరా గోపాలం. వంచినతలపైకెత్తకుండా తినటమేకాని మాటలాడవేం?" అన్నాడు రామం.

"బాగుంది" అన్నాడు గోపాలం యాంత్రికంగా.

"సరేలే, రోజూ రుచి రుచిగా వండిపెడుతూంటే తినే నీకు దాని విలువేం తెలుస్తుంది? రేపు నాతో వచ్చి హోటల్లో భోంచేయి. అప్పుడుగాని నీకు ఇంటి భోజనం విలువ తెలిసిరాదు.

రామం భోంచేసి విశ్రాంతి తీసుకుని మధ్యాహ్నం కాఫీ, టిఫిన్ కానిచ్చి వెళ్ళాడు.

వెళ్ళేముందు వాసంతి దగ్గరకొచ్చి, "ఇకనుండి ప్రతి ఆదివారం మీ ఇంట్లో హాజరవుతాను. భోజనం, టిఫిన్ రెడీగా ఉంచండి" అన్నాడు.

"అలాగే! తప్పకుండా రండి" అంది వాసంతి.

అప్పటినుండి వాసంతి హృదయం అతృప్తితో మండసాగింది. భర్త అలక్ష్యం, ఔదాసీన్యం, అనాదరణలను ఇంతవరకూ ఎలాగో సరిపుచ్చుకుంటోంది. కాని రామం హాస్యం, కలుపుగోరుతనం ఇవి విన్నాక వాసంతికి తన ఈ జీవితంలో ఏదో లోటు వుంది అనిపించసాగింది. గోపాలం ఇంట్లోవున్న భార్య సౌందర్యాన్ని, స్నేహాన్ని గమనించేవాడేకాదు. ఆమె మీద స్వామిత్వాన్ని ధర్మశాస్త్రమే తనకు భుక్తం చేసినందువల్ల అతడికి తన భార్యతో ఏ విధమైన ఆసక్తి, ఆకర్షణ, శ్రద్ధ మిగలలేదు.

అప్పటినుండి ప్రతిఆదివారం రామంవారి ఇంటికి వచ్చేవాడు. అతడి రాకకోసం ఆమె కూడా ఎంతో ఆత్రుతతో ఎదురు చూసేది. మొదటవున్న సంకోచం పోవడానికి ఎక్కువ రోజులు పట్టలేదు. అతడితో స్నేహితురాలిలా, ఆప్తురాలిలా, చెల్లెలిలా ప్రవర్తించేదామె.

ఒక్కొసారి అతడితో, "మీ కాబోయే భార్య చాలా అదృష్టవంతురాలని ఇప్పుడే రాసిస్తాను. ఆమె ఒక్కక్షణం కూడా విసుగు చెందకుండా చూసుకోగలరు" అనేది.

"అలాగా అక్కయ్యా. నేను అంత సంపన్నుడినని నాకే ఇంతవరకూ తెలియదే" అనేవా డతడు.

ఒక్కొమారు రామం సంసారం ఎంత ఆనందమయంగా, తృప్తికరంగాఉంటుందోవూహించేదామె.

---

వారసత్వపు ఆస్తికోసం పేరిశాస్త్రి దావావేశాడు. అతడు కోర్టు గదిలోకి వెడుతుండగా ప్రతివాది వెంకటావధాని ఎదురయ్యాడు.

"ఆ ఎదురుగా కూర్చున్న వారేనాసీ తరఫున సాక్షులు"

వెంకటావధాని దిగులుగా అడిగాడు.

"అవును"నిబ్బరవూపాడు పేరిశాస్త్రి.

"అయితే ఇంకేం! నీవు తప్పకుండా గెలుస్తావు. వెనుక రెండు కేసులలో వీళ్లు నా తరఫున కూడా సాక్ష్యం చెప్పారు!" వెంకటావధాని నిస్పృహతో అన్నాడు.

ఎం. వరహాలరావు (మండపం)

---

రాను రాను గోపాలం ఇంట్లో ఉన్నా లేకపోయినా రామం వచ్చేవాడు. కబుర్లు చాలనిపిస్తే చదరంగం, కేరం ఏదయినా ఆటలు ఆడేవారు. గోపాలం ఇంట్లో ఉన్నా కూడా ఈ ఆటల్లో పాల్గొనేవాడు కాదు. ఏదో పుస్తకం చేతబట్టుకుని కూర్చునేవాడు.

గోపాలాన్ని ఆటలోకి దించడానికెంతో ప్రయత్నించేవాడు రామం. వాసంతి కూడా రమ్మని బలవంతంచేసేది. కాని గోపాలం వచ్చేవాడుకాదు. కాలేజీలో చదివేటప్పుడు గోపాలం చదరంగం 'ఛాంపియన్' అనిపించుకున్నవాడు. అలాంటివాడు ఇప్పుడు వాసంతి "ఏమండీ, ఇలా చూడండి. ఈ గుఱ్ఱం కాపాడుకోగలమేమో" అంటే, అటువైపు చూడనైనా చూడకుండా 'నాకు తెలీదు' అనేవాడు.

"అతడి నేమడుగుతా వక్కయ్యా. సత్యభామ వెంటబడటం తెలుసు వాడికి. ఆమెగారికి టేబుల్ టెన్నిస్ నేర్పడంకోసం కాలేజి ఎగ్గొట్టడం తెలుసు. ఇప్పుడు మీ రడిగితే తెలియదంటాడు. తన జ్ఞాన భండారాన్నంతా సత్యభామ కోసమే ఖర్చు పెట్టేసి నట్టున్నాడు!" అంటూ గోపాలాన్ని ఏడిపించేవాడు.

"సత్యభామకు ఇంకా ఏమేం నేర్పారు?" అని అడిగేది వాసంతి కుతూహలంతో. కొంటెగా.

"ఎన్నడుగుతా వక్కయ్యా? కేరం, చదరంగం, టేబుల్ టెన్నిస్, అవ్‌లెటర్సు వ్రాయటం ఎన్నో నేర్పాడు. ఆ మహాతల్లిని వర్ణిస్తూ కావ్యాలు గూడా రాశాడు. ఆమె పెళ్లయ్యాక తగలెట్టేశాడనుకో. అన్నట్టు అక్కయ్యా. వీ డెప్పుడైనా మిమ్మల్ని మెచ్చుకున్నాడా?"

"............"

"ఒరేయ్ గోపాలం. చెప్పరా. నీ సత్యభామ మా అక్కయ్యంత బాగుందటరా?"

రామానికి మొదట గోపాలం అన్నయ్యకాగా వాసంతి వదిన అయింది. క్రమేణా స్నేహం ఎక్కువయినకొలది వాసంతి దగ్గర అక్కయ్యగాను, గోపాలం దూరపు బావగానూ మారిపోయారు.

ఒకరోజు ఆఫీసునుండి వచ్చాక అతి శాంతంగా ఒక పిడుగులాంటి వార్త నందించాడు గోపాలం వాసంతికి. అది రామం ట్రాన్సఫర్.

గోపాలం ఈ విషయం చెప్పిన రోజున వాసంతికి భోజనం సహించలేదు. నిద్ర కూడా పట్టలేదు.

మరునాడు ఇంటికి వచ్చిన రామం మొహం కూడా వాడిపోయివుంది.

"అక్కయ్యా, నాకు ట్రాన్స్‌ఫర్ అయింది" అన్నాడు.

"తెలిసింది" అంది వాసంతి బలవంతపు చిరునవ్వును పెదవులపైకి తెచ్చుకుని.

అతడు వెళ్ళేరోజు దగ్గరపడింది. అతడికి పిండివంటలు చేసి అతడికి ఇష్టమయిన పదార్థాలన్నీ చేసి వడ్డించింది.

రామం "వస్తానక్కయ్యా. మరిచిపోకండి" అన్నాడు కళ్ళలో నీరు, పెదవులపై చిరునవ్వుతో.

రామం వెళ్ళిపోయాక వాసంతికి చాలా విసుగనిపించేది. ఏమీ తోచేదికాదు. రోజులు గడవటమే దుర్భరంగా వుండేది. మరీ విసుగనిపించినపుడు 'ఇప్పుడు రామం వుంటే' అనుకునేది. ఇలా అనిపించడం రోజుతో వందమార్లయినా అయ్యేది. కేరంబోర్డు, చదరంగంబల్లా మూలపడ్డాయి. మళ్ళీ ఇంటిలో పూర్వపు గంభీరమౌనమే వ్యాపించింది.

ఆమౌనాన్ని చీల్చి దంపతుల సంభాషణలకు అవకాశమిచ్చింది రామంపెళ్ళి శుభలేఖ.

శుభలేఖ వచ్చినపుడు గోపాలం ఇంట్లోలేదు. అతడి రాకకోసం ఆత్రుతతో ఎదురు చూసింది వాసంతి. అతడు ఆఫీసునుండి రాగానే "మన రామానికి వచ్చేనెలలో పెళ్ళట" అంది.

"ఎవరికి?" అన్నాడు గోపాలం పరధ్యానంగా.

"అదే రామం......సత్యభామ గురించి చెప్పేవాడే! వారికే......"

వాసంతి వ్యంగ్యాన్ని అర్థం చేసుకోనట్టే 'సరే' అన్నాడు గోపాలం.

రామం చేపట్టబోయే ఆ అదృష్టవంతురాలిని చూడాలన్న కాంక్షతో ఉంది వాసంతి. "వెడదామా" అంది ఉత్సాహంతో.

"ఉత్తరమైనా రాలేదే! ఎలా వెళ్ళటం?"

"తప్పకుండా రేపో, ఎల్లుండో వస్తుంది. రామం ఈ విషయంగురించి ఉత్తరం రాయకుండా ఉండడు" అంది వాసంతి. ఆమె సరిగ్గానే వూహించింది. ఆ మరునాడే రామం ఉత్తరం వచ్చింది. కవరుమీద గోపాలంపేరువున్నా లోపల ఇద్దరికీ వేరో ఉత్తరం ఉంది.

"తప్పక రావాలి అక్కయ్యా. గోపాలాన్ని లాక్కుని రండి. తను బద్ధకస్తుడు. తనంతట తాను బయలుదేరాడు, మీరే అతన్ని వెళ్ళదీసుకురావాలి. తప్పక రావాలి......" అంటూ రాసిందే మళ్ళీ మళ్ళీ వ్రాశాడు.

వాసంతికి రామం పెళ్ళికి వెళ్ళాలనిఉంది. కాని శలవు దొరకని కారణంచేత గోపాలానికి రావటం వీలుపడదని తేలిపోయింది. వాసంతి ఉత్సాహం, ఆత్రుత ఎంత తీవ్రంగా ఉందంటే గోపాలం కూడా అది గమనించి, "కావాలంటే నువ్వే వెళ్ళిరా" అన్నాడు.

"మీరు రాకపోతే నేనూ వెళ్ళను" అంది వాసంతి సెలవివ్వని గోపాలం బాస్‌ని మనసులోనే తిట్టుకుంటూ.

గోపాలం పెళ్ళికి కానుక, గ్రీటింగ్స్ పంపాడు. స్నేహితుడికి, దానికి థ్యాంక్స్ తెలుపుతూ, దానికి తోడు బోలెడు తిట్లతోనూ, ఆక్షేపణలతోనూ రామం ఉత్తరం రాశాడు.

"పెళ్ళికి ఎందుకురాలేదు ? నువ్వు తలచుకుంటే వచ్చేవాడివే. నువ్వు రానందుకు నేనంతగా బాధపడలేదు. కనీసం అక్కయ్యనన్నా పంపలేకపోయావే? నీ స్వభావమే అంత. సత్యభామకు పెళ్ళయినపుడు మాత్రం కాలేజి ఎగ్గొట్టి ఎంతదూరముందో కూడా తెలియని నరకపు దారిగుండా వెళ్ళటానికి మాత్రం వీలయిందీ? నా పెళ్ళికి వందమైళ్ళు రాలేకపోయావన్నమాట......"

గోపాలం ఉత్తరం చదివి వో చిరునవ్వు నవ్వుకున్నాడు.

ఎక్కడో వందమైళ్ళ దూరానవున్న రామం సంసారాన్నిగురించి వాసంతి మనసులోనే ఎన్నెన్నో చిత్రాలు చిత్రించుకునేది.

"రామం ఇప్పుడు ఎలా వుంటాడో! అతని భార్య ఎంతో పుణ్యం చేసుకుంది. ఎప్పుడూ పొగడ్త, పరసం, కబుర్లు, హాస్యం.....ఉ......అయినా అన్నిటికీ పెట్టి పుట్టాలి. ఏదీ ఊరికేరాదు. ఇప్పుడు వో బిడ్డకూడా పుట్టి ఉండవచ్చు. పెళ్ళయి రెండేళ్ళు కావస్తోంది" ఇలాగే ఆలోచిస్తూ వుండేది వాసంతి.

ఒకరోజు గోపాలం ఇంటికివచ్చి కాఫీ, టిఫిన్ ముగించి పడక్కుర్చీలో కూర్చుని తాపీగా పేపరు మడత విప్పుతూ వాసంతి అనుకోని విషయం చెప్పాడు.

"రామానికి మళ్ళీ ఇక్కడికే ట్రాన్స్‌ఫర్ అయింది. డ్యూటీలో జాయినయి వారం రోజులయింది."

"ఓహో! నిజం? ఒకరోజు వాళ్ళింటికి వెళ్ళాలి."

"వెడదాంలే" నిరుత్సాహంగా అన్నాడు గోపాలం.

## ఆకర్షణ

"ఎప్పుడు వెడదాం?" భర్త నిరుత్సాహాన్ని గమనించకుండా అత్యుత్సాహంతో అడిగింది వాసంతి.

"ఇంకా ఇప్పుడేగదా వచ్చాడు. ఇల్లు ఎక్కడో ఏమిటో కనుక్కుంటాను. తరువాత వెడితేపోతుంది.

"అతన్నే ఇక్కడికోసారి రమ్మనండి."

"ఊఁ"

"పాపాయనుకుంటాను?"

"కాబోలు. అలా చెప్పినట్టే జ్ఞాపకం......"

"ఇక్కడి కెందుకు రాలేదట?"

"పిల్లాడికి వంట్లో బాగాలేదని చెప్పినట్టే జ్ఞాపకం......"

---

నరసింహంగారిని డాక్టరు జాగ్రత్తగా పరీక్షచేసి "కొంత కాలం పాటు మీరు పిండిపదార్థాలు, మిఠాయి తినటం మాని, రోజుకి ఒక్కటంటే ఒక్కటే చుట్టతాగాలి." అని సలహా చెప్పాడు.

పదిహేను రోజుల తరువాత కొన ఊపిరితో నరసింహంగారు మళ్ళీ డాక్టరు దగ్గరు వెళ్ళారు. అయ్యా! పిండి పదార్థాలు, మిఠాయి తినకుండా ఉండటం కష్టమనిపించలేదు గాని, అలవాటులేని ఆ చుట్ట తాగలేక చస్తున్నాను." అయన డాక్టరుతో మొత్తుకున్నారు.

కె. వి. సదానందం (కాకినాడ)

---

"రేపు మనమే వెడదామా?"

"ఊఁ" అంటూ మళ్ళీ పేపర్లోకి తలదూర్చాడు గోపాలం.

మరునాడు సాయంకాలం గోపాలం వచ్చేసరికి వాసంతి బయల్దేరడానికి రెడీగా ఉంది.

కాఫీ, టిఫిన్ అయ్యాక, "ఇక వెడదామా" అంది ఆత్రుతగా.

"ఎక్కడికి ?"

గోపాలం క్రిందటిరోజు సంభాషణ నప్పుడే మరిచిపోయాడు.

"రామం ఇంటికి"

"రేపు వెడితే ఏం? మనం వస్తామని చెప్పలేదే. ఇంట్లో వుంటాడో లేదో?"

"అతడు లేకపోయినా భార్యా, పిల్లాడూ వుంటారుగా. వారినే చూసివద్దాం. పదండి. ఈరోజు వెళ్ళి తీరాల్సిందే. బయల్దేరండి" అంటూ తాళం కప్ప చేతిలోకి తీసుకుంది వాసంతి.

ఇక విధిలేక బయల్దేరాడు గోపాలం. ఇద్దరూ బస్సు ఎక్కారు. వాసంతి రామం సంసారచిత్రాన్ని, అతి సుందరంగా, రంగు రంగులతో చిత్రించుకుంటోంది.

వెన్నెల్లో విహరించే రామం, అతని భార్య, పెళ్ళాంతో కబుర్లు చెప్పే రామం, ఆమెతో సరసమాడుతున్న రామం, ఎప్పుడూ నవ్వే దంపతులు, కలకలలాడే కాపురం.....

వాసంతి స్వప్నం ఇంకా పూర్తి కానేలేదు. గోపాలం' 'ఈ స్టాపింగ్‌లోనే దిగాలి మనం" అన్నాడు.

వాసంతి తేరుకుని బస్సు దిగింది. ఇద్దరూ రామం ఇంటివైపుగా నడిచి వెళ్ళారు. ఇంటికి వేసిన పెద్ద తాళంకప్ప దంపతులకు స్వాగతమిచ్చింది.

"ఇంట్లో ఒక నిమిషమైనా ఉంటాడా రామం? భార్యనీ, బాబునూ తీసుకుని ఏ సినిమాకో పార్కుకో వెళ్ళిఉంటాడు."

"మనం ముందుగా చెప్పివస్తే బావుండేది" అంది వాసంతి నిరాశతో.

"అవును. నువ్వే తొందరపెట్టావు. ఇప్పుడేం చేద్దాం?"

"ఇహ చేసేదేముంది? వెళ్ళిపోదాం. రేపు అతన్నే మనింటికి రమ్మని చెప్పండి"

"సరే. పోదాంపద"

ఇద్దరూ వెనుదిరిగి పదడుగులు వేసేసరికి రామం పిల్లాడి నెత్తుకున్న అతడి భార్య రావటం కనిపించింది. లీల సుమారు ఎనిమిది నెలల పిల్లాడిని ఒక చేతితో ఎత్తుకుని, ఇంకో చేతితో మందు సీసాలున్న సంచి పట్టుకుని నడుస్తోంది. నలతగావున్న పిల్లవాడు చంకలో నిలవక, తన చిన్న పాదాలతో తల్లి నడుమును తన్నుతూ ఏడుస్తున్నాడు.

లీల పిల్లవాడిని సమాధానపర్చడానికి సతత ప్రయత్నం చేస్తోంది. రామం హాయిగా సిగరెట్ పీలుస్తూ, వంటరిగా ఉన్నట్టుగానే నడుస్తున్నాడు. కేవలం ఆమె కాపలాకోసమన్నట్టుగానేనడుస్తున్నాడు.

వాసంతి గోపాలాన్ని చూడగానే చేతిలోని సిగరెట్ పారేసి ముందుకువచ్చి, "ఇన్నటికి గుర్తుకొచ్చానా అక్కయ్యా?" అన్నాడు రామం ఉత్సాహంగా.

"మీ భార్యను తీసుకొని మీరే రాకూడదా ఏమిటి? మీ ఇల్లెక్కడో తెలియకనే రాలేదనుకోండి" అంటూ ఆక్షేపించింది వాసంతి.

"రావాలనే అనుకున్నానుకాని బాబుకు వంట్లో బాగాలేదు. అన్నట్టు మీరు తాళం కప్ప చూసే వస్తున్నారల్లే వుంది! ఆ......ఈమె నా భార్య లీల.....లీలా, వీరు నా స్నేహితులు గోపాల్, వారి భార్య వసంత్ నా అక్కయ్య."

"నమస్తే" అంది వాసంతి. లీల పిల్లాడిని సమాధానపర్చటంలో నిమగ్నురాలైంది.

"ఆ సంచి ఇలా తెండి" అంటూ వాసంతి లీల చేతిలోఉన్న సంచి తీసుకుంది. అసలే మోయలేక బాధపడుతోందేమో ఎక్కువ చెప్పించుకోకుండానే సంచి వాసంతి చేతికిచ్చి, "మీకు శ్రమ నిస్తున్నాను" అంది.

"ఏం ఫరవాలేదు. ముందు మీరు బాబును సముదాయించండి."

"మీరు తీసుకున్నారేమిటి? నేను తీసుకొస్తా నిటివ్వండి" అంటూ రామం వాసంతి చేతిలోని సంచి కోసం చేయి జాచాడు.

పొంగివచ్చే నవ్వు నతి కష్టపడి ఆపుకుంటూ సంచి ఇచ్చేసింది.

అందరూ రామం ఇల్లు చేరారు. లీల చంకలో బిడ్డ నెత్తుకుని తాళం తీయటానికి ప్రయత్నిస్తోంది. బాబు ఎగిరెగిరి పడుతున్నాడు. రెండో చెయ్యిలేందే తాళం తీయటానికి వీలు పడేటట్టు లేదు. కానీ రామం ఆపకుండా వాగుతూనే వున్నాడు.

"చూడరా గోపాల్. మీ ఇంటికి వద్దామనే అనుకున్నాను. కాని వీలుపడలేదు. నీకోసం కాకపోయినా నా అక్కను చూడటానికయినా వద్దామనుకున్నాను. ఏమిటక్కయ్యా, మీరు కూడా నన్నే అంటారా?"

వాసంతి రామం మాటలను విననుకూడా వినలేదు. ఆమె లీలచేతిలోని తాళాలగుత్తి తాక్కుని తాళం తీసే ప్రయత్నంలోవుంది.

అందరూ లోపలికి వెళ్ళారు.

లీల బాబుని ఉయ్యాలలో పడవేసి 'ఇపుడే వస్తాను' అంటూ వంటింటివైపు వెళ్ళింది.

"అక్కయ్యకు కాఫీ ఇవ్వు" అని అక్కడినుండే ఆజ్ఞ జారీ చేశాడు రామం.

లీల లోపలికి వెళ్ళింది. తల్లి చంకనుండి దింపి ఉయ్యాలలో పడుకోబెట్టగానే బాబు గట్టిగా ఏడవ నారంభించాడు.

తన కబుర్లకు అడ్డం తగిలిన బాబు ఏడుపు విని రామం గట్టిగా, "లీలా, బాబు ఏడుస్తున్నాడు. వాడిని సముదాయించు. అన్నట్టు అక్కయ్యా! మీ చేతికూడు తిని చాలా రోజులయింది. ఇంకో రోజు వస్తా నది తినటానికి...."

"వస్తాను. కాదు, వస్తాము అనండి" అంటూ నవ్వుతూ వాసంతి అతడి మాటను సరిదిద్దింది

రామం సంతోషంగా, "అలాగే తప్పకుండా వస్తాము. అన్నట్టు లీలా! నువ్వు, అక్కయ్యా దగ్గర నేర్చుకోవలసినవి చాలా ఉన్నాయి. అందులోనూ వంట విషయంలో చాలా......ఇపుడు హోటల్ భోజనమే నయమనిపిస్తోం దక్కయ్యా.....లీల చేతి వంట రుచి చూశాక......" అంటూ గట్టిగా నవ్వాడు. లీల మాట్లాడకుండా ఉయ్యాల వూపుతోంది.

"పాపం ఇపుడే నేర్చుకుంటున్నారల్లేవుంది. నేనూ అంతే. మొదట్లో బాగా పాడు చేసేదాన్ని. ఇప్పుడు నయం" వాసంతి లీల పక్షం వహించి మాట్లాడింది.

లీల కృతజ్ఞతతో, "అవు నక్కయ్యా! పెళ్ళయ్యేదాకా కాలేజీలోనే సరిపోయింది. పెళ్ళయ్యాక ఎక్కువరోజులు ఇక్కడలేను. పుట్టింటికి వెళ్ళిపోయాను. అలా అయి ఇపుడే నేర్చుకుంటున్నాను" అంది.

"అక్కయ్యకి మాటల్తోనే కడుపు నింపేస్తావా. లేకపోతే కాఫీ ఇచ్చేదుందా?"

లీల ఉయ్యాల వదిలిపెట్టింది. బాబు మళ్ళీ ఏడవటం మొదలెట్టాడు. రామం కబుర్లకు అంతమే లేనట్టుంది.

లీల నిస్సహాయంగా నిల్చుంది. వాసంతి లేచివచ్చి ఉయ్యాల వూపటానికి మొదలెట్టింది. బాబు ఏడుపు మానాడు. లీల కాఫీ కాచటానికి లోనికి వెళ్ళింది.

వాసంతి ఉయ్యాల ఊపటంచూసి రామం నొచ్చుకుంటూ, "ఏమి ఆడవాళ్ళురా బాబూ. అపురూపంగా ఇంటికి వచ్చిన వాళ్ళ చేతితో పని చేయిస్తారు. వదలండి. నేను ఊపుతాను" అన్నాడు.

"అక్కర్లేదు. నేను ఊపుతానులెండి" అంది, వాసంతి. లీల కాఫీ తెచ్చి అందరికీ ఇచ్చింది. అప్పటికి బాబు నిద్రపోయాడు. వాసంతి అప్పుడే లీల వైపు పరీక్షగా చూసింది. లీల అందమైన యువతి అవటానికి సందేహమేమీలేదు. రామం అభిరుచిని వాసంతి మనసులోనే మెచ్చుకుంది.

---

ఇద్దరు బాల్యస్నేహితులు చాలా కాలం తరువాత మళ్లీ కలుసుకున్నారు. "ఏరా! ఏం చేస్తున్నావేమిటి? కులాసాయేనా?" ప్రశ్నించాడు ఒకడు రెండవ వాణ్ణి.

"ఏం చెప్పనురా! మా ఆవిడ చచ్చిపోయింది; మా అబ్బాయికి పిచ్చ ఎత్తింది. నేను డబ్బు వేసుకున్న బ్యాంకు దివాలా తీసింది. నా పళ్ళన్నీ వూడిపోయాయి."

"అరేపాపం!"

"ఇంతకూ నువ్వేం చేస్తున్నావ్?"

"ఆఁ వుందీ! ఇదివరకు నుంచీ చేస్తున్న పనే. అదృష్టం బాగు పరిచే తాయిత్తులు అమ్ముతున్నాను!"

రోహిణీకుమార్ (మద్రాసు)

---

కాఫీ తాగుతూ రామం అడిగాడు, "అక్కయ్యా లీల ఎలా వుంది. మీకు నచ్చిందా?"

"మీరు అదృష్టవంతులు. లీల లక్ష్మిలా వున్నారు"

"నా అక్కయ్యకన్నా బావుందా లీల?"

"మీ అక్కయ్యను నేను చూడలేదే" అంది వాసంతి.

"హాస్యం కాదక్కయ్యా. నాకు వేరే అక్కయ్య లేదు. మీరే......"

"అలాగా...... ఛ, నే నెక్కడ? ఆవెక్కడ? నేను మొరటు మొరటుగా వున్నాను. లీల నాజూగ్గా, దంతపుబొమ్మలా వున్నారు. కానీ......" వాసంతి దీర్ఘంతీసింది.

"కాని....కాని ఏమిటి?"

తన భార్య అందంలో వాసంతి ఏ లోకనిపం పెట్టిందోనని కలవరపడ్డాడు రామం.

"కాని......లీలకు ఇంకా మంచి భర్త దొరకాల్సింది" అంటూ నవ్వింది వాసంతి. ఆమె నవ్వుతో జత కలిపారు లీలా గోపాలంలు.

"నిజం చెప్పావు వాసంతి" అన్నాడు గోపాలం.

రామం కొంచెం చిన్నబుచ్చుకుని, "మహా, మహా నువ్వు చెప్పిన దానిలోని నిజానిజాలు అలా వుంచు: నీకు అక్కయ్యలాంటి పెళ్ళాం దొరకకుండా ఉండాల్సింది. నీకా సత్యభామ సరి" అన్నాడు.

వెళ్ళేటప్పుడు తాంబూలంలో కొబ్బరికాయ పెట్టి ఇచ్చింది లీల వాసంతికి.

"కొబ్బరికాయ వద్దు లీలా" అంది వాసంతి.

"అలా అనకండి. ఫరవాలేదు తీసుకోండి" అంటూ బలవంతం చేసింది లీల.

తన మనస్సు నొప్పించటాని కిష్టంలేక వాసంతి ఆ కొబ్బరికాయ పుచ్చుకుంది.

రామం "నా చేతి కివ్వండి. నేనే తెస్తాను ఇంటి వరకూ" అన్నాడు.

"వద్దు. లీల ఒక్కరే అయిపోతారు. చీకటి కూడా పడిపోయింది."

"మరేం ఫరవాలేదు. తన కదంతా అలవాటయి పోయింది. నేను క్లబ్బునుండి రావటానికే రాత్రి తొమ్మిదవుతుంది."

వాసంతి లీలదగ్గరకు వెళ్ళి, "రామం చాలా కబుర్లు చెప్తాడుకదూ?" అన్నది.

"లేదండి. అసలు మాట్లాడటానికి ఆయన ఇంట్లోనే వుండరు. క్లబ్బుకో లేకపోతే ఫ్రెండ్స్‌తో సినిమాకో వెళ్ళి రాత్రి లేటుగా వస్తారు. అసలు ఇంతగా మాట్లాడుతారని నా కివాళే తెలిసింది" అంది లీల బెంగగా.

"ఇహ వస్తామండి. మీరు మీవారిని కూడా తీసుకుని మా ఇంటి కోమారు రండి" అంటూ సెలవు పుచ్చుకుంది వాసంతి లీలదగ్గర.

రామం వాళ్ళతోబాటు కొంచెందూరం వెళ్ళాడు. తరువాత వాసంతి బలవంతంగా, "మీరు ఇంటికి వెళ్ళండి. లీల ఒక్కరే వున్నారు. బాబుకు వంట్లో బాగాలేదు కూడా. మీరు తోడుగావుంటే ఆమెకు కొంచెం ధైర్యంగా వుంటుంది" అంటూ వెనక్కు పంపివేసింది. భార్యాభర్త లిద్దరూ మౌనంగా ఇల్లు చేరారు.

మౌనంగానే భోజనాలయ్యాయి. భోజనం కాగానే గోపాలం 'నాకు నిద్రవస్తోంది' అంటూ పడుకున్నాడు.

వాసంతి కూడా ఏదో డ్రామా పుస్తకం తీసుకుని చదవటానికి మొదలెట్టింది. ఐదు నిమిషాలు చదివి భర్తతో......

"వినండి! నాటకకారుడు ఈ వాక్యం ఎంత బాగా రాశాడో.....పురుషుడికి ఒక స్త్రీపై ఆకర్షణ ఆమె భార్య అయ్యేవరకేనట. కాని పెళ్ళయినా స్త్రీ జాతిమీదఆకర్షణ నశించదట. కాని చేపట్టిన భార్యలో మాత్రం ఆకర్షణ లోపిస్తుందంట. ఇది వాస్తవం కదా? ఏమంటారు?"

గోపాలం జవాబు చెప్పలేదు. అప్పటికే అతడు నిద్రాదేవి వడిలో పడుకుని కలలుకంటున్నాడు. ★

# గూడుకోసం గువ్వలు

27-వ పేజీ తరువాయి

"అదో బాబుగారొచ్చారు చూడు! మనసు లేని మాట, మనసున్న చోటు! పలకవే చిలకా!" అంటూ గురప్ప పంజరం తలుపులు తీస్తాడు. ఎగిరి గంతేసి బాబుగారి భుజంమీద వాలుతుంది చిలుక. "శాస్త్రం చెప్పమంటే భుజంమీద సవారి చేస్తావేమే? .... వోహో! కానుక కావాలనా?" అంటూ బహు నైపుణ్యంతో తన ఫీజు' సంగతి హెచ్చరిస్తాడు గురప్పతాత. 'కార్ కార్' మంటుంది చిలుక. ఆ వచ్చిన పెద్దమనిషి చిత్తయిపోయి, కిమ్మనకుండా వల్లెవాటు ముడి విప్పుతాడు. ఏది యిచ్చినా గ్రహించకుండా ఓ పది నయాపైసల కానును ముక్కుతో స్వీకరించి తన విజాయితీ చాటుకుంటుంది చిలుక. ఆమీదట బుడిగ హాండీలో కాను జారవిడిచి తుండుగుడ్డమీది యాభై కవ ర్లలో ఏదో ఒకదానిని పట్టి బయటకు లాగి అంతటితో తన పని తీరిపోయినట్లుగ మరలా పంజరం చేరుకుంటుంది. ఆ కవరును గురప్పతాత అందుకుంటాడు. ఏభైయో పడిలో పడిన అతని కండ్లు గాలి భయానికి లోపలికి త్రోసిపెట్టిన దీగూడులోని దివ్వెల్లా వెలిగిపోతూంటే వానిని మరింత విస్తృతంచేసి ఆ జాతకాన్ని ఒక స్టాయిలో చదువుతాడు. అనుకున్న పని అవడం, సంవత్సరం తరువాత లేషయిన యోగం—లాంటి అద్భుత విషయాలతో కూడుకొని ఉంటాయి ఆ జాత కాలు. జాతకుడు బహు ప్రజ్ఞాశాలియై ఈ విష యాలను స్వవిషయాలతో బహు చక్కగా సమన్వ యించుకోవడం, సంతోషంగా వెళ్ళిపోవడం యాంత్రికంగా జరుగుతూంటుంది. భావి జీవి తాన్నిగురించి కలలు గనే మనస్తత్వం గల వ్యక్తులకు మనలో కొదువలేదు. కాబట్టే గురప్ప తాతలాంటి వ్యక్తులు గుట్టుగ కాలం వెళ్ళ కొస్తున్నారు.

అతనికి ఉత్తరంగా నాలుగ్గాళ్ళ మంటపం దగ్గర గడియారంలోని పెద్ద ముల్లు శరవేగ నాలుగుసార్లు తిరుగుతుంది. భూమి తనచుట్టూ తాను ఒక్కసారి తిరుగుతుంది. ఈ పరిభ్రమణలో రాత్రింబవళ్ళు ఏర్పడుతున్నా యంటారు శాస్త్రజ్ఞులు. లోకమంతా ఈ భ్రమణకు లోనవు తూంటే, గురప్పతాత కూడ లయ తప్పకుండా తాళం వేస్తున్నాడు. గోవిందరాజస్వామి తేరు మురుగులో పగలు, దేవస్థానం ఆఫీసరు ఎదురుగా ఉన్న 'మహంత్ మఠం' అరుగుమీద రాత్రి గడిచి పోతున్నాయి. ఆనాడు భూభ్రమణ పగానికి సమీ పించిందేమో, చీకటితెరలు లోకంమీద విరుచుక పడడానికి చిందులు త్రొక్కుతున్నాయి. గురప్ప తాత అంగడి మూట గట్టాడు. పంజరం చంకన బెట్టి తుండుగుడ్డ విదిలించి భుజాన వేసుకొని 'లేరా! రాముడూ పోదాం!" అన్నాడు. ఆమాట చెవిని పడడంతో 'పెద్దబాలశిక్ష' ముందర వేసు కొని కునికిపాట్లు పడుతూండిన రాముడు ఒక్క పరుగులో వచ్చి తాత చేయి పట్టుకొన్నాడు. తాత బయలుదేరాడు....

కన్నులు ఎఱ్ఱ కలువలు. చూపులువాడి తూపులు. మెలిదిరిగిన కండలు నునుపుదేరిన బండలు. కోర మీసాలు వాడి కోడి కత్తులు. ఉళ్లిపొరను దురపించే మల్లు జుబ్బా! వీటన్నిటిని కొట్టివచ్చినట్టు కనుపించే రక్తసిక్తమైనట్టున్న లుంగీ కట్టు .... ఏమిటీ వేషం? ఎవ్వరీ తాత రంగస్థలంపై ఎదురుగా నిలబడిన ప్రతినాయ కుడు? .... ఎవ్వరో మేతకై గూడు విడిచిన గువ్వల కోసం ఉరులొడ్డిన బోయ!

గురప్పతాత మానసాకాశంలో మబ్బెక్కింది. కొన్ని క్షణాలకు పూర్వమే అతనిలో కలిగిన సంతో షము, సంతృప్తి, ఆ మబ్బుల మాటున మాయ మయి పోయాయి. అతడు మెల్లగా పంచ కొన కొంగులో కట్టుకొన్న మూట ముడి విప్పాడు. ఫలితంగా ప్రతినాయకుని చేతిలో పై మబ్బు చినుకుల్లా, పలపలా పడి పది నయాపైసల

---

"నిన్నుచూస్తే జనం హడలి పోతున్నారు. నీ లైసెన్సు రెండేళ్లు రద్దు చేస్తున్నాను." పోలీసు అధికారి ఉరిమాడు.

అనంతయ్య బిక్కమొహం వేసి "బాబూ! బాబు! ఆ పని చెయ్యకండి. దాని మీదేనా జీవితం ఆధారపడిఉంది" అని మొర పెట్టుకున్నాడు.

"నిజమే! రోడ్డు ప్రక్కన నడిచేవారి జీవితాలు కూడా దానిమీదే ఆధారపడి ఉన్నాయి." పోలీసు అధికారి నిర్దయగా అనేశాడు.

కె. బలరామయ్య (విలూరు)

---

కాసులు రాలాయి. అవి కాసులు గావు. ఆ ముసలి వాని కన్నీటిరాసులు. ఒక్కసారి చేతిలోని డబ్బును, మరొక్కసారి తాత మొగాన్ని నిర్లక్ష్యంగా చూశాడు ప్రతి నాయకుడు.

"ఊ! మిగత!!" .... బాబు సొత్తును అడిగే దబాయింపు, ఇచ్చిపెట్టిన సొత్తును పుచ్చుకొనే దీమా కనబడుతూంది ఆ రెండు పలుకుల్లో. అవి ములుకుల్లా ముసలివాని గుండెను గ్రుచ్చాయి. ఆ బాధతో అసలే ముడుతలుబడ్డ అతని మొగం మరింత ముడుచుకుపోయింది. కొంగులో రూకల వైపు, కొట్టవచ్చినట్లు మాట్లాడే ప్రతి నాయ కుని వైపు దీనంగా చూశాడు తాత! కష్టార్జితాన్ని వదలుకోలేని చూపులు, ఆలస్యాన్ని సహించలేని తీక్షణ వీక్షణాలు ఒక్కక్షణం పోరాడుకొన్నాయి. ఆ పోరాటంలో 'ఛే!' అన్న సింహగర్జనంలాంటి 'బాంబు' పడింది. తాత అదిరిపడ్డాడు. మరలా ఓ అయిదు పది నయాపైసల కాసులు ప్రతి నాయకుడి చేతిలో రాలాయి.

కుడివైపు కోరమీసాన్ని ఎడమచేతి మున్వ్రేళ్ళ మెలివేస్తూంటే అరచేతిలోని కాసులను తూకం వేసినట్లు అలా ఎగురవేసి, ఒక్క ఓర గంటి చూపును విసరి పారవేసి, గొంతులో నుండి పుట్టిన నవ్వు వంత పాడగా విసవిస వెళ్ళి పోయాడు ప్రతి నాయకుడు! ఏమిటో వాడి వైఖరి? .... వానికంటే యముడే నయం. ప్రతి దినము ఇలా వేధించుక తినకుండా ఒక్కసారిగ ప్రాణాలు తీసుకవెళతాడు.

సగండబ్బు పోయేసరికి సగం బలం కూడా గుంజుకపోయిన ట్లయింది. 'ఏమిటీ అన్యాయం?... ఎందుకీ ఎడతెగని బంధం?'—అని ఆలోచిస్తూ ఒక్కక్షణం నిలబడ్డాడు గురప్పతాత. భూభ్రమణ ఆగలేదు. చీకటి విచ్చకత్తులు విసరడం మానలేదు. అవి అటూ, ఇటూ అన్న విచక్షణ లేకుండా ప్రస రించి తాత హృదయములోగూడ చోటు సంపా దించుకొన్నవి. అతని హృదయ సంక్షోభ ప్రగాఢ తర మయింది. 'నువ్వుండవయ్యా! కాసేపు నిద్ర పోవాలి. రేపు ప్రొద్దున్నే వింటాలే నీ గోల!' అని ఏడుకొండలమీది వెంకటరమణుడు తాత చంకన మూటలో చల్లగా నిదుర పోతున్నాడు. 'నోరులేని దానిని. నేనేం చేయుగలను?' అని చిలుక పలుక కుండా కూర్చుంది. రాముడు మాత్రం 'పోదాం! పద తాతా!!" అని చేయి బట్టి లాగాడు. తాత ఆలోచనాస్రవంతికి అడ్డు తగిలింది.

ఆ 'మానవుడు' వెళ్లినవైపునుండి తన దృష్టిని పంజరంవైపు మరల్చాడు. పంజరములో చిలుక నిశ్చలంగా కూర్చొని ఉంది. అది నోరు లేని గువ్వ! ......

దాదాపు పన్నెండు సంవత్సరాల క్రిందట 'తిరుమలకొండ' అడవిలో తానూ, తన భార్య, పదమూడేండ్ల కూతురు ఒక చిగర చెట్టు క్రింద కూర్చుని అన్నం తింటున్నారు. ఆ చిగర చెట్టుకల్లంత దూరంలో ఓ నేరేడుచెట్టు. ఆ చెట్టు నిండా కలకలా మాగి నీలాలు పొదే నేరేడుపండ్లు. ఆ పండ్లు తింటూవుంది చిలుక! ఎక్కడ పొంచి ఉండిందో ఓ డేగ 'రివ్వు' మని దూకి చిలుకను తన్నుకొనిపో ప్రయత్నించింది. ఆ దెబ్బకు ఆ చెట్టులోని రెండు, మూడు పండ్లు, ఓ నాలుగైదు ఆకులు ఆహుతి అయ్యాయి. చిలుక గడగడ లాడుతూ తన సమీపములో పడింది. దానిని తీసు కొని ఆప్యాయంగా నిమురుతూ ఒళ్లంతా కళ్ళు జేసి చూశాడు. ఎక్కడో కాస్త గోరు గీచుకు పోయింది. ఆ గాయాన్ని గచ్చాకు, పుచ్చాకు పూసి వయం చేశాడు. ఆ చిన్న సహాయాన్ని మరువలేని చిలుక జీవితాన్నే తనకు అంకితం చేసింది. కట్టుకున్న భార్య, కన్న కూతురు తన్ను ఏకాకిని చేసి వెళ్లిపోయారు. తెచ్చుకున్న అల్లుడు చిత్రహింస పెడుతున్నాడు. కాని నోరులేని పక్షి మాత్రం.....

తాత చిన్నప్పుడేదో సర్కను చూశాడు. అక్కడ పులి, మేక కలిసి తిరిగాయి. కలలో కనుపించితే ప్రాణాలు వదిలే ఏనుగు సింహంతో కలిసి ఆడ కొనింది. అవి కానుకు పడని జంతువు లయినా, కలిసి ఉండడానికి అలవాటు పడ్డాయేమో ఈ

పర్మనెంటువాళ్ల భయంతో అని ఆనాడు నిర్ణయించి తన్ను తాను సమాధాన పరచుకొన్నాడు. తన నిర్ణయం తనకే ఎబ్బెట్టుగా తోచిందినాడు!

'అన్ని తెలువులు గల మనుష్యులకంటె, నోరు లేని జంతువులు మేలేమో!" అన్నది గురప్ప తాత జీవితానుభవాల తోరణాల మధ్య కట్టిన ఓ సుందర మందార పుష్పంలాంటి చక్కటి ఆలోచన!

"పద తాతా! పోదాం!"—మళ్లీ రాముడు ముందుకు లాగాడు. విద్యుత్కాంతులు చీకటికి చిచ్చు పెట్టాయి. నాలుగు చక్రాల సైకిలు రిక్షామీది కృష్ణయ్య అంగడి కూడ ఇంటి ముఖం పట్టింది. తాత కాలుభారంగా పైకి లేచి అంత కంటె భారంగా ముందుకు పడింది. జీవితములో విసిగి వేసారిన ఓ ముసలి రూపం ముందుకు కదిలింది. ఆలోచనలు వెనక్కు తిరిగాయి—

చిత్తూరుజిల్లాలో ఓ మారుమూలపల్లె గురప్ప తాతజన్మస్థానం. దానిని 'పారకపల్లె' అంటారు. ఆపల్లె చుట్టూ పెట్టని కోటల్లా ఉన్న బోడి గుట్టల్లో పారకపుల్లలు విరివిగా లభిస్తాయి కాబట్టి ఆ పేరు సార్థక మయిందేమో! పేరు చెప్పితేనే బండల గుండెలు పగిలి, భూమి గడ గడలాడే వంశము తాతది. దిగుడు బావులు త్రవ్వడం చెరువుకట్టలు వేయడం, మిట్టా గట్టా చదును చేసి భూమిని సాగు యోగ్యంగా చేయడం—అతనికి వంశానుగతంగా వస్తున్న పనులు. ఆ పనులలో రైతుకు కుడిభుజంగా నిలబడి ఆ పల్లెలో హాయిగా బ్రతుకుతున్న ఓ చిన్న కుటుంబము తాతది.

పదిహేను సంవత్సరాలక్రిందట తిరుపతిలో పెద్ద అలజడి కలిగింది. పెద్ద పెద్ద ఇంజనీర్లు తల్లబద్దలు కొట్టుకున్నారు. 'ఇది కాని పనిలే!' అని సామాన్యజనం నోరు చప్పరించారు. ఇంతకూ ఏమిటా అలజడి అంటే—'తిరుమల కొండకు రోడ్డు వేస్తారట!" మానసికంగా భగవంతుని చేరుపోలేని మానవుడు దైవదర్శనార్థం శరీరాన్ని కష్టపెట్టి ఏడు కొండలు దాటడమెందుకని చేస్తున్న ప్రయత్నాన్ని తలకొక్క తీరుగా విమర్శించారు. అయినా, తాటాకుల చప్పుళ్లకు కుందేళ్లు బెదరలేదు. 'కూలీలు కావాలి' అన్న పిలుపు దేశం నలుమూలలా ప్రాకింది. గురప్ప చెవిని కూడ పడింది. గురప్ప ఆలోచించాడు. 'నిద్ర మొగంతో లేచి పొద్దు గూట్లో పడేదాక రెక్కలు విరుచుకుంటే, పొట్టుగింజలైతే ఓ కుంచడు, గట్టి గింజ అయితే ఓ అర్థ కుంచడు ఇస్తారు. దానికి గూడ రైతు ఇంటిముందర చేతులు కట్టుక నిలబడాలి. రోడ్డుపని చేస్తే దినానికి రూపాయి పావలా కూలి దొరుకుతుంది. హాయిగ బ్రతుకవచ్చు.' అని అనుకొన్నాడు. తన భార్యతో ప్రస్తావించాడు.

'ఎందుకే అంత దూరం పొయ్యేది. తూరుపుగా దిగబడిపోతే బతుకు తూర్పార పట్టినట్లయి పోయిందట! ఇక బతికిన్నాళ్లు బతకపోయే దేముంది? పుట్టి పెరిగిన ఊళ్లో రాలిపోయే దాంతో సమానంలేదు లేయే!" అని ఎదురు తిరిగింది.

గురప్ప భార్య మాటను పెడచెవిని పెట్టాడు. 'కూలి బతుక్కు ఏవూరయితే ఏముంది?' అని పెండ్లాన్ని పదేండ్ల కూతుర్ని వెంట దీసుకొని బాగ బ్రతకడానికి తిరుమల కొండకు బయలు దేరాడు.

గురప్ప భార్యతో సహా సరాసరి పనిలో చేరి పోయాడు. అడవి ఈత ఆకుతో ఓ చిన్న గుడిసె వేసుకొన్నాడు. బొమ్మరింటి కాపురాన్ని ఆరంభించాడు. క్రొత్తలో ఏదీ మరీ క్రొత్తగా కనుపిస్తుంది. ఆ క్రొత్తదనంలో కష్టాలు గూడ క్రొత్త క్రొత్త స్వరూపాలనే మలుచుకొంటాయి. ఆ స్వరూపాలను 'ఏదో' గా భావించి మానవుడు సౌహార్ద్రంగా స్వాగతం చెపుతాడు. అందువల్ల గురప్పకు బ్రతుకు కాలప్రవాహంలో ఒడిదుడుకులు లేకుండా సాఫీగా సాగిపోతున్నట్లనిపించింది.

---

ఇంటియజమాని అద్దె కివ్వదలచిన భాగాన్ని భీమసేనానికి చూపుతున్నాడు. "ఇంతకు మునుపు ఇక్కడ ఉండి వెళ్ళిన వాళ్లు ఈ గదులన్నీ నానా కచటాగా ఉంచేవారు. మీకు పిల్లలా?"

"అబ్బే లేరండీ!"

"కుక్కలు, పిల్లులు పెంచరు కదా!"

"కాని సుష్టుగా భోజనం చేసిన తరువాత చుట్టలు కాల్చటం నా అలవాటు."

జి. వి. రామచంద్రయ్య (ఒంగోలు)

---

ఒకనాడు మధ్యాహ్నం గంట 'గణగణ' మ్రోగింది. కూలీలంతా పారలు, గడ్డ పలుగులు, ఎక్కడి వక్కడ పారవేసి భోజనానికి బయలుదేరారు తాము సాధారణంగా కూర్చునే చెట్లక్రింద కడి తింటున్నారు. గురప్ప కూడా భార్యతో సహా వచ్చి చిగరచెట్టు క్రింద కూర్చున్నాడు అదో! అల్లంత దూరాన కూతురు రంగవల్లి నెత్తిమీద బుట్టలో సంకటి తెస్తూ ఉంది. ఈలోపల గురప్ప పెళ్లాంతో మాటల్లో బడ్డాడు.

"పిల్లదానికి ఒళ్ళు బలిసి పోతుందే! నాలుగు రూకలు మిగుల్చుకొని తొందర్లో ఎవుడి చేతిలో నైనా పెట్టేయలిసిందే!"

"నువ్వూ నేనూ అనుకుంటే .... దేవుడు కన్ను తెరవాలి గానీ!"

"నువ్వెప్పయినా చెప్పే! ...; ఆడదానికి అసలు దూరం ఆలోచించే బుద్ధే లేదు."

'ఆ! అబ్బా !!!' అన్న ఓ చిరుకేక తరగని కన్నుల ద్వారా బయటకు నెట్టి పూడుకుంది గురప్ప భార్య. ఆ చిరుకేక గురప్పను ముంచి వేయలేదు కాని కలవరం సృజించలేదు.

"లేకపోతే ఈ పెనుకొండంత బాధుండేదా చూడు. సంపాదకు రెండున్నర రూపాయలు చేతిలో పడ్డున్న రోజులివి. మన పల్లెలో వానలేక గాడిద కష్టం గూడ లేదు. పన్నెండు లోపున పనిలో నాగాలేని పని లేదు. పొద్దునకూయిస్తూ కొచ్చిం దంటే గంట కొట్టినట్టు తిండి తిని అట్ట పడి లేయటానికి సందు గూడ దొరుకుతుంది. పొద్దు గూకేదాక మాయక మరునాడు దాకా చేస్తాను ఏదో నాలుగు రూకలు కూడబెట్టు కుంటే నాకేమే! .... నా రంగమ్మ తల్లికి పూల రంగళ్ళి లేదా!"

గురప్ప ప్రస్తుత జీవిత ప్రకంప, భవిష్యత్ జీవిత ఆకాంక్ష వినిన అతని భార్య ఏదో బదులు చెప్పబోయేసరికి కూతురు రంగవల్లి సంకటి తట్ట తెచ్చింది. సాయంత్రం [illegible]. ఆకలిగొన్న ప్రేగులు కూతురు వచ్చినట్టే 'అన్నం రావురు' మంటూ తిరుగుతున్నాయి.

అంతలో 'అమ్మా!' అన్న ఆర్తనాదాన్ని 'దబ్' మన్న శబ్దం అనుసరించింది. ఆ శబ్దం గురప్పను కలవరపెట్టింది. నాలుగు వైపులా దృష్టి సారించాడు. తిరుమల కొండకు పోయే కాలిబాటమీద ఒక యువకుడు పడిపోయినాడు. చేతిలో అన్నం చేతిలో ఉండగానే గురప్ప పరుగు తీశాడు. చేతిలో సంకటి కూతురు చేతిలో పెట్టి గురప్ప ఆ యువకుణ్ణి పరీక్షగా ఎత్తుకున్నాడు. చిగురుచెట్టు క్రిందకి అతనిని తీసుకొని పోయినాడు. పైగుడ్డ క్రింద పరచి పడుకోబెట్టి ముంతలోని మంచినీళ్ల గ్రుక్కెడు త్రాగించి, కొన్ని మొగంమీద చిలకరించాడు. ఆ కొద్ది గ్రుక్కెడు గవ్వకుహరంతో నుండి ఓ నవ్వుని మొలుగా, చైతన్యరహితునికి పడికసిపిల్లవానికి కొత్త చురుకుగా కలిగాయి. గురప్ప సంతోషముతో పొంగిపోయినాడు.

అంతలో గంట కొట్టడం, గురప్ప దంపతులు అతనిని కూతురు చేతుల కప్పగించి పనిలోకి వెళ్ళడం జరిగింది. ఆ అప్పగింత శాశ్వతమై నిలిచిపోతుందని వారికి మాత్రం ఏం తెలుసు?—

ఆ నాగరికుడి పేరు రంగడు, స్వగ్రామం 'పారకపల్లె' ప్రక్కన 'పోతుక్షేత్రం'. అతని ప్రవర్తన మునుపు ఎప్పుడు, ఏవిధంగా అడుగు పెట్టాడో, అతనికే తెలియదు. చిన్నప్పటినుండి పోకిరిగానే పెరిగాడు వయస్సుతోపాటు పోకిరితనం వ్యసనాలు పెరుగుకొన్నాయి. అంతే! అయితే వేళకు నాలుగు మెతుకులు చిమ్మిపెడ్తూ ఉండిన లోకం 'తాటిచెట్టంత పెరిగావే! ... పోయి పని చేసుకో రాదా!' అని చెప్ప సాగింది. దాంతో, నిరాశ హోదవిక్ష పొంది కష్టాలను దేవునితో మొర పెట్టుకొందామని తిరుమల కొండకు బయలు దేరాడు.

రంగడు గురప్ప ఆదరణతో కోలుకున్నాడు. పెట్టినది తిని, చెప్పిన పని చేస్తూ మంచి పేరు సంపాదించుకున్నాడు. దాంతో రంగడు, రంగవల్లి

పేరు బలాలు కుదిరి ఒకనాడు ఏడుకొండలవాని సాన్నిధ్యములో రంగవల్లి మెడలో ఆ మూడు ముళ్ళు వేసి ఆ ఇంటికి అల్లుడై కూర్చున్నాడు.

ఇప్పుడు నాలుగు చేతులకు బదులు ఎనిమిది చేతులు సమిష్టిగా కష్టపడుతున్నాయి. రాతికి రాయి చేరినట్లు నాలుగు డబ్బులు కూడుతున్నాయి. సాధారణంగా మనిషి ఉత్తచేతులతో మూరవేయ లేదు. ఏదో కాస్త మిగులుబాటు అయిందంటే దాని అభివృద్ధి విధానాన్నిగురించి తీవ్రంగా ఆలోచిస్తాడు. అలాంటి ఆలోచన పట్టుకుంది గురప్పను. తన అందాల రామచిలుకకు అద్దాల పంజరమే కాకుండా, తన ముద్దుల కూతురుకి ఓ అద్దాల మేడ కొనవలెనని కలలు గంటూ కూర్చున్నాడు. అతని కలలకు దోహదమిస్తూ అప్పుడు ఒక సంఘటన జరిగింది.

ఆ ప్రాంతాలలోనే 'అక్కగారి' ఆలయమంటూ ఒక ఆలయాన్ని నిర్మించారు. ఆ ఆలయం రోడ్డుతోబాటు సుమారు నూరు అడుగులు క్రిందకి దిగవలసి వచ్చింది. ఆ ఆలయాన్నయితే అంతకంటె అందంగా కట్టినారు కానీ, ఆలయం లోని 'అక్కగారి' ని మాత్రం తరలించడం పెద్ద సమస్య అయి కూర్చుంది. విగ్రహాన్ని తాకి బయటకు తెస్తే నెత్తురు కక్కి చస్తారని వో వదంతి పుట్టింది. అందువల్ల 'బతికిఉంటే బలుసాకు తిని బతుకవచ్చు' అని అందరూ తప్పుకున్నారు కానీ గురప్ప మాత్రం గుండెధైర్యం చేసి ఒప్పుకున్నాడు. దేవుడిమీద భారం మోపి శిలా విగ్రహాన్ని పెకలించి తెచ్చి నూతనాలయంలో ప్రతిష్ఠాపించాడు. అందరూ ముక్కుమీద వేలేసుకున్నారు. అధికారులు 'సెబాస్' అని వీపు తట్టి రెండు వేల రూపాయలు పారితోషిక మిచ్చారు. అంతవరకు బాగానే జరిగింది కానీ, ఆ రాత్రి అతని భార్య కలవరించి, పలవరించి రెండు దోసిళ్ల రక్తం కక్కింది. కూలీల పూరిగుడిసెలన్నీ 'గుప్' మన్నాయి. ఆ సంఘటనకు తల కొక విధంగా రూపు రేఖలు దిద్ది, కడకు దేవుని సొత్తు 'ఉక్కళంగా' తీసుకొన్నాడు కాబట్టే ఈ దుష్ఫలిత మన్నారు. ఆ నిర్ణయాన్ని విని గురప్ప కంపించిపోయాడు. రాత్రికి రాత్రే బయలుదేరి దేవుని ముందు సాగిలబడి, తప్పు క్షమించమని లెంపలు వేసుకొని రెండు వేల రూపాయలు హుండీలో గ్రుమ్మరించి భార్యను బతికించమని బతిమలాడాడు. గురప్ప భార్య చెయిజారిపోయింది!....

భార్య పోవడంతో—గురప్ప బాగా దిబగులుపడిపోయాడు. గుడిసె దాటి అడుగు బయటపెట్టడు. కూతురు పూర్ణగర్భవతి. ఈలోపల అల్లుడు రంగడు కూడ పూర్తిగా మారిపోయాడు. ఒక్క దినం పనికి పోతే మరొక దినం పోడు. సాధారణంగా కూలి జీవుల ఆసరతో మోసులు వేలార్చే త్రాగుడు, జూదంలాంటి వ్యసనాలు రంగణ్ణి తమ పాలనలోనికి తెచ్చుకొన్నాయి. ఒక్కొక్క దినం ఇంటికే రాడు. పాపం! రంగవల్లి అతని కోసం ఏడుస్తూ, ఎదురుచూస్తూ రాత్రుళ్ళు కాస్తుంటే ఆ ముసలివాని కడుపు తరుక్కుపోయేది. అతడు ఏం చేస్తాడు? .... నాలుగు ఓదార్పు మాటలు కూడ కరువైపోయాయి. అతని బ్రతుకులో! 'సలసల' కాగే నూనెలో నుండి 'ధగధగ' మండే మంటల్లో పడినట్లయింది. అప్పుడే రంగవల్లి ఒక

# గూడుకోసం గువ్వలు

మగబిడ్డను ప్రసవించింది. ప్రసవమైతే సుఖంగానే జరిగింది కాని, ఎక్కడి నుండి వచ్చిందో మాయదారి జ్వరం, ముంచు కొచ్చింది. పత్యం బెట్టే దిక్కులేక, మందు మాకూ ఇప్పించే ఓర్పు లేక గురప్ప ఆ కూతుర్ని కూడ ధారపోసుకొన్నాడు. ఇక మిగిలిందల్లా పురిట్లో కూన, పంజరంలో చిలుక, ప్రాణాలు తోడుక తినడానికి అల్లుడు రంగడు.

ఇక్కింటి ప్రక్కింటి అమ్మలక్కల సహాయంతో చాలని కొదువకు ఆవుపాలు పోసి నానా అవస్థలు పడ్డాడు ఆ పసిగందుతో పదేండ్లుగ! వానిని ఒక మనిషిగా తయారుచేయవలెనని అతని ఉబలాట. ఆవిధంగా చేస్తానని కూతురుకి మాట గూడ యిచ్చాడు. శరీరంలో శక్తినశించినా, కష్టపడే ఓపిక లేకపోయినా, ఏనాడో వీదిబడిలో చదువు కొన్న చదువుతో, చిలుక సహాయంతో తన మాట నిలబెట్టుకోవడానికి బ్రతుకుబాటలో తన తంటాలు తాను పడుతున్నాడు. కానీ రంగడు చుట్టమై వచ్చి దెయ్యమై పట్టుకున్నాడు. 'నా బిడ్డను నాకిచ్చెయ్!'

"అమ్మా! నేనూ వీధిలోకి వెళ్ళి సూర్యగ్రహణ చూస్తానే" సుశీల తల్లి దగ్గర మారాం చేసింది.

"సరే వెళ్లు! మరీ దగ్గరగా వెళ్ళకేం!" సుభద్రమ్మ ఎందుకైనా మంచిదని కూతుర్ని హెచ్చరించింది.

బి. స్వర్ణకుమారి (ఏలూరు)

అంటూ ప్రతిదినం దెబ్బలాటకు వస్తాడు. వాడి చేతిలో బిడ్డ ఏమైపోతాడో అన్న బాధ! అందుకే కష్టార్జితాన్ని సగం ఆ తాగుబోతు వెధవ చేతుల్లో పోసి ఏ దినాని కా దినం పీడ వదిలించుకొంటున్నాడు అయితే మాత్రం .... ఎంతకాల మీ ముసుగులో గుద్దులాట! ఎలా సహించడం ఈ కృతఘ్నుని వేట?

నిర్మలంగా ఉన్న సంధ్యాకాశం ఎప్పుడు మబ్బెక్కిందో పలపల చినుకులు రాల నారంభించాయి. గురప్పతాత భావి ఆలోచనలు కరగి, భవిష్యత్తుపై మళ్లి, తడిసిపోతామన్న భయంతో 'గబగబ' నడచి మఠం తిన్నె చేరుకున్నాడు. దేవస్థానం ఆఫీసు ఎదురుగా కూర్చుని అన్నం అమ్ముకునే పూట కూళ్లమ్మ వానకు జడిసి ఆవేళ మఠం తిన్నె మీదనే మకాం వేసింది. మామూలు మేరకు గురప్పతాత, రాముడు చెరి కాస్త ఎంగిలిపడ్డారు. వాన జోరు హెచ్చింది. వానకంటె గాలి ఉధృతంగా వీస్తూంది. తిన్నెమీద జల్లు కొడుతుంటే గురప్పతాత రాముణ్ణి ప్రక్కలో పరుండబెట్టుకుని బాగా దుప్పటి కప్పాడు.

దేవస్థానం ఆఫీసులో బిళ్లజవాను ఎంచి తొమ్మిది గంటలు కొట్టాడు. పూటకూళ్లమ్మ గంప నెత్తిన బోర్లించుకుని వెళ్లిపోయింది. గురప్ప లాంటి జీవులు కొంతమంది ఆ తిన్నెమీద గుర్రు పెట్టి నిద్రపోతున్నారు. భావి బ్రతుకును గురించి భయంలేని రాముడు ఒళ్లు తెలియకుండా నిద్ర పోతున్నాడు. 'బావాజీ' చేతిలోని చిలుం గొట్టం మిణుగురుపురువులా వెలుగుతూంది. గోవిందరాజ స్వామి దేవాలయ గోపురము విద్యుత్కాంతిలో ధవళ శిఖరములా వెలుగుతూ ఆణిముత్యాల్లా పడే వాన చినుకులతో అభిషేకం చేసుకుంటోంది. ఎక్కడో వో కుక్క భీకరంగా మొరుగుతూంది. గురప్పతాత బుర్ర ఆలోచనలతో మరుగుతూంది. ఎప్పుడో లోకాన్ని మరచిపోయింది.

"పిల్లోడికి పదేళ్లకు పైబడింది. నువ్వు పండు ముసలి వయ్యావు. ఎప్పుడు తోడిమరాలిపోతుందో తెలియదు. ఆమీదట నా గతేం కావాలి? కిష్టయ్య దగ్గర 'పెద్దబాలశిక్ష' చదివిస్తే సరిపోతుందా ?"

ఓ కరుడుగట్టిన దీనాకృతి తన్ను తట్టిలేపి, గ్రుచ్చి గ్రుచ్చి అడుగుతూంది. ఏదో సమాధానం చెప్పుదా మనుకుంటే గొంతు పెగల్లేదు. నీటి బయట చేపలాగ హృదయం తహతహ పడుతూంది. అంతలో ఆ కరుడుగట్టిన దీనాకృతి కరిగి పోతున్నట్లనిపించింది. 'అమ్మా!' అని అరుస్తూ ఎగిరిపడి లేచాడు. వాన వెలిసిన తరువాత ప్రశాంత వాతావరణం, నిర్మలాకాశం మినహా మరేమీ లేదు. కల చెదరిపోయింది. తూరుపున పట మెగిరింది. అస్తవ్యస్తంగా పడి నిద్రపోతున్న రాముడు ఇంకా నిద్ర లేవలేదు. వారం రోజుల క్రిందట తొడిగిన చొక్కా, నిక్కరు తోళ్లయినాయి. తల 'బుట్టి బుట్టి' గా పెరిగి బాగా మాసింది. గద్ద గూడులా తయారయింది. నిగ్గులుదేరే నిమ్మపండు లాంటి రంగు నల్లని అల్ల నేరేడుపండు కాబోతూంది. మొగమంతా దోమలు కరచి చిడుములు చిడుములుగా కందిపోయి ఉంది. గురప్పతాత హృదయములో పుట్టిన కన్నీళ్లు మరలా హృదయం మీదనే పడి ఇంకిపోయింది.

ఆదినమంతా గురప్పకు మనసులో మనసులేదు. ఎంత ఆలోచించినా భావి జీవితమార్గం సుగమంగా కనుపించలేదు. అనికిరాని ఆలోచనలు, ముడిపడని కోరికలు ... మనస్సు వూసరవెల్లిలా ముందుకు వెనక్కు వూగిసలాడుతుందే గాని ముందుకు సాగ లేదు. కాలం అతని కోసం ఆగలేదు. ఆవేళ 'బేరం' కూడ అంత కంతకుగానే ఉంది.

గంట అయిదయింది. మిడిసిపడుతూండిన సూర్యుడు మబ్బుల మాటున మినకరిస్తున్నాడు. కాస్త చల్లబడింది. వర్షం వెలిసిన తరువాత ఈసుళ్ళ మాదిర జనం గుంపులు గుంపులుగ వీధిని బడ్డారు. రకరకాల బోడిగుండ్లు కొండదిగి, దిగువ తిరుపతిలో తిరిగి గోవిందరాజస్వామి తేరు దగ్గర తెప్పపాటు నిలిచి, మోర పైకెత్తి పరజూచి 'బలే పెద్దదే!' అని పొగడి చేతులు జోడించి ముందుకు పోతున్నారు. ఏదో పెట్టె మరచినట్లు, కారులు, లారీలు, రొదచేసుకుంటూ శరవేగంతో దూసుకపోతున్నాయి. 'కాసింత నిదానంగా పోతే ఈళ్లబ్బగంటుపోతుందేమో!' అని చీదరించుకొంటూ జనం చీలిపోతున్నారు తేరు దగ్గర పాలఅంగడి వద్ద గొల్లగోవిందు పాలు పిదుకుతూ ఆవును అదలించిన దెబ్బకు అందరూ హడలిపోయారు. బెదిరిపోతంత జటకటిన్నలిపై వటిస్తూంటే, ఇంతింత కళ్లతో, హారతి పళ్లెంలో

మందగమనంలో అందగత్తెలు గోవిందరాజస్వామిని సేవించడానికి వెళుతున్నారు. ఎదురుగా వస్తున్న పద్మావతీ కళాశాల బస్సును 'ఢీ' కొంటుందనిపించి, 'దైవవశాత్తు తప్పిపోయిందిలే' అనుకొంటూండే పోలీస్ వ్యాన్ చెవులు చిల్లులు పడేలా హారన్ మ్రోగిస్తూ స్టేషన్ వైపు పారిపోయింది. చావుదప్పి, కన్నులు లొట్టబోయినట్లయిన పద్మావతీ కళాశాల బస్సు గురప్పతాతను తొక్కుదామని పైకిబోయి 'పోనీలే !' అని దయతలచి వదలి ముందు కురికింది. రాముడు ఒత్తరపడి 'కెవ్వు' మని అరిచాడు. చిన్న గుంటలో వానకు నిలిచిన బురదనీరు ఎగిరి గురప్పతాతను పలకరించింది. అది జూచి బస్సులోని పడుచుదనం పరిహాస మాడింది. అందరి ముఖాల్లో దరహాసరేఖ గీచింది!

పారిపోయిన పోలీసు వ్యాన్ను ఒక గుంపు తరుముకొని పోయారు. పోలీస్ స్టేషను చుట్టూ గుమిగూడారు. అందరి ముఖాల్లో ఆతురత ద్యోతక మవుతూంటే కొందరి ముఖాల్లో బాధ వ్యక్తమవుతూంది. ఎగ్గొట్టుక వచ్చే ఏడుపును నోట్లో గుడ్డ దురికి, వూపిరి బిగబట్టి ఆపుకొంటూ ఆశ ముందుకు లాగుతూంటే నిరాశ వెనక్కు ఈడుస్తూంటే మధ్య ఉక్కిరిబిక్కిరవుతూ ఒక ఆలూ మగడు స్టేషన్ వైపు నడుస్తున్నారు.

"ఏంది కిష్టయ్యా ఇదంతా ?"

ప్రక్కన్నే నాలుగు చక్రాల సైకిలు రిక్షా మీద 'ఫాన్సీషాప్' యజమాని కృష్ణయ్య. అంగడి ముందు నిలబడి దినపత్రికలోని అక్షరక్షరాన్ని పట్టిచూచి వీధి రాజకీయాలు మాట్లాడడంలో మొనగాడు. రాముడికి 'పెద్దబాలశిక్ష' చెప్పిస్తూ ఉంటాడు అంగడివద్ద బేరం లేనప్పుడు. అందువల్ల కృష్ణయ్యమీద గురప్పతాతకు కాస్త గురి! బజారులో ఆ హఠాత్పరిణామానికి కారణం అడిగాడు అందుకే కాబోలు ! అదో ఆడ బోతాఉండారు. చూడు ఒక ఆలు మొగడూ ! వాళ్ల కొడుకు పన్నెండేండ్ల పిల్లకాయ, ఒక కసుగందు గొంతు పిసికి వాడి మెడలో నగలు దొంగిలించినాడంట. అందుకోసరం వాణ్ణేదో ఇస్కూలుకు పంపిస్తుండారు. ఈపొద్దే వాణ్ణి తీసుకెళుతుండారు కాబట్టి ఇరుగూ పొరుగూ చుట్టపక్కాలు చూడవచ్చినారు!"

కృష్ణయ్య మాటలు గురప్పకు వింతగా వినిపించాయి.

"ఏంది కిష్టయ్యా ? నీ మాటలు బలే సోద్దెంగా ఉండాయి. నగలు దొంగిలిస్తే జైల్లో తోస్తారు కానీ యాడైనా ఇస్కూలుకు పంపిస్తారా ?"

మైనరుడీరలేదు గదయ్యా ! అందుచేత జైలుకు పంపరు జడ్జి ఆక్టు ప్రకారం ఇస్కూలుకే పంపిస్తారు."

"అయితే ఆ యిస్కూల్లో పిల్లోణ్ణి ఏం చేస్తారు కిష్టయ్యా ?"

"ఏంచేస్తారు ? చదువు సంధ్య చెప్పిస్తారు. 'ఇకమీదటయినా బాగా బతకరా పిల్లోడా !'' అని పంపించేస్తారు."

"ఈ ఆర్డు ఎవురేస్తారు కిష్టయ్యా ?"

"చెప్తి గదయ్యా జడ్జని !"

"జడ్జి యాడుంటాడు కిష్టయ్యా !"

"కోర్టులో ఉంటాడు"

"కోర్టు యాడుంది కిష్టయ్యా ?"

"నీ చిలక నడగవయ్యా చెప్తుంది ! .... పోనీ నీ కెందుకయ్యా ఈ సోదె అంతా ?"

"తెలుసుకుంటే తప్పేముంది చెప్పు కిష్టయ్యా!"

"అదేనయ్యా ! ఆ సింగిరిగుంట కింద ఉండాయి చూడు ! .... బిళ్ల యిండ్లు !"

"ఆఁ ! ఆఁ !!"

"అదే కోర్టంటే !"

అప్పుడప్పుడే వ్యాపిస్తూన్న చీకటిలో ఓ కాంతి పుంజం 'తళుక్కున మెరసింది. గురప్పతాత అంగడి మూటగట్టాడు. రాముడు తోడుగా గూటికి బయలుదేరాడు. ఆ రాత్రి మఠం తిన్నెమీద పడుకున్నాడే గాని అతనికి నిద్ర పట్టలేదు. రాముడి భవిష్యత్తు, కృష్ణయ్య మాటలు "నీటిలో చేపల్లా మెదడులో ఈదుతున్నాయి. దొంగతనం .... జడ్జి ఆర్డు .... ఇస్కూలు !'' వరుసగా ఒకదాని వెంబడి ఒకటి చుట్టూ ప్రదక్షిణం చేస్తున్నాయి. అతని చూపులు ఒక్కసారి వూరిమీద విరుచుకు పడ్డాయి. అదే రైల్వేస్టేషన్. అక్కడ్నే ప్రయాణంతో అలసిపోయి ఒళ్లు తెలియకుండా పడి నిద్రపోయే యాత్రికులు ! .... అదుగో ! వారి మెడల్లో కన్నులు మిరుమిట్లు గొలుపుతూ 'ధగధగ' మెరిసే బంగారు నగలు ! ఆ ప్రక్కనే చూపు మేరలో పోలీస్ స్టేషన్ ! .... గురప్పతాత ఆశగా అటు వైపు చూశాడు. సంతృప్తిగా నిట్టూర్చి రాముణ్ణి లేపాడు. నడిరేయి. సినిమా వదిలిన తరువాత 'హేలులా' ఉంది వూరు. రాముడికి నిద్రమత్తు వదలలేదు. తూలుతూ నడుస్తూంటే, చేయి బట్టి లాక్కుని గురప్పతాత స్టేషన్‌వైపు చరచరా వెళ్లిపోయాడు. మంచిని వూహించిన మనస్సుకు ముందు వెనుక లాలోచించవలసిన ప్రమేయం లేకపోయింది ! ......

---

రెండు మంగలిషాపులు ఒకే వీధిలో ప్రక్కప్రక్కనేఉన్నాయి. ఒకరోజు ప్రొద్దున్నే మొదటి షాపుబయట ఒక బోర్డు ప్రత్యక్షమైంది. "క్షవరానికి రూపాయి ఎందుకు ఖర్చుచేస్తారు? మేము అర్థరూపాయికే చేస్తాం!" అని దానిమీద రాసివున్నది. మరో రెండుగంటలకు "అర్థరూపాయి క్షవరాలు మరమ్మతు చేస్తాం?" అని హామీఇస్తూ ప్రక్క షాపు బయట ఇంకొకబోర్డు వెలిసింది!

కె. జనార్దనరావు (కాచిగూడా)

---

మిట్టమధ్యాహ్నం. ఎండ తీసి కాస్తూంది. సింగిరి గుంటలో మురికినీటి కంపు తెంపులు తెంపులుగా వస్తూవుంది. కోర్టు ఆవరణలో సుంకిరేసి చెట్ల నీడలో జనం మందలు మందలుగా కూర్చుని ఉన్నారు. పొలాల దగ్గర కట్టిన దిష్టిబొమ్మల్లాగ ఒక్కొక్క గుంపు దగ్గర ఒక్కొక్క వకీలు శివతాండవ మాడుతున్నాడు. బోనులో చిట్టిలుకలా రాముడు కోర్టు బోనులో నిలబడి మినకరిస్తున్నాడు. ఎవరికంట బడకుండా గురప్పతాత ఒక మూల ఒదిగి కూర్చొని గుడ్లప్పగించి చూస్తున్నాడు. రాముణ్ణి శతవిధాల ప్రశ్నించిన 'పబ్లిక్ ప్రాసిక్యూటర్' ప్రత్యుత్తరం లేకపోయేసరికి విసిగిపోయాడు.

"ఏసిన పుల్లదాటలేదు కన్నోరు! ఎంత మంచోడు !!"—

గురప్పతాత మనస్సులోని గుట్టు అనుకోకుండా బైటపడింది. ఎవరైనా విన్నారేమో యని 'ఉలిక్కి' పడ్డాడు. భయం భయంగా చుట్టూ చూసి ఎవ్వరూ లేకపోయేసరికి గుండె దిటవు చేసుకున్నాడు.

'ఇక అడుగవలసిం దేమీ లేదంటూ' పబ్లిక్ ప్రాసిక్యూటర్ తనస్థానంలో కూర్చున్నాడు. అందరి దృష్టి న్యాయాధికారి వైపు మళ్లింది. కలంపుల నొసటి కానించి కన్నులు మూసుకొని ఒక్క క్షణం ఆలోచించాడు జడ్జి !

"ముద్దాయి పసిపిల్లవాడు. ఈ దొంగతనం ఉద్దేశపూర్వకంగా చేయబడినట్లు మాకు తోచడం లేదు. ముద్దాయి తరపున బాధ్యత వహించువారెవ్వరూ లేనందున ముద్దాయి శ్రేయస్సు దృష్ట్యా 'బోస్టల్ స్కూలుకు' పంపిస్తున్నాము."

తీర్పుచెప్పి జడ్జి వెళ్లిపోయాడు. పొంచి ఉండిన పోలీసులు 'రాముణ్ణి' లాక్కొచ్చి పోలీసు వ్యాన్‌లో పడేశారు. గురప్పతాత కోరిక నెరవేరింది ! .... కానీ, తన మనుమడు ! తన చేతుల మీదుగా పెరిగి, తన గుండెలమీద నిదురించిన బాలుడు! తన్ను శాశ్వతంగా వదిలిపోతున్నాడు. గురప్ప కనుగ్రుడ్లు నిండుకొన్నాయి. త్రుంచివేయలేని బాంధవ్యం కడసారిగ పలకరించమని ముందుకు లాగింది. గురప్ప పరుగెత్తుకుంటూ వచ్చి రాముని కంట పడ్డాడు. రాముడు 'తాతా !' అని అరుస్తూ పైకి లేచాడు. పోలీస్‌వ్యాన్ ఒక్క కుదుపులో కదలింది. ఆ కదలికకు తట్టుకోలేని రాముడు అడ్డంగా వలలా అల్లిన కమ్ములమీద బోర్ల పడ్డాడు.. తలకు మంచి దెబ్బ తగిలింది. తాత కడుపు రగిలింది. కళ్లల్లో నీళ్లు గిర్రున తిరిగాయి. చేతులుచాచి 'బాబూ!' అంటూ ముందు కురకబోయాడు. పరిస్థితులమాట అటుంచి, తన కాళ్లే తనమాట వినలేదు. రాయి తగిలి బోర్ల పడ్డాడు. తాత తేరుకొని మెల్లగా పైకి లేచేసరికి పోలీస్‌వ్యాన్ లేపిన దుమ్ము అప్పుడప్పుడే అణగిపోతూంది. చంకన పంజరం బారెడు కవతల పడిఉంది. కదలలేక కదిలి పంజరం చేతికి తీసుకొన్నాడు. పంజరం ఖాళీ !....

విసురకపోయి పడడంతో పంజరం తలుపు తెరచుకుంది. చిలుక హైస్కూలు ఆవరణలోని మ్రానిమల్లె చెట్టెక్కి కూనిరాగాలు తీస్తూంది. ఒకసారి పంజరంవైపు మరొకసారి చిలుక వైపు దీనంగా చూశాడు తాత. బోసిగా నవ్వుకొన్నాడు. ఏమనుకొనిందో ఏమో చిలుక ! రెపరెప రెక్కలల్లార్చుకొంటూ వచ్చి తాత ముంజేతిమీద వాలింది. ఒక్కక్షణం స్వేచ్ఛాజీవితానంతరం ! తాత ఉప్పొంగిపోయాడు. ఉప్పెనలా పొంగి వచ్చిన ఉత్సాహపు ముద్దులతో చిలుకను ముంచివేశాడు. గువ్వ గూటిలోని కెళ్లింది ! ....

ఉన్నది. దాని ప్రతిధ్వనులు ఆ సొరంగం లోపలలో క్రమంగా క్షీణించి పోయాయి.

ఈ శబ్దం ఎక్కడిది? భూగర్భంలోని శిలా రాశిలో ఏదో జరిగి ఉంటుంది. ఏదో వాయువు పేలి ఉండవచ్చు. లేదా భూమి పై పెచ్చులో ఒక బ్రహ్మాండ మయిన 'శిలకం' జారిపోయి ఉండవచ్చు.

నిశ్శబ్దంగా వింటూ కూర్చున్నాను. చప్పుడు తిరిగి వినపడుతుందా అనుకున్నాను. పావుగంట గడి చింది. నా చుట్టూ మౌనం ఆవరించినది. నా గుండె దడ కూడా నాకు వినిపించలేదు.

హఠాత్తుగా అనుకోకుండా గోడకు చెవి ఆన్చగా అవ్యక్తంగా, అతి దూరంనుంచి కొన్ని మాటలు వినిపించినట్లయినది. నాలో పూర్తిగా చైతన్యం కలిగినది.

"ఇది మిథ్య!" అనుకున్నాను.

కాని మిథ్యకాదు. జాగ్రత్తగా వినగా కంఠ స్వరాలు మందంగా వినిపించాయి. నా మెదడు బాగా అయోమయంగా ఉండటంవల్ల మాటలు తెలుసు కొనలేకపోయాను. కాని ఎవరో మాట్లాడుతున్నారు. అది ఖాయము.

ఒక క్షణం, అవి ప్రతిధ్వనిగా తిరిగి వచ్చిన నా మాటలేనేమో అని భయపడ్డాను. నాకే తెలియ కుండా అరిచానా? దృఢ నిశ్చయంతో పెదిమలు బిగ బట్టి, గోడకి మళ్ళీ నా చెవి నొక్కాను.

"అవును, అనుమానంలేదు. ఎవరో మాట్లాడు తున్నారు. ఎవరో మాట్లాడుతున్నారు!"

తడుముకుంటూ గోడవెంబడే కొన్ని అడుగులు ముందుకి జరిగాను. ఈమాటు స్పష్టంగా వినిపించి నది.

సన్నగా, విచిత్రంగా, అర్థంకాని మాటలు కొన్ని పట్టుకున్నాను. ప్రశమితమయిన కంఠస్వరంతో రహస్యంగా పలికినట్లు ఉన్నాయి. "ఫర్లొరెన్!" అనే పదం మాత్రం అతివిచారంగా ఎన్నోసార్లు ఉచ్చరించబడినది.

దీని అర్థం ఏమిటి? మాట్లాడేది ఎవరు? మా పెదనాన్న, లేక హన్స్, అని వేరే చెప్పనక్కర లేదు. కాని నేను వారిని వినగలిగితే నన్ను వారూ వినగలగాలి కదా!

"రక్షించండి!" అని నా బలంకొద్దీ అరిచాను. "రక్షించండి!"

ఆ చీకట్లో, సమాధానంకోసం చెవులు ఒగ్గి విన్నాను. ఒక కేక, స్వల్పం తెలిపే అరుపు—ఏవి ఏమైనా వినిపిస్తాయేమోనని. ఒక్క శబ్దంలేదు. కొన్ని నిముషాలు గడిచాయి. నా మెదడులో ఏవో ఊహలు 'కలవరం' చేస్తున్నాయి. బలహీన మయిపోయిన నా గొంతుక నా సహచరులు ఉన్న చోటివరకూ వెళ్ళలేదని గ్రహించాను.

"వారే అయుండాలి" అని నాలో నేనే అను కున్నాను. "భూగర్భంలో తొంభై మైళ్ళలోతున పాతుకుపోయిఉన్న మనుష్యులు ఎవరుంటారు?"

శ్రద్ధతో వినటం ప్రారంభించాను. గోడమీదుగా నా చెవి జరిపేసరిగ్గా ఏ చోటు కంఠస్వరాలు బిగ్గ రగా వినిపిస్తున్నాయో కనుక్కున్నాను. 'ఫర్లో రెన్' అనే మాట మళ్ళీనా చెవిని పడినది; ఆ తర్వాత నన్ను ఆ చైతన్యంలోనుంచి లేపిన ఉరుము.

"చూడు" అన్నాను. "గొంతుకలు రాయి

# భూగర్భంలోనికి సాహసయాత్ర

24–వ పేజీ తరువాయి

మధ్యన ఉంటే వినిపించవు. ఇది గ్రానైట్‌గోడ. పెద్ద పేలుడు కూడా దానిని భేదించలేదు! కాదు, శబ్దం గోడ వెంబడే వస్తున్నది! శబ్ద ప్రసారం జరిగే వింత ఏదో ఇక్కడున్నది!"

మళ్ళీ విన్నాను. ఈసారి—అవును!—ఈసారి నా పేరు ఎవరో స్పష్టంగా ఉచ్చరించటం వినిపించి నది. ప్రతిధ్వనిస్తున్న సొరంగంలోనే ఈ ఉచ్చారణ జరుగుతున్నది.

పలికినది మా పెదనాన్న! మా గైడ్‌తో మాట్లా డుతున్నాడు—'ఫొర్ లొరెన్' అనేది డానిష్ పదం!

నాకంతా అర్థమయిపోయినది. నా కంఠస్వరం వినిపించాలంటే ఈ గోడవెంబడే మాట్లాడాలి.

---

**"సోలమన్ మహారాజు చాలా మంచివాడు-ఎందుకంటే స్త్రీలయెడ, జంతువుల యెడ కరుణ చూపాడు. ఏడువందల మంది భార్యలు, మూడువందల ముళ్లపందులు అతనివద్దఉన్నట్లు తెలుస్తుంది." అని వ్రాశాడుట అమెరికాలో ఒక చిన్న అబ్బాయి.**

---

అప్పుడు శబ్దం, తీగలో విద్యుచ్ఛక్తి పారినట్లు ఈ మార్గంలో పారుతుంది.

కాలం వృధా చెయ్యటానికి వీలులేదు. నా అను చరులు మరికొంచెం ముందుకు నడిచినట్లయితే ఈ 'శబ్ద వైచిత్ర్యం' చెడిపోవచ్చు. గోడకు ఆను కుని, వీలైనంత స్పష్టంగా "పెదనాన్నా!" అన్నాను.

ఔత్సుక్యంతో ఎదురుచూశాను. శబ్దవేగం తక్కువ. గాలి చిక్కబడినకొద్దీ, శబ్దం తీవ్రమయినా వేగం అధికమవదు. కొన్ని సెకండ్లు—కొన్ని శతా బ్దాలు—గడిచాయి. చివరకు నా చెవి చేరిన మాటలు ఇవి :

"ఆక్సెల్! ఆక్సెల్! నువ్వేనా?"

. . . . . . . . . . . . . .

"అవును! అవును!" అని సమాధాన మిచ్చాను.

. . . . . . . . . . . .

"అయ్యో పిచ్చివాడా, ఎక్కడున్నావ్?"

. . . . . . . . . . . . . .

"కాలాంధకారంలో తప్పిపోయి ఉన్నాను!"

. . . . . . . . .

"మరి నీ దీపం?"

. . . . . . . .

"ఆరిపోయింది."

. . . . . . . . . . .

"నీటి ప్రవాహమో?"

"మాయమయిపోయింది"

. . . . . . . .

"ఆక్సెల్, అయ్యో ఆక్సెల్, నిబ్బరంగా ఉండు."

. . . . . . . . .

"ఒకక్షణం విశ్రాంతి తీసుకోనీ. పూర్తిగా అలిసి పోయాను. సమాధానానికి ఓపికలేదు. కాని నాతో మాట్లాడటం మానెయ్యక!"

"సరే విశ్రాంతి తీసుకో" అన్నాడు మా పెదనాన్న. "మాటాడకు—నేను చెప్పేది విను. నీకోసం అన్ని వైపులా వెతికి చూశాముకాని నువ్వెక్కడా కనిపించ లేదు. చిన్న పాపాయిలాగ ఏడ్చాననుకో, ఆక్సెల్! ఆఖరికి నువ్వింకా హాన్స్‌బాక్ పక్కనే ఉంటావు కదా అని అప్పుడప్పుడూ, నిర్ణీత కాలావధులకు, తుపాకి కాలుస్తూ వచ్చాము. ఇప్పుడు మన కంఠ స్వరాలు కలుస్తున్నాయంటే శబ్ద ప్రసారంలో ఏదో వైచిత్ర్యం ఉన్నదన్నమాట! మన చేతులు కలవ లేము—కాని నిరాశ చెందకు! ఆక్సెల్! మనం ఒకరి నొకరు వినగలిగామంటే అదే చాలు!"

ఆయన మాట్లాడుతూఉండగా నా బుద్ధి తిరిగి పనిచెయ్యటం ప్రారంభించినది. ఎంత అల్పమయినది అయినా ఒక నిజమయిన ఆశాభావం నాకు ప్రోత్సా హం ఇచ్చినది. అయితే ఒక ముఖ్యమయిన విషయం తెలుసుకొనవలసి ఉన్నది. గోడ ప్రక్కనే నా పెదిమలు ఉంచి అన్నాను :

"పెదనాన్నా?"

. . . . . . . . . . . . . . . .

"ఏమిటబ్బాయ్?"

. . . . . . . . . . . . . . . .

"ముందు మన మధ్య దూరం కనిపెట్టాలి."

. . . . . . . . . . . . . . . .

"చాలా తేలికయిన పని."

. . . . . . . . . . . . . . . .

"క్రోనోమీటర్ఉందా?"

. . . . . . . . . . . . . . . .

"ఉన్నది."

. . . . . . . . . . . . . . . .

"దాన్ని చూసినాపేరు పలుకు. ఏ సెకండున మాట్లాడావో గమనించు. నేనూ పునరుచ్చారణం చేస్తాను. నా జవాబు నిన్ను చేరిన సమయం ఖచ్చిగ్గా గమనించు."

. . . . . . . . . . . . . . . .

"బావుంది. నేను మాట్లాడిన తర్వాత నీ సవా ధానం నన్ను చేరుకొనటానికి ఎంతసేపవుతుందో అందులో సగం కాలంలో నా గొంతుక నీ వద్దకు వస్తుంది."

. . . . . . . . . . . . . . . .

"రైట్! పెదనాన్నా!"

. . . . . . . . . . . . . . . .

"సిద్ధంగా ఉన్నావా?"

. . . . . . . . . . . . . . . .

"ఉన్నాను"

. . . . . . . . . . . . . . . .

"సరే, జాగ్రత్తగా విను! నీ పేరు ఉచ్చరించ బోతున్నాను."

..................

నా చెవిగోడకు ఆన్చి, "ఆక్సెల్!" అనే మాట వినిపించగానే, వెనువెంటనే, "ఆక్సెల్!" అని జవాబు ఇచ్చాను. ఇచ్చి వేచి ఉన్నాను.

..................

"నలభై సెకండ్లు" అన్నాడు మా పెదనాన్న. "ఈ రెండు పదాలమధ్యా నలభై సెకండ్ల కాల వ్యవధిఉంటే మన మధ్యదూరం శబ్దం ప్రమాణం చెయ్యటానికి ఇరవై సెకండ్లు పడ్తుందన్నమాట. సెకండుకి వెయ్యిన్ని ఇరవై అడుగుల చొప్పున ఈ దూరం ఇరవైవేల నాలుగు వందల అడుగులు, లేక నాలుగున్నర మైళ్ళపైన ఎనిమిదవ వంతు."

..................

"నాలుగున్నర మైళ్ళు!" అని మూలిగాను.

..................

"ఆమాత్రం సాధించలేవా, ఆక్సెల్! రా, రా!"

..................

"కాని ఏ వైపు?"

..................

"క్రిందికివెళ్ళే ఏవైపైనాసరే. ఎందుకో చెప్తాను. ఒక విశాలమైన చోటు చేరుకున్నాం. ఇక్కడికి ఎన్నో దారులు వచ్చి కలుసుకుంటున్నాయి. నువ్విప్పు డున్నది కూడా ఇక్కడికి వచ్చితీరుతుంది. ఎందు కంటే ఈ చుట్టుపక్కల భూగర్భంలోఉండే చీలి కలూ, పగుళ్లూ అన్నీ కూడా మేమున్న ఈ గుహ వంటి ప్రదేశంనుంచి వలయంలోని వ్యాసార్థాల వలె 'ప్రసార' మవుతున్నట్లు కనిపిస్తుంది. వోపిక పట్టి దిగి వచ్చేశయ్! నడు; పాకు—అవసరమయితే దొర్లిరా—మా బాహువులు నీ కోసమే తెరుచు కుని ఉన్నాయి. బయల్దేరబ్బాయ్! బయల్దేరు!"

..................

ఈ మాటలు నాలో క్రొత్త చైతన్యం కలి గించాయి.

"గుడ్‌బై!" అని అరిచాను. "పెదనాన్నా ఇదిగో బయల్దేరాను. కొంతసేపు ఒకళ్ల నొకరు వినలేము! అందుకనే గుడ్‌బై అంటున్నాను!"

..................

"గుడ్‌బై, ఆక్సెల్! త్వరలోనే నిన్ను చూస్తాంలే!' నేను విన్న చివరి మాటలు ఇవే.

ఈ విచిత్రమయిన సంభాషణ, భూగర్భంలోతు లలో మూడు మైళ్ళ ఎడంగా జరిగినది. ఈ ఆశా పూరితములయిన మాటలతో మునిగినది. ఆనంద మయిన చీకటిలో నా సహచరుల కంఠస్వరాలు వినగలిగినచోటు ఇది ఒక్కటే అయిఉండవచ్చు. అక్కడికి తీసుకువెళ్ళినందుకు భగవంతుడికి నా నమస్సులు అర్పించుకున్నాను.

ఈ విచిత్ర శబ్దప్రసారానికి కారణం భౌతిక శాస్త్రంలో లభిస్తుంది. మార్గ నిర్మాణం, శిలా విశేషాల గుణాలు ఇవే. ఇటువంటి ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. శబ్దం ఒక బిందువునుంచి మరొక బిందువుకి ప్రసారమయినా వీటికి రెండిటిమధ్య మాత్రం వినిపించటం జరగదు. లండన్‌లో సెయింట్ పాల్‌స్ (Pauls) గోపురంలో గమనించవచ్చు. ప్రపంచంలో ఇటువంటి వింతలుమరికొన్నిఉన్నాయి.

ఇవన్నీ గుర్తుకుతెచ్చుకున్న నాకు ఒక ఊహ కలి గింది. మా పెదనాన్న గొంతుక నేను ఉన్నచోటికి వచ్చినదంటే మా ఇద్దరిమధ్యా అవరోధమేమీ ఉండేం దుకు వీలులేదు. శబ్ద తరంగాలు ప్రయాణం చేసిన మార్గం అనుసరించినట్లయితే ఆయన ఉన్న ప్రదేశం చేరుకుని తీరాలి—ఇంతలో నా శక్తి నశిం చకపోతే.

అందుకనే లేచినుంచున్నాను. కాని నడవటం కన్నా పాకడమే ఎక్కువ జరిగింది. దారి బాగా క్రిందుకుదిగి పోతున్నది. జారి వెళ్ళిపోయాను.

త్వరలో నా గమనవేగం భయంవేసేటంత అధికమయి, దొర్లుతున్నానా, పడుతున్నానా అనే సందేహం కలిగించినది. ఆగేశక్తి నాలో లేదు.

నా క్రింద నేల హఠాత్తుగా మాయమయినది. ఇంచుమించు నిలువుగాఉన్న గోడలమీదుగా చుట్టు కుంటూ క్రిందకు పడిపోతున్నట్లనిపించినది. నాతల ఒక రాతికి తగిలి స్పృహ తప్పినది.

## 29

తెలివి వచ్చేసరికి మసక చీకటిలో దళసరి కంబ ళిలమీద పడుకుని ఉన్నాను. నా ముఖంలో జీవకళ

---

ఒక వదరుబోతు రాజకీయ వాదిని గూర్చి గోపాలం, అతని స్నేహితుడు మాట్లాడుకుం టున్నారు.

"అతడికి టైఫాయిడ్ వచ్చినా ఫరవాలేదు; న్యూమోనియా వచ్చినా బెదురులేదు; క్షయ వచ్చినా భయం లేదు; కాని నోరుపడిపోతే మాత్రం తక్షణం చస్తాడు!" గోపాలం రాజకీవాది సంగతి తేల్చేశాడు.

వి. ఆర్. మోహన్ (గుడివాడ)

---

ఏదైనా కనిపిస్తుందేమో, అని మా పెదనాన్న వెతికి చూస్తున్నాడు. నా మొదటి నిట్టూర్పు విని నా చెయ్యి పట్టుకున్నాడు; నేను కళ్లు తెరవగానే సంతో షంతో అరిచాడు.

"బ్రతికే ఉన్నాడు! తెలివి వస్తోంది!" అని అరి చాడు.

"అవును" అన్నాను. హీనస్వరంతో.

"అబ్బాయ్" అన్నాడు మా పెదనాన్న నన్ను తన గుండెలకు అదుముకుంటూ, "మాతోబాటు సురక్షితంగా ఉన్నావు!"

ఆయన మాటల ధోరణి నన్ను బాగా కదల్చి వేసినది. కరుణతోనిండిన ఆయన పరిష్వంగం మరింత కదల్చివేసినది. నేను పడిన కష్టాల తీవ్రత తప్ప ప్రొఫెసర్‌గారివద్దనుంచి ఈ వాత్సల్య ప్రదర్శ నానికి వేరే హేతువు ఉండిఉండేది కాదు.

ఆ క్షణంలో హాన్స్ నా దగ్గరకు వచ్చాడు. నేను మా పెదనాన్న చెయ్యి పట్టుకుని ఉండటం చూశాడు. అతని కళ్లలో ఆనందం మెరిసినదని ప్రమాణంచేసి చెప్పగలను.

"గాడ్‌డాగ్" అన్నాడు.

నేను నా బలహీనమయిన స్వరంలోనే అతని అభినందనకి ప్రత్యభినందనము చేశాను. "పెదనాన్నా మన మిప్పు డెక్కడున్నాం?" అని అడిగాను.

"రేపు ఆక్సెల్, రేపటివరకూ ఇంకో విషయం ఆలోచించక. ఈవేళ మరీ బలహీనంగా ఉన్నావు. కదలకుండా పడుకో. నీ తలచుట్టూ కట్టిన కట్లు కదలకూడదు. ఈవేళ నిద్రపో! రేపంతా తెలిసి పోతుంది!"

"పోనీ కనీసం గంటెంతో, ఇవాళ తేదీ ఏమిటో చెప్పు!" అన్నాను.

"సాయంత్రం పదకొండు గంటలు. ఈవేళ ఆదివారం. ఆగస్టు తొమ్మిది—ఈనెల పదవతేదీ వరకూ ఇంకేమీ అడగటానికి వీల్లేదు."

నేను బలహీనంగా ఉన్నమాట నిజమే. నా కళ్ళు వాటంతట అవే మూత పడిపోయాయి. ఒక రాత్రి విశ్రాంతి అవసరం, అందుచేత విధేయముగా కునుకు తీశాను. మూడు దినాలు ఒంటరిగా ఉండి పోయానా అనే వూహతో నిద్ర కుపక్రమించాను.

ఉదయం లేవగానే నా చుట్టూ కలయజూశాను. నా పాన్పు—కంబళీలతో 'నిర్మించినది'—ఒక హృద యాహ్లాదకరమయిన 'గుహ'లో ఉన్నది. అద్భుత ముగా ఉండే 'స్టాలాగ్మైట్' (Stalagmite)లు దీనికి అలంకరణలు. చక్కని ఇసుకనేల. సగం చీకటిగా ఉన్నది. 'టార్చి' గాని, మరే దీపంగాని వెల గటములేదు. అయినా అనిర్వచనీయమయిన వెలుగు బయటనుంచి వస్తున్నది. గోడలోని సందుల ద్వారా పడకట్టినట్లు తోచినది. అంతేకాక ఏమిటో చెప్పను వీలుకాని ఒక శబ్దం విన్నాను. తీరంపైన అలలు తగులుతున్న శబ్దం. అప్పుడప్పుడు గాలి మ్రోత వినిపించేది.

నిజంగా మేలుకుని ఉన్నానా లేక ఇంకా కలలు కంటున్నానా అని నన్ను నేనే ప్రశ్నించుకున్నాను. బహుశః నేను క్రిందపడినప్పుడు నా మెదడు చిట్లి కేవలం మిథ్యాశబ్దాలు వింటున్నానేమో అనుకున్నాను. కాని నా కళ్ళు, చెవులు అంత మోసం చెయ్యలేవు.

"అది పగటి వెలుగు" అనుకున్నాను. రాతిలో ఒక చీలిక మధ్యనుంచి కనిపిస్తోంది! నేను వినేది అలల ఘోష! గాలి వీచిన శబ్దమే! భూతలంమీదకు తిరిగి వచ్చేశామా? నేను పారబడటంలేదుకదా! అయితే మా పెదనాన్న తన యాత్ర విరమించాడా? లేక పోతే విజయవంతంగా ముగించాడా?"

సమాధానాలులేని ఈ ప్రశ్నలు వేసుకుంటూ ఉండగా ప్రొఫెసర్‌గారు వచ్చారు.

"ఇప్పు డెలాఉంది! కులాసాగా ఉన్నావనుకుంటాను, ఆక్సెల్!" అన్నాడు ఉత్సాహంగా.

"ఆహా!" అని నా కంబళీలపక్కమీద లేచి కూర్చు న్నాను.

"ఉండకేమి, బాగా ప్రశాంతంగా నిద్రపోయావు. నేనూ, హాన్స్ వంతులు పట్టి మేలుకుని ఉన్నాము. అతి త్వరగా కోలుకుంటున్నావని తెలుస్తూనే ఉంది."

"బాగా నయంగా ఉంది. కావాలంటే నువ్వు ఫలహారం పెట్టినా తిని బుజావు చెయ్యటానికి సిద్ధంగా ఉన్నాను."

"దానికేముంది, కావలసినంత తినబ్బాయ్. జ్వరం లేదు. నీ దెబ్బలకు హాన్స్ ఒక అంజనం రాశాడు. అది ఐయిస్‌లాండర్లకు మాత్రం తెలుసు. గాయాలు

బాగా వయసుమయ్యాయి. మన వేటగాడు నిజంగా ఖలేవాడు!"

మా పెదనాన్న నాకు కొంచెం ఫలహారం పెట్టాడు. ఆయన హెచ్చరింపులు లెక్కచెయ్యకుండా దానిని త్వరగా పూర్తి చేశాను. ఆయనను కొన్ని ప్రశ్నలు అడిగాను; ఉత్సాహంగా సమాధానము ఇచ్చాడు.

నేను నిటారుగా దిగిన మార్గము మా పెదనాన్న, హాన్స్ కాచుకునిఉన్నచోటుకి తీసుకు వచ్చినది. నాతోబాటు ఒక రాతి వాన కురిసినది కాబట్టి, ఈ వానలో చిన్న రాళ్ళు కూడా నన్ను నలగకొట్టివేయటానికి చాలు కాబట్టి, జారిపడిన రాళ్ళ కుప్పతో బాటు 'వచ్చా' ననుకున్నారు. ఈ ప్రయాణ సాధనము భయంకరముయినదే అయినా నేరుగా మా పెదనాన్న చేతులలోకి వచ్చి పడ్డాను.

"నిజంగానే, నువ్వొక వెయ్యిసార్లు చావలేదంటే ఆశ్చర్యంగా ఉన్నది. ఇకమీద ఇలా తప్పిపోయావంటే మళ్ళీ ఒకరినొకరు చూడలేమేమో!" అన్నాడుఆయన.

'రెండవసారి తప్పి పోవటమా!' అయితే ప్రయాణం ముగియలేదా? ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేశాను.

"ఏమిటి ఆక్సెల్?"

"ఒక ప్రశ్న అడుగుతాను. నే నిప్పుడు సురక్షితంగా ఉన్నానంటావ్?"

"అంటాను."

"నా కాళ్ళు చేతులు సవ్యంగానే ఉన్నాయి?"

# భూగర్భంలోనికి సాహసయాత్ర

"తప్పకుండా."

"మరి నా తలకాయ?"

"కొన్ని చోట్ల బొప్పి కట్టిందంతేకాని నీ తల నీ భుజాలమీద ఉండవలసిన చోటే ఉన్నది.

"సరే—నాకు మతి తప్పిందని అనుమానంగా ఉంది."

"మతి తప్పటమా?"

"అవును. మనం తిరిగి భూతలంమీదకు రాలేదా?"

"లేనేలేదు!"

"అయితే నాకు పిచ్చ లేకపోలేదు; పగటి వెలుగు చూడగలుగుతున్నాను, గాలి వీయటం వింటున్నాను, అలల ఘోష కూడా వింటున్నాను!"

"ఓహో, అంతేనా?"

"నా క్కొంచెం అర్థమయ్యేట్టు చెప్తావా?".

"అన్నిటినీ అర్థమయ్యేట్లు విడమరచి చెప్పలేను! కొన్నిటికి అర్థమే లేదు. కాని భూ తత్వశాస్త్రం తెలుసుకొనవలసింది చాలా ఉందని నువ్వే చూడగలుగుతావు!"

"పదండి ముందుకి వెడదాం!" అని లేచాను.

"వద్దు ఆక్సెల్, వద్దు! బయట గాలి నీకు పడకపోవచ్చు."

"బయట గాలేమిటి?"

"అవును గాలి బాగా వీస్తోందేమో! అందులో నువ్వు తిరగటం నా కిష్టంలేదు."

"కాని నేను బాగా కులాసాగా ఉన్నానని చెప్పి తీరాలి."

"కొంచెం ఓపిక పట్టబ్బాయ్! ఇప్పుడు జ్వరం తిరగకొట్టిందంటే చాలా ఇబ్బంది పడ్తాం. ఆలస్యం పనికిరాదు. జలయానం కొంతకాలం పట్టవచ్చు.

"జలయానమా?"

"అవును. ఈరోజు పడుకో, రేపు తెరచాపఎత్తి బయల్దేరుదాం."

'తెరచాప ఎత్తటం' అనే దానికి ఇక్కడ అర్థం ఏమిటి? నది, సరస్సు, సముద్రం ఇవేవీ లేవుకదా? ఏదైనా భూగర్భాంతర నౌకాశ్రయంలో ఒక నావ లంగరువేసి ఉన్నదా ?

నా కుతూహలము ఇంతా అంతా కాదు. మా పెదనాన్న వారించేందుకు ప్రయత్నించాడు. కాని నా ఉబ్బు నాకు హాని కలిగించవచ్చునని గ్రహించి ఒప్పుకున్నాడు.

శీఘ్రంగా బట్టలు వేసికొన్నాను. ఎందుకయినా మంచిదని అదనంగా ఒక కంబలీ నా చుట్టూ కప్పుకున్నాను. తర్వాత గుహ ద్వారంవైపు నడిచాను.

(సశేషం)

---

పిల్లవాడి పరిస్థితి ఏవిధంగానూ బాగులేదని చెప్పాడు. ఈవిధంగా ఉంది, ఒకసారి వచ్చి పిల్లడిని చూడమని, ప్రొద్దున్న వచ్చిన డాక్టరుకు కబురు పంపితే, రాత్రిపూట తను ఎక్కడికీ కదలనని చెప్పి, ఏవో రెండు పొట్లాలలో మందు యిచ్చి పంపాడు.

రవియొక్క స్థితి నిముషనిముషానికీ దిగజార నారంభించింది. కాళ్ళు చల్లబడ్డాయి. ఒరుపుగా వూపిరి పీలుస్తున్నాడు. పిలిచినా పలికే స్థితిలో లేడు. దినకర్, శారదా పిల్లడికి చెరోవైపు కూర్చుని, పిల్లవాడి పరిస్థితి ఏమైనా మారుతుందేమోనని చూస్తున్నారు. శారద, తనకు [illegible] వచ్చి దేముళ్ళందరికీ మొక్కుకుంది. [illegible] పొంగి వస్తున్న ఏడుపుని గొంతుక [illegible] కూచుంది. ఒళ్ళు చల్లబడుతోం[illegible] నారంభించింది, పిల్లడికి. రవి గుడ్లు [illegible]. శారద మరి దుఃఖం ఆపుకోలేక, దిన[illegible] పట్టుకొని "ఏమండీ ! పదండి ! ఎక్కడికైనా బిడ్డను తీసుకుపోయి—బ్రతికించుకుందాం. పోనీ డాక్టరింటికే తీసుకుపోదాం. ఏమండీ ! మన బిడ్డ చూడండి, ఎంత అవస్థపడుతున్నాడో. అలా వూరుకుంటా రేమండి .... ఏమండీ .... నా మాట వినరూ ! అలా చూస్తారేమిటి ? అయ్యో! నాబిడ్డ నెవరూ బ్రతికించలేరా ? శ్యామ్‌బాబూ, మిశ్రబాబూ మీదగ్గ రేం మందుల్లేవా ? నా చిట్టి తండ్రంటే మీకు ఎంతో ఇష్టమే ! ఏదైనా మార్గం చూడండి" అంటూ ఏడుస్తూ దినకర్‌నీ, శ్యామ్‌బాబునీ, మిశ్రనీ బ్రతిమాలసాగింది. మళ్ళీ రవిదగ్గరి కెళ్ళి "నాన్నా ! నన్ను అన్యాయంచేసి [illegible] ? ఒక్క నిముషం నేను లేకపోతే వుండ

# ఏడుకొండలు

23వ పేజీ తరువాయి

లేవే ? ఇలా చూడు బాబూ .... నేను అమ్మని .... నేనూ .... బాబూ !" అని శారద ఒక్క కేక వేసి పిల్లడిమీద వ్రాలటం, రవి ప్రాణాలు వదిలెయ్యటం ఒక్కసారి జరిగింది. దినకర్ చంటి పిల్లాడిలా ఏడవసాగాడు. శ్యామ్‌బాబు, దినకర్ చెయ్యి పట్టుకుని దినకర్ తనవైపు చూస్తుంటే, శారదను ఓదార్చమని సౌజ్ఞచేశాడు. దినకర్ వెళ్ళి, పిల్లాడి దేహంమీద పడి "బాబూ ! బాబూ !" అని ఏడుస్తున్న శారదను వెనక్కి లాగి "ఏడవకు శారదా ! మనకీ వాడికీ ఋణం తీరిపోయింది. మనల్ని వాడు వదలిపెట్టి వెళ్ళిపోయాడు. వాడికోసం మరి దిగులుపడవద్దు" అని వోదార్చబోయాడు.

"అలా అనకండీ. నా బాబు నెలాగయినా రక్షించండీ. వాడు లేకపోతే నేను బ్రతుకలేను. నేను బ్రతుకలేనండీ, నా బాబుని వదిలి" అని మరీ ఏడవసాగింది శారద.

"అలా విచారిస్తే, ఎలాగమ్మ. హఠాత్తుగా జబ్బు వచ్చి పిల్లాడు పోయాడు. మీ రిద్దరూ ధైర్యంగా వుండాలి. ఏం చేస్తాం? మనం ఎంతవిచారించినా లాభంలేదు. ఆపిల్లవాడు పుట్టలేదనుకోండి." అని మిశ్ర వోదార్చాడు.

"మీరూ అలాగే అంటారా? అప్పుడే నా బాబుకు నూరేళ్ళూ నిండాయా? అబద్ధం. నన్ను మోసం చేస్తున్నారు. నిజం చెప్పండి! నాబాబు మరి బతకడా? నాకు మరి కన్పించడా. ఏమండీ! మీరు కూడా చెప్పరా? వాడంటే మీకు అంత ఇష్టమే? వాణ్ణి ఎలా పోనిస్తారండీ? అయ్యో నా బాబును ఏదేముడు రక్షించలేదు. నాకు చావు రాదేం ? నేనూ చచ్చిపోతాను వదలండి" అని లేచి తనని పట్టుకున్న దినకర్‌తో పెనగులాడింది. "వద్దు శారదా ! నా మొహం, శశిమొహం చూడు" అని దినకర్ ఏడుస్తూ చెప్పాడు.

శ్యామ్‌బాబు కండ్లవెంబడి వస్తున్న నీరు తుడుచుకుంటూ "చూడమ్మా శారదా ! కన్న బిడ్డకోసం మాతృహృదయం ఎలా విలపిస్తుందో నాకు తెలుసు. అయినా, ఇప్పు డెవరూ చేయగలిగిం దేమీ లేదు. నవమాసాలు మోసి నువ్వు కన్నావు. అంతేగాని, ఆయుస్సు పోయగలవా ? భగవదిచ్ఛ అలాగుంది ! ఏం చేస్తాం ! విచారించి లాభంలేదు. నీ రెండోబిడ్డ మొహం భర్తమొహం చూడు. నీగురించి వాళ్ళు బెంగపెట్టుకొనేట్టు చెయ్యకు. జరిగినదాన్ని మర్చిపో" అని అనేకవిధాల ఓదార్చాడు.

తెల్లవార్లూ పిల్లవాడి దేహందగ్గర జాగరం చేశారు, నలుగురూ. తెల్లవారుఝామునే ఆ శరీరాన్ని తీసుకుపోయే ఏర్పాటు మిశ్ర చేశాడు. ఆ మృతదేహాన్ని తీసుకుపోతూంటే, శారద గోలుగోలుమని ఏడ్చింది. దినకర్‌కూడా బిగ్గరగా ఏడ్చాడు. శ్యామ్‌బాబు వాళ్ళను ఓదార్చి, ఊరుకోబెట్టాడు. మిశ్ర తనయింటికి వెళ్ళి, నారాయణిచేత వీళ్ళందరికీ కాఫీ చేయించి పంపాడు. నారాయణి శారదను అనేకవిధాల వోదార్చి ఆరోజల్లా, శారదయింట్లోనే ఉండి వంట వండి, పనులు అవీ చేసి సాయంచేసింది. ఆ రోజల్లా శారదా,

దినకర్ ఇద్దరూ భోజనం ముట్టలేదు. శశికి నారాయణి అన్నం పెట్టింది.

శ్యామ్‌బాబుకూడా అవాళల్లా దినకర్ యింట్లోనే ఉన్నాడు. దినకర్ తలిదండ్రులకూ, శారద తలిదండ్రులకు వైర్లిచ్చారు. వయస్సులో దినకర్, శారదా ఇద్దరూ ఇంకా చిన్నవారే అవటం వల్ల వారికి ప్రపంచానుభవం లేదు. ఇదే వారి జీవితంలో మొదటి దెబ్బ. దినకర్ పైకి ఎక్కువ అనలేక, లోలోపల ఎంతో బాధపడసాగాడు. శారద, తనకు వచ్చిన దుఃఖాన్ని పైకి వెళ్ళబుచ్చేసేది. రవి మాటలూ, చేష్టలూ తల్చుకు తల్చుకు, చెప్పుకు చెప్పుకు ఏడ్చేది. ఆఖరురోజున వాడు అన్నంపెట్టమని దీనంగా అడగడం, తను పెట్టక పోవడం, తల్చుకుని మరీ బాధపడేది.

హృదయాన్ని రంపంతో కోస్తూంటే బహుశా ఈ బాధకన్నా సుఖంగానే ఉంటుందేమో! అనిపించేది, దినకర్, శారదలకు రవిని తల్చుకుంటూంటే. వాళ్ల బాధని బాగా అర్థం చేసుకున్న శ్యామ్‌బాబు, వాళ్లకు గాంధారీధృతరాష్ట్రులు పుత్రశోకం ఎలా అనుభవించారో, దశరథమహారాజు శ్రీరామచంద్రమూర్తిగురించి ఏవిధంగా బాధపడి ప్రాణాల్ని విడిచాడో, చెప్పి, వాళ్ల మనుస్సును మళ్లించాలని చూసేవాడు. విధి విధానం మార్చలేమని చెప్పేవాడు.

"ఈ జీవితంలో ఇటువంటి బాధలు తప్పవు దినకర్. అది జీవితంయొక్క సహజస్వభావం. మరణం అనేది పుట్టుకతోటే మనిషిని కానుకు కూర్చుంటుంది. మనందరంకూడా ఒకనాడు మరణించవలసినవాళ్లమే. వెనకాముందూ భేదం తప్ప అందరూ మట్టిలో కలవవలసిందే. అన్నీ బాగా ఉన్నన్నాళ్లు మనకు అది గుర్తుకురాదు. కాని, మనం మర్చిపోయినా అది మనల్ని మరువదు. దాని విధిని అది నిర్వర్తిస్తుంది. ఏవ రెవరికి ఎంత ఆయుష్షు భగవంతుడు లిఖించాడో అంతకు తప్ప, మరొక లిప్తకూడా మనం ఇక్కడ ఉండలేము. అయితే ఆప్తుల్ని పోగొట్టుకున్నప్పుడు మనకు చాలా బాధ కలుగుతుంది. కాని, దానివల్ల ప్రయోజనం లేదని తెలుసుకొని ఆ బాధను తగ్గించుకోవాలి" అని శ్యామ్‌బాబు చెప్పేవాడు.

ఆ దంపతు లిద్దరూ, ఆ పిల్లవా డింకా తమ తోటే ఉంటున్నాడనే భ్రాంతి కల్పించుకొని కొంత తృప్తిపడ్డారు. మూడవరోజున శారద తలిదండ్రులు వచ్చి, ఆమెను పుట్టింటికి తీసుకు వెళ్లారు. దినకర్‌కూడా వారంరోజులదాకా ఉండి, సెలవుపెట్టి వెళ్లడానికి నిశ్చయించాడు.

దినకర్‌పిల్లవాడు పోయిన విషయం ధర్మసూరిగారి కుటుంబానికి శ్యామ్‌బాబుద్వారా తెలిసి చాలా విచారించారు. లలిత కండ్లవెంబడి నీళ్లు కార్చేసింది. ఆరోజల్లా ఇటువంటి దుఃఖాలూ, బాధలూ, వీటిమీదే వారింట్లో కబుర్లు నడిచాయి. కష్టాలుపడినవాళ్లకే, కష్టాలలో ఉన్న వాళ్లయందు సానుభూతి కలుగుతుంది. లలిత లేతమనస్సు అవాళల్లా బాధపడ్తూనే ఉంది.

సాయంకాలం శంకర్ వచ్చాడు. అతణ్ణి చూడ గానే లలిత యీ విషయమే మర్చిపోయింది. స్వాతి వానకోసం ఎదురుచూసే ముత్యపుచిప్పలా, ఆమె శంకర్‌కోసం ఎదురుచూస్తోంది. శంకర్ కన్పించ గానే ఆమెహృదయంలో సంతోషం వెల్లివిరిసింది. ఆ సంతోషం వెనకాలే సిగ్గుకూడా వచ్చి ఆమె నాక్రమించుకొంది. శంకర్ వచ్చాడని లోపలికి వెళ్లి తల్లితో చెబ్దామని వుంది, కాని, బావని తనే ముందు పలకరించాలని గట్టికోర్కె మనస్సును బాధిస్తోంది. ఇటూ అటూ కదలలేక మధనపడింది, ఆ ఒక్క నిముషంలోనే.

తనచేతిలో ఉన్న పువ్వులపొట్లం తీసి, తనని చూడగానే సంతోష లజ్జాసమ్మిశ్రితమైన భావాల్ని వ్యక్తపరిచేముఖంతో తననేదో పలకరించాలని ప్రయత్నిస్తున్న లలితకు శంకర్ 'ఇదిగో లలితా, నీకోసం ఈ పూలు తెచ్చాను' అని పూల పొట్లాం అందిచ్చాడు.

అది వా రిద్దరికీ ఒక మధురక్షణం. సిగ్గు పడుతూనే, పొట్లంకోసం చెయ్యి జాపింది లలిత. ఆమెను చూస్తూ సమ్మోహితుడై, ఆమె చేతిలో ఆ పూలపొట్లం ఉంచుతూంటే, శంకర్‌కు ఆమె చెయ్యి తగిలింది. ఆస్పర్శ అతన్ని ఏవో లోకాల్లోకి తీసికెళ్లడంవల్ల, ఆ పొట్లాన్ని ఆమె వేళ్ల స్పర్శసుఖాన్ననుభవిస్తూ, అలాగే వదలకుండా పట్టుకున్నాడు. అతని హస్తస్పర్శకు ఆమె కూడా వివశఅయింది. కాని, అతనికన్నా ఆమే ముందు తన మామూలుస్థితికి వచ్చి పొట్లాం లాక్కుందామనీ, ఎవరైనా చూస్తే బాగుండదనీ అనుకొంది. ఆ క్షణంలోనే "అరె! ఎంతసేపయింది, శంకర్ నువ్వొచ్చి? అదేమిటే లలితా, అలా నిలబడి పోయావు? బావకి కాళ్లు కడుక్కోనేందుకు నీళ్లియ్యి" అంటూ లోపల్నించి జగదాంబ రావడం లలిత చేతిలో పూలపొట్లంతో లోపలికి పరిగెత్తడం వరసాగ్గా జరిగిపోయాయి.

> "నన్ను రక్షించు ప్రభూ! ప్రతిపక్షం కార్యకర్తల నిద్దరిని చంపించాను" మరణశయ్యమీద ఉన్న ఒక నాయకుడు మతాధికారికి తన నేరాలు చెప్పకుంటున్నాడు.
>
> "నీ నేరాలు మాత్రమే చెప్పు; నీ రాజకీయాలతో నాకునిమిత్తం లేదు." మతాధికారి అడ్డు తగిలి విసుక్కున్నాడు.
>
> కె. ఎ. సుబ్రహ్మణ్యం (మద్రాసు)

"ఇప్పుడే వచ్చా నత్తా" అన్నాడు శంకర్. అతను క్రిందటిసారు వచ్చినట్టు, ఏమీ సామాను తీసుకురాలేదు. అతని మొహంలోకూడా వెనుకటి ఉత్సాహానందాలు కన్పించటంలేదు. జగదాంబ, శంకర్ రాకలో ఏదో విశేషముందని గ్రహించింది.

"నీ ఉత్తరం అందినప్పటినుంచి నువ్వు వస్తావనే చూస్తున్నాం. ఎం. ఎస్‌సి లో చేరావ్ తెలిసింది. సెలవ లిచ్చారా?"

"ఇంకా సెలవు లివ్వలేదు. ఒకసారి మామతో మాట్లాడివెళ్దామని వచ్చాను." అన్నాడు శంకర్, ఏదో ఆలోచిస్తూ.

లలిత నీళ్ళూ, సబ్బూ, తువ్వాలూ తెచ్చి యిచ్చింది. శంకర్ మొహంకడుక్కోగానే కాఫీ యిచ్చింది. శంకర్ కాఫీ త్రాగాక, జగదాంబ "మీ మామ విశాఖపట్నం వచ్చినప్పుడు నువ్వు లేవుట" అంది.

"అవును. ఒక స్నేహితుడి పెళ్లికి, బెజవాడ వెళ్లాను. తిరిగి వచ్చిన కొద్దిరోజులకు తెలిసింది. మా నాన్నగారూ, అమ్మా అంత కఠినంగా ప్రవర్తిస్తారని నే ననుకోలేదు" అన్నాడు శంకర్, వాళ్ల నేమీ అనలేకా, వాళ్ల ప్రవర్తనను సమర్థించ లేకా, బాధపడుతూ.

"వాళ్ల దేం తప్పుంది నాయనా! మా తాహతుకుమించి మేము ఆశలు పెట్టుకోవడం మాదే తప్పు. డబ్బుకున్న విలువ, ప్రపంచంలో దేనికీ లేదు, ఆఖరికి ఒకే గర్భవాసాన్ని జనించారన్న అభిమానంకూడా డబ్బుముందు నిలవదు. ఆ విషయం తెలిసుండీకూడా మీ మామగారు అనవసరంగా మీ వూరు వచ్చి, వారి నడిగారు" అంది జగదాంబ.

శంకర్ ఈ మాటలకు చాలా బాధపడుతున్నాడు. తనలోనే తను. పరిస్థితి ఈవిధంగా వచ్చిందని కుమిలిపోతున్నాడు. అటు తన తలిదండ్రులు, ధర్మసూరిగారు వట్టి వ్యర్థుడని, వ్యసనాలపాలై ఆస్తంతా తగలబెట్టేసి, తిండికైనా గడవక అవస్థ పడుతున్నాడనీ, అంత దరిద్రుల సంబంధం చేసుకుంటే నలుగురిలో తమకు తలవంపులవుతుందనీ అంటున్నారు. వారి దృష్టిలో ధర్మసూరిగారి కుటుంబమంతా, తమ బంధువులని అయినా చెప్పకోడానికి వీల్లేని పరిస్థితిలో ఉన్నారనీ, అందుకని వారి పిల్లను చేసుకోకూడదని ఉంది. ఇక్కడ పరిస్థితి చూస్తే, అనురాగాలూ, బాంధవ్యాలూ నశించిపోకూడదనీ, మనుష్యులయొక్క హృదయానికే విలువనివ్వాలనీ అనిపిస్తుంది. తన మనస్సులో పడే బాధను, అత్తా, మామయ్యైనా అర్థంచేసుకొని సానుభూతి చూపిస్తారనే ఆశతో వచ్చాడు. కాని వీరి మనస్సులు, తన తలిదండ్రుల ప్రవర్తనవలన దెబ్బతిని పౌరుషాన్ని చూపిస్తున్నాయని గ్రహించాడు. అత్తే యిలా మాటాడుతోంది. ఇక మామ ఎలా మాట్లాడుతాడో! వీరి మాటలకు తనుకూడా కోపం తెచ్చుకుని వెళ్లిపోవడమా? లేక లలితకోసం ఇవన్నీ భరించడమా? శంకర్ మాట్లాడకుండా వూరుకోవడం చూసి, జగదాంబ, తన మాటలు అతనికి కష్టం కలిగించాయని గ్రహించింది.

"జరిగిందేదో మంచికే జరిగిం దనుకుంటున్నాం. ఒకవేళ మామీద అభిమానంకొద్దీ మీవాళ్లు లలితను నీకు చేసుకున్నా, తరువాతైనా, మాలాంటి బీదవాళ్ల పిల్ల అయినందుకు దానికీ, దానివల్ల నీకూ అనేక అవమానాలు జరిగేవి. మొదట్లోనే ఈ విషయం తేలిపోయింది. అందుకు నాకు తృప్తిగా ఉంది" అంది జగదాంబ.

ఈ మాటలకుకూడా శంకర్ ఏమీ జవాబు

చెప్పలేదు. జగదాంబ ఇలా మాట్లాడడం అతనికి ఆశ్చర్యంవేసింది. దీనినిబట్టి తన తలిదండ్రుల ప్రవర్తన వీరి నెంత బాధించిందో తెలుస్తోంది. బహుశా ఇప్పుడు వీళ్ళు లలితను తనకు ఇచ్చి పెళ్లిచెయ్యకూడదని తీర్మానించుకొన్నారేమో ? ఇక తను చెయ్యవలసినదేమిటో శంకర్‌కు బోధ పడలేదు. అంతవరకూ తలవంచి ఆలోచిస్తున్న శంకర్ తలయెత్తి, జగదాంబవైపు చూసేసరికి జగదాంబప్రక్కన లలిత కన్పించింది. జగదాంబ ఇంకా ఏదో చెప్తూనే ఉంది. కాని శంకర్ చెవులు పనిచెయ్యటం మానేశాయి. కేవలం కళ్ళు మాత్రమే పనిచేస్తున్నాయి. లలితమొహంలో ఏదో బాధ స్పష్టంగా కన్పిస్తోంది. తన నేదో అర్థిస్తున్నట్టు, జాలిగా చూస్తున్నాయి ఆమె కళ్ళు. ఆ కళ్ల లోతుల్లో ఏవో లోకాలు తను వూహించుకొనేవాడు. ఆ లోకాలన్నీ సౌందర్య మయం ఆనందమయంగా ఉంటాయి. అవి తన భావనాప్రపంచంలో చాలా ముఖ్యమైన పాత్రను నిర్వహించే కళ్ళు. అలాంటి లలితకళ్లలో ఏదో వేదన కన్పిస్తోంది. ఆ కళ్లకోసం, అవి మెరుస్తూ తనవైపు చూడటం కోసం అడ్డువచ్చేవా రందర్నీ అతను ద్వేషిస్తున్నాడు. తనహృదయంలోని బాధ ఏ శెవరికీ అక్కరలేదు. వీళ్లంతా శిలాహృదయులులా కన్పిస్తున్నారు తనకు. ఇన్నాళ్లూ తన తలిదండ్రుల్నే ద్వేషించాడు, తనను లలితను వివాహం చేసుకోవద్దంటున్నారని. కాని ఇప్పుడు అత్తయ్య కూడా వారివర్గంలోనే జేరింది. అత్తమాటల వల్ల లలితకూడా బాధ పడుతోందని తెలుస్తోంది.

జగదాంబ వంటచెయ్యడానికి లోపలికి వెళ్లింది. సంధ్య చీకటి బాగా ముదురుతోంది. శీనూ, రామూ, పద్మా ఆడుకోవడానికి వెళ్లినవా ళ్లింకా రాలేదు. లలిత తల్లికి వంటలో సాయంచేస్తోంది. శంకర్ ఒక్కడే వీధి అరుగుమీద కూర్చున్నాడు. లలిత లోపలినుంచి వచ్చి "బావా, నాలుగు చింత కాయలు కోసిపెట్టావా ? తమ్ముళ్లింకా రాలేదు. చింతకాయపచ్చడి ఏ కష్టంలేదా అని అమ్మ చెప్తానంటోంది" అంది. శంకర్ "సరే కోసిపెట్టా" నని లలిత తోవ చూపిస్తూంటే తోటలోకి బయల్దేరాడు.

చింతచెట్టుదగ్గర శంకర్ "లలితా, మామయ్య కూడా మన పెళ్లికి ఒప్పుకోడా ?" అని అడిగాడు.

"ఒప్పుకోరు బావా" అంది లలిత.

"లలితా నా మనసులో ఎప్పుడూ నువ్వే మెదులుతూంటావు." అన్నాడు శంకర్, చుట్టూ క్రమంగా అవరిస్తున్న చీకట్లు, లలితతో తన ఏకాంతానికి బలమిస్తుండగా.

"బావా! నేనుకూడా ఎప్పుడూ నిన్నే తల్చుకుంటూంటాను."

"నువ్వు లేకపోతే నేను బ్రతకలేనేమో ననిపిస్తోంది లలితా."

"నాకుకూడా, నువ్వు పెళ్లి చేసుకోకపోతే ఏందులోనైనా పడి చావాలనుంటుంది బావా!"

"మరి వీళ్లంతా ఒప్పుకోటంలేదుకదా, మన పెళ్లి ఎలాజరుగుతుంది లలితా?" అని అడిగాడు శంకర్.

"బావా! నీకోసం ఏం చెయ్యమన్నా చేస్తాను."

శంకర్ నిజానికి అంతవరకూ ఆలోచించలేదు గాని లలిత ఈమాట అనగానే అతని బుర్రలో ఒక ఆలోచన మెరిసింది.

# ఏడు కొండలు

"లలితా, మనం ఇద్దరము ఎక్కడికైనా వెళ్లిపోదాం" అన్నాడు.

'అలాగే బావా, నీతో ఎక్కడికి రమ్మన్నా నేను సిద్ధమే.'

లలిత ఈమాట అనటంతో శంకర్‌కు చాలా ఉత్సాహం వచ్చేసింది. తనూ లలితా ఎక్కడికైనా వెళ్లిపోతారు, పెళ్లిచేసుకొని హాయిగా ఉంటారు. "ఈ రాత్రే .... " అని, శంకర్ మళ్లీ "బహుశా ఈ రాత్రి సాధ్యంకాదేమో ?" అన్నాడు.

"మరి వీళ్ళు మనకోసం వెదికి మనల్ని పట్టుకోరుకదా !" అంది లలిత, తా మనుకొన్న పని చెయ్యడం అంత సులభం కాదేమోననే భయం

---

రంగాపురం క్లబ్ సభ్యుల్ని గూర్చి విలేఖరి వ్రాసిన వార్తను సవరిస్తూ సంపాదకుడు ఇలా అన్నాడు: "క్లబ్ సభ్యులలో ప్రతివారూ జూదం ఆడతారని ఇప్పుడు రాస్తే రాశావుగాని, ముందెప్పుడు రాయబోకు!"

"అందులో అబద్ధమేమీ లేదండీ!"

"నాకు తెలుసయ్యా! కాని మన జాగ్రత్తలో మనం ఉండాలి కదా! క్లబ్ సభ్యుల్లో ఒక్కరు తప్ప మిగతా వారంతా జూద మాడతారని రాయి, ఏ చిక్కూ ఉండదు. ఎవరికి వారు తమను కాదనుకుని సంతోషిస్తారు!

ఎస్. శ్రీనివాస్ (మద్రాసు)

---

వ్యక్తపరుస్తూ. శంకర్‌కుకూడా ఆ ఆలోచనే తట్టింది. పైగా చేతుల్లో పుష్కలంగా డబ్బుండాలి. తా మిద్దరూ కలిసివెళ్లినట్టు వాళ్లకు అనుమానం తట్టేలోపల, తాము వాళ్లకు అందనంతదూరంలో ఉండాలి. తగిన ఏర్పాట్లు చెయ్యడానికి కొంత టైము కావాలి.

"బావా ? నాలుగు చింతకాయలు తొందరగా కోసియ్యి. మళ్లీ ఆలస్యమైతే అమ్మ కేకలేస్తుంది" అంది లలిత.

శంకర్ గబగబా నాలుగు చింతకాయలు కోసి, లలితకిచ్చి "లలితా, నేను తగిన ఏర్పాట్లన్నీ చేసి పదిరోజులలో మళ్లీ రావడమో, నీకు కబురు చెయ్యడమో చేస్తాను. నువ్వు సిద్ధంగా ఉండు" అన్నాడు. లలిత "సరే" నని, తొందరగా అడుగులేసుకుంటూ ఇంట్లోకొచ్చేసింది. అప్పటికే జగదాంబ "ఇంతాలస్యమైందేమిటే ?" అని విసుక్కొంది. లలిత ఆమాట వినిపించుకోలేదు.

ధర్మసూరిగారు ఆ సమయంలో ఇంటికి వస్తూ, శంకర్‌ని "ఎప్పుడొచ్చావు ?" అని పలకరించారు. తను సాయంకాలం వచ్చానని శంకర్ చెప్పాక, శంకర్ చదువుగురించి ప్రశ్నలు వేశారు. ఆయనా శంకర్, కొద్దిసేపు కాలేజీవిషయాలు మాట్లాడేరు. ఇంతలో పిల్లలంతా రావడం, జగదాంబ వంటయింది భోజనాలకు లెమ్మని చెప్పడం జరిగింది.

భోజనం చేస్తూండగా ధర్మసూరిగారు, శంకర్‌తో తను విశాఖపట్నం వెళ్లడం, సత్యవతీ కేశవరావుల్ని, పెళ్లివిషయం అడగడం, వాళ్ళు తనని తృణీకరించడం చెప్పారు. శంకర్, తన తలిదండ్రుల ప్రవర్తనకు విచారించాడు. ధర్మసూరిగారది లోకసహజం అన్నారు. "వాళ్లదేమీ తప్పు లేదు, శంకర్. తప్పంతా నాదేను. మీ అత్త అంటూనే ఉంది, వెళ్లి అడిగితే వాళ్ళు ఒప్పుకోరని. అలాగే జరిగింది. సరియం, వాళ్ల అభిప్రాయం తొందరగానే తెలిసింది."

"అయితే మా అమ్మా, నాన్నా అలా అన్నారని మీరుకూడా అలాగే అంటారా ?" అన్నాడు శంకర్.

అలా సూటిగా శంకర్ అడిగేసరికి ధర్మసూరిగారు సందిగ్ధావస్థలో పడ్డారు. శంకర్‌కు లలితను చేసుకోవాలని ఉందని స్పష్టంగా తెలుస్తూనే ఉంది. అయినా ప్రస్తుతపరిస్థితులలో అది జరగడం అసంభవం. తనకీ పౌరుషం ఉంది. ఆయన ఆనాడే మనస్సులో నిశ్చయించుకొన్నారు, ఏమైనా లలితకు పరాయి సంబంధమే చెయ్యాలని. ఒకవేళ మేనల్లుడు సుముఖంగా ఉన్నాడు కదా, అతని తలిదండ్రుల ప్రమేయం లేకుండా పెళ్లి జరిపిద్దామంటే, తన బీదస్థితిని చూసి లోకం తననే 'మేనల్లుణ్ణి వలలో వేసుకొని కూతుర్ని అంటకట్టాడని' నిందిస్తుంది. ఈ విషయాలన్నీ శంకర్‌తో అంటే, అతని మనస్సు బాధపడుతుంది. తన అభిప్రాయాన్ని శంకర్‌కు ఎలా తెలియజెయ్యాలా ? అని ఆలోచించారు.

"మా పరిస్థితి నీకు తెలుసుకదా! మా అంతస్థుకు తగిన సంబంధం చూసి లలితకు పెళ్లి చేస్తాను" అన్నారు.

శంకర్ అంతవరకూ అనుకుంటున్నవిధంగానే ఆయన జవాబిచ్చారు. అతనికి ఆ మాటలు వింటుంటే చాలా బాధ కలిగింది. వాళ్ల పరిస్థితిని కాదనలేడు. లలితను వదులుకోలేడు. ఇంక తను ఎన్ని విధాలుగా అడిగినా లాభంలేదని గ్రహించాడు. మౌనంగా ఊరుకొన్నాడు. ధర్మసూరిగారుకూడా, ఆ విషయాన్ని తప్పించి, ఇతర విషయాలు మాట్లాడ నారంభించారు.

లలితకూడా తండ్రిమాటలు విని, బాధగా ఆలోచిస్తూ భోజనంకూడా సరిగా చెయ్యలేదు. పెద్దవాళ్ల మనస్తత్వం ఆమెకు ఎంత ఆలోచించినా బోధపడటంలేదు. అన్ని విషయాల లోనూ తమయందు ఎంతో ప్రేమ చూపిస్తారు. కాస్త దెబ్బతగిలితే 'పిల్లలు ఎంత బాధపడిపోతారో!" అని తల్లడిల్లిపోతారు. అటువంటిది, తమ హృదయాలకు ఇంత గాయం తగులుతూంటే,

యొక్క పెళ్లికి అతని అభిప్రాయం గాని, ఆలోచనగాని అనవసరమని అతని తలిదండ్రులు నిర్ణయించారు. అలాగే తనవిషయంలోకూడా, తన బాధను తన తలిదండ్రులు ఏమాత్రం అర్థం చేసుకోటంలేదు. తన ఇష్టం గురించి కనుక్కునే అవసరంకూడా వారు గుర్తించలేదు. వాళ్ల పట్టుదలలూ, పౌరుషాలే ప్రధానంగా కన్పిస్తున్నాయి వారికి.

మరికొంత ఆలోచించాక, లలితకు తన తలిదండ్రులు చేస్తున్నదికూడా కొంతవరకూ సబబే ననిపించింది. వాళ్ల పరిస్థితి అటువంటిది. వాళ్లు ఏం చేసినా, లోకం నిందిస్తుంది. ఒకవేళ శంకర్ యొక్క అంగీకారాన్ని ఆసరాగా తీసుకొని వివాహం జరిపినా, తను అత్తవారింటికి ఎలా వెళ్తుంది? వాళ్లకూ, శంకర్‌కూ మధ్య ఎన్ని పేచీలు తనవల్ల వస్తాయో ? బహుశా ఇవన్నీ ఆలోచించే అమ్మా నాన్నా ఈ నిర్ణయానికి వచ్చేరేమో ! అసలు బావే వాళ్ల తలిదండ్రులను ఒప్పించటానికి ప్రయత్నిస్తే బాగుండును, అనుకుంది లలిత.

భోజనాలయ్యాక శ్యామ్‌బాబు శంకర్‌ని తన యింట్లోకి రమ్మని పిల్చారు. శంకర్ ఆయన వద్దకు వెళ్లాడు. ధర్మసూరిగారు భార్యవద్దకు వచ్చారు. శంకర్ యొక్క ఉద్దేశాన్ని తను గ్రహించాననీ, కాని అది కేవలం చిన్నతనంచేతా, అమాయకత్వంవల్ల పుట్టిన ఊహ అని అన్నారు. జగదాంబ "పోనీ శంకర్‌నే వాళ్ల తలితండ్రుల్ని వప్పించటానికి ప్రయత్నించమనండి" అంది.

"ఇప్పుడు వాడి తలిదండ్రులు వచ్చి అడిగినా మరి నా కూతుర్నివ్వను" అన్నారు ధర్మసూరిగారు.

"అదేమిటండీ అలా అంటారు ? వాళ్లిద్దరి మనస్సులూ గాఢంగా కలిసిపోయాయి. మనం ఎలాగో వాళ్లను ......"

"నువ్వు తెలివితక్కువగా మాట్లాడకు. ఇంక ఎవ రెన్నిచెప్పినా సరే నేను లలితనుమాత్రం శంకర్ కివ్వదల్చుకోలేదు" అని గట్టిగా చెప్పేసి ధర్మసూరిగారు వీధిలోకి వెళ్లారు.

శ్యామ్‌బాబు శంకర్‌ద్వారా జరిగినదంతా తెలుసుకున్నారు. ధర్మసూరిగారిది చాలా పట్టుదల స్వభావమని శ్యామ్‌బాబుకి తెలుసు. ఆయన నిర్ణయంవల్ల ఆయనకే నష్టంకలుగుతుందని తెలిసినా, ఆయన తననిర్ణయం మార్చుకోరు.

శంకర్‌కు ఆ సమయంలో శ్యామ్‌బాబు ఎంతో ఆప్తుడైన మిత్రుడిలా కన్పించాడు. "శ్యామ్ బాబూ, నా కేం చెయ్యాలో తోచటంలేదు. అటు మా అమ్మ, ఈ సంబంధం చేసుకుంటే నుయ్యో, గొయ్యో చూసుకుంటానంటోంది. ఇటు మామ, వాళ్లు తన నవమానంచేశారుకాబట్టి, లలిత కింకొక సంబంధం చేస్తానంటున్నాడు. నాకు మాత్రం లలితను చేసుకోకపోతే జీవించాలనే లేదు" అని శంకర్ శ్యామ్‌బాబుతో అన్నాడు.

"శంకర్ నువ్వేమీ తొందరపడకు. కొద్ది నెలలు ఊరుకో. పరిస్థితులు వాటంతట అవే దారికి వస్తాయి."

"అలాకాదు శ్యామ్‌బాబూ ! మరి ఈ విషయంలో పెద్దల అనుజ్ఞకోసం ఎదురుచూసి లాభంలేదు. నేనూ, లలితా ఒక నిర్ణయానికి వచ్చాం" అని సాయంకాలం తనూ, లలితా జరిపిన సంభాషణంతా, శ్యామ్‌బాబుకు శంకర్ చెప్పాడు. ఆవిధంగా తామిద్దరూ ఎవరికీ తెలియకుండా ఎక్కడికైనా వెళ్లిపోతామనీ, అందుకు తా నన్ని ఏర్పాట్లూ చేస్తాననీ, లలితను ఆ ఊరినుంచి దాటించే విషయంలో తనకు శ్యామ్‌బాబు సాయంచెయ్యాలనీ కోరాడు.

శంకర్‌మాట లన్నీ విని శ్యామ్‌బాబు, అటువంటి పనేమీ ప్రస్తుతంలో చెయ్యవద్దనీ, ఒక సంవత్సరంవరకూ ఓపికపట్టమనీ, ఈలోగా లలితచేత తను మెట్రిక్‌కు కట్టించి పాసు చేయిస్తాననీ, అప్పు డిద్దరూ, ఒకరిమీద ఆధారపడకుండా సంపాదించుకోవచ్చనీ, ఈలోపల పెద్దవాళ్ల మనస్సులు మార్చడానికి ప్రయత్నం చెయ్యాలనీ చెప్పారు. శంకర్‌కు యీ సలహా ఎక్కువగా నచ్చకపోయినా, శ్యామ్‌బాబు తనమేలు కోరేవాడని తోచటంవల్ల, లలితతో తన వివాహం తప్పక జరుగుతుందని తెలుస్తే, ఒక సంవత్సరం ఓపిక పట్టడం తనకు కష్టం కాదన్నాడు. శ్యామ్‌బాబు, తన మాటప్రకారం శంకర్ వింటే, లలితకూ శంకర్‌కు వివాహమయ్యే పూచీ తనది అనీ, కాని శంకర్ తను చెప్పినట్లు చెయ్యడానికి సిద్ధంగా ఉండాలన్నాడు. శంకర్ అందుకు ఒప్పుకున్నాడు.

శ్యామ్‌బాబు "శంకర్ మీ యిద్దరి మనస్సులు నాకు తెలుసు. మీ వివాహం జరిపించే పూచీ నాది. కాని నా మాట, అది పైకి ఎంత అవివేకంగా కన్పిస్తున్నా, వింటానని నాకు హామీ ఇవ్వగలవా ?"

"ఓ ! తప్పకుండా వింటాను శ్యామ్‌బాబూ !"

"అయితే ఇక నువ్వు నిశ్చింతగా తిరిగి వెళ్లు. ఒక సంవత్సరంమట్టుకు వ్యవధి కావాలి" అని, ఆ రాత్రే శంకర్‌ను విశాఖపట్నం పంపించేశాడు శ్యామ్‌బాబు.

లలితవిషయం తన స్వంతవిషయంగా భావించుకోసాగాడు శ్యామ్‌బాబు, లలితను మొట్టమొదట చూసిన దగ్గర్నుంచీ. అది ఏ పూర్వ జన్మల అనుబంధమో ! లలితకు కూడా, తన తలితండ్రుల దగ్గరకన్నా శ్యామ్‌బాబుదగ్గర చను వెక్కువైంది. ఆమెకు ఓపికగా ఎన్నో కథలూ, కబుర్లూ చెప్పేవాడు. ఆమె తనదగ్గరున్న కాస్సేపూ అపూర్వానందాన్ని అనుభవించేవాడు. కాని అంత చనువులో కూడా, తన గతాన్నిగురించి ఏనాడు శ్యామ్‌బాబు చెప్పలేదు. వ్యక్తిగతవిషయమైన ఏ ప్రశ్నవచ్చినా శ్యామ్‌బాబు పరధ్యానంలో పడేవాడు. మూకీభావం వహించేవాడు. ఏవో చెప్పలేని కష్టాలనుభవించాడు కాబోలని, లలితే ప్రసంగాన్ని మార్చేసేది. తనకు వచ్చిన డబ్బంతా లలిత చేతనే ఖర్చుపెట్టించేవాడు, శ్యామ్‌బాబు. లలిత కోసం మెట్రిక్ పుస్తకాలు తనే కొన్నాడు. ఎలాగైనా లలితచేత మెట్రిక్ కట్టించి పాసుచేయించాలని శ్యామ్‌బాబు ఉద్దేశం. అప్పుడప్పుడు జగదాంబ "నీకు చదువెందుకే, ఎవడో తగిన అయ్యచేతిలో నిన్ను పెట్టినప్పుడు ఈ చదువెందుకు పనికొస్తుంది ? ఈ పల్లెటూళ్లల్లో, చదువుకున్న పిల్ల అంటే మంచి సంబంధంకూడా రాదేమో ?" అని విసుక్కున్నప్పుడు లలిత, "నాకు పెళ్లీ వద్దు, పెడకులూ వద్దు. చదువుకుని లక్షణంగా ఉద్యోగం చేస్తా" ననేది.

జగదాంబ, కూతురు ఈమాట అంటూంటే, ఆమె వైపు ఆశ్చర్యంగా చూసేది.

శంకర్ వెళ్లిపోయిన మరునాడు, శ్యామ్‌బాబు లలితతో తనకూ, శంకర్‌కూ జరిగిన సంభాషణ చెప్పాడు. బాబాయి ఈవిషయంలో కలుగ జేసుకుంటానన్నాడుగదా, అని ఆమె ధైర్యం వహించింది. ధర్మసూరిగారుమాత్రం, ఏమైనా సరే, శంకర్‌కు లలిత నివ్వననీ, వీలైనంత త్వరలో తమకు తగిన సంబంధం చూసి, లలితకు పెళ్లి చేసేద్దామనీ పట్టుదలతో ఉన్నారు. (సశేషం)

---

విన్నావుగా? నన్ను ఎప్పుడు తీసుకుపోతాడో ఆభగవంతుడు అంటూ మొదలుపెడుతుంది. ఏమన్నా తింటే విరోచనాలు. అందుకుముందిప్పిస్తున్నాం. డాక్టరు ఏమి పెట్టకూడదంటాడు. అన్నితింటుంది. వద్దంటే కోపం, ఇహ ఎన్నంటుందో చెప్పలేం. జాలివేసి పెడతాను. ఇక యివన్ని తిన్నప్పుడు మందు మానేద్దామంటే ఒకగొడవ. "నన్ను చంపుతే మీపీడ విరగడవుతుందను కుంటున్నారటే? మందు మానేశారు" అంటుంది. ఏం చెయ్యను చెప్పమ్మా! నిజంగా సుందరీ ఎంతమంది చిన్నపిల్ల పిల్లల్నయినా మరిపించి వూరుకో పెట్టవచ్చుగాని, ఈవిడను మాత్రం వూరుకో పెట్టలేం" అంటూ వాపోయింది మాపిన్ని. నేను ఇంటికి వచ్చేశాను.

నిజంగా యిలాంటివారు ఎంతమంది వుంటారు? కొందరు ముసలివాళ్లుయిలా గొడవ పెట్టరేమోగాని, యిలా చేసేవారిని చాలామందిని

# వృద్ధాప్యంలో కోరికలు

17-వ పేజీ తరువాయి

చూశాను. ఎందుకనోగాని, ముసలివాళ్ళు అవుతున్నకొద్దీ కోరికలు ఎక్కువవుతాయి.

కొందరు ముసలివారనే జాలిలేకుండా పాపం ఆముసలావిడను వదిలేసి వేరుకాపురం పెడతారు. పాపం ఆముసలి ప్రాణంవండుకుతిని కుక్కిమంచంలో కాలం గడపడం చూచాను. ఇప్పుడు ముసలివాళ్ళ ఆశ్రమాలుకూడా వచ్చాయి. ఏమయినా, మనవాళ్ళను., మనవరాలిని ఆడిస్తూ, కోడల్ని అదిలిస్తూ ఇంతతింటూ కాలంగడుపుతుంటే ఎంతో ఆనందంగా వుంటుంది ముసలివాళ్ళకు. ఎంతవిసిగించినా ఒకరకమైన జాలి కల్గుతుంది వాళ్ళమీద. ఏది ఏమైనా వారికి కావల్సిందిస్తూ, వారు అడిగినందల్లా చేస్తూ, వారు స్వర్గస్తు లయ్యేవరకు ఏలోపమురానీకుండా చూచిన వారే ఓర్పుగలవారు. వారు అంతిమదశలో అలా కోరుతూవుంటారు. మధ్యరకం కుటుంబీలకు వారు అడిగిందల్లా తేలేకపోవచ్చు. కానీ వున్నదంట్లో తృప్తి పరచాలిగాని అలా ఈసడించరాదు. ముసలివాళ్ళు ప్రతీదీ తమకు కావాలంటారు.

నాకుమాత్రం బామ్మకబుర్లంటే భలే యిష్టం. ముసలివాళ్ళమీద మనం జాలి కనబరచాలి. అంతేకాని, పొలముందిగా ఆపొలం మీదవచ్చే గింజలమీద బ్రతుకుతుందిఅని మానన ఆవిడ నొదిలి ఆమె చనిపోగానే ఆపొలంకోసం వచ్చే వాళ్ళు లేకపోలేదు. అంతిమ కోరికలను తీర్చుకొని కొడుకుకోడలు సపర్యలు చేస్తుంటే ఆత్మశాంతితో కాలగమనంలో కలిసిపోయిన జీవేజీవి అని నాభావన. ★

# కవిసార్వభౌముడు

16-వ పేజీ తరువాయి

నారణప్ప 'ఆహా' అని మెచ్చుకొనెను. దుగ్గన వెంటనే ఆ పద్యమును దుయ్యబట్టెను.

"సహజపాండిత్యా, నీ పద్యము ఎంత పేలవముగా ఉన్నదో చూడు! సరిగా ఇదే భావము బావ ఎంత ప్రౌఢిగా, ఎంత హృదయంగమముగా చెప్పినాడో చూడు !" అనుచు 'ప్రౌఢి బలికింప సంస్కృత భాషయంద్రడు—" ఇత్యాది పద్యము చదివి రెండిటిని పోల్చి, ఒకే భావము విద్వాంసులు చెప్పుపద్ధతికి అవిద్వాంసులు చెప్పు పద్ధతికి, భేదమిట్లే యుండునని వివరించెను. నారణప్ప విని 'నిజమే' అనెను. పోతనకూడ ఒప్పుకొనక తప్పలేదు కాని ఆతనికి మనస్సు నొచ్చినది. ఉడుకుబోతుదనము వచ్చినది.

దుగ్గన శ్రీనాథుడు డిండిమభట్టుపైని సాధించిన విజయము ప్రస్తావించి పొంగిపోవుచుండెను. వెంటనే పోతన అందుకొని, "దుగ్గా, కవిత్వము యుద్ధము వంటి దనుకొన్నావా, గెలుపోటములకు ! డిండిమభట్టు ఏమంత కవి యేమిటి ! ఒక్క ప్రహసనకర్త ! అదీ విరూపాక్షస్వామి ఉత్సవాలను వర్ణించి నవ్వే బూతుల ప్రహసనము ! ఇక బావ మహావిజయము స్తుతికావ్యముతో ! అది క్షుద్రకావ్యమని బావే ఒప్పుకొన్నాడుగదా !" అనెను.

నారణప్ప ఏకీభవించి "మహాకావ్యములు వ్రాసినవారేకదా మహాకవులు !" అనెను.

దుగ్గన చిన్నపుచ్చుకొని, "బావ శతావధానము చేసి కనకాభిషేకము పొందలేదా ! అంత గౌరవము ఎవరికి కలిగినది !" అనెను.

పోతన : "మాటిమాటికీ శతావధానము సంగతి, ఎత్తబోకు ! అందులో బావ శాస్త్రపాండిత్యమూ, అద్వితీయమైన జ్ఞాపకశక్తీ ప్రదర్శించినాడు ! దానికీ, కవిత్వానికీ సంబంధమేమిటి ! మనము కవిత్వము సంగతి మాట్లాడుతున్నాము."

నారణప్ప అందుకొని, "శతావధానమునాడు యోగశాస్త్రప్రస్తావనలో 'అస్తేయ ప్రతిష్ఠాయం సర్వరత్నోపస్థానం సిధ్యతి' అని కవిసార్వభౌములు ప్రవచించినది ఎంతో నచ్చినది. పతంజలి యోగ సూత్రములోనిదట. నేను యోగసూత్రము చెప్పుకొనదలచినాను. ఏ కోరికా లేనివారికి అన్ని కోరికలూ సిద్ధిస్తవని నా బుద్ధికి తోస్తున్నది— దాని విషయమే మననము చేస్తున్నాను. శ్రీనాథభట్లు ఇంత కష్టపడి డిండిములను ఓడించి, దుష్కరమైన శతావధానము చేసి, ప్రభువులను అడిగి కనకస్నానము చేయించుకొన్నారు—మన పోతన్నకు కోరికే లేదు. భగవంతుడు శ్రీనాథభట్లచేత ఆ పద్యాలు చదివించడమేమిటి, ఈ అమూల్యమైన స్ఫాటికమాల దేవరాయలు పోతనకు అర్పించడమేమిటి ! నా కాశ్చర్యము కలిగిస్తున్నది. కనకస్నానము కంటె ఇదే నా బుద్ధికి గొప్ప గౌరవంగా కనిపిస్తున్నది" అనెను.

పోతన సిగ్గుతో తలవంచుకొనెను. దుగ్గన శ్రీనాథునియందు అభిమానముతో "అంతమంది విద్వాంసులు కలసి బావను కవిసార్వభౌముడైనాడని ప్రకటించి, ముల్లోకములలోని దేవతలకుకూడా తెలిపినారుగదా !" అనెను.

నారణప్ప నవ్వుచు, "అది గొప్పగౌరవమే కాని కవితాశక్తికీ, గౌరవాలకూ సంబంధ మేమున్నది! వాల్మీకి వేదవ్యాసులకు బిరుదము లేమున్నవి !— ఐనా ఇంకొక విశేషము గమనించావా ? ఇంతమంది కలసి కవిసార్వభౌముని చేసిన మీ బావే పోతన్నను సహజపాండిత్య బిరుదముతో గౌరవించలేదా! నా దృష్టిలో ఈ బిరుదమే ఎక్కువ గొప్పది" అనెను.

మరల పోతన అజ్ఞావిష్టుడై మిన్నకుండెను. దుగ్గన హేళనచేయుచు "మన సహజపాండిత్యుని పద్యము బండారము ఇందాక బయటపెట్టినాను గదా ! పండితులమార్గము వేరు, సహజపాండిత్యులది వేరు ! బావ రచనా వైవిధ్యము ఎంత గొప్పది" అనెను.

ఒక సోదెమ్మ పోలీసు స్టేషనుకు వెళ్ళి తన మొగుడు కనిపించటంలేదని ఫిర్యాదు చేసింది.

"అందరికీ సోదె చెబుతావు కదా! మరి నీ మొగుడు ఎక్కడికెళ్ళాడో తెలుసుకోలేకపోయావ్" హేళనగా అన్నాడు పోలీసు అధికారి.

"తెలుసుకోలేకేం బాబు! సోలెడు బియ్యం, అర్ధరూపాయి అక్కడపెడితే మా చక్కగా చెబుతాను" సోదెమ్మ ధీమాగా అన్నది.

వి. ఎల్. నారాయణ (బెజవాడ).

పోతన కిప్పుడు మాట పెకలినది. "దుగ్గా, బావ మహావిద్వాంసుడు. ఆయన కవిత్వము నావద్ద అంతగా పొగడవద్దు !"

దుగ్గన కోపముతో వివర్ణవదనుడై 'పోతా, నీకుకూడా బావకవిత్వమంటే ఈర్ష్య కలిగిందా?' అనెను.

పోతన వెంటనే జవాబిచ్చెను. "చవటా ! బావమీద నాకు ఈర్ష్యా ? సమానులలో ఈర్ష్య ఉంటుంది. పసివాణ్ణి. నాకు ఈర్ష్య ఏమిటి ? బావకవిత్వములో ఆయన భాషాపాండిత్యమూ, శాస్త్రపాండిత్యమూ తప్పితే, కవిత్వ మేమున్నదో చెప్పు చూతాము !"

దుగ్గన "వచియింతు వేములవాడ భీమన భంగి" ఇత్యాది సీసపద్యపాదాలు చదివి, "భీమనవలె వ్రాయగలడు. నన్నయ వలె చెప్పగలడు, తిక్కనవలె కూర్చగలడు. ఎర్రయవలె గూడ నిబంధింపగలడు — ఇంత కవి ఆంధ్రభాషలో పుట్టలే దిప్పటికి !" అనెను.

"అదే బావ కోపము ! వారివలె వీరి వలె చెప్పగలడు—తనవలె చెప్పలేడు ! ఆయన విద్వత్తు కవిత్వాన్ని హరించివేసింది" అనెను పోతన.

దుగ్గన : "కవిత్వములో విద్వత్తుకంటె ఏముంటుందో ?"

పోతన : "నారణప్పా, నీవన్నా వీడికి కవిత్వమంటే ఏమిటో కాస్త చెప్పరాదూ ! పాండిత్యము లేనివారు ఎంతమంది ముచ్చటగా కవిత్వం చెప్పడములేదు ?"

నారణప్ప : "నిజమే. పాండిత్యాలూ, లోకానుభవమూ కవితకు మెరుగులుపెట్టగలవు. అది వ్యుత్పత్తి. అసలు కవితకు మూలకారణము ప్రతిభ, పూర్వపుణ్యమువల్ల జన్మతః పుట్టేది. అది కవితకు ఆత్మను ఇస్తుంది. వ్యుత్పత్తి శరీర సౌష్ఠవమువంటిది — అబ్బా, మా బావ ముమ్మకవికి ఎంత శాస్త్రజ్ఞానము, లోకజ్ఞానము ఉన్నవి. ఒక్కపద్యం బాగుంటే ఒట్టు కదా !"

పోతన : "వింటున్నావా దుగ్గన్నా, నారణప్ప బంగారుమాటలు !"

దుగ్గన : "నాకు ప్రతిభా వ్యుత్పత్తుల సంగతే తెలియదంటావా ? — మమ్మటభట్టు—"

పోతన : "అబ్బా, ఈ పుస్తకాల మాటలు అప్పగించేవాళ్ల కర్మ మింతే ! తీర్థానికి తీర్థమే, ప్రసాదానికి ప్రసాదమే — ఎప్పుడైనా పంచకోశాల సంగతి విన్నావా ? తైత్తిరీయములో ఆనందవల్లీ, భృగువల్లీ ఎన్నడైనా విన్నావా ?"

దుగ్గన : "నేనా, నీవా ? ఆ ఉపనిషత్తు అంతా నోటికి వచ్చు. అది వేదాంతవిషయము. దానికీ కవిత్వానికీ సంబంధ మేమిటి ?"

ఇట్టనుచు అప్పటెప్పటకు ముందు ఆనందవల్లి శాంతి ప్రారంభించెను.

పోతన : "చాలు, చాలు ! వింటున్నావా, నారణప్పా, మన దుగ్గన తెలివితేటలు !"

జన్మతః కవియైన నారణప్పకు ఆకస్మికముగా గ్రుడ్డిమెరపువలె పోతనభావము స్పష్టాస్పష్టముగా స్ఫురించినది. ఆత డుత్కంఠతో పోతన వివరణమునకు ఎదురుచూచుచుండెను. దుగ్గన కొంత కోపముతోను, కొంత వికటముగాను, 'నీ కొత్తవ్యాఖ్యాన మేదో వెలిగించు, విందాము' అనెను.

పోతన స్వప్నావస్థలోనుండి పలవరించుచున్న వానివలె పలుకసాగెను. "ఈ సాహిత్యవేత్తలు రీతులు, అలంకారాలు, గుణాలు, దోషాలు, అనే మాటలకంటె నన్ను రాత్రింబవళ్లు రసము రసము అనేమాట కలతపెట్టుతున్నది. దాన్ని కూడా స్థాయీభావమూ సంచారీభావమూ అంటూ ఏమేమో సూక్ష్మంగా, కసాయివాళ్ల మేకపిల్లను ఖండించినట్లే, ముక్కముక్కలుచేసి వివాదపడుతూంటారు. ప్రసిద్ధమైన రామాయణాది మహాకావ్యాలకు ఈ రసవాదాలు, ధ్వనిభేదాలూ అన్వయించడానికి నానా యాతనలూ పడతారు.—"

దుగ్గన అడ్డువచ్చి, 'ఏమిటీ ఉపన్యాసము ! పంచకోశాలకూ దీనికీ సంబంధమేమిటి ?' అనెను.

పోతన : "నిజమే దుగ్గా, మనస్సు ఎందుకో చలించింది. కొందరు కవులకు శబ్దశక్తి మాత్రమే ఉంటుంది. వారి కవిత అన్నమయకోశానికే అంటు

ఱుంది. కొందరికి అర్ధశక్తి కూడా ఉంటుంది. వారిది ప్రాణమయకోశానికి వ్యాపిస్తుంది. మరి కొంతమందిది శబ్దార్థాల జోడింపుతో సూక్ష్మమైన నేర్పుచూపి మనోమయకోశానికి కూడా ప్రసరిస్తుంది. భావకవిత సాధారణంగా అన్నమయ, ప్రాణమయకోశాలు దాటదు. ఎప్పుడో మనోమయకోశంలోకి వెళ్లి, వెంటనే వెనక్కు మళ్లుతుంది."

దుగ్గన వారణప్పలు ఆలోచనలోపడిరి. పోతన కన్నులు మూసికొని ప్రస్తావింపసాగెను. "పూజ్యుడగు తిక్కనసోమయాజికి అభిమానమైనది మనోమయకోశము, అప్పుడప్పుడు విజ్ఞానమయకోశమును స్పృశించును. అంతకంటె నన్నయ విజ్ఞానమయకోశములో ఎక్కువ విహరించును. ఎఱ్ఱయ విజ్ఞానయోగి. సర్వసాధారణముగా ఆయన విహారప్రదేశము, విజ్ఞానమయకోశము. తన కావ్యము నందుకే విజ్ఞానాత్మక వాఙ్మయ మన్నాడు — ఆనందమయకోశములో విహరించి విహరింపజేయగలవారు మహర్షులు—వాల్మీకివ్యాసులే!"

దుగ్గనయు వారణప్పయు పోతనవలెనే స్వప్న లోకములో విహరించుచున్నట్లు మౌనముద్రాంకితులై యుండిరి.

ఇంతలో విడిదిలో సందడియైనది. రాజనాథకవి భార్యతో కలసివచ్చి, ఆ మరునాడే తన పితృపాదులు "ఉగ్రరథశాంతి ప్రారంభింపనున్నా రని శ్రీనాథ పండితుల నాహ్వానించెను. పత్ని లోనికి జని శ్రీదేవిని స్త్రీజనమును బొట్టుపెట్టి పిలిచెను. రాజనాథు డందరికి తప్పక రావలెనని మరిమరి చెప్పి, ఎవరికొరకో వెదకుచున్నట్లు దిక్కులు చూచుచుండెను. శ్రీనాథు డెవరు కావలెనని ప్రశ్నింపగా నాతడు 'ఆర్యా, నా నాయనగారు, అమ్మగారు మీ బ్రహ్మచారి శిష్యులను ప్రత్యేకాదరముతో పిలిచి రమ్మన్నారు. ఒకప్పుడు పితృపాదులు తొందరపడి అగౌరవించినారట. ఏరీ వారు ?" అనెను.

"వాళ్ళ కుఱ్ఱవాళ్ళు. అగౌరవించు టేమిటి! ఏదైనా పెద్దల అనుగ్రహమే. ఆ మామిడిచెట్టు నీడను కూర్చుండి నా కవిత్వాన్ని దుయ్యబట్టు చున్నారు. పోతనా, దుగ్గనా !" అని శ్రీనాథుడు పిలిచెను. పోతన దుగ్గనలును వారితో నారణప్పయు వచ్చిరి.

రాజనాథకవి పోతన దుగ్గనలను రెండు బాహువులతో పొదివి శిరస్సులు మూర్కొని 'మా పితృపాదులు ఉగ్రరథశాంతి చేసికొనుచున్నారు. వెనుక జరిగినది విస్మరించి తప్పక రావలె సుమా !' అనెను. వా రిద్దరికీ కన్నులలో నీరు తిరుగుచుండుట గమనించి, వెంటనే తన యుత్తరీయపు చెరగుతో వారి కన్నులు తుడిచి, చెరియొక చేతితో ఇద్దరి గడ్డములు పట్టి ముఖములు పైకెత్తి, 'నాన్నగారి కోపము ఆశీర్వాదము వంటిది. మీరు తప్పక వృద్ధిలోనికి వచ్చెదరు. మా అమ్మగారు కూడ ఆదేశించినది' తప్పక రావలె!, అనుచు మరల శిరస్సులు మూర్కొనెను. వా రిద్దరు శ్రీనాథుని వంక చూచుచు సరే అనిరి. రాజనాథుడు వారణప్పను కూడ ఆహ్వానించెను.

ఆ మరునాటినుండి అరుణగిరినాథ డిండిమభట్టు పంచాహదీక్షగా షష్ఠిపూర్తి శాంతి చేసుకొనెను. జపములు, హోమములు, పూజలు, దానములు, స్నపనము, బ్రాహ్మణ భోజనము మహా వైభవముగా జరిగెను. శ్రీనాథులు విద్యానగర విద్వాంసులు, కవులు, ఉద్యోగులు అందరు వచ్చి శోభ చేకూర్చిరి.

* * *

ఒకనాడు సింగన ప్రధాని పత్రము అంచెగుఱ్ఱములమీద శ్రీనాథునకు వచ్చినది. అందులోనిట్లున్నది:

"శ్రీనాథభట్టా, మీ విజయము కనకాభిషేకము మా కందరికి అమందానందము చేకూర్చినవి. వేమ ప్రభువులు విజయోత్సవములు చేయించి, కులదేవత యగు నందికంత పోతరాజుకు ప్రత్యేకోత్సవములు కావించుచున్నారు. ప్రభువులు మిమ్ము చూచుటకు తహతహ లాడుచున్నారు. వెంటనే బయలుదేరి రావలసినది. వామనభట్టబాణుల ఆనందము విపరీతముగా నున్నది. మతిభ్రమణము కలుగునేమో యని భయ మగుచున్నది.—మామిడి సింగన ప్రధాని."

"మీరేం చేస్తుంటారు ?"
"అల్లులను అందలం ఎక్కిస్తుంటాను" పేరుమోసిన ప్రచార సంస్థ అధికారి తపీమని సమాధానం చెప్పాడు.

అది యందిన వెంటనే శ్రీనాథుడు తెలుగు రాయని దర్శించి తిరుగు ప్రయాణమునకు ఏర్పాట్లు చేయ వేడెను. నాటినుండి మూడవ నాడే వల్లభరాయుడు వినుకొండకు ప్రయాణ మగుచున్నాడని, ఆయనతో కలసి వెళ్ళుటకు క్షేమమని, కటకపాలుడు తెలిపెను. ఆ వ్యవధానములో శ్రీనాథుడు దేవరాయలదర్శించి అనుమతి పొంది, ముమ్మ కవిని లింగన చయనులను, డిండిములను కవులను, విద్వాంసులను, ఉద్యోగులను దర్శించి, సెలవు తీసికొనెను. విరూపాక్షేశ్వరుడు మొదలుగా విద్యానగరములో వెలసియున్న ప్రధాన దైవత మూర్తులను దర్శించి వచ్చెను.

శ్రీదేవి యిప్పుడు వేవిళులతో బాధపడు చున్నది. ఆమెతో కలసి శ్రీనాథుడు శ్రీ శంకరానంద భారతీస్వాములను దర్శించి, వారి నారాయణ స్మరణపూర్వకముగు ఫల ప్రసాదము ప్రత్యక్ష సిద్ధమైనదని నివేదించి, మ్రొక్కి సెలవు తీసుకొనెను. అక్కడికి దుగ్గనయు, పోతనయు రాగా, శ్రీ గురువులు వా రిరువుర శిరస్సులపై తమ అమృతహస్త ముంచి 'మీరు చెప్పికొన్న మంత్రములు ఎంత ఎక్కువ స్మరించిన, మీకంత ఎక్కువ అతిశయము చేకూరు'నని ఆశీర్వదించిరి.

శ్రీనాథుడును, మిత్రులును తిరుగు ప్రయాణము చేయు రోజు వచ్చినది. అందరికి నా నగరము విడిచి వచ్చుట భారముగా నున్నది. స్వస్థలమునకు వచ్చి కొలది దినములకే మరల పరస్థలమునకు వెడలుచున్నవారికి వలెనే వారి కున్నది. ఈ పుణ్యనగరమే వారి కాత్మీయముగా నున్నది.

వారి ప్రయాణవేళను నారణప్ప వచ్చి దుగ్గనను, పోతనను గాఢాలింగనము చేసికొనెను. నారణ ముగ్గురకును కన్నుల నీరు గిఱ్ఱున తిరిగినది.

తిరుగు ప్రయాణములో కవి సార్వభౌముడు పటాటోపము లన్నియు పరిత్యజించెను. శ్రీదేవియు శ్రీనాథుడును మేనా పల్లకులు వదలి తక్కిన స్త్రీపురుషులతోపాటు బండ్లలో ప్రయాణము సాగించిరి. మధ్య మధ్య శ్రీనాథుడును, మిత్రులును మార్పుకు అశ్వముల నధిరోహించుచుండిరి. దారిలో సమస్త సౌకర్యములు వినుకొండ దుర్గాధిపతియే కల్పించుచున్నందున ప్రయాణము సుఖముగా నుండెను. అది శ్రావణమాస మగుటచే వర్ష బాధ వలన మందముగా సాగుచున్నది. విద్యానగర సర్వతోముఖవైభవ స్మృతులే ఇష్ట కథా వినోదములలో వారికి ప్రస్తావవస్తువు లగుచుండెను. విశ్రాంతి చిక్కినప్పుడెల్ల అప్పటికి పూర్తిచేసిన క్రీడాభిరామమును వల్లభరాయుడు వినిపించి శ్రీనాథుడు సూచించిన సవరణలు తరచుగా గ్రహించుచుండెను. విశేష సంఘటన లేమియు లేకుండ పది దినములకు వారు కర్నూలు చేరుకొనిరి. అక్కడికి అంచె టపాలో సింగన ప్రధాని పంపిన లేఖ శ్రీనాథునకు వేగిరి అందించెను. అందులో నిట్లుండెను:

"శ్రీనాథ కవిసార్వభౌమా, మన మిత్రుడు మన ప్రభువు, మన బంధువు, పెదకోమటి వేమభూపాలుడు పరలోకగతుడైనాడు. నందికంత పోతరాజును కృష్ణానదీ స్నానము చేయించుటకు ధన్నడకోట (ధరణికోట—అమరావతికి ఒక మైలులో ఉన్నది.) వద్ద విడిసియుండగా, ఆకస్మికముగా రాచకొండ సేన యాత్రిక తండమువలె కృష్ణ దాటి వచ్చి మీద బడినది. వీరనారాయణుడు వీరోచితముగా యుద్ధము చేసెను. ప్రయోజనము లేక పోయినది. ప్రభువులు వీరశయన మలంకరించిరి. రాచకొండ సైనికులు నందికంత పోతరాజును గ్రహించి, తాము వచ్చినంత ఆకస్మికముగా కృష్ణ దాటి పలాయితులైరి. మన సేనలు కూడుకొని వెన్నంటి పోయినను లాభములేక పోయినది. సురాంబా మహాదేవి ప్రభువులతో కృష్ణవేణీతీరమున సహగమన మొనర్చినది. వారి యవశేషములు పవిత్ర కృష్ణవేణీ జలములలో లీనమైనవి. వేయి వరహాలు పంపుచున్నాను. ఇక మీ కెట్టి ధనమును పంపలేను. ప్రోలయ వేమారెడ్డి ప్రభుత్వముతోపాటు అవతరించిన నందికంత పోతరాజా కఠారి రెడ్డి రాజుల కులదైవము ! దానితో కొండవీటి రాజ్యలక్ష్మియే పరహస్తగతమైనదని నగర మంతయు విచారసాగరమున మునిగియున్నది.—మామిడిసింగన."

వీరనారాయణుని వీరశయనవార్తను శ్రీనాథుడు ప్రకటించినంతనే, కొండవీటివా రందరు దుఃఖవివశులైరి. శ్రీనాథునకును, పండిత బృందమునకును కులభేదముతో నిమిత్తములేకుండ, తమకు ఆశౌచము వచ్చిన దనుభావము కలిగినది. వారందరు సంప్రదించుకొని ఆనాడు ప్రభువుల

# కవిసార్వభౌముడు

వృత్తికి వ్రైల పట్టవలెనని నిర్ణయించుకొనిరి. వెంటనే అందరు తుంగభద్రకు పోయి సచేల స్నానము లాచరించి ప్రభువుకు ఉదకప్రదానము లొనర్చి ఆనాటికి నిత్యకర్మకలాపము లుజ్జ గించిరి.

పర్వతమల్లు కన్నీరు ఏకధారగా గార్చుచు తుంగ భద్రానదిలో స్నానముచేసి ప్రభువుకు అశ్రు తర్పణము కావించెను.

ఆనా డంతయు కోమటివేమప్రభువు వితరణ మును గూర్చియు, వైదుష్యము గూర్చియు, యుద్ధపరాక్రమమును గూర్చియు, సద్గుణ గణ ముల గూర్చియు వారు ప్రస్తావించుచు గడపిరి.

మరునాటి యుదయమున వా రందరు మరల తుంగభద్రానదిలో శుద్ధిస్నానము లొనర్చిరి. శ్రీనాథుడు నిత్యకర్మ కలాపములు పూర్తి కావించు కొని వల్లభరాయని జూడబోయెను. అంతకు ముందే వల్లభరాయనికి వేమప్రభువు నిర్యాణ వార్త తెలిసి యుండుటచే, శ్రీనాథునితో ఓదార్పు వచనములు పలికెను. "వృద్ధుడైనను, వీరనారా యణప్రభువు వీరోచితముగా పోరాడి శరీర త్యాగము చేసినందున వీరస్వర్గము నలంకరించుటచే ధన్యుడు!"

శ్రీనాథుడు : "వారు ధన్యులే. ఈ విజయ యాత్రకు వారు నన్నెంత ప్రేమాతిశయముతో పంపిరో నాకే ఎరుక. వారిని దర్శించి ఈ యాత్రా విశేషములు నివేదించు భాగ్యమైనను నాకు ప్రాప్తించియున్నచో, నేనును కొంతవర కైన ధన్యుడనైనట్లే భావించియుందును. ఇప్పు డీ యాత్ర నాకు నిస్సారముగా తోచు చున్నది."

వ. రాయుడు : "కాదు, కాదు. మీ విజయవార్త వారికి చేరెను. తమ విద్యాధికారి శ్రీనాథభట్టు, శ్రీ విద్యానగర సార్వభౌముల విద్యాధికారి డిండిమ భట్టారకుని జయించి, కంచుఢక్క పగుల గొట్టించి, అద్వితీయముగా శతావధానము కావించి, ముత్యాలశాలలో వైభవముగా కనకాభిషేకము పొంది కవిసార్వభౌమపట్టాలంకృతుడయ్యె నను వార్త వారు శ్రవణపర్వముగా నాలకించిన పిమ్మ టనే, ఆ యానందముతోడనే దేహత్యాగ మొన ర్చిరి. మీ విజయయాత్ర వారి ధన్యతను ద్విగు ణీకరింప జేసినది."

"శ్రీనాథుడు : "వల్లభరాయా, నిస్సందేహముగా వారు ధన్యులే. వారు నాకు యాత్రారంభమున ప్రసాదించిన కవిసార్వభౌమ బిరుద లాంఛనము నారివాగుకడ విడిచి రావలసివచ్చినది. దానికంటె ఈ కవిసార్వభౌమపట్టము నా దృష్టిలో ఎక్కువ ప్రియతమమైనది కాదు."

వెంటనే వల్లభరాయ డడ్డువచ్చి విచారముతో, "కవిసార్వభౌమా, ఆ బిరుదలాంఛనము విను కొండలో భద్రముగా నున్నది. మీ కక్కడ సగౌర వముగా నర్పించెదను" అనెను.

శ్రీనాథుడు : "నేను వినుకొండ రా దలచలేదు. రాచకొండ వెళ్ల నిశ్చయించితిని."

పిమ్మట వా రిద్దరికి కొంతతడవు మంతన ములు జరిగినవి. రాజ రహస్యములు బయలు పరుపకుండ వల్లభరాయ డిట్లనెను : "దేశ మంతయు నిప్పుడల్లకల్లోలముగా నున్నది. వెనుకటివలె నిర్భయముగా ప్రయాణములు చేయుట కవకాశము లేదు. రాచకొండ ప్రయాణ మిప్పుడు నిరపాయము కాదు. మీరు రాచకొండకు వెళ్లదలచినచో, ఒకటి, రెండు వారము లిక్కడనే యుండవలెను. తుంగభద్ర దాటరాదు సుమా!— నేను విచారణలు చేసి ఒక మార్గము నిర్ణయించి మీకు వార్తాహరునిచే తెలియజేసెదను. ఆ మార్గమే మీరు తు. చ. తప్పకుండా అనుసరించి రాజాచలము చేరుకొనవలెను. నా వార్త వచ్చు వరకు మీరు అలం పురము కూడ వెళ్లరాదు. మీరు కోరినట్లు దుగ్గ నను అప్పగారితో దగ్గుబల్లికి క్షేమముగా చేర్పింప సర్వ యత్నములు చేసెదను. తక్కినవారిని శ్రీ విద్యానగర రాజ్యపు పరిహద్దులు క్షేమముగా దాటింపగలను. మీ కొండవీటి కరణమునకు విను కొండలో భద్రపరచిన మీ బిరుదలాంఛనము లప్ప గించెదను."

లోకజ్ఞుడగు శ్రీనాథభట్టు వల్లభరాయని వాక్కులలో సూక్ష్మరహస్య మేదో ఉన్నదని గ్రహించి, "వల్లభార్యా, నేను మీ యాజ్ఞలకు కట్టువడి యుండెదను. సెలవు!" అనెను.

రాచకొండ సేనలకును బహమనీరాజ్య సేనల కును, విద్యానగర సేనలకును, కొండవీటి సేనల కును పలుతావులలో సంఘర్షణములు జరుగు చుండెనని స్పష్టమైనది. విశేషములు వల్లభ రాయుడు తన కెంత యాప్తుడైనను వివరిం పడు. తనకు తెలిసియు ప్రయోజనము లేదు. భయపడి విద్యానగరమునకు తిరిగి పోయినచో వేమ ప్రభువుల యానతి ధిక్కరించినవా డగును. సమస్త మును వల్లభరాయని సామర్థ్యమునకు, సద్బుద్ధికి వదలి ప్రవర్తించుట క్షేమకరమని శ్రీనాథుడు నిశ్చయించెను.

రాచకొండకు తనతో పోతనను, నృసింహ భట్టును, సుబ్రహ్మణ్యశ్రోత్రిని మాత్రము కొంపో దలచెను. లక్కనసూరికూడ వారితో వత్తునని ప్రయాణమయ్యెను. వంటలవారి నిద్దరిని పరి వారకు నొకనిని శ్రీనాథుడు తమతో నుంచుకొని తక్కినవారి నందరిని వల్లభరాయనితో పంపి వేసెను.

శ్రీదేవి భర్తకు నమస్కరించి సెలవు తీసికొను చుండగా అతడు, "ప్రద్యుమ్న కుమారుని నామ కరణమహోత్సవమునకు దగ్గుబల్లి వచ్చి మా గృహమహారాజ్ఞి దర్శనము చేసికొందును" అనుచు ఛలోక్తిగా నాశీర్వదించి పంపెనేకాని, తన హృదయభార మేమాత్రము ప్రదర్శింపలేదు.

పోతన శ్రీదేవిపాదములు మరలమరల కన్ను లార నద్దుకొనుచు, "అక్కా, నిన్ను ఈ జన్మలో మళ్లీ ఎన్నాళ్లకు దర్శింతునోకదా!" అని కన్నీరు కార్చెను.

దుగ్గనయు, పోతనయు ప్రేమమీర నాలింగన మొనర్చుకొని కన్నీరు విడుచుచు విడిపోయిరి.

శ్రీనాథుడు తనకు సింగనప్రధాని తుదకు పంపిన వేయి సువర్ణములును తనయొద్ద మిగిలి యున్న తక్కిన ద్రవ్యము సమస్తమును కొండ వీటి కరణము మాచయ కప్పగించి, "ఈ ద్రవ్య ముతో మీ యందరి యాత్రలు పూర్తిచేసికొన వలె" నని యాదేశించెను.

(సశేషం)

# హరివంశం

12-వ పేజీ తరువాయి

సాందీపనియు, ఆచార్యాణియు, సుదక్షిణయు వచ్చినవేళకు శ్రీకృష్ణదేవుడు పౌండ్రకునితో అనుచున్న మాటలు వారికిగూడ విన్పించినవి.

"పౌండ్రక! నీవు మహారాజవగుదువు. అప్పుడు కాశిక యిట్లుండునా! ఆచార్య సాందీపని ఆశ్రమ మిట్లుండునా! నేను అదియే ఆలోచించుచున్నాను. నీవు నాయందు విరోధము చేయుచున్నావు. అట్లు విరోధము చేయుట నీ ఆత్మలక్షణము. మరి అట్లని అందరియందును విరోధమును చేయుదువా!"

శ్రీకృష్ణుని ఈ మాటలలో జాలి యున్నది. పౌండ్రకుడు మారు పలకక నిలుచుండిపోయెను. సుదక్షిణయు, సాందీపనితో, ఆచార్యాణితో ఈ తన రథము నధిరోహించెను. విచిత్రమేమనగా పౌండ్రకుడు వెంటనే బయలుదేరలేదు.

అతడు రాజమందిరములకు చేరుసరికి, అతనితో మహానందుడు గూడ నుండెను. వారు రథము దిగి సరాసరి మహారాజా మందిరములకు పోయిరి. అచ్చట ఎవ్వరును కనిపించలేదు. పౌండ్రకుడు అగ్ని గృహమునకు దారితీసెను. మహానందు డాతని ననుసరించెను.

అగ్నిమందిరములో మహారాజా దర్భాస్తరణముపై పద్మాసనస్థుడై యుండెను. ఆయనకు సమీపములో సాందీపని మరియొక ఆస్తరణముపై ఉపవిష్టుడై యుండెను. ఆచార్యాణియు, సుదక్షిణయు మరియొక ప్రక్కగా కూరుచుని యుండిరి. మహారాజా ఏదో చెప్పుచుండగా వారు వినుచున్న వారివలె నున్నారు. పౌండ్రకుడు ద్వారమున నిలబడి ఆయన మాటలు వినుచు నిలబడిపోయెను.

"ఆచార్య! సాందీపని! నీవును, నేనును బాల్య స్నేహితులము. నేను పౌండ్రకుడు నీవద్ద విద్య నభ్యసించవలయునని అనుకొనినాను. అది జరుగలేదు. ఆచార్య మహానందులు సమర్థులు కారని నే నననుు. ఆయనకు ఏమియు పట్టవు. ఏది ఎట్లుల జరుగునో, అది అట్లులే జరుగవలయు ననుకొనును. శిష్యుని శిక్షించుట ఆయన లక్షణము కాదు. ఇప్పుడు నేను సుదక్షిణతోపాటు కాశికనుగూడ పౌండ్రకుని చేతిలో పెట్టుచున్నాను. నా యింటికి భిక్షకు వచ్చిన క్షత్రియ వటువునకు అవమానము జరుగగా నేను చూచుచు ఊరకుంటిని! ఏమి చేయుదును. అందుకు నేను నాకే శిక్ష విధించుకొంటిని. అది కాశికకుగూడ శిక్ష యగునో! నాకు తెలియదు. సాందీపని! మీరు సుదక్షిణ కల్యాణమును, పౌండ్రకుని పట్టాభిషేకమును జరిపించవలయును. మీరు నాకు బాల్య మిత్రులు. సుదక్షిణకు తండ్రివంటివారు. మీరు ఈ వివాహమును జరిపించవలయును. మరి నేనో! యోగమువలన ప్రాణములను త్యజించుచున్నాను! సుదక్షిణ! తల్లీ! విచారించకు. నేను బ్రతికి నిరర్థకము. రాజభావము నానుండి నిష్క్రమించి పోయినది. ఆచార్య! నా తల్లి భారమును మీయందు ఉంచుచున్నాను."

మహారాజానందు ఇప్పుడు దుఃఖము లేదు పూర్వపు ఆమయముగూడ లేదు. శ్రీకృష్ణున కవమానము జరిగిన అనంతర మేర్పడిన విషణ్ణత తోడి నిర్వేదమునులేదు. సుదక్షిణనుగూర్చి ఒక్క ఆలోచనతప్ప మరి ఇంకొక ఆలోచనయు ఆయనయం దున్నట్లు లేదు.

అప్పుడు సాందీపని అనినాడు.

"మహారాజ! సుదక్షిణ వివాహమును జరిపించి తనువును త్యజించరాదా!"

"ఆచార్య! తమరు అట్లాతే యందురు. ఈ శరీరబంధములో పడి ఇంతవరకును బహుయాతనలు పడినాను. ఇప్పుడు విడుదలను పొందుచున్నాను. నాకు దేనియందును రక్తి లేదు. సుదక్షిణ వివాహమందురా! నా మనస్సులో ఆ వివాహమెప్పుడో జరిగిపోయినది. అదిగూడ నాకు బరువైనది. సుదక్షిణకును బరువైనదో! స్వామీ! సాందీపని! నే నిక ఏమియు చూడదలచుకొనలేదు. వినదలచుకొనలేదు. మాటాడదలచుకొనలేదు."

మహారాజా మరల నేమియు చూడలేదు. వినలేదు. మాటాడలేదు. ఆయనదృష్టి అంతర్ముఖమైనది. నాసాగ్రమున దృష్టి నిల్పినది. సర్వ శరీరగమైన ప్రాణమును యోగమువలన బంధించి, ఆయన దానిని బ్రహ్మరంధ్రమునకు ఎప్పుడు చేర్చెనో, అప్పుడు ఆయనముఖమున ఆనందము వెల్లివిరిసినది. అచ్చటి అందరును ఆయన ముఖమునందే బద్ధదృష్టులై యుండిపోయిరి. ★

---

# మనమూ-మనదేహస్థితి

15-వ పేజీ తరువాయి

ఎక్కువగా దాచివుంచే విధానం శరీరంలో లేదు. కొద్దిపాటి శర్కరను గ్లైకోజనుగా లివరు మాత్రమే మారుస్తుంది. శరీరంలోనూ రక్తం అంతటిలోనూ వుండే చక్కెర అంతా 17 గ్రాములు మాత్రమే. కండరములలో గ్లైకోజన్ రూపంలో వుండే చక్కెర 245 గ్రాములు, లివరులోవుండే గ్లైకోజన్ 108 గ్రాములు. మొత్తం 470 గ్రాములు. ఒక గ్రాము చక్కెర దహనమైనప్పుడు 4.1 కేలరీల ఉష్ణశక్తి పుడుతుంది. పరిశ్రమచేసే మనిషికి రోజుకు 2800 కేలరీల ఉష్ణశక్తి కావాలి. ఉష్ణదేశాల్లో కొంచెం తక్కువవున్నా చాలు. ఇందులో శరీరంలోవున్న చక్కెర అంతా 1722 కేలరీలు ఇస్తుంది. అంటే అది ఒక రోజుకు కూడా సరిపోదు. ఒకరోజు ఉపవాసంచేస్తే శరీరంలోవున్న శర్కర అయిపోతుంది. నిత్యాహారంలో 500 గ్రాముల చక్కెర మనం తీసుకుంటాము. అయినా అనేక రోజులు ఉపవాసం చేయగలవారు అనేకమంది వున్నారు. వారిలో ఉపవాస దుష్ఫలితములు కొన్ని రోజుల తరువాతగాని ఏర్పడవు. ఇందుకు కారణం శరీరములో కండలలోనూ చర్మంక్రింద యితర ప్రదేశములలోనూ పుష్కలంగా ప్రోటీనులు, కొవ్వుపదార్థములు నిలవ వుండడం, ఎడ్రినల్, పిట్యూయిటరీ, థైరాయిడ్ గ్రంధుల స్యందనముల ప్రభావంవల్ల. లివరు వాటిని అవసరమైనప్పుడు గ్లూకోజుగానూ, గ్లైకోజనుగానూ మార్చుకోగలగడం. శరీరంలో అనేక రకములయిన ధాతువులు మారిపోగా మిగిలిన ఎమైనో ఏసిడ్లనూ, కొవ్వు పదార్థములనూ వినియోగించుకుని పని చేయగలవు. కాని మెదడు అల్లా పనిచేయలేదు. మెదడుకు ఒక్క గ్లూకోజును తప్ప మరే యితర వస్తువులన తన మెటబాలిజమునకు వినియోగించుకునే శక్తి లేదు. మెదడు పనిచేయకపోతే శరీర కార్యక్రమమే సాగదు. అందుచే ఎప్పుడూ రక్తంలో ఒక పరిమాణంలో గ్లూకోజు సంచరిస్తూవుండాలి. రక్తంలో గ్లూకోజు పరిమాణం నూరు ఘనసెంటిమీటర్లలో 40 మిల్లిగ్రాములవరకు పడిపోతే మెదడులోవున్న జీవకణములు ఉద్రిక్తములై ఆరాటము ఏర్పడి, తరవాత కాళ్ళు చేతులూ బాదుకోటం ఏర్పడుతుంది. అప్పటికీ చక్కెర పరిమాణం పెరగకపోతే క్రమంగా దీర్ఘమయినమైకం (Coma) ఏర్పడుతుంది. మధుమేహంతో బాధపడేవారు మూత్రమునూ రక్తమునూ పరీక్షించకుండా ఉజ్జాయింపుగా ఇన్సులిన్ తీసుకుంటే ఈ ప్రమాదం ఏర్పడవచ్చు. అల్లాగే శరీరంలో ఇన్సులిన్ లోపించి, శరీరంలోవున్న చక్కెరలు అర్థ దహనమైనప్పుడు రక్తంలో ఆమ్లగుణం (Acidosis) అధికమవుతుంది. అప్పుడూ మైకం ఏర్పడుతుంది.

మధుమేహం వున్నవారందరికీ మూత్రంలో గ్లూకోజు వుంటుంది. కాని మూత్రంలో చక్కెర వున్నవారందరికీ మధుమేహం (Diabetes) వుండాలని లేదు. మూత్రంలో చక్కెర అనేక యితర కారణముల చేత వుండవచ్చును. అందుచేత తరుచు రక్తంలో చక్కెర పరిమాణం ఏ స్థితిలోవుందో పరీక్షించుకుంటూవుండడం అత్యవసరం. ఇంతేకాదు. ఇన్సులిన్ ఉత్పత్తిచేసే జీవకణములు తాత్కాలికంగా వ్యాధిగ్రస్తములై మూత్రంలో చక్కెర కనపడవచ్చును. కొన్నాళ్లకు అవి బాగుపడి, మధుమేహస్థితి తగ్గవచ్చును. ఆ మార్పు గమనించకుండా మొదట ఆరంభించిన మోతాదులోనే ఇన్సులిన్ తీసుకోడం. అనేకమార్లు ప్రమాదాలకు దారితీసింది. మెదడులాగే హృదయానికీ చక్కెర మాత్రమే శక్తి ఉత్పత్తికి కావాలి. ఒక్కొక్కప్పుడు ఆహారంలో శర్కరలు మాత్రమేవుండి రక్తంలో శర్కర పరిమితి అధికమై, ఎంత గ్లైకోజన్‌గా మార్చినా మించివున్నప్పుడు, లివరే, ఆ అధిక శర్కరను కొవ్వుగా మార్చివేస్తుంది! ఈపని ఒక్క లివరువల్లనే జరగదు. శరీరంలో ఇతర అవయవములలో కూడా జరుగుతుంది. కాని, అధికంగావున్న చక్కెరను కొవ్వుగా మార్చేపనిలో నూటికి 75 వంతులు లివరువల్లనే నిర్వహించబడుతుంది. గ్లూకోజులో కార్బను, హైడ్రోజను, ఆక్సిజను 6:12:6లో వుంటే నిష్పత్తిలో కొవ్వులో 6 : 12 : 5 వుంటవని యిదివరకే తెలుసుకున్నాము. ఈ మార్పు శరీరంలో ఎల్లా జరుగుతుందో శాస్త్రజ్ఞులు ఇంకా తెలుసుకోలేదు. తెలుసుకొంటే లావెక్కిపోతున్నామని ఆందోళనపడేవారి సందర్నీ, సమదేహుల్ని చేసిపారెయ్యవచ్చు.

శరీర కార్యక్రమంలో శర్కరాద్రవ్యముల ప్రాముఖ్యత అత్యధికమైంది. వాటి వినియోగంఅంతా లివరుమీదనే అత్యధికంగా ఆధారపడివుంటుంది. ★



"ఇద్దరు కొడుకులు"లో బి. సరోజాదేవి.

# సినీ విహారం

10-వ పేజీ తరువాయి

ఒకవేంప శృంగార మొలుకు నాట్యాలు
నవరసా లొలికించు నగారి కొచ్చాము
కనులు లేవని కలతపడ వలదు
నా కనులు నీవిగా చేసికొను చూడు ॥కు॥

ఇది బాబూ మువీస్‌వారు "కుముదం" తమిళ చిత్రగాథ ఆధారంగా తయారుచేసిన తెలుగు చిత్రం "కుంచి మనసులు" లోనిది. ఈ వారం లోనే బాబూ మువీస్‌వారు తమ తొలి చిత్రానికి పై విధంగా నామకరణం చేశారు. ఈ పాట నటించిన దృశ్యాల్లో నాగేశ్వరరావు, జానకి నటించారు. అచార్య ఆత్రేయ వ్రాసిన పాటకు ఆకర్షణీయమైన బాణీని సంగీతదర్శకుడు కె. వి. మహాదేవన్ అందివ్వగా ఘంటసాల మధురంగా పాడాడు. ఈ చిత్రానికి దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు; కామెరా పి. ఎల్. రాయ్. హంపీ నగరం ఔట్ డోర్ షూటింగులో నాగేశ్వరరావు, జానకి, వాసంతి బి.వి, నాగభూషణం, సూర్యకళ పాల్గొన్నారు. వీరుగాక ఈ చిత్రంలో సావిత్రి, ఎస్. వి. రంగారావు, గుమ్మడి, ప్రముఖపాత్రలు నిర్వహించారు.

## ముక్కంటి కొంటెతనం

కుమారి సతి కొండమీద నుంచి ఆత్మహత్య చేసుకుందామని ఉరికింది; ఆమెలో ఇంతటి నిస్పృహ, నిరాశ, తెగింపు కలగడానికి కారణం తాను వరించిన శివుని పేరు స్మరించరాదని తండ్రి దక్షుడు ఆమెను శాసించాడు. దక్షప్రజాపతికి పరమశివునికి చుక్కెదురు. కాని, అతని కూతురికి ఆ శివునిపై ప్రేమ, భక్తి, పారవశ్యం పెరిగిపోయాయి. అంచేత తండ్రీ కూతుళ్లమధ్య రేగిన ఈ ఘర్షణలో పుత్రిక నిరుత్సాహం చెంది ప్రాణాల్ని పోగొట్టుకోడానికి ఆ కొండ చివరకు వచ్చి ఒక్క దూకు దూకింది.

దిగువనే శంకరుడు, భక్తురాలికి, ప్రియురాలికి వశమైపోయిన శివుడు ప్రత్యక్షమై ఆమెను రక్షించాడు. పరమేశ్వరుని చేతుల్లో పడిన అబలకు స్మృతి లేదు. ఆమెను మెల్లగా దించాడు; ఆమెకు తెలివి వచ్చేలోగా శివుడు ముసలిజంగందేవర వేషంలో అవతరించాడు. ఆమె కళ్లు తెరచింది; తాను చావలేదని తెలుసుకుంది. "హరహర! ఇదేం కర్మ! మృత్యువు కూడా నాకు దూరమౌతోందే" అని తిరిగి విలపించింది.

ముదివగ్గు పలుకులు ఆమెకు వినిపించాయి, "శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదని నీకు తెలియదా అమ్మాయీ! నువ్వు రమ్మన్నా మృత్యువు రాదు." అనే మాటలకు ఆమె ఆశ్చర్యపడుతూ "స్వామీ! తమ రెవరు?" అని ప్రశ్నించింది.


"నీ శ్రేయోభిలాషిని. శివభక్తు లందరూ నా ఆత్మీయులే. కోమలీ! నీవు ఆత్మహత్యకు పాల్పడవలసిన అగత్య మేమి వచ్చింది?" అని అమాయకుడిలా ప్రశ్నిస్తూ ఆమెచేత ఏదో పలికించా లనుకొన్నాడు.

"బ్రతుకు దుర్భరమైతే చావుకంటే తరుణోపాయం ఏముంది స్వామీ!" అని దీనంగా నిజం చెప్పింది కుమారి సతి.

ఆ ముదుసలిముక్కంటికి ఇంకా ఆమెనుంచి మృదుమధురమైన వచనాలను వేటినో వినాలని ఆశ పెరిగినట్టుంది. ఇంకా ఇలా ప్రశ్నించాడు:

"సంపన్నుని పుత్రికలా కన్పిస్తున్నావు. నిండు యవ్వనంతో ఉన్న నీ కీ నిస్పృహలెందుకు? ప్రియుడు నిరాదరించెనా? లేక నీ తండ్రి పెండ్లికి వ్యతిరేకించెనా?"

ఈ ప్రశ్న వినగానే ఆమెలో విచారమంతా ఇగిరిపోయి ముఖంలో సిగ్గుదొంతర్లు పరుగెత్తిన భావాన్ని కొంటె శివుడు కనిపెట్టి "సిగ్గుపడతా వెందుకు?" అని అడిగాడు;








# సినీ విహారం

ఈ రసవత్తర సన్నివేశం వరలక్ష్మి పిక్చర్సు చిత్రం "దక్షయజ్ఞం" లోనిది. ముసలిజంగం దేవరగా, శివుడుగా ఎన్. టి. రామారావు, సతిగా దేవిక నటించారు. ఈ చిత్రానికి దర్శకుడు, నిర్మాత కడారు నాగభూషణం; పాటలు, మాటలు : ఆరుద్ర; కామెరా : లక్ష్మణ్ గోరే; కళ : తోట. ఈ చిత్రంలో రంగారావు, కన్నాంబ, రామకృష్ణ, పద్మనాభం, బాలకృష్ణ, రఘురామయ్య, సూరిబాబు, మిక్కిలినేని, అమర్‌నాథ్, రజని, రాజశ్రీ, ఛాయాదేవి, మీనాకుమారి, రాజసులోచన, నాగయ్య ఇతరపాత్రలు నిర్వహిస్తున్నారు. స్టూడియో : వీనస్.

## రాలుగాయి రెండో పెళ్ళాం

ఒక మోతుబరి రైతు ఇల్లులాగ ఆముండు వాతో ఉన్న పరికరాలు చెబుతున్నవి. పల్లెటూరు రైతు, కామందుకి అవసరమయే సామగ్రి అంతా అక్కడే ఉన్నది. గోడకు తగిలించి ఎడ్ల గంటలు, మువ్వలు, పెద్ద భోషాణం, దానిపై పరుపులు, మరోమూల ధాన్యం బస్తాలు, ఇంకోచోట వాలు కుర్చీ.

ధర్మయ్య ఎంతో సంబరపడుతూ ఇంటికి వచ్చాడు; ఏదో మహత్కార్యాన్ని సాధించిన వార్తను ముద్దులభార్య రెండోభార్య మంగమ్మకు చెప్పాలనే ఆనందంతో ఆ ఇంట్లో అడుగు పెడుతున్నాడు. భార్యను చూసి పలకరించాడు అతడు; కాని, ఆమె అతన్ని చూడగానే మూతి మూడువైపులకు తిప్పుతున్నట్లు, ఖుసలుకొడుతున్నట్లు కనబడింది. ఆయనకు మొదటిభార్య సంతానం సావిత్రి అనే పుత్రిక; పెళ్ళీడుకొచ్చిన పిల్ల. ఆమె నో అయ్య చేతుల్లో పెట్టాలని ఆ తండ్రి తాపత్రయం. కాని, ఆమెకు ఎందుకుంటుంది బాధ ? సవతికడుపున పుట్టిన బిడ్డపై ఆమెకు ప్రేమ ఎక్కడ ఉంటుంది ? అంచేత ఆమె ఎప్పుడూ ఆ పిల్లకు సవతితల్లిగానే ఉన్నట్లు ఋజువుచేస్తూంటుంది.

"అమ్మాయికి ఒక మంచి సంబంధం .... " అని ఆయన వాక్యం పూర్తిచేసేలోగానే ఆ మహాసాధ్వికి ఒళ్ళు మండినట్లుంది.

"మీ అమ్మాయికి మంచి సంబంధమూ దొరకదు. నన్ని సంసారబంధమూ వదలదు. రోజూ వినేదేగా ! ఎవరి ఖర్మ కెవరు తప్పిస్తారు ?" అని రుసరుస లాడుతూ ఇంట్లోకి వెళ్ళిపోయింది.

ఉసూరుమంది ఆయన ప్రాణం — ఆమె తీవ్రదింపునకు. ఈ క్షణానికే వచ్చాడు పాలేరు పిచ్చయ్య ఆయన దగ్గరకు.

"ఏమండీ అయ్యగారూ !" అని ఆయన్ని అతను పలకరించాడు ।



"స్వర్ణగౌరి" చిత్రంలో కృష్ణకుమారి.

"రోజా ఉన్నదేగా!" అని సతీపతుల దాంపత్య సౌరభ్యానికి ఆయన వ్యాఖ్యానం అందించాడు.

"అదికాదు బాబుగారూ! తమరు వెళ్లిన పని..." అని అర్ధోక్తిలో వీరన్న అందుకున్నాడు.

ఈ సన్నివేశం వాసవీ ఫిలిమ్స్ వారి తొలి చిత్రానికి చెందినది. ధర్మయ్యగా గుమ్మడి, మంగమ్మగా రత్నకుమారి, వీరన్నగా కృష్ణమూర్తి నటించారు. ఈ చిత్రానికి దర్శకుడు భరణీ రామకృష్ణరావు, నిర్మాతలు: కె. వెంకటేశ్వరరావు, కె. ఎస్. మార్కండేయులు; మాటలు: పిచ్చేశ్వరరావు; కామెరా: వెంకట్, కళ: రాజేంద్రకుమార్; సంగీతం: శ్రీనివాస్. ఈ చిత్రం మొదటిరోజు షూటింగ్ వీనస్ స్టూడియోలో ఫిబ్రవరి 19వ తేదీన జరిగింది. కృష్ణకుమారి, జగ్గయ్య, రేలంగి, రమణారెడ్డి, సూర్యకాంతం ప్రధానపాత్రలు నిర్వహిస్తున్నారు. ★














# గాలివాన

9-వ పేజీ తరువాయి

వెళ్ళోయిల్లు యిక్కడికి దగ్గరగా చూసివెళ్ళి చెప్పేస్తే. "సార్! మనిద్దరం పెళ్ళాలమీద మమకారం వున్నవాళ్ళం......వాళ్ళకి మనమీద భక్తి విశ్వాసాలు లేకపోతేనేం......యిల్లు దగ్గరగా వుందిగా".....అని...... కాని ఆ వ్యధా. ఆ సమస్య అక్కడితో తీరనేలేదు.

"ఛీ! ఆ శేఖరంగాడి వూసు నా దగ్గరెందుకెత్తాలి.. అంత......అంత......" కుర్చీలోనించి అమాంతం లేచాడు. గడియారం నెత్తిన మొత్తినట్లు "టం" గున నాలుగున్నర కొట్టింది. చతికిలబడ్డాడు.

ఎలావుంటాడో.....ఎంత మన్మధుడో లేదా ఎంత కీచకుడో......ఎంత యిదో ఎంత అదో అనుకుంటూ తను ఎన్నడూ ఎరుగని శేఖరాన్ని తల్చుకుంటూ...... రోడ్డుమీదా, బస్సులోనూ అది దిగేకా యింటి గుమ్మందాకా కూడా పరిగెడుతూన్నట్లే వుద్వేగంగా వున్నాడు ధరణీపతి.

## 2

తలుపు దబదబ బాదేశాడు. నీరజ రాలేదు. ఇరుగు పొరుగూ అరఫర్లాంగుదాకా యిల్లులేవు గనక ఏ తలుపు ఎవరూ తెరవలేదు.

"కన్నంలోంచి చూద్దామా" అనిపించింది. చూసేడు.

ఏదో మడిచిపెట్టి జాకట్లో దోపుకుని మరీ వస్తూంది నీరజ. అవతల దొడ్లోనించి వస్తూంది. తలుపు బాదేశాడు.

"ఏమిటి చెప్మా అది?"

"ఏమిటండీ? ఏం జరిగింది?"—గాభరా పడుతూ తీసింది తలుపు. ధరణీపతి పెదవి కరుచుకున్నాడు. నుదుట చెమట పోసింది.

"ఏం జరగడం ఏమిటీ? యింతసేపు పట్టిందేం! తలుపు తియ్యడానికి?"

"ఎంతసేపూ?......అసలు యిలా మొత్తేస్తే మీారు అనుకోలేదు. రోజూ యించక్కా "నీరూ!' అనేవారుగా......" నవ్వాలనే ప్రయత్నం చేసినా భర్త ఆంతర్యం ఏమిటో తెలియక తికమక పడుతూనే వుంది నీరజ.

"ఉత్తరం ఏమిటి?"—దొంగని చేతిలో వస్తువుతో సహా పట్టుకుని యిదేమిటని గదించినట్లుంది అతగాడి ధోరణి.

"భేష్! బాగుందండీ? వరస.....యివాళ ఏమిటి సంగతులు.....గుమ్మంలోనించే కారాలు మిరియాలు నూరుతున్నారు?" అని నవ్వుతూనే తన పెట్టె తలుపు తెరచి, అందులో జాకట్టులో దోపుకున్న ఉత్తరాన్ని తీసి, పడేసి మూత జాగ్రత్తగావేసి, భర్తకేసి తిరిగింది నీరజ.

"లేదు కారాలు మిరియాలు నూరడంవాని కబుర్లూ, కారుణ్యాలూ చెబుతాను....దేవిగారికిఐనా గాకపోయినా నా కబుర్లెందుకూ? వున్నాయిగా...... వుత్తరాల్లో చదువుకుంటే సరి......"

భర్తకి కాఫీ తెద్దామని వెడుతున్నదల్లా నీరజ టక్కున ఆగిపోయింది. ఆ పిల్ల అభిమానం బహుసున్నితమైనదేమో. యిట్టే దెబ్బ తిన్నది.

"నీ మాటలు నాకేం అర్థం అవడంలేదు...... అసలు లోపల వున్నదేమిటో చెప్పేస్తే మంచిది.

"ఔను! ఎలా అర్థం ఔతాయి....?యింతకీ అరగంటనుంచి తలుపు మోత్తుతూవున్నా కనిపించ నంత శ్రద్ధగా ఉత్తరంలో నిమగ్నమై పోయావే.... అందులోని అర్థం సరిగ్గా తల కెక్కిందా?"

"సామెత చెప్పినట్లేవుంది మీ వరస......ఉత్తరం చదువుతూవుంటే "లచ్చి" వెళిపోతున్నా తలుపు వేసుకోమంది".......వెళ్ళి వేస్తున్నా నింతలోనే మీరు తలుపు బాదేశా రాయను......" నీరజ పూర్తి సంజాయిషీ యిచ్చేస్తానన్నట్లు వంట ఇంట్లో కెళ్లింది.

కుర్చీలో కూలబడ్డాడు ధరణీపతి. తనేమి టడిగేడు? నీరజ ఏమన్నది? అసలు ఉత్తరం ఎక్కణ్ణుంచి? అంటే—అందులోని సంగతులేమిటి? అంటే లచ్చి వెళ్లింది తలుపువేసే నంటుందేం?

సెక్రటరీ సంసారంలాగే తన కొంప వ్యవహారాలు కూడా ఏ చలపతి నోటంటో రచ్చ కెక్కకుండా జాగ్రత్త పడాల్సిందే ననుకున్నాడు.

నీరజ పెట్టెకేసి చూశాడు. వెంటనే ఉత్తరం ఏదిటోతీసి చదవేస్తేనేం? అనుకున్నాడు. ఔను ఏం?

నీరజ తన పెట్టె చక్కబెడుతుంది. ఇంటికి రాగానే తన జేబు తడుముతుంది తనెప్పుడూ నీరజ పెట్టె చూడలేదే......అసలు దానికి తాళం వేస్తుంది కదా!

"ఏం......మీ సెక్రటరీగారిమీద కినుకఅంతా నామీద వొలక వోద్దామని చూస్తున్నారా? శ్రీవారు నేడు?" అన్నది కాఫీ తీసుకొనివచ్చి భర్త కోపానికి అంతకంటే మంచికారణం వూహించలేని నీరజ.

"ఏం? ఆయనమీద నెందుకుకోపం? పాపం వెర్రిబాగులవాడు నాలాగే భార్యను విశ్వసించి, ప్రేమి స్తున్నాడనేగా?"......కప్పు లాక్కుని తాగబోయి అంతలో జ్ఞాపకం వచ్చినట్లు "టక్కున" అక్కడ పెట్టేశాడు.

"ఉహూ!.....యింతకీ మీ యిద్దరికీ యిప్పుడేం తక్కువ వచ్చిందో......"

"ఇంకా ఏం రావాలి?......అసలు ఆ ఉత్తరం ఎవరు రాశారూ అంట?......"

భర్తది నిజం కోసమే అని గ్రహించిన నీరజ, భర్తది నిజం అనుమానమేనన్న సంగతిని కూడా తప్పనిసరిగా గ్రహించింది.

"ఛీ! ఎందుకండీ.....యివాళ యింత చైతన్యం? అది మా ఫ్రెండు రాసిన ఉత్తరం.....మీకు ఎప్పు డేనా అడిగే అలవాటూ నాకు చెప్పే అలవాటూ వున్నాయా?" అన్న అహంకారం అణచుకొనే ప్రయత్నంవుందికాని ఆమెలో పూర్తిగా ఈ అవ మానంపట్ల సహనం నశించింది. కన్నులు చెమ్మ గిల్లేయి.

"ఫ్రెండు? ఉహూ.....ఫ్రెండు......అంత రహ స్యమా? చదివి జాకట్లో దోపుకొని......అంతలో పెట్టెలో పెట్టుకుని......తాళం వేయాల్సినంత అప్పులు రాసిందేం?

"మరే....కాదు......ప్రేమలేఖలు రాస్తున్నాను కదూ?"—మంచివాడనుకున్న భర్తలో యింత అనుమానం వుందనుకోలేదు. నీరజ. ఇంత క్రౌర్యం వుందని భావించలేదు నీరజ. అందుకనే వ్యంగ్యంగా లక్కసుగా అక్కణ్ణించి వెళిపోబోయింది.

"కాపోతే ఎందుకంత ఉలుకు?"

కోపం—కోపం తప్ప మరేంలేదు అతని కంఠంలో. అతని కన్నులలో. "అన్నలా వుత్తరం నువ్వెందుకు బయట పెట్టవ్? చెప్పుముందు ...... ఔను...... ఖాతరులేదు నీకు చదువుల సరస్వతివి కదూ!..... ఎందుకుంటుంది?"

ఐనా నీరజ మాత్రం "ఖాళీఐతే కప్పు తీసుకు వెళ్తాను. ఆనక వింటాను మీ నాటకం!" అది ఈ రభసఅంతా తనకేం పట్టనట్లు.

అంతెత్తునలేచి నుంచున్నాడు ధరణీపతి "వెధవ బ్రతుకు......అంతహీనం అనుకున్నావ్? నన్ను? వీల్లేదు!......నామీద ప్రేమ, గౌరవం "గురి" లేని పెళ్లాం నా కక్కర్లేదు!! నేను! నేను!......నీ ఫ్రెండు ఉత్తరం చూడాలి....."మరోవేపు మొహం తిప్పు కున్నాడు భార్యకేసి చూడలేక.

"నేను మీ ఆట వస్తువుని......వంటపుట్టని అనుకోవద్దు......మీకు సహధర్మచారిణ్ణి......నాకు నాకూ......"

"ఏమిటి నీకు? మీ భావ టెన్నిస్ ఆట కావాలి! మీ బావ చదరంగం ఆట కావాలి!!ఆ కన్నన్న ఎవడో వాడు పాడిన సైగల్ పాట కావాలి? ఫ్రెండ్సు ప్రేమ జేబులూ, పెట్టె తాళం కావాలి.....ఔనా!!"

మాటాడలేదు నీరజ......మాటకి మాట తెగులు. నీటికి నాచు తెగులు. అని వూరుకుంది.

"ఊ......చెప్పు శేఖరం బావ! శేఖరం బావ్వ? ఆ ఉత్తరం వాడేనా?"

"రామ రామ......ఎవరనుకున్నారు మా శేఖరం బావ అంటే?" నీరజకి ఆవేశం హెచ్చిపోయింది.

"వల్లకాట్లో రామనాథయ్య అనుకున్నాను...... ఆ ఉత్తరం యియ్ ముందు......కాల్చేస్తాను......" కసిగా పెట్టెకేసి వేలు చూపించేడు.

"ఛీ! యింత నీచులనుకోలేదు....అది ఏమేనా సరే......ఛస్తే యివ్వను......నేనే కాల్చేస్తా...... మీ కెందు కివ్వాలి......?"

"అయితే ఒక్క క్షణం వుండ నలా ఐతే ఈ కొంపలో......ఏమనుకుంటున్నావో......" చెప్పులు తొడుక్కున్నాడు. తను కావాలో ఉత్తరం కావాలో తేల్చుకో మన్నట్లు నించున్నాడు.

"సరే..... బెదిరిస్తారా ఏం? నాకు అసలు యిక ప్రాణాలమీదేం తీపిలేదు.....నూతిలోపడి చస్తాను లేదా.........వురోసుకుంటా నంతే" నంది. నీరజ నిజంగా అంతపని చేద్దామనుకుంది.

"ఆఖరిసారి......ఆఖరిసారి అడుగుతున్నా......"

నీరజ ఏడవడంతప్ప సమాధానంలేదు. ఇంకేం చెయ్యాలి?......ధరణీపతి అమాంతం ఆ పిల్లను చంపేసి......తను తిన్నగా పోలీసుల దగ్గరికి వెళిపోదాం అనుకున్నాడు.

"అంతలో తలుపు తట్టిన చప్పుడయింది. తనే వెళ్ళి తీయబోతూ "మరో ఉత్తరం......" పరేమ లేఖయ్యుంటుంది" అని వ్యంగ్యంగా సాగదీసి వినురుగా తలుపు తీశాడు.

ఎదురుగావ్యాను గురువులు ఉత్తరమే యిచ్చాడు. కాని అది ధరణీపతికే!......

ప్రేమ లేఖ కూడా కాదు.

"నేను క్యాంపుకి రేపు ఉదయం వెళ్లలేను. నువ్వు వెళ్లాలి......" యజమాని సంతకం.

"ఎలా వెళ్తాడా ఆయన? కొంపలో కొంపలో.." గురువులు దగ్గర యిక నోరుజారడం యిష్టంలేక "నువ్వుఫో" అన్నాడు ధరణీపతి.

"రేపు క్యాంపు. యిక కులుకు......నీ ప్రేమలేఖ లన్నీ పాడకో......వదే చదువుకో ఎవడిక్కావాలి..."

నీరజ మాటాడవేలేదు.

"సరే! రేపటిదాకా ఎందుకు యిప్పుడేపోతా నా క్యాంపుకి......మళ్ళీ వస్తే వొట్టు......వుహూ..... వుహూ......" తలుపు బార్లా దభాలున తెరచు కొని, గభాలున నీరజ అట్నుంచి యిటు తిరిగి నారిం చేలోపునే రోడ్డుమీద పడిపోయాడు. ధరణీపతి.

ఏమీ వినిపించలే, దతగాడికి. ఎదురుగా రోడ్డు తప్ప ఏమీ అగుపించలేదతగాడికి......ఉరుకులుతీస్తూ అగుర్లు కక్కుతూ వెళ్ళిపోయాడు.

"ఏమండీ......ఏమండీ!......" అన్న నీరజ కేకలు గాలిలో కలిసిపోయాయి.

## 3

"ఇది లేపోతే నాకు గతి లేదన్నమాట......ఎంత దగా.......ఎంత ఘోరం.......ఎంత కలికాలం...."

ఒకకారుఆగి తప్పుకుని వెళ్లిపోయింది. ఒక సైకిలువాలా గంట కొట్టి కొట్టి ప్రాణం విసిగి...... "ఏవండో? "మజ్నూ" గారు! యిదిదారి. ఎడారికాదు" అనిగట్టిగా కసిదీరా అనేసి తప్పించుకుని వెళిపోయాడు.



# గాలివాన

"కాను. "మజ్నూ"? "లైలా"? వీడికేం తెల్సు. లైలా సంగతి?......ప్రేమలేఖ యివ్వదూ? కావలంటే చంపండికాని ఉత్తరం యివ్వదేం!? అది రహస్యంగావుండాలి......లాపోతే అంత భయం ఎందుకూ అంట......

"అసలూ, దీనికి యిదికాదు మందు...... రైలెక్కి ఆ క్యాంపుకి యిప్పుడేపోయి.....మరి మరిలా కూడదు.. మరి రాకూడదు......"

తిన్నగా రైలుస్టేషనుకేసి దారి తీశాడు. "ఎంత మంచి దనుకున్నాను......అసలు ఎంత నిర్మలమైన మనస్సు అనుకున్నాను. తనకీ నాకుమధ్య రహస్యాలు లేవనుకున్నాను, వెర్రాణ్ణి. దాని పెట్టెకే తాళం వుంది. యిక మనసులో ఎన్ని రహస్యాలున్నాయో.... "ఛి ఛీ! ఈ వూర్లోనే వుండకూడదూ...... అప్పుడుకాని దానికి బుద్ధిరాదు.......

తిన్నగా బుకింగ్ ఆఫీసు దగ్గరికే వెళ్ళేడు. తన చెయ్యి వెంటనే బుకింగ్‌కిటికీలోకూడా దూర్చేశాడు.

"ఏమిటి కావాలి?" బుకింగ్ క్లార్కు కునుకు తున్నవాడు వులిక్కి పడ్డాడు.

"ఉత్తరం......కాదు. కాదు టిక్కెట్టు"

"ఏ ఊరికి ? అసలు డబ్బేది? యిదేం ధర్మ సత్రమా?"

"ప్లాట్‌ఫారమ్ టిక్కెట్టు......" వెంటనే పావలా యిచ్చాడు ధరణీపతి. కోపంతో కందగడ్డలాంటి మొహం మరింత జేవురించింది.

"చిల్లరలేదు" బుకింగ్‌క్లార్కుకి నిద్ర మత్తు వదిలిపోయింది. టికెట్ యిస్తూనే కొంచెం బెదురుగా అన్నాడు. పావలా అలాగే వదిలేసి.....టిక్కెట్టు తీసుకుని రైలు తప్పిపోతుందేమోనన్నట్టు గబగబా వెళిపోయాడు ధరణీపతి ప్లాట్‌ఫారం మీదికి.

రైలులేదు. ప్రయాణీకులు పల్చగానే వున్నారు. అది చిన్న సబ్ స్టేషను.

అసలింతకీ అది ప్రేమ లేఖేనా?

ఐనాగాపోయినా తనకి ఎందుకు చూపించిందికాదు. మూర్ఖత్వం కాదది—అహంకారం......జేఖాతరీ—నిర్లక్ష్యం! వుహ్! తప్పకుండా అది శేఖరం రాసి వుంటాడు. అందులో "నీ గుమాస్తా మొగు డేమంటాడు? పాపం......రోజుకి పది గంటలు......పది మైళ్ళ దూరాన ఆఫీసులోనే గడుపుతూ వుంటాడు కదూ?" అని రాసుకుంటాడు.

నిజంగా నల్లని అక్షరాలు అలాంటి వాక్యాలుగా వరుసగా క్రిందగా మీదుగా, ప్రక్కగా, ధరణీపతి చుట్టూ తిరిగినట్టనిపించింది.

బెంచీమీద చతికిలబడ్డాడు.

బి. ఏ. చదివేనని గర్వం......వాళ్ళ శేఖరం బావ టెన్నిస్ ఆడతాడని. దీనికి పొగరు......అసలు అసలు" మళ్ళీ కోపం ముంచుకొచ్చింది అతగాడికి.

ఒక గూడ్సురైలు దడదడ వెళిపోయింది. "ఛీ! పెళ్ళాం తన మాట వినదంటే ఎంత సిగ్గు..... యిదే చలపతిఐతే ఈపాటికి పెళ్ళాన్ని జుట్టు పట్టుకుని నాలుగు కొట్టి.....................

ధరణీపతి కళ్ళ ముందు. చలపతి; గొరవళ్ళతో జీరకళ్ళతో అతని పెళ్ళాన్ని కొట్టడం......వెంటనే ఆమె పెట్టెతీసి ఉత్తరంతీసి, భయంతో అతగాడి కందించడం......కాళ్ళు పట్టుకోడం యిత్యాది కళ్ళముందు మసకగా లీలగా అగుపించాయి. గూడ్సు రైలు ఆగింది. కూసింది. కదిలింది.

ఇదే చంద్రంఐతే పెళ్ళాన్ని మెడపట్టి గెంటేసి వుంటాడు. "ఝుక్......ఝుక్...... ఝుజ్ ...... గుడ్సు రైలు వెళ్ళిపోయింది.

ధరణీపతికి అలసట వచ్చింది.

"నన్ను చంపండి నే నివ్వను......నేను......నేను వురిపోసుకుని చస్తానుకాని"—నీరజ మాటలే చెవుల్లో గింగుర్లు పెడుతున్నాయి.

అందంగావున్న ఆడవాళ్ళకి అహంకారం జాస్తి అనితనికితెలిసినట్టు ఎవరోచెప్పినట్టు జ్ఞాపకంవచ్చింది. నీరజ అందం వర్ణనాతీతం అని ధరణీపతి ఎన్ని సార్లో గర్వపడ్డాడు. కాని అంత అందం......కూడా గోధుమ వన్నె నాగుబాములాంటిదే ననుకున్నాడు ఇప్పుడు.

ఇంతలో సిగ్నలు కవతల రైలు ఆగిపోయింది. పరిగెడుతున్నారు.

జనం ధరణీపతికి ఆశ్చర్యం వేసింది.

ఏమిటా అని మెడ రిక్కించి......ఇంకా ఆశ్చర్యం ఎక్కువై కుతూహలంగా నిలబడి దృష్టి సారించాడు.

జనం గుమిగూడడం తెలుస్తోందేగాని, రైలు కట్టమీది దీపపు కాంతులలో ఏం తెలుస్తుంది?...... తనూ అనాలోచితంగా నాలుగడుగులు వేసేడు ...... అట్నుంచి ఓ నల్ల గుడ్డలవాడు పరిగెత్తుకొస్తున్నాడు.

"ఏమిటది?"

"ఆడకూతురు......బండికింద తలకాయ పెట్టేసింది......"తుక్కే" తుక్కై పోనాది" హడావుడిగా వెళిపోయాడు వాడు.

ధరణీపతి గుండెలాగిపోయి......తక్షణం రెండింతల వేగంతో కొట్టుకున్నాయి. ముచ్చెమటలు పోసేశాయి. నాలిక ఎండిపోయింది.

పరిగెడదామనుకున్నాడు. కాళ్ళు చప్పబడిపోయాయి......"ఆడ కూతురు?.....నీ...ర...జ?"

"నూతిలోబడి చస్తానంది" నీరజ.

ఉహుఁ!"...ఏమో......మైలుదూరం లేదీ స్టేషను ఒకవేళ పుట్టింటికి అని రైలుకువచ్చి నన్ను చూసి కోపం వచ్చి?? అలాంటిదే మూర్ఖురాలు !!"

గుంపులో జొరబడ్డాడు.

"పాపం......అలా రాసిపెట్టినాడు 'దేముడు' ఎవరో ఏంటో?......ముప్పయి సంవత్సరాల ఆడకూతురు.....చూస్తావుండగానేవచ్చి తలకాయ పెట్టేసినాదట" చెప్పుకుంటున్నారు.

"ఎవరు? ఎవరో? తెలుసా?" రొప్పుతూ అడిగేడు ధరణీపతి.

"భగవంతుడికే తెలియాల ...... ఓ అమ్మ కూతురు ఎవళుఅంటే ఎవళని చెపుతాం...... అబ్బే! తలకాయ అల్లదుగో డొంకలో పడింది......" అన్నాడు చుట్ట పేల్చి వుమిసి ఓ తైసంను కూలీ.

"యిక్కడి మడిసేలే......మొగుడు ఒగ్గేసినాడని వచ్చేసిందట......అప్పలస్వామి పెళ్ళామటలే...... అదుగో ...... ఆ "సింహాద్రి" అంటున్నాడు"—మరొకడు చెప్పేడు.

ధరణీపతి యింటికేసి పరుగుతీశాడు......

తింటున్నాడు?.....ఏమో......ఆ(పతిష్ఠ, అనంత దేవు తెరుగు! తన గతేంగాను......

తన నీరజ! తన భార్య! తన......తన.....ఆర్నెళ్ల క్రితం తన జీవితంలో వెలుగై అడుగు పెట్టిన దీపం......

"నీరజా! నీరజా!!" అతని గుండె లవిసి లోపల లోపల కేకలు గగ్గోలు పెడుతున్నాయి.

"అబ్బా! ఎంత పని చేసేను! ...... ప్రేమలేక కాగాక......!"

ధరణీపతి నడుస్తున్నాడు. పరిగెడుతున్నాడో ఆలోచిస్తున్నాడో......దుఃఖిస్తున్నాడో తనకే తెలియదు. కాలు తగిలింది. చెప్పువున్నా, కాలిగోరు చుట్టూ ఊడిపోయింది. నెత్తురు చిమ్మింది.

"పుట్టింటికి వెళ్లిపోయుంటుంది ...... అంత పని చెయ్యదు ...... ఉహూ, చెయ్యదు" పదేపదే గట్టిగా గొణుకున్నాడు.

తనేం కావాలి?.....తనూ ఆ రైలు క్రింద......అడుగో కారు....దాని క్రింద....కాని అంతలో మళ్లీ ఆశ నీరజ ఉండకపోతే......అప్పుడే చేద్దాం అనే అనిపించింది ఆఖరి అర క్షణంలో......కారు ప్రూచికవాపిలో తప్పుకుపోయింది.

గుమ్మం అగుపించగానే చీకట్లో ఆత్రుతగా, గొళ్ళెం, తడిమి చూశాడు. లోపల వెలుతురు కిటికీలో నించి పడుతూంది రోడ్డుమీద. ధైర్యంగా తలుపు తోశాడు. లోపల గడియలేదు.

రెండు తలుపులూ బార్లా తెర్చుకున్నాయి.

నీరజ ఉలిక్కిపడ్డది.

"వచ్చారా?" అన్నది. ఆమె కంఠంలో యింకా దుఃఖం జీరాడుతోంది. లేద్దామనుకుంది లేవలేదు.

శోకం మూర్తీభవించినట్లు కూచునుంది నీరజ. ఉత్తరాలను ఎంతసేపయిందో చిన్న చిన్న దమ్మిడీ అంతేసి ముక్కలు చేస్తూ వాటిని కన్నీళ్లల్లో తడుపుతూ కూచుంది. ఆ పెళ్ళి పెట్టె తెరచి, చిందర వందరగా వుంది. పెట్టె ముందు దీపం దగ్గరగా... ఓ ఫోటో పడేసివుంది.

అంతవరకూ ఎంతో ఆదుర్దాతో తనలోని చివరి నెత్తురు చుక్కను కూడా కూడగట్టుకుని వచ్చిన ధరణీపతికి ఈ దృశ్యం తొలిక్షణంలో ఊపిరి పోసిందికాని మరుక్షణంలోనే అతనిలో దాగివున్న అహం, ఈర్ష్య, కోపం అన్నీ విజృంభించి ఉగ్రమూర్తి అయిపోయాడు.

తన కివ్వకుండా చింపేస్తుంది ఉత్తరాలు! అందుకుకాదు కోపం......తను అనుకున్నట్లు నూతిలో పడలేదు. అందుకా? కోపం......అందుకూకాదు..... ఎందుకో తెలియదు! కోపం! కోపం!! మండిపోయాడు! ధరణీపతి. కోపం అణచుకున్నకొద్దీ కోపమే ఎక్కువయింది.

"వచ్చానా? ...... ఔను......చచ్చాను కాననేగా నీ బాధ? పోతా" నంటూ విరిగిన కెరటంలా అటు తిరిగాడు.

"వెళ్లొద్దు" అరిచింది నీరజ.

లేచి, శక్తిలా వచ్చి ముందు నించుంది. అడ్డంగా

"ఇదుగో మా బావ......యితనే మా బావ....." ఫోటోను అతని కళ్ళముందు పెట్టింది.

చూసేడు ధరణీపతి. దీపం వెలుతురు దాని మీద పడుతోంది. అందులో ఒక చిరునవ్వు మొహంతో యిద్దరు పాపలను ఎత్తుకుని ఒక వ్యక్తి నించున్నాడు. నిర్మలంగా నిశ్చలంగావుందా బొమ్మ!

"దాచుకో ...... అడ్డంతే ...... "

విదిలించబోయాడు. తప్పించుకుని అవతలకి పోదామనుకున్నాడు.

"ఊహూ! అదుగో ...... అందులో కుడిచేతిలో వున్నదే మా కమల......ఎడంచేతిలోనే అదుగో ఆ బొమ్మనాదే.....నేనే .... మా బావ నన్ను మా కమ అని ఎత్తుకుని తీయించుకున్న ఫోటో" ఆ ఫోటో అతని మొహానకొట్టి తలుపుకి చేరబడి మొహం అటు తిప్పుకుంది. నీరజ.

నీరైపోయాడు ధరణీపతి.

నిర్విణ్ణుడైపోయాడు ధరణీపతి.అర్థం అవలేదతనికి!

ఫోటో......లో పాపలకు ఐదారు సంవత్సరాలుంటాయి ...... ఎత్తుకుని చిరునవ్వుతోన్న వ్యక్తికి పాతిక......అంటే తన వయస్సు ...... అంతే అంతకంటే వుండదు. ఇంకా తక్కువేనేమో.

నీరజను దగ్గరగా తీసుకుందామనుకున్నాడు. ధైర్యం చాల్లేదు......వెనుదిరిగి గాలికి రపరపలేచి అటుయిటూ తనను వెక్కిరిస్తున్నట్లు తిరుగుతున్న ఉత్తరం ముక్కలను ఏరి కలిపి చదివి...... అసలు కారణం ...... తెలుసుకుంటే పోతోందనుకున్నాడు.

జుట్టు పీక్కుని "నిజం చెప్పు......నన్ను చంపకు అని అరిచాడు ఒక్కసారి.

కుర్చీలో కూలబడ్డాడు.

నీరజ, యింకా ఏడుస్తూనే వుంది కాబోలు. జవాబు చెప్పలేదు.

పెద్దగాలి వేసింది. ఉత్తరం ముక్కలు చిందులు తొక్కేయి. నృత్యం చేసేయి. వెకిలిగా నవ్వినట్లు! మరింత పెద్ద గాలి వేసింది.

ఫోటో రెండుసార్లు అగి ఎగరబోయి మూడోసారి రివ్వున గాలితో వీధిలోకి ఎగిరిపోయింది.

మెరిసింది! ఉరిమింది!......పెద్ద గాలి!...... దాంతోనే వాన......

ధరణీపతికి భయం వేసింది. లేచి భార్యను ఒక చేత్తో లోపలికి లాక్కుని తలుపు వేసేశాడు.

నీరజ అతని గుండెలమీద వెక్కి వెక్కి ఏడ్చింది.

అవతల ఉరుములు. మెరుపులు. ఘోరున వాన కురుస్తూనేవుంది.

"నీరూ......నీరూ......" అని ఎక్కిళ్లకు ఏడుస్తూన్న భార్యను ఓదార్చడానికి ప్రయత్నం చేశాడు ధరణీపతి. "నువ్వులేందే నేను బ్రతకలేను" నీరూ" అన్నాడు........

# 4

మర్నాడు నీరజని ఒక్క ప్రశ్న వేయలేదు ధరణీపతి. లేచి స్నానం చేసివచ్చి బుద్ధిగా కూచున్నాడు. నీరజ అప్పటికే సగం వంట ముగించింది. కాఫీ తీసుకునివచ్చి అక్కడ పెట్టింది. మాటాడకండా. ఆ పిల్లవంక చూడడానికి ధైర్యం లేక గాలివాన వెలిసిపోయి నిర్మలంగావున్న ఆకాశంకేసి కిటికీలోనుంచి చూస్తూ కాఫీ తీసుకున్నాడు ధరణీపతి.

"మా అక్క,కమలను భూమివిూద పడేసినవెంటనే కన్నుమూసింది.కమల నేనూ ఒకేయీడువాళ్లం...మా




Statement about ownership and other particulars about newspaper


ANDHRA SACHITRA VARA PATRIKA

1. Place of Publication:
6&7, Thambu Chetty St., Madras-1.
2. Periodicity of its publication:
Every Friday
3. Printer's Name:
Sri S. Radhakrishna
Nationality: Indian
Address: 6&7, Thambu Chetty Street, Madras-1
4. Publisher's Name:
Sri S. Radhakrishna
Nationality: Indian
Address: (As above)
5. Chief Editor's Name:
Sri S. Sambhu Prasad
Nationality Indian
Address: 29, Chamier's Road, Adyar, Madras-28.
Editor's Name;
Sri S. Radhakrishna
6 & 7, Thambu Chetty Street., Madras-1.
6 Names and addresses of individuals who own the newspaper and partners or share-holders holding more than one per cent of the total capital.

| NAMES | ADDRESSES |
| --- | --- |
| 1. Mr. S. Sambhu Prasad | 29, Chamier's Road, Adyar, Madras-28. |
| 2. Mrs. S. Kamakshamma | Do |
| 3. Mr. S. Nageswara Rao | Do |
| 4. Mr. S. Radhakrishna | 6 & 7, Thambu Chetty Street, Madras-1. |

I, S. Radhakrishna, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

S. RADHAKRISHNA,
1-3-1962 Signature of Publisher










# గాలివాన

యిద్దర్నీ ఒక్కలాగ చూసుకొనేవాడు మా బావ....."
చెప్పింది నీరజ...

ధరణీపతి ఏమీ అనలేదు. కమల అంటే నిన్నరాత్రి తను ఫొటోలో చూసిన పాపాయి అలో ఒక్కర్తి అన్నమాట అనుకున్నాడు.

"ఏంచేసినా యిద్దరికీ సమంగా చేసేవాడు. కాని మేం స్కూలు ఫైనలు చదువుకునే రోజుల్లో కమల దాని క్లాసుమేటుని ప్రేమించి లేచిపోయింది"

నీరజ కళ్ళు నిండు మేఘాల్లాగున్నాయి.

"బావకి కోపం దు:ఖం ఆవేశం అన్నీ వచ్చాయి. చచ్చిపోదామనుకుని ఒకటి రెండు ప్రయత్నాలు చేశాడు. కాని నేను "ఒక కూతురు వెళ్ళి పోయిందనీ, రెండో కూతుర్ని కూడా అన్యాయం చేయకుమనీ, నన్ను చంపుకు తిన్నంతపొట్ను అని ఏడ్చి చదువు మానేస్తానన్నాను. బావ మా అమ్మతో మాత్రం తను మిలటరీలో చేరుతున్నానని చెప్పి వెళ్ళిపోయాడు. తను డాక్టరు గనక డాక్టరుగానే మిలటరీలో చేరాడనుకున్నారంతా.....నేను ఏడ్చాను....ఆనక విచారించాను. "కన్న తమకంటే బావ ఎక్కువా?—దీనికి?" అని అమ్మా నాన్నా బాధపడడంతో అదీ పోయింది. మాకు బావ......కమల యిద్దరూ కేవలం "కథ"లుగానూ, "కబుర్లు" క్రిందా జమఐపోయారు.

ధరణీపతి ఆ పిల్లను వారించి కన్నీళ్ళు తుడుద్దామనుకున్నాడు. తనను తాను పీక పిసుక్కుందామనుకున్నాడు. కాని రెండూ చేయలేదు. ఆమెను విన సాగాడు.

".....మన పెళ్ళైంది.....బావ జాడ మాత్రం తెలియలేదు....కాని కమలమాత్రం దేశాలపాళ్ళై అన్ని విధాలచెడి బావను చూద్దామని వచ్చిందిట. తన నెవరూ పోల్చలేకపోయారు ఆ ఊళ్ళో బావనే సగం మంది మర్చిపోయారు......అది.....అది...." ఊరుకుంది.

"అదీ అదీ! ఏమైందీ?" ఆదుర్దాగా అడిగాడు ధరణీపతి.

**"ఎవరికీ చూపించవనే వాగ్దానంచేస్తే దాని కథ అంతా నాతో చెప్పుకుంటాననీ, నా ఎడ్రసుకు ఉత్తరం రాసింది సాటి స్త్రీ తప్ప పురుషుడి హృదయంలో జాలి కలిగించని ఆ విషాదగాథను వింటానని ఒట్టు** పెట్టుకుని, నా ఎడ్రసు యిచ్చాను నేను దానిని చూడడానికి వెళ్ళడంకాని దాని ఉనికి ఎవరికేనా చెప్పడంకాని చేయవద్దనీ, కథంతా తెలుసుకుని క్షమించానని రాస్తే ఆ మాటలు 'బావ" దగ్గర్నించే వచ్చాయని అనుకుంటానని అది రాసింది బావ ఎక్కడవున్నా అది లేనిలోటు నేనే తీరుస్తానని రాసింది '


ధరణీపతికి ఏం చేయాలో తెలిసిందికాదు, తనమీద తనకు కోపం వచ్చేసింది

నేను వెర్రి వెధవని నేను వెర్రి వెధవని" అంటూ లేచి 'ఉండు! ఆ ఫోటో తెస్తా" నంటూ గుమ్మంలోకి పరిగెత్తాడు

నీరజ కూడా ఆ వెనకాతలే వెళ్ళింది

ఫోటో గాలివాన రాకముందువచ్చింది గాలివానన కూడా తీసుకుని ఎగిరిపోయింది ఇంకెక్కడ?

**కొత్త కొండ, మబ్బులమీద వెండి కత్తుల మాలుతున్నది.** ★



# గళ్లనుడికట్టు - 93

## అడ్డం

1 గానములో రాగమున్నా రెండింటిలో పెద్ద చర్మవాద్యం ఉన్నది !

5 వృకము.

7 మా బలములు కరితో కలిపి ఒక అక్షరం తగ్గిస్తే సింహముల తత్యము

9 [illegible]

10 ఆయుధపూజ సమయంలో వచ్చే పండగ కలగా పులగం !

13 దాగుడు?

15 [illegible]

16 [illegible]

19 నాటకము కూడా కలగాపులగం !

20 [illegible]

21 నమ్మకాలు తగ్గిస్తే మరో రకం చిక్కులు !

23 [illegible] ?

26 మందు కలగాపులగం !

27 [illegible]

## నిలువు

1 [illegible]

2 అగమనముకు అగమనము లేక !

3 [illegible] !

4 అముక్త మాల్యదతో [illegible] మరో [illegible] ?

5 [illegible]

6 [illegible]

8 ఉసిరికాయ, ఒక సామెత గుర్తుకి తెచ్చుకోండి

9 కొట్లాట.

11 బెదరింపులు !

12 చేతిముందు కరేణువుతో సగం చేర్చండి, పిడి కిటిపోటు తత్యం.

17 బంగారు రంగు

18 విసరుకొను వీవన.

22 పుచ్ఛము


23 సింహము హితవాక్యములలో ములక దొరుకుతుంది

24 నీరు పారేది తలక్రిందు అయినది.

25 కొండ తగ్గిస్తే ఆభరణము.

☆

### 92-వ గళ్లనుడికట్టుకు జవాబు



నిజాయితీపరుడైన ఒక రాజకీయవాది ఎన్నికలలో గెలవడానికి తాను పడిన శ్రమను డైరీలో రాసుకున్నాడు "ఎన్నికలను గూర్చి ఆలోచిస్తూ 1349 గంటలు గడిపాను నా ప్రత్యర్థితో ముష్టియుద్ధం చేసి ముందు రెండుపళ్లు పోగొట్టుకున్నాను నాలుగువందల సైకిళ్లు ప్రచారం చేసినవారికి, 400 గోరెలు ఓటర్లకు ఇచ్చాను 126 మంది పసిపిల్లలను ఎత్తుకున్నాను 977 మైళ్ళు నడిచి 2,344 మందితో కరచాలనం చేశాను 400 ఉద్గ్రంథాలు నిండే చెత్త మాట్లాడను ఇంతాచేస్తే 53 ఓట్లు ఆధిక్యతతో గెలిచాను"

ఎం. ఎజాగర ఘకర వు (గుంటూరు)

# మనమూ—మనరాష్ట్రం

13వ పేజీ తరువాయి

మీ ఓటు అని కేవలం నినాదాలవల్ల లాభంలేదు పైగా పార్టీ విధానాలకన్నా ఎక్కువగా పార్టీ చిహ్నాలను గురించి ప్రచారం చేయడం నిజంగా విచారకరం

ఈసారి ఎన్నికలనాటికైనా పార్టీలు కుల మతాభిమానాలకు చోటివ్వక ఓటర్ల విచక్షణ జ్ఞాన సంపన్నులయ్యేవిధంగా ప్రచార కార్యక్రమం నిర్వహిస్తాయో లేదో చూడాలి

* * *

దేశం స్వాతంత్ర్యం పొందిన తరువాత విద్య రంగంలో జరిగినన్ని మార్పులు మరే రంగంలోనూ జరగలేదు ఎన్ని కమిటీలువేసినా ఎంత పరిశీలన జరిపినా దేశానికి తగిన విద్యా విధానం ఎటువంటిదై ఉండాలి అన్నది ఇప్పటికింకా సమస్యగానే ఉంది విద్యా ప్రమాణాలు పెరగకపోవడంవల్ల విద్యార్థులలో క్రమ శిక్షణ లోపించడంవల్ల విద్యావేత్తలు సమావేశమైనప్పుడల్లా విద్యావిధానంలో ఇంకా సంస్కరణల ఆవశ్యకతగురించి చర్చకు వస్తూనే ఉంది

క్రిందటివారం తిరుపతిలో అంతర్విశ్వవిద్యాలయ మండలి సమావేశంలో ఆంధ్ర గవర్నర్ శ్రీ భీమసేన్ సచార్ ఉత్కళ విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు శ్రీ పారిజ నేటి విద్యావిధానంలో ఎదురౌతున్న సమస్యలకు కొన్ని పరిష్కార మార్గాలు సూచించారు అవి ఎటువంటివో పరిశీలనార్హం విద్యాప్రమాణాలు పెరగాలన్నా విద్యార్థులలో క్రమశిక్షణ పెంపొందాలన్నా యోగ్యులైన విద్యార్థులకు మాత్రమే అవకశమిచ్చి, కళాశాలల్లో సంఖ్య పరిమితం చేయాలని శ్రీ సచార్ సూచించారు ఇదేమీ కొత్త సూచనకాదు ఇదివరలో పలువురు విద్యావేత్తలు ఇదే సూచన చేశారు ఇప్పుడు శ్రీ పారిజ కూడా ఈ సూచనతో ఏకీభవించారు అయితే ఇందులో అనేక ఇబ్బందు లున్నాయి యోగ్యులైన విద్యార్థులనే చేర్చుకోవాలిఅంటే — యోగ్యత అనగా ఏమిటో ముందు నిర్వచించాలి 35, 40% పాస్ మార్కులుగా నిర్ణయించుకున్నప్పుడు ఆ మార్కులు తెచ్చుకొన్ని ఉన్నత విద్యాభ్యాసం చేయగల తాహతు ఉన్నవారందరికీ ప్రవేశమివ్వడం విశ్వ విద్యాలయాల కర్తవ్యం అలా ఇవ్వదలచుకోకపోతే పాస్ మార్కులస్థాయి ని 50 లేదా 60% కు పెంచాలి అలా అయితే చాలామంది తప్పుతారు కనుక ఆ పని చేయడం వారికి ఇష్టంలేదు అది గాక దేశంలో 43 విశ్వ విద్యాలయా లున్నాయి కేవలం యోగ్యులు విపరీతమైన తెలివి తేటలు గలవారినే చేర్చుకోవాలంటే విద్యాలయాల నిర్వహణకు సరిపోగలగినంతగా విద్యార్థులు దొరుకుతారా అన్నది కూడా సమస్యే దొరకరని శ్రీ సచార్‌కు తెలుసు అందుకే ఈ విషయంలో విశ్వవిద్యాలయాలు ఎదుర్కోవలసివచ్చే నష్టాన్ని ప్రభుత్వం భర్తీ చేయాలని సలహా యిచ్చారు గిరి ఈ సలహా ప్రభుత్వాలు ఎంతవరకు పాటిస్తాయో తెలియదు పోనీ ఇవన్నీ ఇట్లాగే జరుగుతాయనుకొందాం విశ్వవిద్యాలయాలలో ప్రవేశం దొరకని సామాన్యమైన తెలివి తేటలుగల విద్యార్థుల గతేం కాను చదువు చాలించి ఉద్యోగాలకు వెడదామా అంటే డిగ్రీ ఉంటేగాని, గుమాస్తాగిరియైన దొరకదుకదా పోనీ ఏ టెక్నికల్‌కోర్సు అయినా చదువుదామా అంటే ఇంజనీరింగ్, వైద్య కళాశాలలో కూడా తెలివి తేటలకే ప్రాధాన్యం గాబట్టి అక్కడ ప్రవేశం దుర్లభం పోతే పాలిటెక్నిక్‌లు ఇవి మనరాష్ట్రంలోమటుకు ఏడెనిమిది ఎక్కువ లేవు మూడు విశ్వ విద్యాలయాలు 55 కళాశాలలు ఉన్నాయి. వీటా రాష్ట్రంలో మొత్తం మూడు విశ్వవిద్యాలయాలలో కలిపి దాదాపు 50 వేల మంది విద్యార్థులు తయారవుతున్నారు కనుక కేవలం యోగ్యులకే స్థానమని నిర్ణయించేముందు, ఇందులో బహుసంఖ్యాకులుగాడుండే సామాన్యుల సంగతి ఆలోచించాలి ఇప్పుడు చదువుకు ఒక ప్రయోజనం, ఒక లక్ష్యం లేకనే ఇంతమంది కళాశాలల్లో చేరుతున్నారు ఇతరత్రా బహు రకాలైన వ్యాపకలకు ఉద్యోగాలకు అవకాశం లభించాలంటే దేశం పారిశ్రామికంగా అభివృద్ధిచెంది, సాంకేతిక విద్యా సంస్థల సంఖ్య పెరగాలి అందాకా శ్రీ సచార్ ప్రభృతుల సూచన ఆచరణ సాధ్యంగాక సూచనగానే మిగిలిపోతుంది

ఉత్కళ విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు శ్రీ పారిజ అధ్యక్షోపన్యాసం చేస్తూ, అన్ని రకాల విజ్ఞానం బాగా పెరిగిపోతున్నందున విద్యార్థికి వైజ్ఞానిక పునాదులు వేయాలంటే ప్రీ యూనివర్శిటీ కోర్సుకు ఏడాది గడువు చాలదని రెండేళ్లకు పెంచాలని సూచించారు హైస్కూళ్లను హయ్యర్ సెకండరీ స్కూళ్లుగా మార్చే పని సర్వత్రా సాధ్యపడక పోవడంవల్ల ఇప్పుడే కోర్సు కళాశాలల్లోనే బోధిస్తున్నారు ఇప్పుడు దీన్ని ఇంకో ఏడాదికి పెంచాలంటే కళాశాలలకు మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టుగా తయారవుతుంది అదిగాక ప్రీ యూనివర్శిటీ కోర్సు ఇంకో ఏడాది పెంచడమంటే మొత్తం యూనివర్శిటీ చదువు ఐదేళ్లకు పెంచడంగాక మరేమీకాదు ఇది విద్యార్థుల తలిదండ్రులకు కూడా డబ్బుఖర్చుతో కూడుకున్న పని హైస్కూళ్లలో చదువంతా ప్రాంతీయ భాషలోనే జరగడంవల్ల ప్రీ యూనివర్శిటీకోర్సు అంతా ఇంగ్లీషులోనే బోధించడం విద్యార్థులకు కష్టంగా ఉందని, అందుకే ఎక్కువ మంది తప్పుతున్నారని కనుక ప్రీ యూనివర్శిటీ రెండేళ్లకు పెంచాలని చెబుతున్నారు. మూడేళ్ల డిగ్రీ చదువు అమలులోకి రాకపూర్వం, రెండు సంవత్సరాలు డిగ్రీ చదువు ఉండేది హైస్కూళ్లలో ప్రాంతీయ భాషలో విద్యాభ్యాసం చేస వచ్చిన విద్యార్థులకు ఇంటర్మీడియెట్ రెండేళ్లుండటంచేత డిగ్రీ కోర్సులోకి వచ్చేసరికి ఆంగ్ల విద్యాభ్యసం కొంత సులువయ్యేది ఇప్పుడు పారిజ సూచన అమలు జరిపితే పూర్వం ఉన్న ఇంటర్మీడియట్‌ను మరో రకంగా పునరుద్ధరించినట్లవుతుంది కాని దాంతోపాటు డిగ్రీ కోర్సుకు ఇప్పుడున్న 3 ఏళ్ల కాలాన్ని రెండేళ్లకు తగ్గించితే, పూర్తిగా మళ్లీ పాత పద్ధతి వచ్చేస్తుంది ★

# యువ ప్రపంచం

## విద్యావిధానం : విమర్శకుల తాహతు

శ్రీ "పాశుపతాస్త్రం" నా మొదటి లేఖ మీద వ్రాసిన విమర్శను చదివాను. నా హిత వాక్కులను అపార్థం చేసుకోవడం ప్రస్తుత విద్యార్థుల పరిజ్ఞానానికి అనుగుణంగానే ఉన్నది! కాని నా లేఖకు జవాబు ఇవ్వగలిగిన అర్హత వారికి వున్నదన్న ఉద్దేశంతో కాదు నేనా లేఖ వ్రాసింది. ఆ లేఖ తల్లిదండ్రులకు, సంఘ నాయకులకు మాత్రమే ఉద్దేశింపబడినది. వారు ఆ లేఖను చదివి ఆత్మపరిశోధన చేసుకోనడమే దాని ముఖ్యలక్ష్యం.

విద్యార్థిదశలో ఉన్న మానవుని లక్ష్యం, నేర్పిన విద్యను గడించడమే. విద్యావిధానాన్ని విమర్శించ గలిగిన శక్తి, అర్హత విద్య పూర్తి అయిన తరువాతనే వస్తవి. వైద్యుని వద్దకు వచ్చి వ్యాధికి ఏమందు లివ్వాలో చెప్పే అర్హత ఎట్లాలేదో అదే విధముగా విద్యావిధానాన్ని సరిదిద్ద గలిగినశక్తి విద్యార్థికికూడా లేదు. విద్యావేత్తలు మానసిక వైద్యులు; రోగికి వారి మందులే విద్యార్థులకు శరణ్యం. ఈ సంగతి చేసుకుని వీలైనంత విద్యను గడించిన విద్యార్థులకే ముక్తి. విద్యాప్రమాణం ఇప్పటికే మన దేశంలో హీనస్థితిలో వున్నది. బి. యే. చదువుతున్న విద్యార్థులు ఎంతమంది ఐన్‌స్టైన్, నీల్స్‌భోర్, పికాసో, షోపన్ హోవర్ మొదలైన పేర్లు విన్నారు? వారి 'జనరల్ నాలెడ్జి' యెంత? తిరుపతి విశ్వవిద్యాలయంలో 'జనరల్ నాలెడ్జి' సబ్జెక్టు తీసివేయడం తమకు శ్రేయస్కరమనుకునే ఈ విద్యార్థుల బుద్ధిహీనతకు మించిన ఉపమానమేదైనా ఉన్నదా? ఐ. ఏ. ఎస్. మొదలైన పరీక్షలలో ఉత్తీర్ణులవుతున్న ఆంధ్ర విద్యార్థుల శాతం ఎంత?

విద్య అంటే పరీక్షలు ప్యాసవడం కాదు. వేల సంవత్సరములుగా పొందిన జ్ఞానములో అవగింజంతైనా ఆ మూడు నాలుగు సంవత్సరాలలో నేర్చుకుందామనే కుతూహలమే విద్య! ఆ లక్ష్యమే విద్యార్థికి పరమార్థం.

శ్రీ 'పశుపతాస్త్రం' గ్రేడుల పద్ధతి విమర్శించ ప్రయత్నించడం అసందర్భం. ఎవ్వరికీ తెలియదన్నట్లుగా అర్ధజ్ఞానముతో గ్రేడులు ఒక తిరుపతివిశ్వవిద్యాలయంలో నేవున్నవి అని వ్రాశారు. కాని కనీసం మద్రాసు యూనివర్సిటీలో కూడా గ్రేడుల పద్ధతి వున్నదని నేను వారికి తెలియచెప్పాలి. మళ్లీ పరీక్షకు కూర్చోవాలనే సమస్య ఏ విద్యార్థికి రాకూడదు. సరిగా వీరి జుహాతాలు ఆగాజా చదివి అర్థం చేసుకుని, జ్ఞానం గడించిన ఏ విద్యార్థికీ ఈ సమస్య రాదు.

ఇకపోతే తల్లితండ్రులు మూడు నాలుగు సంవత్సరాలు తమ జీవితాలు ధారపోసి చదువుకోమంటే, సినిమాలకు తిరిగి, క్లాసులు ఎగగొట్టి, మూడు సంవత్సరాల పాఠాలు మూడు నెలలలో ముక్కున పెట్టుకుని పరీక్షలు పాసయితే పరమార్థం లభిస్తుందనుకునే వారికే తమ కక్కరలేని సమస్యలూ, సమ్మెలూనూ. చదువులు ఎగరగొట్టి ఆనాడు జైలుకువెళ్లడంవల్ల రాజకీయబాధితులమంటూ ఈనాడు రాజకీయ నాయకులుగా తయారైన కొందరు వ్యక్తులు మన విద్యార్థులకూ, సంఘానికి ఆరాధనాతుల్యులవడం ఈ దుస్థితికి ముఖ్యకారణం.

'గురు వింద గింజ' న్యాయము ఉపదేశించిన శ్రీ "పాశుపతాస్త్రం" గారికి నేను చెప్పవలసినది ఒక్క మాట. అదే న్యాయం విద్యార్థులకు చెల్లుతుంది. తమ తప్పులు, మనోబలం తెలియనిదశలో ఉన్న విద్యార్థులకు, విద్యావిధానాన్ని నిర్ణయించగల సామర్థ్యం విద్యావేత్తల కుంటుందనేకదా ఆపనికి వారిని నియమించినది? దానిని ప్రశ్నించి, పరీక్షించే శక్తి వున్నట్లయితే, విద్యార్థులకు విద్య ఎందుకు? కాలేజీలెందుకు? ఈ అసభ్య న్యాయము తీసుకుని, శ్రీ "పాశుపతాస్త్రం" గారితో పాటు నేనుకూడా వ్రాయవలసిన దుగతి కలిగినందుకు నేను విచారించక తప్పదు. కాని, ఈ అసభ్య రచనలు చదివిన తరువాత, విద్యార్థి లోకం మీద మిగిలివుండే జాలికూడా హేయ భావంగా మారగలదు.

పాంచజన్య

## ఆశయాలు – అవకాశాలు

యువప్రపంచం అయోమయంగా ఉన్నది.

ఎందుకనంటే

అవకాశాలా బోలెడు.

కానీ

అందవు. అందినట్టే కనిపించి అందకుండా పోతయ్.

చదువులా

ఎక్కువ బుఱ్ఱకు.


ఏదో చెయ్యాలనిపించుతుంది.

చెయ్యలేకపోతాము.

ఏదో చేయబోయి మరేదో చేస్తాం.

ఫలితం – వ్యాపకాలేవో, వ్యసనాలేవో తెలియకుండా పోవడం – కాదంటారా? చెప్పండి. పెద్దవాళ్ళకంటే ముసలివాళ్ళంగా లేమా మనం???

వి ఎస్ ఏ (మద్రాసు)



వాల్తేరులో జరిగిన అంతర్విశ్వ విద్యాలయాల లలితసంగీత పోటీలో ప్రథమ బహుమతి పొందిన ఉస్మానియా విశ్వవిద్యాలయంవిద్యార్థి శ్రీ ఎ.బాలకృష్ణారావు.

## వర్ణాంతర వివాహాలు

జీవితంలో ప్రతివ్యక్తి సంఘసంస్కర్తగానో, విద్య, లేక ఐశ్వర్య భావంతోనో, ఉన్నతాశయాలతోనో గొప్ప వ్యక్తిగా పరిగణించబడాలని కోరుకుంటాడు. ఈ నవీన ప్రపంచములో దుష్టగ్రహాలలా వర్ణాంతర వివాహములను పరిగణిస్తున్నారు. నా హృదయంలో ప్రతి అణువు వీటి మంచి చెడుగులను గురించి వ్రాయమని, ఉద్దేశ్యాలను బహిర్గతము చేయమని, ప్రోత్సహిస్తున్నది.

ఈ వివాహములు సుఖవంతములు కాకుండుటకుగల కారణములు : 1. వ్యక్తుల మూఢాచారములు 2. యువకుల సంకుచిత భావములు 3. ధైర్యస్థయిర్యములతో నిలబడి విమర్శలను ఎదుర్కొనలేని ఆర్థిక దుస్థితి. 4. సంఘముయొక్క విమర్శనా పూర్వకదృష్టి.

కొందరు యువకులు తమ దేమి తప్పులేనట్లు, అంతా తమ తల్లిదండ్రులదేఅయినట్లు సూచిస్తారు. కాని యిది సమంజసం కాదు. వాస్తవికంగా ఏ తల్లిదండ్రులైన తమ బిడ్డల క్షేమాన్నే కోరుతారుగాని వినాశనాన్ని కోరరు. యువకునిలో మంచిభావాలు ఉన్నపుడు వాటిని తల్లిదండ్రులకు విడమర్చి చెప్పాలి. అపుడు తల్లిదండ్రులు అంగీకరించక తప్పదు.

వర్ణాంతర వివాహము చేసుకున్న యువతీ యువకులు వృద్ధిలోకి రావడము లేదంటే ప్రబలకారణం పరిస్థితుల నెదుర్కొనే ఆర్థికస్తోమత లేకపోవడమే. ఇందుకు గాను ప్రభుత్వము వారు కొంతసహాయము చేయవలెను.

ఐ. సి. యస్. రావు (ప్రొద్దుటూరు)

★

# పొట్టి కథలు

### భట్రాజులు

నాగభూషణరావుగారు స్నేహితుణ్ణి వెంటబెట్టుకుని ఒక ఒకరోజున ఆలస్యంగా ఆఫీసుకు వచ్చారు ఆయన కోసం ఎదురు చేస్తున్న ప్రముఖుల ముఖాలు విప్పారాయి రావుగారు వారివంక ఎగాదిగా చూచి తాతలనాటి విక్టోక్కటి విసిరి చరాచరా తనగది లోకి వెళ్ళారు

వెంటవచ్చిన స్నేహితుడు "అదేమిటోయ్! నీకా పాత చింతకాయ పచ్చడి తప్ప మరేవిట్టూ దొరకలా?" ఉండ బట్టలేక అడిగాడు

"ఆ సంగతి నాకు తెలియ కనా ! అక్కడ చేరినవారిలో ఎంతమంది భట్రాజులున్నారో తెలుసుకుందామని ఆ చలోక్తి విసిరా!

"ఇంతకూ తెలిసిందా!"

"మహాచక్కగా! ఆ నవ్విన వారంతా ఎవరనుకున్నావ్?"

డి బ్రహ్మానందం (నెల్లూరు)

### సూక్ష్మగ్రాహి

"మరేమీ అనుకోకండి! పడమర అట్టువైపేనా?" దూరపు కొండల చాటున అస్తమిస్తున్న సూర్యుణ్ణి చూపిస్తూ నూనూగు మీసాల పత్రికా విలేఖరి తడబడుతూ ప్రక్కన ఉన్న వృద్ధుణ్ణి అడిగాడు

"అది పడమరే కాకపోతే, నువ్వు ఈ పాటికి పెద్ద "స్కూప్" కొట్టేసి ఉండేవాడివి!" వృద్ధుడు కొంటెగా సమాధానంచెప్పాడు.

డి ఎ ఫ్రాన్సిస్ (తిరుపతి)

Edited Printed and Published by S Radhakrishna at the Andhra Patrika Press 6 & 7 Thambuchetty Street Madras 1 Chief Editor S Sambhu Prasad,